www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 18-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 63 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి ఉ. 6.25 తదుపరి ద్వాదశి; నక్షత్రం: స్వాతి మ. 3.56 తదుపరి విశాఖ; వర్జ్యం: రా. 9.52-11.34; దుర్ముహూర్తం: ఉ. 8.21-9.13, రా. 10.22-11.04; అమృతఘడియలు: ఉ. 6.21-8.06; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 5.45; సూర్యాస్తమయం: 6.47 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రాయ్‌బరేలీకే రాహుల్ జై!



వయనాడ్‌ను వదులుకోవాలని నిర్ణయం.. అక్కడి నుంచి పోటీ చేయనున్న ప్రియాంక

క్లిష్ట పరిస్థితుల్లో నా వెంట నిలిచారు.. వయనాడ్ ప్రజలకు రాహుల్ కృతజ్ఞతలు

అక్కడ అన్న లేని లోటు లేకుండా చూస్తా: ప్రియాంక


కేరళను కాంగ్రెస్ రాజకీయ ఏటీఎంగా భావిస్తోంది: బీజేపీ

లోక్‌సభలో విపక్ష నేత పదవి తీసుకోవటానికి రాహుల్ విముఖం

కుమారి షెల్జా, గౌరవ్ గొగోయ్, మనీష్ తివారీల్లో ఒకరికి చాన్స్

2

విధ్వంసం



డయాఫ్రమ్‌వాల్‌ను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

జగన్ చేసిన అనేక తప్పిదాలు పోలవరం ప్రాజెక్టుకు శాపాలుగా మారాయి. రాజకీయాలకు పనికిరాని వ్యక్తి పాలన.. రాష్ట్రానికి ఎలా శాపంగా మారుతుందో చెప్పడానికి ఇదే ఉదాహరణ. - చంద్రబాబు

కూడబలుక్కుని కూల్చేశారు!

జగన్, అధికారుల నిర్వాకం

పోలవరానికి ఆయనే శాపం: చంద్రబాబు

పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటన

కీలక కట్టడాల స్థితిగతులపై ఆవేదన

సమీక్షలో అధికారులపై ఆగ్రహం

జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారు?

శశిభూషణ్, ఈఎన్‌సీ, సీఈపై మండిపాటు

జగన్ పాలకుడు కాదు.. విధ్వంసకుడు

ఇప్పుడు ఎక్కడి నుంచి మొదలెట్టాలో కూడా అర్థం కావడం లేదు

జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు వివరిస్తాం

ప్రజాభిప్రాయం మేరకు చర్యలు

మరోసారి పూర్తిస్థాయి సమీక్ష చేస్తా: సీఎం

అమరావతి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం సంపూర్ణ సహకారం అందిస్తూ వచ్చిందని.. కానీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, అధికారులు కూడబలుక్కుని ప్రాజెక్టులోని కీలకమైన నిర్మాణాలు కూల్చేశారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. ప్రాజెక్టు

మిగతా 12వ పేజీలో...

నేను చేసిన పనులన్నీ కొరగాకుండా పోయాయి

అంతా సంక్లిష్టం చేసేశారు.. ఇది క్షమించరాని నేరం: బాబు

పోలవరం పూర్తికి మరో నాలుగేళ్లు!

డయాఫ్రం వాల్ కొత్తది కట్టాలి.. 990 కోట్లు ఖర్చు

పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో అధికారుల వెల్లడి

కుటుంబం కోసం జల్సా మహల్‌ను కట్టుకున్న జగన్, దానికి సంబంధించిన ఖరీదైన 'పనుల'ను తన సమీప బంధువుకే అప్పగించినట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. రుషికొండకు గుండు కొట్టించి కట్టిన ప్యాలెస్ ఖరీదు రూ. 450 కోట్లు. ఇందులో కేవలం ప్యాలెస్‌లో సోకుల కోసమే రూ. 120 కోట్లకుపైగా ఖర్చుచేశారు. ఈ వర్క్స్‌ను తన సమీప బంధువు సుప్రియారెడ్డికి జగన్ అప్పగించారు. ఆయన రెండో కంటికి తెలియకుండా మూడేళ్లలో ఏకంగా రాజభవనాన్నే నిర్మించుకున్నారు. అలాగే, మూడో మనిషి చొరబడకుండా ప్యాలెస్‌లోని పనులను కూడా సమీప బంధువుకే అప్పగించిన వైనం ఇప్పుడు పర్యాటక శాఖలో చర్చనీయాంశంగా మారింది.

విలాసం



సోకులకే.. 120 కోట్లు

ఆ పనులన్నీ సమీప బంధువు సుప్రియారెడ్డికే

ఐటీ సలహాదారు శ్రీనాథ్‌రెడ్డి భార్యే సుప్రియ

జగన్ బెంగళూరు, హైదరాబాద్ ప్యాలెస్‌లకు అందాలు దిద్దింది ఈమే

వైసీపీ అధికారంలోకి వచ్చాక సొంత కంపెనీ

తొలుత తాడేపల్లి.. తర్వాత రుషికొండ పనులు

పాంథియన్ డిజైన్స్ పేరిట ఇంటీరియర్, డిజైన్లు

ప్రభుత్వ టూరిజం ప్రాజెక్టులన్నీ ఆమె కంపెనీకే

ఏ ప్రాతిపదికన ఇచ్చారు? బంధువనేదే అర్హతా?

రూ. వందకు అయ్యే పనికి వెయ్యి రూపాయలు

నీళ్లలా రూ. వందల కోట్ల ప్రజాధనం ఖర్చు



రుషికొండ ప్యాలెస్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విలువలు, విశ్వసనీయత... ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడూ, మాజీగా మారిన తర్వాతా వైఎస్ జగన్మోహన్ రెడ్డి పలుకుతున్న చిలుక పలుకులివి! ఆయనవి మాటలు మాత్రమే! ఆచరణకు ఆమడ దూరం. రుషికొండ మీద జనం సొమ్ముతో విలాసాల ప్యాలెస్ నిర్మించిన ఆయన... అదే ముసుగులో దగ్గరి బంధువుకు కోట్లు కుమ్మరించారు. పర్యావరణాన్ని పణంగాపెట్టి

మిగతా 12వ పేజీలో...

ప్యాలెస్‌పై పూటకో పాట

7 స్టార్ హోటల్.. కన్వెన్షన్ సెంటర్ అని తొలుత ప్రకటన

పర్యాటక భవనమేనని నాడు రోజా, గుడివాడ వ్యాఖ్యలు

ప్రారంభం తరువాత మాట మార్పు.. తెరపైకి కమిటీ

సీఎం క్యాంపు ఆఫీస్‌కు అడిగితే ఇచ్చేస్తామని వెల్లడి

ఇప్పుడేమో ప్రధాని, రాష్ట్రపతి బస కోసమని బుకాయింపు

12





పూర్వం రాజులు కోటలు, నిలువెత్తు గోడలూ కట్టుకునే వారు. జగన్‌దీ అదే తరహా! తన తాడేపల్లి ప్యాలెస్ చుట్టూ ఇలా సుమారు 30 అడుగుల ఎత్తున ఇనుప కంచె నిర్మించారు. అంతా... ప్రభుత్వ ధనంతోనే!

కోడెల చేస్తే తప్పు.. జగన్ చేస్తే ఒప్పా?

మాజీ సీఎంపైనా ఫర్నిచర్ దొంగతనం కేసు పెట్టాలి

టీడీపీ నేతల డిమాండ్.. వైసీపీ సమర్థనలపై ఆగ్రహం

అప్పట్లో ఉమ్మడి అసెంబ్లీ ఫర్నిచర్ కోడెల క్యాంపు ఆఫీసులో

ప్రభుత్వం మారాక దానిని తీసుకెళ్లాలని లేఖ

ధర చెల్లిస్తాననీ లెటర్.. ఆ తర్వాత స్పీకర్‌కూ సమాచారం

వాటన్నిటినీ పక్కనపెట్టి మాజీ స్పీకర్‌పై దొంగతనం కేసు

11



11

పవన్‌కు సవాల్!

గాడితప్పిన గ్రామీణాభివృద్ధి

పంచాయతీరాజ్ శాఖ నిర్వీర్యం

ఉపాధి హామీ పథకానికి తూట్లు

తాగునీటి సరఫరా ఛిన్నాభిన్నం

యథేచ్ఛగా నిధుల దుర్వినియోగం

ఘోరంగా చతికిలపడిన వ్యవస్థలు

రేపు పవన్ బాధ్యతల స్వీకరణ

విషాద ప్రయాణం



పశ్చిమ బెంగాల్‌లోని నిర్మల్‌జోట వద్ద కాంచనజంగా రైలును గూడ్స్ రైలు ఢీకొన్న ప్రమాద తీవ్రతకు అద్దం పట్టే దృశ్యం. ఈ ఘటనలో కాంచనజంగా బోగీల్లోని ఒక బోగి గాల్లోకి లేచింది.

బెంగాల్‌లో కాంచనజంగా ఎక్స్‌ప్రెస్‌ను ఢీకొట్టిన గూడ్స్.. 15 మంది దుర్మరణం

సంఖ్య పెరిగే అవకాశం!.. 60 మందికి గాయాలు.. కొందరి పరిస్థితి విషమం

సిగ్నల్ పడినా ఆగని గూడ్స్!.. ఈ మార్గంలో అందుబాటులోకి రాని 'కవచ్'

మృతుల కుటుంబాలకు 10 లక్షల పరిహారం.. గాయపడినవారికి 2.50 లక్షలు

అధ్వాన నిర్వహణతోనే ప్రమాదాలు: ఖర్గే, రాహుల్.. అనాథలా రైల్వే: మమత

1,500 కి.మీ. మార్గంలోనే 'కవచ్'

దేశవ్యాప్త నెట్‌వర్క్‌లో ఇది 1 శాతమే

ఈ ఏడాదిలోగా మరో 3 వేల కి.మీ.లలో..

న్యూజల్పాయ్‌గురి/కోల్‌కతా, న్యూఢిల్లీ, జూన్ 17: మరో రైలు ప్రమాదం..! కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ దుర్ఘటన మరువకముందే.. విశాఖ-రాయగడ ప్యాసింజర్ రైలు ఉదంతం కళ్లముందు కదలాడుతుండగానే.. ఇంకో ఉదంతం! పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో సోమవారం ఒకే ట్రాక్‌పైకి వచ్చిన రెండు రైళ్లు ఢీకొన్నాయి. 15 మంది ప్రాణాలు కోల్పోయారు. 60 మందిపైగా గాయపడ్డారు. వీరిలో తీవ్ర గాయాలతో

మిగతా 2వ పేజీలో...

అగ్రి గోల్డ్ భూములతో దందా!

మాజీ మంత్రి జోగి కుటుంబం నిర్వాకం

సీఐడీ జప్తులో ఉన్న భూములపైనే కన్ను

జోగి బాబాయ్, తనయుడి పేరిట పత్రాలు

సర్వే నంబర్ల డ్రామాతో స్వీయ సవరణలు

అనంతరం ప్లాట్లుగా మార్చేసి విక్రయాలు

అప్పనంగా రూ.5 కోట్లకు పైగా జేబులోకి

2,160 చ.గ. కబ్జా చేసి అమ్మేశారు



(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

వైసీపీ మాజీ మంత్రి జోగి రమేశ్ కుటుంబం అగ్రిగోల్డ్ భూములను చెరబట్టింది. సీఐడీ స్వాధీనంలో ఉన్న భూములను దర్జాగా కబ్జా చేసి అప్పనంగా రూ.5కోట్ల పైచిలుకు సొమ్ము చేసుకుంది. ఎన్టీఆర్ జిల్లా అంబాపురం గ్రామంలో ఆర్ఎస్ నం.69/2, రీసర్వే నం.87లో అగ్రిగోల్డ్‌కు చెందిన సుమారు 2,300 గజాల భూమి ప్లాట్ల రూపంలో ఉంది. దీన్ని ఏపీ సీఐడీ స్వాధీనం చేసుకుంది. అగ్రి గోల్డ్ భూములు వివాదంలో ఉండటాన్ని సాకుగా తీసుకున్న జోగి కుటుంబం ఈ భూములపై కన్నేసింది. జోగి రమేశ్ బాబాయ్ అయిన జోగి వెంకటేశ్వరావు, జోగి తనయుడు జోగి రాజీవ్ కలసి చెరో 1,086, 1,074 గజాలను తమ పేరుతో రాయించుకున్నారు. ఈ విషయంలో జోగి కుటుంబం తమ చేతికి మట్టి అంటకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకుంది. అంబాపురంలో ఆర్ఎస్ నం.88లో పట్టాదారులుగా ఉన్న కనుమూరి వెంకటరామరాజు, కనుమూరి వెంకట సుబ్బరాజు తమకు ఉన్న భూమిలో 4 ఎకరాలను బొమ్ము వెంకట చలమారెడ్డికి విక్రయించారు. ఆయన ఎకరా భూమిని

మిగతా 11వ పేజీలో...

భార్యాభర్తల నడుమ బుక్కైన

యాపిల్!

సెక్స్ వర్కర్లతో ఐఫోన్‌లో ఓ వ్యక్తి చాటింగ్

మెసేజ్‌లు కంటపడటంతో భార్య విడాకులు

'డిలీట్'పై అవగాహన కల్పించలేదంటూ

యాపిల్ సంస్థపై రూ.53 కోట్లకు భర్త దావా

2



3

భూముల సర్వే నిలిపివేత?

పాత రికార్డులు పునరుద్ధరించే అవకాశం

ఉద్యోగ వర్గాలకు

కేంద్రం ఊరట!

ఆదాయపు పన్ను తగ్గించే యోచన

మధ్యతరగతి వర్గం వద్ద డబ్బు మిగిలేలా ఆర్థిక విధానాలు

బడ్జెట్‌పై కొనసాగుతున్న కసరత్తు

2

వెబ్ పేజీలను చదివి వినిపించేలా
గూగుల్ క్రోమ్‌లో ఫీచర్

» 'లిజన్ దిస్ పేజ్' పేరుతో సేవలు

వాషింగ్టన్, జూన్ 17: మీరు సెర్చింజన్ దిగ్గజం గూగుల్ బ్రౌజర్ క్రోమ్‌ను వాడుతున్నారా? అయితే.. ఇకపై ఎంచక్కా మీరు మీ మొబైల్‌లో వెబ్ పేజీలను ఆడియో రూపంలో వినొచ్చు. అంతేకాదు.. టేప్‌రికార్డర్, మ్యూజిక్ ప్లేయర్ మాదిరిగా.. రివైండ్, ఫార్వర్డ్, పాస్ వంటి ఆప్షన్లను కూడా వాడుకోవచ్చు. ఈ మేరకు గూగుల్ తన క్రోమ్ ఆండ్రాయిడ్ వెర్షన్-125లో 'లిజన్ ద పేజ్' అనే ఫీచర్‌ను పరిచయం చేసింది. బీటా వెర్షన్ యూజర్లకే ప్రస్తుతం ఈ సేవలు అందుబాటులో ఉండగా.. త్వరలో ఇతర వెర్షన్లకూ విస్తరించనున్నట్లు గూగుల్ ప్రకటించింది. ప్రస్తుతం 12 భాషల్లో– ఆంగ్లం, హిందీ, బెంగాలీతోపాటు.. అరబిక్, చైనీస్, ఫ్రెంచ్, జర్మన్, ఇండోనేసియన్, జపనీస్, పోర్చుగీస్, రష్యన్, స్పానిష్‌లో ఈ ఫీచర్ అందుబాటులో ఉంది.

ఝార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

» ఐదుగురు మావోయిస్టుల మృతి.. ఇద్దరి అరెస్ట్

చాయ్‌బాసా, జూన్ 17: ఝార్ఖండ్‌లో సోమవారం తుపాకుల మోత మోగింది. వెస్ట్ సింగ్‌భూమ్ జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ఇద్దరు మహిళా మావోయిస్టులు ఉన్నారు. పారిపోతుండగా మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. గువా పోలీస్ స్టేషన్ పరిధిలోని లిపుంగా ప్రాంతానికి సమీపంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని అధికారులు తెలిపారు. ఘటన స్థలంలో ఒక ఇన్సాస్ రైఫిల్, రెండు ఎల్ఎల్ఆర్‌లు, మూడు రైఫిల్స్ (303), ఒక (9ఎంఎం) పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఎయిరిండియా భోజనంలో బ్లేడ్

ముంబై, బెంగళూరు, జూన్ 17: భారత్‌కు చెందిన ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియాలో అందించిన ఆహారంలో ఒకరికి బ్లేడ్ వచ్చింది. మరొకరికి ఉడకని ఆహారం వచ్చింది. ఎయిరిండియా ప్రతిష్ఠను మసకబార్చేలా చేసిన ఈ రెండు సంఘటనలు బెంగళూరు నుంచి, న్యూఢిల్లీ నుంచి అమెరికాకు వెళ్లిన విమానాల్లో చోటుచేసుకున్నాయి. గత వారం బెంగళూరు నుంచి అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోకు బయల్దేరిన ఎయిరిండియాకు చెందిన ఏఐ 175 విమానంలో ప్రయాణించిన మధురేస్ పాల్ అనే జర్నలిస్టుకు విమాన సిబ్బంది భోజనాన్ని అందించారు. తింటుండగా నోట్లో ఏదో గట్టిగా తగిలినట్టు అనిపించింది. బయటకు తీసి చూడగా అది బ్లేడ్ ముక్క. ఆ ఫొటోను ఆయన ఎక్స్‌లో షేర్ చేశారు. ఈ ఘటనపై ఎయిరిండియా స్పందించింది. అది కూరగాయలు కట్‌చేసే విషన్‌లోని బ్లేడ్ ముక్క అని క్షమాపణలు చెప్పింది. ఆ తర్వాత పాల్‌ను సంప్రదించి.. ఏడాదికాలంపాటు ఏ ఎయిరిండియా విమానంలోనైనా చెల్లుబాటయ్యేలా బిజినెస్ క్లాస్ టికెట్‌ను ఆఫర్ చేసింది. అయితే 'లంచం'గా పేర్కొంటూ పాల్ ఈ ప్రతిపాదనను తిరస్కరించినట్టు తెలిసింది. మరో ఘటనలో.. 5 లక్షలు వెచ్చించి ఎయిరిండియా విమానంలో బిజినెస్‌క్లాస్ టికెట్ కొంటే తనకు ఉడకని ఆహారం వడ్డించారని, సీట్లు కూడా చాలా మురికిగా ఉన్నాయని వినీత్ అనే వ్యక్తి ఆరోపించారు. ఆయన శుక్రవారం న్యూఢిల్లీ నుంచి న్యూయార్క్‌కు ఎయిరిండియా విమానంలో బిజినెస్ క్లాస్‌లో ప్రయాణించారు.

ఢిల్లీ విమానాశ్రయంలో పవర్ కట్!

న్యూఢిల్లీ, జూన్ 17: ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం కొంతసేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దాంతో దాదాపు 15 నిమిషాల పాటు సేవలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చెక్-ఇన్, బోర్డింగ్, డిజి యాత్ర వంటి సేవలు కూడా నిలిచిపోయాయి. ఆ తర్వాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో అన్ని సేవలు యథావిధిగా కొనసాగాయి. విమానాశ్రయంలోని పవర్‌గ్రిడ్‌లో సమస్య కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

ఈవీఎంలలో పారదర్శకత పాటించండి..
లేదంటే రద్దు చేయండి: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, జూన్ 17: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మరోమారు సందేహాలు వ్యక్తం చేశారు. వీటి నిర్వహణలో పూర్తిస్థాయి పారదర్శకతను పాటించాలని, లేదంటే రద్దు చేయాలని ఎన్నికల కమిషన్‌కు సూచించారు. సోమవారం ఈ మేరకు ఆయన ట్వీట్ చేస్తూ "ప్రజాస్వామిక సంస్థలు ఆక్రమణకు గురయినప్పుడు పారదర్శకమైన ఎన్నికల ప్రక్రియలోనే ప్రజలకు రక్షణ కలుగుతుంది. ఈవీఎంలు ప్రస్తుతం 'బ్లాక్ బాక్స్'గా మారాయి. వీటి నిర్వహణలో పూర్తి పారదర్శకత ఉండేలా ఎన్నికల కమిషన్ చూడాలి. లేదంటే రద్దు చేయాలి" అని సూచించారు. ఈవీఎంల ఫలితాలను తారుమారు చేసే అవకాశం ఉందని కాంగ్రెస్ సీనియర్ నేత పిట్రోడా కూడా అన్నారు.

రాజ్‌భవన్ నుంచి వెళ్లిపోండి

» పోలీసులకు బెంగాల్ గవర్నర్ ఆదేశం

కోల్‌కతా, జూన్ 17: రాజ్‌భవన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కోల్‌కతా పోలీసులు తక్షణమే వెళ్లిపోవాలని పశ్చిమ బెంగాల్ గవర్నర్ సి.వి.ఆనంద బోస్ సోమవారం ఆదేశించారు. రాజ్‌భవన్ ఉత్తర గేట్ వద్ద ఉన్న పోలీసు అవుట్ పోస్టును జన్ మంచ్ (ప్రజా వేదిక)గా మార్చాలని కూడా ఆయన భావిస్తున్నారు. రాజ్‌భవన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆఫీసర్ ఇన్‌ఛార్జి సహా పోలీసులు అందరూ తక్షణమే ఖాళీ చేయాలని గవర్నర్ ఆదేశించినట్టు ఓ అధికారి తెలిపారు. బీజేపీ నాయకుడు సువేందు అధికారిని రాజ్‌భవన్‌లోకి వెళ్లేందుకు పోలీసులు అనుమతి నిరాకరించిన నేపథ్యంలో గవర్నర్ ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకొంది.

పోక్సో కేసులో విచారణకు యడియూరప్ప

బెంగళూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మాజీ సీఎం యడియూరప్ప పోక్సో కేసులో సోమవారం సీఐడీ విచారణకు హాజరయ్యారు. విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని 4 రోజుల క్రితం ఆయనకు సీఐడీ అధికారులు నోటీసులు ఇచ్చారు. కోర్టును ఆశ్రయించి నాన్ బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేయించారు. యడియూరప్ప హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేయడంతో ఉపశమనం లభించింది. యడియూరప్పను అరెస్టు చేయవద్దని హైకోర్టు సీఐడీకి సూచించింది. అంతకుముందు చెప్పినట్లుగానే యడియూరప్ప సోమవారం విచారణకు హాజరయ్యారు. సుమారు 3 గంటలపాటు సీఐడీ పోలీసులు ఆయనను విచారించారు.

అమెరికాలో భారత సంతతి మహిళ కాల్చివేత

న్యూఢిల్లీ, జూన్ 17: అమెరికాలో భారత సంతతి మహిళను మరో భారతీయ యువకుడు గౌరవ్‌గిల్ కాల్చి చంపేశాడు. కాల్పుల్లో ఇంకో యువతికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమె ప్రాణాపాయ స్థితిలో ఉంది. న్యూ జెర్సీలో ఆదివారం ఈ ఘటన జరిగింది. చనిపోయిన మహిళ పేరు జస్వీర్ కౌర్. గాయపడిన యువతి గగన్‌దీప్ కౌర్(20). ఇద్దరూ బంధువులు. జస్వీర్ ఐదేళ్ల క్రితమే భర్తతో సహా అమెరికాకు వచ్చి స్థిరపడ్డారు. మరోవైపు, గగన్‌దీప్ కౌర్‌కు, నిందితుడైన గౌరవ్‌కు ఇంతకు ముందే పరిచయం ఉంది. పంజాబ్‌లో ఇద్దరూ ఒకే కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్నారు. గగన్‌దీప్ కౌర్ ఇటీవలే స్టూడెంట్ వీసా మీద అమెరికా వచ్చి జస్వీర్ ఇంట్లో ఉంటోంది. ఈ క్రమంలో, గౌరవ్‌గిల్ అమెరికా వెళ్లాడు. ఆదివారం జస్వీర్ ఇంటికి వెళ్లి అక్కడ గగన్‌దీప్‌తో గొడవపడ్డాడు. అడ్డువచ్చిన జస్వీర్‌పైన, ఆ తర్వాత గగన్‌దీప్‌పై కాల్పులు జరిపాడు.

'భారత్', 'ఇండియా'.. రెండూ వాడతాం

» దీనిపై చర్చ అనవసరం: ఎన్‌సీఈఆర్‌టీ చీఫ్

న్యూఢిల్లీ, జూన్ 17: దేశ రాజ్యాంగంలో మాదిరిగానే ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో కూడా 'భారత్', 'ఇండియా' అనే పదాలను పరస్పరం ఉపయోగించనున్నట్లు ఎన్సీఈఆర్టీ డైరెక్టర్ డీపీ సక్లానీ తెలిపారు. వీటిలో దేనిపైనా మండలికి విముఖత లేదని చెప్పారు. ఇప్పటికే తమ పాఠ్యపుస్తకాల్లో ఈ రెండు పదాలనూ ఉపయోగిస్తున్నామని, కొత్త పుస్తకాల్లో కూడా ఇదే విధానం కొనసాగుతుందని చెప్పారు. ఇదో పనికిమాలిన చర్చ అని అభిప్రాయపడ్డారు.అన్ని తరగతుల పాఠ్యపుస్తకాల్లో ఇండియా స్థానంలో భారత్ అని చేర్చాలని సోషల్ సైన్స్ పాఠ్య ప్రణాళికపై పనిచేస్తున్న ఉన్నత స్థాయి కమిటీ సిఫారసు చేసిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా, ఎన్‌సీఈఆర్‌టీ ఆరెస్సెస్ అనుబంధ సంస్థగా పనిచేస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు.

విషాద ప్రయాణం

(మొదటి పేజీ తరువాయి)

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురి పరిస్థితి విషమంగా ఉంది. అసోంలోని సిల్చార్ నుంచి బెంగాల్ రాజధాని కోల్‌కతాకు వెళ్తున్న కాంచనగంగా ఎక్స్‌ప్రెస్‌ను న్యూజల్పాయ్‌గురి దాటిన తర్వాత రంగపాని స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు వెనుకనుంచి గట్టిగా ఢీకొట్టింది. గూడ్స్ బోగీలు చెల్లాచెదురయ్యాయి. కాంచనగంగా బోగీలు రెండు పట్టాలు తప్పగా, ఓ బోగి అమాంతం గాల్లోకి లేచింది. రైల్వే పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.



ప్రమాదంలో చెల్లాచెదురైన రైలు బోగీలు

గూడ్స్ సిగ్నల్ జంప్‌తోనే..



ప్రమాదం జరిగిన స్థలానికి బైక్‌పై వెళ్తున్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

కాంచనగంగా ఎక్స్‌ప్రెస్ దుర్ఘటనలో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. సిగ్నల్ పడినప్పటికీ, గూడ్స్ రైలు దానిని పట్టించుకోకుండా వెళ్లడంతోనే ప్రమాదం జరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. దీనిపై రైల్వేశాఖ నుంచి అధికారికంగా ప్రకటన రావల్సి ఉంది. కాగా, గూడ్స్ డ్రైవర్, సహాయక డ్రైవర్, కాంచనగంగా గార్డ్ కూడా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. క్షతగాత్రులను ఉత్తర బెంగాల్ వైద్య కళాశాలకు తరలించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, క్షతగాత్రులకు రూ.2.50 లక్షలు, స్వల్పగాయాలైన వారికి రూ.50 వేలు పరిహారం అందజేస్తామని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. సోమవారం ఢిల్లీ నుంచి విమానంలో బగ్డోగ్రా చేరుకున్న ఆయన.. అక్కడినుంచి ద్విచక్ర వాహనంపై ప్రమాద స్థలానికి వెళ్లారు. కాగా, రైలు ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం తనను కలచివేసిందని రాష్ట్రపతి ముర్ము తెలిపారు. సహాయ చర్యలు విజయవంతం కావాలని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని పేర్కొన్నారు. కాగా, బెంగాల్ రైలు ప్రమాదం పట్ల ప్రధాని మోదీ స్పందించారు. ఆప్తులను కోల్పోయిన వారికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు ట్వీట్ చేశారు. రైల్వే మంత్రిని తక్షణమే ఘటనా స్థలికి వెళ్లమని ఆదేశించినట్లు తెలిపారు.

రైలు ప్రమాదంపై పవన్ దిగ్భ్రాంతి


పశ్చిమ బెంగాల్ రాష్ట్రం న్యూ జల్పాయిగురి ప్రాంతంలో జరిగిన రైలు ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాంచనజంగ రైలును గూడ్స్ ఢీ కొట్టిన ఈ ప్రమాదంలో 15 మంది మరణించడం దురదృష్టకరమన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కవచ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని సోమవారం పార్టీ కార్యాలయం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

1,500 కి.మీ. మార్గంలోనే 'కవచ్'

రెండు రైళ్లు ఒకే ట్రాక్ (పట్టాలు)పైకి వచ్చినపుడు ఢీకొనకుండా తీసుకొచ్చిన వ్యవస్థ 'కవచ్'. ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే వ్యవస్థ ఉన్న భారత్‌లో ఇంకా చాలా మార్గాల్లో అందుబాటులోకి రాలేదు. ఇప్పటివరకు 1,500 కి.మీ. పరిధి రైల్వే మార్గంలోనే కవచ్ వినియోగం ఉంది. ఇది 1.30 లక్షల రూట్ కిలోమీటర్లు ఉన్న భారతీయ రైల్వే నెట్‌వర్క్‌లో ఒక శాతమే. అందులోనూ మొత్తం కూడా దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోనే ఉండడం గమనార్హం. తెలంగాణ (684 కి.మీ.)దే అత్యధిక వాటా కావడం విశేషం. ఏపీలో 66, కర్ణాటకలో 117, మహారాష్ట్రలో 598 కి.మీ. నెట్‌వర్క్ కవచ్ పరిధిలోకి వచ్చింది. తాజాగా ప్రమాదం జరిగిన ఢిల్లీ-హౌరా రూట్ సహా మరో 3 వేల కి.మీ. మార్గంలో ఈ ఏడాది ఆఖరుకల్లా కవచ్‌ను ప్రవేశపెట్టనున్నారు. కాగా, ఒక రైలు వెళ్తున్న ట్రాక్‌పైనే మరో రైలు కూడా వస్తున్నట్లయితే 'కవచ్' వెంటనే సెన్సార్లతో గుర్తిస్తుంది. రైలు దానంతటదే ఆగిపోతుంది. పైలట్ రెడ్ సిగ్నల్‌ను పట్టించుకోకుండా వెళ్తున్నా, బ్రేకులు పడిపోతాయి. మరోవైపు బెంగాల్ దుర్ఘటనలో సిగ్నలింగ్ లోపాలు ప్రధానంగా చర్చకు వస్తున్నాయి. రాణిపత్ర-ఛత్తర్‌హాట్ కూడలి మధ్య సోమవారం తెల్లవారుజాము నుంచి సిగ్నలింగ్ వ్యవస్థ పనిచేయలేదని రైల్వే వర్గాలు పేర్కొంటున్నాయి. కాంచనగంగా ఎక్స్‌ప్రెస్ 8.27 సమయంలో బయల్దేరినా, రాణిపత్ర-ఛత్తర్‌హాట్ మధ్య ఆగిపోయింది. సాంకేతిక లోపంతో సిగ్నలింగ్ వ్యవస్థ పనిచేయనప్పుడు రైళ్లు నడవడానికి వీలుగా స్టేషన్ మాస్టర్ టీఏ912 సూచన జారీ చేస్తారు. కాంచనగంగాకూ ఇలానే టీఏ912ను జారీ చేశారు. కానీ, ఇదే సమయంలో గూడ్స్ కూడా వచ్చింది. దీంతో గూడ్స్‌కూ టీఏ912 ఇచ్చారా? లేకపోతే గూడ్స్ డ్రైవర్ నిబంధనలను ఉల్లంఘించారా? అనేది నిర్ధారణ కావాల్సి ఉంది.

రీల్స్‌పైనే మంత్రి దృష్టి.. రైళ్లపై లేదు: కాంగ్రెస్

మోదీ ప్రభుత్వ అధ్వాన నిర్వహణ, నిర్లక్ష్యంతో పదేళ్లలో రైలు ప్రమాదాలు పెరిగాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. కేంద్రం తీరుతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైలు ప్రమాదం పట్ల విచారం వ్యక్తం చేసిన ఆయన, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. మోదీ ప్రభుత్వం రైల్వే శాఖను పూర్తిగా దుర్వినియోగం చేసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. రైల్వేలను స్వీయ ప్రచారానికి వేదికలా మార్చారని మండిపడ్డారు. అశ్విని వైష్ణవ్‌కు ఇన్‌స్టా రీల్స్ చేయడంలోనే సమయం సరిపోతోందని, ప్రజల భద్రత ఆయన ప్రాధాన్య అంశాల్లో లేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. దేశంలో రైల్వే వ్యవస్థ ఎవరూ పట్టించుకోని అనాథలా మారిందని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధ్వజమెత్తారు. చార్జీలు పెంచడంపై తప్ప ప్రయాణికుల రక్షణ, వసతుల కల్పనపై ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధ లేదని మండిపడ్డారు.



భార్యాభర్తల నడుమ బుక్కైన
యాపిల్!

సెక్స్ వర్కర్లతో ఐఫోన్‌లో ఓ వ్యక్తి చాటింగ్

మెసేజీలు కంటపడటంతో భార్య విడాకులు

'డిలీట్'పై అవగాహన కల్పించలేదంటూ

యాపిల్ సంస్థపై రూ.53 కోట్లకు భర్త దావా

లండన్, జూన్ 17: తన నుంచి భార్య విడిపోవడానికి కారణం యాపిల్ సంస్థనే అంటూ ఓ వ్యక్తి ఏకంగా కోర్టులో కేసు వేశాడు. ఆ కంపెనీ నుంచి పరిహారంగా రూ.53 కోట్లు డిమాండ్ చేస్తున్నాడు. లండన్‌లో చోటుచేసుకున్న ఈ వ్యవహారం త్వరలోనే అక్కడి కోర్టులో విచారణకు రానుంది. ఇంతకీ ఏం జరిగిందంటే.. లండన్‌కు చెందిన ఓ వ్యాపారి తన యాపిల్ ఐఫోన్‌లోని ఐ మెసేజ్ ద్వారా సెక్స్‌వర్కర్లతో చాటింగ్ చేసేవాడు. అవి తన భార్య కంటపడకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు డిలీట్ చేసేవాడు. అయితే, తాను వాడుతున్న యాపిల్ ఐడీని కుటుంబానికి చెందిన ఐమ్యాక్ లోనూ ఉపయోగించాడు. ఐ మెసేజ్‌లో డిలీట్ చేసిన మెసేజీలు ఐమ్యాక్‌లో మాత్రం ఉండిపోయాయి. అవి భార్య కంటపడటంతో ఇంట్లో పెద్ద గొడవ అయిపోయింది. చివరకు విడాకులకు అది దారితీసింది. దీంతో సదరు భర్త.. యాపిల్ తన వినియోగదారులకు సరైన అవగాహన కల్పించడం లేదని ఆక్షేపిస్తూ కోర్టులో కేసు వేశాడు. ఒక పరికరంలోంచి తీసేసిన సమాచారం, దానితో అనుసంధానించిన ఇతర పరికరాల్లో మాత్రం అలాగే ఉండిపోతుందనే విషయం ముందుగా చెప్పలేదని వాదిస్తున్నాడు. మెసేజ్‌ల్లో పంపినవీ, స్వీకరించినవీ, మరీ ముఖ్యంగా తొలగించినవీ ఏమి అవుతాయనేది తన వినియోగదారులకు స్పష్టపరచకపోవడం యాపిల్ పొరపాటేనని అతని తరపు న్యాయవాది సీమన్ వాల్టన్ చెబుతున్నారు.

ఆదాయపు పన్ను తగ్గించే యోచన!

బడ్జెట్‌పై కొనసాగుతున్న కసరత్తు

న్యూఢిల్లీ, జూన్ 17: మోదీ 3.0 ప్రభుత్వం వచ్చే నెలలో ప్రవేశపెట్టనున్న కొత్త బడ్జెట్‌లో ఉద్యోగ వర్గాలు, వేతన జీవులకు ఊరట కలిగించే విధంగా పలు నిర్ణయాలు ప్రకటించనుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా ఆదాయపు పన్ను భారాన్ని తగ్గించే అవకాశాలు ఉన్నాయి. కిందిస్థాయి శ్లాబుల్లో ఉన్నవారికి ప్రయోజనం కలిగించేలా పన్నులు తగ్గించే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నాయి. సంక్షేమ పథకాలకు నిధుల కేటాయింపుపై దృష్టి పెట్టడం కన్నా, మధ్య తరగతి వర్గం ప్రజల చేతుల్లో నాలుగు డబ్బులు ఉండేటట్టు చూసి తద్వారా ఆర్థిక ప్రగతికి దోహదపడాలన్న ఉద్దేశంలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఆదాయపు పన్ను భారం తగ్గితే ఆ రూపంలో ఆదా అయిన సొమ్ముతో వస్తువులు కొనుగోలు చేస్తారని, దాని ద్వారా ఒకదానితో మరికొటి ముడి పడి ఉండే ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని అంచనా వేస్తోంది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ.3 లక్షల వరకు ఉంటే 5% ఆదాయపు పన్ను చెల్లించాల్సి ఉంది. అది శ్లాబుల వారీగా పెరుగుతుంది. ఆదాయం రూ.15 లక్షలకు చేరుకుంటే పన్ను 30% పెరుగుతుంది. ఆదాయం అయిదు రెట్లు పెరిగితే పన్ను శ్లాబు మాత్రం ఆరు రెట్లు పెరుగుతోంది. ఈ పెరుగుదలలో హేతుబద్ధత లేదని, శ్లాబులు కూడా మరీ ఎక్కువగా ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. జులైలో ప్రవేశపెట్టనున్న 2024-25 బడ్జెట్‌పై ఆర్థిక మంత్రిగా మరోసారి బాధ్యతలు చేపట్టిన నిర్మలా సీతారామన్ కసరత్తు ప్రారంభించారు. మంగళవారం రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రాతో చర్చలు జరపనున్నారు. ఈ నెల20న పారిశ్రామిక వర్గాలతో భేటీ అయి సలహాలు స్వీకరించనున్నారు. ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మూడు క్రిమినల్ చట్టాలను జులై ఒకటో తేదీ నుంచే అమల్లోకి తీసుకురానున్నట్టు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ వెల్లడించారు. ఈ విషయంలో పునరాలోచన ఏమీ లేదని స్పష్టం చేశారు. ఐపీసీ, సీఆర్పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్-1872 చట్టాల స్థానంలో కేంద్ర కొత్త క్రిమినల్ చట్టాలను తీసుకువచ్చిన సంగతి తెలిసిందే.

రాయ్‌బరేలీకే రాహుల్ సై

వయనాడ్‌ను వదులుకోవాలని నిర్ణయం.. అక్కడి నుంచి పోటీ చేయనున్న ప్రియాంక

» కాంగ్రెస్ రాజకీయ ఏటీఎంగా కేరళ:బీజేపీ



న్యూఢిల్లీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో యూపీలోని రాయ్‌బరేలీ, కేరళలోని వయనాడ్‌ల నుంచి విజయం సాధించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ.. రాయ్‌బరేలీకి ప్రాతినిధ్యం వహించాలని, వయనాడ్ స్థానాన్ని వదులుకోవాలని నిర్ణయించుకున్నారు. వయనాడ్ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికలో కాంగ్రెస్ తరఫున ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ పోటీ పడనున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ వివరాలను విలేకర్లకు వెల్లడించారు. సోమవారం ఖర్గే నివాసంలో ఆయనతో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్ పర్సన్ సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, ప్రియాంకా గాంధీ సమావేశమయ్యారు. రెండు స్థానాల్లో గెలిచిన ఎంపీలు లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన 14 రోజుల్లో ఏదో ఒక స్థానాన్ని ఖాళీ చేయాలని నిబంధనలు స్పష్టం చేస్తున్న నేపథ్యంలో.. రాయ్‌బరేలీ, వయనాడ్‌లో రాహుల్ ఏ స్థానాన్ని నిలుపుకోవాలనే అంశంపై చర్చించారు. అనంతరం ఖర్గే విలేకర్లతో మాట్లాడుతూ తరతరాలుగా నెహ్రూ కుటుంబంతో ప్రత్యేక అనుబంధం ఉన్నందువల్ల రాయబరేలీ నుంచే రాహుల్ ఎంపీగా కొనసాగాలని పార్టీ నిర్ణయించిందని తెలిపారు. వయనాడ్ ప్రజలూ రాహుల్‌నే కోరుకుంటున్నప్పటికీ నిబంధనలు అనుమతించడం లేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో పోరాడటానికి అవసరమైన శక్తిని వయనాడ్ ప్రజలు తనకు అందించారని, ఆ విషయాన్ని ఎన్నడూ మర్చిపోనని చెప్పారు. రాయ్‌బరేలీ, వయనాడ్‌లతో తనకు భావోద్వేగపూరిత సంబంధం ఉందని, వాటిల్లో దేనిని ఎంచుకోవాలన్న నిర్ణయం సులభం కాలేదని వెల్లడించారు. రాహుల్ లేని లోటు లేకుండా తాను చూస్తానని వయనాడ్ ప్రజలకు ప్రియాంకగాంధీ హామీ ఇచ్చారు. కష్టపడి పని చేసి మంచి ప్రజాప్రతినిధి అనిపించుకుంటానన్నారు. కాగా, వయనాడ్‌లో రాహుల్‌పై పోటీ చేసి ఓడిపోయిన కేరళ బీజేపీ అధ్యక్షుడు సురేంద్రన్.. రాహుల్ వయనాడ్ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశారని విమర్శించారు. కేరళను కాంగ్రెస్ పార్టీ రాజకీయ ఏటీఎంగా భావిస్తోందన్నారు.

ప్రతిపక్ష నేత పదవికి విముఖం

లోక్‌సభలో ప్రతిపక్ష నేత పదవిని తీసుకోవటానికి కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ అంగీకరించటం లేదని ఆ పార్టీ వర్గాలు సోమవారం వెల్లడించాయి. రాహుల్ బదులుగా కాంగ్రెస్ పార్టీకే చెందిన కుమారి షెల్జా, గౌరవ్ గొగోయ్, మనీష్ తివారీల్లో ఒకరు ఆ బాధ్యతలు చేపట్టవచ్చని పేర్కొన్నాయి. ఈ పదవిలో ఉండే వ్యక్తికి కేంద్ర క్యాబినెట్ మంత్రి హోదాతోపాటు ప్రతిపక్షాలను సమన్వయపరచటంలో, అధికారపక్షాన్ని దీటుగా ఎదుర్కోవటంలో మెరుగైన అవకాశాలు లభిస్తాయి. దీంతో ఈసారి విపక్ష నేత పదవిని రాహుల్‌గాంధీ తీసుకోవచ్చని ప్రచారం జరిగింది. రాహుల్ విపక్షనేత బాధ్యతలు చేపట్టాలని సీడబ్ల్యూసీ కూడా ఇటీవల ఏకగ్రీవ తీర్మానం చేసింది. అయితే, రాహుల్ అందుకు అంగీకరించటం లేదని తాజా సమాచారం. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమితో పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన రాహుల్ ఆ తర్వాత.. ఏ పదవీ తీసుకోవటానికి ఇష్టపడటం లేదని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

క్రైస్తవులారా.. క్షమించండి!

'ఎక్స్' ఖాతాలో వివాదాస్పద పోస్టుపై కాంగ్రెస్ అభ్యర్థన

తిరువనంతపురం, జూన్ 17: "క్రైస్తవులారా.. క్షమించండి!" అని కేరళ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్లను బేషరతుగా క్షమాపణలు కోరింది. అంతేకాదు.. "మేం ఏ మతాన్నీ, ఏ ఆచారాన్నీ కించపరచం. మా పార్టీ సోషల్ మీడియా 'ఎక్స్'లో పెట్టిన పోస్టు మీ మనసులను గాయపరిచి, విఎమ్మల్ని భావోద్వేగానికి, మానసిక అశాంతికి గురి చేసినందుకు తీవ్రంగా చింతిస్తున్నాం. సదరు పోస్టును ఇప్పటికే తొలగించాం" అని తెలిపింది. ఇటీవల ఇటలీలో జీ-7 సదస్సులో ప్రధాని మోదీ పోప్ ఫ్రాన్సిస్‌తో భేటీ అయ్యారు. ఈ ఫొటోను కేరళ కాంగ్రెస్ విభాగం 'ఎక్స్'లో పోస్టు చేస్తూ.. "చివరకు.. పోప్‌కు దేవుడి(మోదీ)ని కలిసే అవకాశం దక్కింది" అంటూ వ్యంగ్యాస్త్రాన్ని జోడించింది. ఇది వివాదాస్పదమైంది. క్రైస్తవ సంఘాలు వ్యతిరేకించాయి. దీంతో కాంగ్రెస్ క్షమాపణలు తెలిపింది.

పౌష్టికాహార లోపంతో ఎవరూ చనిపోకూడదు

» రంగంలోకి ఫీడర్ అంబులెన్సులు

» మళ్లీ గిరిజన గర్భిణి వసతి గృహాలు

» గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా గుమ్మిడి సంధ్యారాణి బాధ్యతలు

» మంత్రిని పట్టించుకోని మహిళా సంక్షేమ శాఖ అధికారులు

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గర్భిణీలు, చిన్నారులు, గిరిజనుల్లో పౌష్టికాహార లోపంతో ఏ ఒక్కరూ చనిపోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సోమవారం సచివాలయంలో ఆమె మంత్రిగా పదవీబాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 544 గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంలను నియమించేందుకు ప్రతిపాదిస్తూ ఫైల్‌పై మొదటి సంతకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'గిరిజన మారుమూల ప్రాంతాల్లో రహదారులు సరిగాలేని ప్రాంతాలకు ఫీడర్ అంబులెన్స్‌లను తిరిగి ప్రవేశపెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. గిరిజన గర్భిణీల వసతి గృహాలను వివిధ గిరిజన ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. త్వరలో ఐటీడీఏ, ఐసీడీఎస్‌లను పూర్తిగా ప్రక్షాళన చేస్తాం' అని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ మురళి పాల్గొన్నారు.

పత్తాలేని అధికారులు

మంత్రిగా ఎవరు పదవీబాధ్యతలు చేపడుతున్నా ఆయా శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు, కమిషనర్‌లు కచ్చితంగా హాజరు కావాలి. అయితే సోమవారం మంత్రిగా గుమ్మిడి సంధ్యారాణి బాధ్యతలు చేపడతున్న సందర్భంలో సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పత్తా లేరు. మంత్రికి ఆయా శాఖల్లోని వివిధ విభాగాలకు సంబంధించి పూర్తి వివరాలతో నోట్ తయారుచేసి ఇవ్వాల్సిన మహిళా శిశు సంక్షేమ అధికారులు అసలు పట్టించుకోలేదు. జిల్లాల నుంచి ఒకరిద్దరు మహిళా శిశు సంక్షేమ శాఖకు చెందిన పీడీలు మాత్రమే హాజరయ్యారు. ఆ శాఖ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి, కమిషనర్, ఇతర విభాగాలకు చెందిన ఏ అధికారీ రాలేదు. దీంతో మంత్రి నివ్వెరపోయారు. మధ్యాహ్నం ఒంటిగంటకు బాధ్యతలు చేపడుతుంటే సమాచార శాఖ అధికారులు ఉదయం 10.30 గంటలకు సమాచారమిచ్చారు. దీంతో పలువురు మీడియా ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు పూర్తిగా గిరిజన మహిళా మంత్రిని విస్మరించడంతో సన్నిహితవర్గాల వద్ద మంత్రి వాపోయినట్లు తెలిసింది. జగన్ ప్రభుత్వంలో చెప్పకముందే చకచకా పనిచేసుకుంటూ వెళ్లిన ఉన్నతాధికారులు ఇప్పుడు ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదని పలువురు అధికారులే నివ్వెరపోతున్నారు. గిరిజన మంత్రి పట్ల ఇంత అలసత్వం ప్రదర్శించిన ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



మంత్రిగా బాధ్యతలు చేపడుతున్న సంధ్యారాణి




పెద్ద పులి పాద ముద్రలుసేకరిస్తున్న డీఆర్వో రవీంద్రవర్మ

పెద్దపులి దాడిలో దెబ్బతిన్న కారు

కారుపై పెద్దపులి దాడి!

క్షేమంగా బయటపడిన ప్రయాణికులు

మర్రిపాడు, జూన్ 17: నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి వద్ద నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ఓ పెద్దపులి కారుపై దాడి చేసింది. దీంతో ఆ కారు ముందుభాగం నుజ్జు నుజ్జు అయింది. అందులో ప్రయాణిస్తున్న వారు క్షేమంగా బయటపడ్డారు. స్థానికులు, అటవీ అధికారుల కథనం మేరకు... కడప జిల్లా గోపవరం మండలం కాలువపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి నెల్లూరులోని కళాశాలలో చేరేందుకు కారులో బయలు దేరారు. కారు కదిరినాయుడుపల్లి సమీపంలోకి వచ్చేసరికి పెద్దపులి ఒక్కసారిగా దాడి చేసింది. కారు వేగంగా వెళ్తుండటంతో కారు ముందుభాగంలో పెద్దపులి చిక్కుకుంది. దీంతో రోడ్డుపై కొంత దూరం పెద్దపులిని కారు ఈడ్చుకుపోయింది. అనంతరం కారు బ్రేక్ వేసి ఆదుపు చేసిన వెంటనే తీవ్రగాయాలతో పెద్దపులి కుంటుకుంటూ అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. కారులో ఉన్న ఐదుగురు ప్రయాణికులు భయంతో హాహాకారాలు చేశారు. అయితే వారికి ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న జిల్లా అటవీశాఖాధికారి(డీఆర్వో) రవీంద్రవర్మ సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకున్నారు. ఆ ప్రాంతంలో పెద్దపులి పాద ముద్రలు సేకరిస్తున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- పార్టీకి, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తా
- 3 నుంచి 6 నెలల్లోగా నామినేటెడ్ పోస్టుల భర్తీ
- పోస్టుల పంపకంలో మిత్రధర్మం పాటిస్తాం
- దాడులకు ప్రతిదాడులు మా సిద్ధాంతం కాదు
- పార్టీలో బీసీ, యువత, మహిళలకు ప్రాధాన్యం
- 2029లో కూడా అధికారం లక్ష్యంగా పనిచేస్తాం
- 'ఆంధ్రజ్యోతి'తో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి, పార్టీకి మధ్య వారధిగా పనిచేస్తానని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గత ఐదేళ్లలో అనేక కష్టాలు పడి, అధికార పక్షం దాడులకు ఎదురొడ్డి నిలబడిన కార్యకర్తలకు అండగా నిలబడతామని కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత న్యాయం చేస్తామని చెప్పారు. తమ నాయకులు, కార్యకర్తలపై వైసీపీ ప్రభుత్వం బనాయించిన తప్పుడు కేసులను 100 రోజుల్లో ఎత్తివేస్తామని తెలిపారు. వారికి మూడు నుంచి ఆరు నెలల్లో నామినేటెడ్ పదవులు ఇస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఐదేళ్ల పాటు ప్రజారంజక పాలన సాగించేలా సహకారం అందిస్తామని, 2029లో కూడా తిరిగి అధికారంలోకి వచ్చేలా ప్రణాళికలు అమలు చేస్తామని వివరించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పల్లా శ్రీనివాసరావు సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

కార్యకర్తలకు ఎటువంటి భరోసా కల్పిస్తారు?

పల్లా: వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు జరిగాయి. అక్రమంగా కేసులు బనాయించి అనేక రకాలుగా వేధించి, హింసించారు. వీటికి సంబంధించి పార్టీ కేంద్ర కార్యాలయంలో పూర్తి సమాచారం ఉంది. రానున్న 100 రోజుల్లో కార్యకర్తలపై పెట్టిన కేసులు ఎత్తివేసేందుకు కృషి చేస్తాం. కోర్టుల్లో ఉన్న కేసుల విషయంలో న్యాయ నిపుణులతో చర్చించి ఏడాదిలోపు ఎత్తివేస్తాం. దీనికి సంబంధించి ప్రణాళిక రూపొందిస్తాం. వైసీపీ నేతల దాడులతో ఆస్తులు, కుటుంబాలు కోల్పోయిన కార్యకర్తలకు పూర్తి భరోసా ఇస్తాం. పార్టీ సహాయ నిధి, ఎన్టీఆర్ ట్రస్టు నుంచి అవసరమైన సాయం అందిస్తాం.

కూటమి ప్రభుత్వంలో తమ నేతలపై దాడులు జరుగుతున్నాయని వైసీపీ అంటోంది?

పల్లా: అక్కడక్కడా దాడులు జరిగిన విషయం పార్టీ దృష్టికి వచ్చింది. దాడులకు ప్రతిదాడులు అనేది టీడీపీ సిద్ధాంతం కాదు. ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని చంద్రబాబు పదేపదే చెబుతున్నారు. ప్రతి కార్యకర్త సంయమనం పాటించాలి. దాడులు, కవ్వింపు చర్యలను పార్టీ అనుమతించదు.

పార్టీ అధికారంలోకి రావడానికి అహర్నిశలూ కృషిచేసిన కార్యకర్తలకు ఎటువంటి న్యాయం చేస్తారు?

పల్లా: ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన కార్యకర్తలు, నాయకులకు నామినేటెడ్ పదవులు ఇస్తాం. ప్రభుత్వంలో వారందరికీ భాగస్వామ్యం కల్పిస్తాం. ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పించి తగు న్యాయం చేస్తాం. 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత కేడర్ కొంతవరకు నిర్లక్ష్యానికి గురయ్యారు. అధికారంలో లేనప్పుడు ఒకలా... ఉన్నప్పుడు మరోలా వ్యవహరించకూడదని పార్టీ నిర్ణయించింది. మూడు నుంచి ఆరు నెలల్లో నామినేటెడ్ పదవుల పంపకం జరిగేలా కృషిచేస్తా. జనసేన, బీజేపీకి ఇచ్చిన 31 అసెంబ్లీ నియోజకవర్గాలు, 8 పార్లమెంటు స్థానాల్లో సీట్లు ఆశించిన టీడీపీ నాయకులకు ప్రాధాన్యం ఇచ్చి వారి గౌరవానికి తగిన పోస్టులు ఇస్తాం. నామినేటెడ్ పదవుల్లో మిత్రధర్మం పాటించి జనసేన, బీజేపీ నాయకులకు భాగస్వామ్యం కల్పిస్తాం.

పార్టీ సభ్యత్వం పెంపు, కార్యకర్తల సంక్షేమంపై ఎటువంటి చర్యలు తీసుకుంటారు?

పల్లా: దేశంలో అత్యధిక కార్యకర్తలు ఉన్న పార్టీల్లో టీడీపీ ఒకటి. రెండేళ్ల కాలానికి ఇచ్చిన సభ్యత్వం వచ్చే డిసెంబరులో ముగుస్తోంది. ఈ పర్యాయం సభ్యత్వ నమోదు ప్రక్రియను సులభతరం చేస్తాం. 2029లో తిరిగి అధికారంలోకి రావడానికి ప్రణాళికలు సిద్ధం చేసి అందుకు తగిన విధంగా కేడర్‌ను సన్నద్ధం చేస్తాం. దీనికోసం సోషల్ మీడియాను అన్ని విధాలుగా ఉపయోగిస్తాం. వైసీపీలా కాకుండా సోషల్ మీడియా వింగ్‌ను సరైన దారిలో ముందుకు తీసుకువెళతాం.

టీడీపీలో యువతకు ప్రాధాన్యం కల్పించే సంప్రదాయం కొనసాగుతుందా?

పల్లా: పార్టీ బలోపేతానికి యువత ఎంతో కీలకం. మొన్న ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం ఇచ్చినట్టే మంత్రివర్గ విస్తరణలో సముచిత స్థానం ఇచ్చాం. ఇదే సంప్రదాయం పార్టీలో కొనసాగిస్తాం. రాజ్యాధికారంలో బీసీలకు భాగస్వామ్యం కల్పిస్తాం. ఎస్సీ/ఎస్టీ/మైనారిటీ వర్గాలకు చెందిన వారికి పార్టీలో ప్రాధాన్యం ఇస్తాం. వైసీపీ చేతుల్లో ఉన్న జిల్లా, మండల పరిషత్‌లు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తాం.

మంగళగిరి ప్రధాన కార్యాలయంలో ఎన్ని రోజులు ఉంటారు?

పల్లా: గాజువాక శాసనసభ్యుడిగా ఎన్నికైన నేపథ్యంలో నియోజకవర్గంలో రెండు, మూడు రోజులు, మంగళగిరి ప్రధాన కార్యాలయంలో కార్యకర్తలకు రెండు, మూడు రోజులు అందుబాటులో ఉంటా. కార్యకర్తల నుంచి గ్రీవెన్స్ తీసుకుని చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తా.



టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన పల్లా శ్రీనివాసరావు సీఎం చంద్రబాబును సత్కరిస్తున్న దృశ్యం

నమ్మకంతో పెద్ద బాధ్యత ఇచ్చాం!

పార్టీకి, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవాలి

- యువతను రాజకీయాల్లోకి స్వాగతించాలి
- జాతీయ అధ్యక్షుడిగా, సీఎంగా అండగా ఉంటా
- సీనియర్ల సూచనలు, జూనియర్ల మద్దతు కూడగట్టుకోవాలి.. వచ్చే నెల నుంచి సభ్యత్వ డ్రైవ్
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు చంద్రబాబు సూచనలు

అమరావతి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఐదేళ్లుగా పడిన కష్టం, పార్టీ బలోపేతం కోసం చేసిన కృషిని గుర్తించి అతి పెద్ద బాధ్యత అప్పగించామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పల్లా శ్రీనివాసరావు యాదవ్‌తో సీఎం చంద్రబాబు అన్నారు. సోమవారమిక్కడ ఉండవల్లి నివాసంలో పల్లా ఆయన్ను కలిశారు. తనకు రాష్ట్ర అధ్యక్ష పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. నమ్మకంతో అతి పెద్ద బాధ్యత అప్పగించామని, సమర్థంగా నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరికీ తగు గౌరవం ఇవ్వాలని, ప్రత్యేకంగా యువతను పార్టీలోకి ఆహ్వానించాలని.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల నుంచి యువతను రాజకీయాల్లోకి స్వాగతించాలని సూచించారు. యువతతోనే సమాజంలో మార్పులు సాధ్యమవుతాయన్నారు. జాతీయ అధ్యక్షుడిగా పార్టీపరంగా, ముఖ్యమంత్రిగా ప్రభుత్వపరంగా అండగా ఉంటానన్నారు. నిత్యం కార్యకర్తలతో అనుసంధానమై పార్టీకి, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవాలని కోరారు. సీనియర్ల సూచనలు.. జూనియర్లు, యువత మద్దతుతో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. వచ్చే నెల నుంచి పార్టీ సభ్యత్వం డ్రైవ్ కూడా పునఃప్రారంభించాలన్నారు. పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలను వీలైనంత త్వరగా నామినేటెడ్ పదవుల్లో నియమించి గౌరవించాలని.. ప్రతి నాయకుడికి తగిన గుర్తింపు ఇవ్వాలని చంద్రబాబు సూచించారు.

నాకంటే మీపైనే ఎక్కువ బాధ్యత ఉంది: లోకేశ్

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యా మంత్రి లోకేశ్‌ను పల్లా కలిశారు. తన కంటే పెద్ద బాధ్యత చంద్రబాబు మీపై ఉంచారని ఈ సందర్భంగా లోకేశ్ అన్నారు. ప్రతి క్షణం కార్యకర్తల నుంచి నాయకుల వరకు అందరికీ తోడుగా నిలవాలన్నారు. 'కొన్ని ప్రాంతాల్లో కార్యకర్తలు, నాయకులు స్తబ్ధుగా ఉన్నారు. వారందరినీ సమాయత్తం చేయాల్సిన గురుతర బాధ్యత మీపై ఉంది. పార్టీ కార్యాలయంలో మెరుగైన వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నాం. ప్రతి మంత్రీ నెలలో ఒక రోజు పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి సముచిత న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలి. ఏం కావాలన్నా అందించేందుకు పార్టీ సిద్ధంగా ఉంది' అని చెప్పారు. పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయడం కోసం అనునిత్యం కష్టపడతానని, సీనియర్ల సలహాలతో పార్టీలోకి యువరక్తం ఎక్కించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పల్లా తెలిపారు. సీఎం చంద్రబాబు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని.. కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేసే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు.

కార్యకర్తలను కాపాడుకోవాలి: చంద్రబాబు




టీడీపీ లీగల్ సెల్ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): 'ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా పార్టీతో ఉండేది కార్యకర్తలే..వారిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సోమవారం ఉండవల్లి నివాసంలో టీడీపీ లీగల్ సెల్ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'ప్రభుత్వమే దారుణాలకు పాల్పడటం, రౌడీయిజం చేయడం వైసీపీ హయాంలోనే చూశాం. ఐదేళ్లలో వైసీపీ అరాచకాలను ఎదుర్కొన్న కార్యకర్తలపై కేసులు పెట్టి, అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేశారు. ఈ అక్రమ కేసులపై లీగల్ సెల్ రేయింబవళ్లు కష్టపడి, కార్యకర్తలకు అండగా నిలిచింది. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి అనేక పోరాటాలు చేయాల్సి వచ్చింది. ఈ పోరాటంలో టీడీపీ లీగల్ సెల్ చేసిన కృషి ప్రశంసనీయం' అని కొనియాడారు.



చిత్తూరులో సోమవారం ప్రారంభించిన అన్న క్యాంటీన్

చిత్తూరులో అన్న క్యాంటీన్

చిత్తూరు, జూన్ 17: చిత్తూరు నగరంలో సోమవారం అన్న క్యాంటీన్ ప్రారంభమైంది. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక చేసిన ఐదు సంతకాల్లో అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం కూడా ఉన్న విషయం తెలిసిందే. దీని అమలులో భాగంగా రాష్ట్రంలోనే తొలిసారిగా చిత్తూరులో అన్న క్యాంటీన్ ప్రారంభమైంది. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, జేసీ శ్రీనివాసులుతో కలిసి కలెక్టర్ షన్మోహన్ రిబ్బన్‌ను కత్తిరించి ప్రారంభించారు. టిఫిన్, మధ్యాహ్న భోజనాన్ని రూ.5కే అందించనున్నారు.

నేడు ఇంటర్ సప్లిమెంటరీ సెకండియర్ ఫలితాలు

అమరావతి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ పరీక్షల మూల్యాంకనంలో తీవ్ర జాప్యంతో తొలుత మంగళవారం సెకండియర్ ఫలితాలను విడుదల చేయాలని ఇంటర్ విద్యాశాఖ నిర్ణయించింది. అయితే ఏ సమయం అనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు. సెకండియర్ విద్యార్థులు సుమారు లక్షన్నర మంది ఉంటారని అంచనా. డిగ్రీ, ఇంజనీరింగ్ అడ్మిషన్లకు ఇబ్బంది లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఫస్టియర్ ఫలితాలకు వారం రోజులు పట్టే అవకాశముంది.

జూనియర్ లెక్చరర్లను రెన్యువల్ చేయాలి

- లోకేశ్‌కు కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ వినతి

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యాశాఖ నిర్లక్ష్యంతో ఈ ఏడాది తమ కాంట్రాక్టు ఇప్పటికీ రెన్యువల్ కాలేదని, కాలేజీలు కూడా ప్రారంభమైనందున వెంటనే రెన్యువల్ చేసేలా ఆదేశాలు జారీచేయాలని కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ నేతలు కుమ్మరకుంట సురేష్, కల్లూరి శ్రీనివాస్, వీరయ్య మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్‌ను కోరారు. సోమవారం ఉండవల్లిలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లోని కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ అంశం చివరి దశలో నిలిచిపోయిందని లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలపై అధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు.

ఆ ముగ్గురినీ తొలగించాలి: ఏఎస్ రామకృష్ణ

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిన పాఠశాల విద్య ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, పాఠశాల విద్య సచివాలయంలో జేడీ సర్వీసెస్‌గా పని చేస్తున్న రామలింగంను వెంటనే ఆ స్థానాలను నుంచి తప్పించాలని మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన చేశారు. 117 జీవో ద్వారా 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి, చాలా పాఠశాలలు మూల పడటానికి, వేల సంఖ్యలో ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరగడానికి కారణమైన ప్రవీణ్‌ప్రకాశ్ నాడు-నేడు, విద్యాకానుక పథకాల్లో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. 2019లో కృష్ణా-గుంటూరు జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భార్యను నిలబెట్టిన ప్రతాప్‌రెడ్డి టీచర్లను బెదిరించి, ఓట్లు వేయించుకోవడం, ప్రభుత్వ అధికారి అయి ఉండి, వైసీపీకి అనుకూలంగా ప్రచారం నిర్వహించడం చేశారని ఆరోపించారు. జేడీ సర్వీసెస్ రామలింగం నాటి విద్యాశాఖ మంత్రికి, టీచర్లకు మధ్య బ్రోకర్‌లా మారి, అక్రమ బదిలీలకు భారీగా నిధులు వసూలు చేశాడని ఆరోపించారు.

మండిన కోస్తా.. తునిలో 40.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

- నేడు, రేపు కోస్తాకు వర్షసూచన

విశాఖపట్నం, అమరావతి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత, ఉక్కపోతతో కోస్తా ప్రాంతం సోమవారం ఉడికిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడమర దిశ నుంచి వీచిన గాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. పలు జిల్లాల్లో వడగాడ్పులు వీచాయి. విజయనగరం జిల్లా వరకూ విస్తరించిన రుతుపవనాలు బలహీనంగా ఉండడంతోపాటు.. పడమర గాలులు వీయడంతో వేడి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. నెల్లూరు నుంచి కళింగపట్నం వరకు పలుచోట్ల 39 డిగ్రీలు పైబడి నమోదుకాగా తునిలో 40.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కాగా.. గోవా నుంచి కోస్తాంధ్ర వరకు విస్తరించిన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. అయితే ద్రోణి బలపడే అవకాశం ఉన్నందున మంగళ, బుధవారాల్లో కోస్తాలో అనేకచోట్ల, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

సెప్టెంబరు రూ.300 టికెట్ల కోటా 24న విడుదల

తిరుమల, జూన్17(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు నెలకు సబంధించి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను టీటీడీ ఈనెల 24వ తేదీన ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఉదయం 10 గంటలకు టీటీడీ అధికారిక వెబ్‌సైట్ 'టీటీదేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్'లో విడుదల చేయనున్నారు. అలాగే శ్రీవారి ఆర్జితసేవా టికెట్లను 18వ తేదీన ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. టికెట్లు పొందిన భక్తులు 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు సొమ్ము చెల్లిస్తే లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. అలాగే కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవల టికెట్లను 21వ తేదీన ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. ఆదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు చెందిన కోటాను విడుదల చేస్తారు. 22న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ, 11 గంటలకు శ్రీవాణిట్రస్టుకు సంబంధించిన టికెట్లను, మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి టోకెన్ల కోటాను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతి, తిరుమలలోని గదుల కోటాను, 27న ఉదయం 11 గంటలకు శ్రీవారిసేవ, 12 గంటలకు నవనీత సేవ, మధ్యాహ్నం ఒంటిగంటకు పరకామణి సేవ టోకెన్లను విడుదల చేయనున్నారు. కాగా, తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం నుంచి మూడురోజుల పాటు జ్యేష్ఠాభిషేక ఉత్సవాలు జరుగనున్నాయి.

నేడు పీఎం కిసాన్ సొమ్ము విడుదల

- బటన్ నొక్కనున్న ప్రధాని మోదీ

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడత సొమ్మును ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం విడుదల చేయనున్నారు. ప్రధాని మోదీ కంప్యూటర్‌లో బటన్ నొక్కి, లబ్ధిదారులైన రైతుల ఖాతాలకు నేరుగా సొమ్ము జమ చేయనున్నారు. ఒక్కో రైతుకు రూ.2వేల చొప్పున అందనున్నాయి. ఏపీలో 40.91 లక్షల మంది రైతులకు పాత బకాయిలతో సహా రూ.824.61కోట్లు విడుదల కానున్నట్లు వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్ సోమవారం తెలిపారు.

భూముల సర్వే నిలిపివేత..?

- పాత రికార్డులు పునరుద్ధరించే అవకాశం

అమరావతి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి ఆయన తండ్రి వైఎస్ఆర్ పేరిట చేపట్టిన భూముల సర్వేపై సమీక్ష చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటిదాకా రాష్ట్రంలో జరిగిన భూముల సర్వేపై సదభిప్రాయం లేదని, రికార్డుల్లో తప్పులొచ్చాయని రైతాంగం ఆందోళన గా ఉంది. ఈ నేపథ్యంలో భూముల సర్వేను నిలిపివేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు తెలిసింది. తొలుత జగన్ ఫొటోలతో ఉన్న పాసుపుస్తకాల జారీని నిలిపివేయాలని ప్రభుత్వం భావిస్తోంది. జగన్ పేరిట సిద్ధం చేసిన సర్వేరాళ్లను ఎలా ఉపయోగించుకోవాలన్న అంశంపై పలు ప్రత్యామ్నాయాలు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దుచేసిన చంద్రబాబు ప్రభుత్వం.. దానితో ముడిపడిన రీ సర్వేపై కూడా త్వరలో నిర్ణయం తీసుకోనుంది. త్వరలో జరిగే మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై చర్చిస్తారని తెలిసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇదివరకే ఈ అంశంపై నివేదిక కోరినట్లు తెలిసింది. భూముల సర్వేను రద్దుచేసే పక్షంలో 2020 డిసెంబరు నాటికి ఉన్న రెవెన్యూ రికార్డులనే పునరుద్ధరించే అవకాశాలున్నాయని సీనియర్ అధికారి ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

నన్ను రిలీవ్ చేయండి

- 12వ పీఆర్సీ కమిషనర్ మన్మోహన్ సింగ్

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాష్ట్రంలో 12వ పీఆర్సీ కమిషనర్‌గా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి మన్మోహన్ సింగ్ తనను బాధ్యతల నుంచి రిలీవ్ చేయాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్‌కు లేఖ రాశారు. 12వ పీఆర్సీ కమిషనర్‌గా రిటైర్డ్ అధికారి మన్మోహన్‌సింగ్‌ను నియమిస్తూ వైసీపీ ప్రభుత్వం 2023 జూలై 12వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి 2023 జూలై 1 నుంచి ఉద్యోగులకు 12వ పీఆర్సీ ప్రయోజనాలు వర్తింపజేయాలి. కానీ, ఉద్యోగులను తీవ్రంగా నిర్లక్ష్యం చేసిన జగన్ సర్కార్ వారికి పీఆర్సీ ఏర్పాటులోనూ ఐదేళ్ల జాప్యం చేసింది. కమిషనర్ నియామకం జరిగి దాదాపు ఏడాది కావస్తున్నప్పటికీ ఇప్పటి వరకు 12వ పీఆర్సీ కసరత్తు ప్రారంభం కాలేదని మన్మోహన్ సింగ్ సీఎస్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. తనకు ఉద్యోగులను కేటాయించకపోవడమే ఇందుకు కారణమని వెల్లడించారు. తన వ్యక్తిగత కారణాల వల్ల కమిషనర్ బాధ్యతలను కొనసాగించలేకపోతున్నానని, తక్షణమే రిలీవ్ చేయాలని మన్మోహన్ సింగ్ కోరారు.

అమిగోస్ బిల్లుల చెల్లింపులు నిలుపుదల

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 17: ఖనిజ రవాణాకు సంబంధించి అమిగోస్ మినరల్స్ ప్రైవేటు సంస్థ బిల్లుల చెల్లింపులను అనంతపురం జిల్లా గనులు-భూగర్భ శాఖ అధికారులు నిలుపుదల చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా అమిగోస్ సంస్థ ఏర్పాటు చేసిన 72 చెక్‌పోస్టులను అధికారులు మూసివేయించారు. అమిగోస్ కార్యకలాపాలను సైతం పూర్తిగా నిలిపివేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అమిగోస్ బిల్లుల చెల్లింపులను నిలుపుదల చేసినట్లు అనంతపురం జిల్లా గనులు-భూగర్భశాఖ అధికారి నాగయ్య సోమవారం తెలిపారు. రెండు మూడు రోజుల్లో ప్రభుత్వం కొత్త విధానం ప్రకటిస్తుందని తెలిపారు. అమిగోస్ సంస్థ తదుపరి బిల్లుల విషయంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నడుచుకుంటామని అన్నారు.

వైసీపీ హయాంలో దోపిడీ..

వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఖనిజ సంపదను అమిగోస్ మినరల్స్ దోచుకుంది. ప్రభుత్వం మారడంతో అనంతపురం లోని తమ కార్యాలయంలో ఉన్న ముఖ్యమైన ఫైల్స్‌ను తరలించేందుకు వారం క్రితం ఆ సంస్థ ప్రతినిధులు ప్రయత్నించగా..మైన్స్ అధికారులు అడ్డుకున్నారు. తిరుపతికి చెందిన అమిగోస్ సంస్థ ఎండీ ప్రసాద్ రెడ్డి వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ప్రధాన అనుచరుడు. జిల్లావ్యాప్తంగా 72 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, పన్నుల రూపంలో రూ.కోట్లు వసూలు చేశారు.

'కన్ఫర్డ్ ఐఏఎస్‌ల' జాబితా రద్దు చేయండి

- కొత్త జాబితా పంపిస్తాం.. ఆ తర్వాతే ఇంటర్వ్యూలు
- యుపీఎస్సీకి సీఎస్ కార్యాలయం లేఖ
- నాడు అస్మదీయులకు కన్ఫర్డ్ కట్టబెట్టేందుకు వైసీపీ సర్కారు యత్నాలు
- అప్పట్లో మాజీ సీఎస్ జవహర్ రెడ్డి అత్యుత్సాహం
- ఎన్నికల కోడ్ ఉన్నప్పుడే ఇంటర్వ్యూలు చేసేద్దామని లేఖ
- ఈ నెల 25న తేదీ ఖరారు చేసిన యుపీఎస్సీ

అమరావతి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కన్ఫర్డ్ ఐఏఎస్ పోస్టుల భర్తీకి సంబంధించి గత వైసీపీ ప్రభుత్వం పంపించిన జాబితాను నిలిపివేయాలని, కొత్తగా అర్హులందరికీ అవకాశం కల్పిస్తూ మరో జాబితా పంపిస్తామని చంద్రబాబు ప్రభుత్వం యూపీఎస్సీకి లేఖ రాసింది. దీనికి సంబంధించి ఈ నెల 25న నిర్వహించ తలపెట్టిన ఇంటర్వ్యూలను రద్దు చేసి, తాము జాబితా పంపాక ఇంటర్వ్యూలకు తేదీలను ఖరారు చేయవచ్చని సీఎస్ కార్యాలయం లేఖలో పేర్కొంది. వైసీపీ హయాంలో ఎన్నికల ముందు కన్ఫర్డ్ ఐఏఎస్ పోస్టుల భర్తీ విషయంలో భారీ డ్రామా జరిగిన విషయం తెలిసిందే. అస్మదీయులకు కన్ఫర్డ్ ఐఏఎస్ పోస్టులను కట్టబెట్టాలని ఆరాటపడింది. జూన్ 4 ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మే 30 లేదా 31వ తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించేద్దామని నాటి సీఎస్ జవహర్‌రెడ్డి యూపీఎస్సీకి లేఖ రాశారు. అయితే దీనిపై యుపీఎస్సీ తీవ్ర స్థాయిలో స్పందించింది. ఎన్నికల కోడ్ ఉన్నప్పుడు ఇంటర్వ్యూలు నిర్వహించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. జూన్ 25వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు యుపీఎస్సీనే తేదీలు ఖరారు చేసింది. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైందని, ఈ సమయంలో ఇంటర్వ్యూలకు హాజరయ్యే పరిస్థితి లేదని చంద్రబాబు ప్రభుత్వం తాజాగా లేఖ రాసింది.

ఇప్పుడు అర్హులందరికీ అవకాశం!

గత ప్రభుత్వంలోని పెద్దలు అత్యంత రహస్యంగా ఈ పోస్టులు భర్తీ చేసేద్దామని ప్రయత్నాలు చేశారు. కనీసం నోటిఫికేషన్‌ను బయటకు రానివ్వకుండా, వచ్చినా ఎక్కువ సమయం ఇవ్వకుండా చేశారు. దీంతో దరఖాస్తు చేద్దామనుకునే వారంతా తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. అధికారులు తాము ముందుగా నిర్ణయించిన వారి దరఖాస్తులు వచ్చాయో.. లేదో చూసుకున్నారు. వారి దరఖాస్తులు రాగానే, గతంలో దరఖాస్తు చేసుకున్న కొంత మంది పేర్లు తీసుకుని లిస్ట్‌లో కలిపేసి యుపీఎస్సీకి పంపించేశారు. దీనిపై అప్పట్లోనే చాలా మంది అధికారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కానీ గత ప్రభుత్వంలో ఎవ్వరూ మాట్లాడడానికి వీల్లేదన్నట్లు నియంత పాలన సాగడంతో అధికారులు కూడా సైలెంట్ అయ్యారు. కొత్త ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో.. నాడు రహస్యంగా ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేయాలని కొంత మంది అధికారులు డిమాండ్ చేస్తున్నారు. మళ్లీ కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చి అర్హత కలిగిన వారందరి దగ్గర నుంచి దరఖాస్తులు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో పాత జాబితాను పక్కన పెట్టాలని, కొత్తగా జాబితా పంపాక ఇంటర్వ్యూ తేదీలను ఖరారు చేయాలని కోరుతూ చంద్రబాబు ప్రభుత్వం యూపీఎస్సీకి లేఖ రాసింది.

టీడీపీ కార్యకర్త దారుణహత్య

- అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఘటన



లాల్‌బాషా

తాడిపత్రి టౌన్, జూన్ 17: అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలోని నందలపాడుకు చెందిన టీడీపీ కార్యకర్త లాల్ బాషా(23)ను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. డాబాపై నిద్రిస్తున్న అతనిని సోమవారం తెల్లవారుజామున కత్తులతో నరికేశారని డీఎస్పీ జనార్దన్‌నాయుడు తెలిపారు. నందలపాడుకు చెందిన లాల్‌బాషా మెకానిక్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. స్నేహితులతో కలిసి ఆదివారం రాత్రి డిన్నర్‌కు వెళ్లొచ్చి డాబాపై నిద్రించాడు. తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో విచక్షణారహితంగా దాడిచేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం ఎంతసేపటికీ కిందకు దిగిరాకపోవడంతో తల్లిదండ్రులు వెళ్లి చూశారు. రక్తపు మడుగులో ఉన్న కుమారున్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ జనార్దన్‌నాయుడు, సీఐ నాగేంద్రప్రసాద్ డాగ్‌స్క్వాడ్‌తో వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. లాల్‌బాషా తల్లిదండ్రులను విచారించి.. కేసు నమోదు చేసుకున్నారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని డీఎస్పీ అన్నారు. లాల్‌బాషా పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఆ కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దేవుడ్ని దోచుకున్న ధర్మారెడ్డి, కరుణాకర్‌రెడ్డి

- మూడు నెలల్లో రూ.1200 కోట్ల పందేరం
- చేసిన పాపాలకు మూల్యం చెల్లించుకోవాల్సిందే
- మాజీ ఈవోపై న్యాయ విచారణకు ఆదేశించాలి: నీలాయపాలెం

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): 'దేవుని దోచుకున్న ధర్మారెడ్డి, కరుణాకర్‌రెడ్డి మూడు నెలల్లో రూ.1,200 కోట్లు పందేరం చేశారు' అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ధర్మారెడ్డి, కరుణాకర్‌రెడ్డి రిజైన్ చేసినంత మాత్రాన శుద్ధపూసలు అయిపోరు. శ్రీవాణి ట్రస్ట్‌ల పేరుతో, సమరత సేవాట్రస్ట్‌కు నిధుల పేరుతో దోపిడీ చేశారు. ఈ ఐదేండ్లలో తిరుమలలో హిందూ వ్యతిరేక కార్యక్రమాలు, అవినీతి, అక్రమాలు ఎన్నో జరిగాయి. ధర్మారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, జగన్‌ల నేతృత్వంలో తిరుమలను భ్రష్టు పట్టించారు. ఎక్కడ దొరికిపోతామోనని బోర్డు తీర్మానాలను, ఇంజనీరింగ్ పనులన్నీ వెబ్‌సైట్ నుంచి మాయం చేశారు. చేసిన పాపాలకు మూల్యం చెల్లించుకోక తప్పదు' అని హెచ్చరించారు. ఇంజనీరింగ్ విభాగంలో పరిమితికి మించి రూ.కోట్లు విలువ చేసే పనులకు అనుమతులు మంజూరు చేసి భారీ అక్రమాలకు తెరతీశారని లెక్కలతో సహా వివరించారు. సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘించి, ఎన్‌జీటీలో కేసు నడుస్తుండగా మడ అడవుల్లో గుడి నిర్మాణం చేపట్టడాన్ని తీవ్రంగా తప్పు పట్టారు. కొత్తగా సలహాదారుల విధానాన్ని టీటీడీలోకి తీసుకొచ్చిన ధర్మారెడ్డి సలహాదారులుగా తనకు ఇష్టం వచ్చినోళ్లతో టీటీడీలోని కీలక విభాగాలను నింపేశారని ఆరోపించారు. శానిటేషన్ దోపిడీ, విశాఖ స్వరూపానంద ఆశ్రమానికి నూరు శాతం అతిక్రమణలతో భవన అనుమతులు మంజూరు వంటి వేలాది అభియోగాలు ధర్మారెడ్డి మీద ఉన్నాయన్నారు. 'ఈ ఐదేళ్లలో ఆయన లీలలన్నీ శాఖాపరమైన విచారణతో తేలవు. ప్రతి అవినీతికి మూలాలు లోతుగా ఉన్నాయి. అందుకని ప్రభుత్వం ధర్మారెడ్డిని రిలీవ్ చేయకుండా ఆయన హయాంలో జరిగిన అన్నీ విషయాలపై న్యాయ విచారణకు ఆదేశించాలి' అని విజయ కుమార్ కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కలంపై కక్ష

ప్రముఖ రచయిత్రి అరుంధతీరాయ్ మీద పద్నాలుగేళ్ళనాటి ఓ కేసును తిరగదోడి, ఆమెమీద ఏకంగా 'ఊపా' ప్రయోగానికి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అనుమతించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కశ్మీర్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ న్యాయశాస్త్ర మాజీ ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌ను కూడా ఈ క్రూరమైన చట్టం కింద విచారించడానికి గవర్నర్ అనుమతించారు. గత ఏడాది అక్టోబర్‌లో వీరిద్దరినీ ఐపీసీ సెక్షన్లతో పాటు ఊపా చట్టంలోని 13వ సెక్షన్‌కింద విచారించేందుకు ఢిల్లీ పోలీసులు అనుమతికోరితే, రెండు ఐపీసీ సెక్షన్లకు మాత్రమే సరేనన్న గవర్నర్ ఇప్పుడు ఊపాకు అనుమతించారు. ఎటువంటి విచారణలు లేకుండా సాధ్యమైనంత వేగంగా అరుంధతిని నిర్బంధంలోకి నెట్టేయాలని పాలకులకు ఉత్సాహంగా ఉన్నట్టుంది. కానీ, అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులున్న ఒక రచయిత్రితో ఈ రీతిన వ్యవహరిస్తూ వారు దేశానికి ఎనలేని అపకీర్తి తెస్తున్నారు.

రాజకీయ ఖైదీల పక్షాన పనిచేసే కమిటీ ఒకటి ఢిల్లీలో 2010లో ఏర్పాటుచేసిన ఈ సదస్సులో వక్తల ఉపన్యాసాలు వేర్పాటువాదాన్ని ప్రోత్సహించేట్టుగా ఉన్నందున దేశద్రోహం కేసు పెట్టాలంటూ 'రూట్స్ ఇన్ కశ్మీర్' సంస్థ నాయకుడు సుశీల్ పండిట్ అప్పట్లో ఫిర్యాదు చేశారు. 'దేశద్రోహం' కేసు స్థాయిలో ప్రసంగాలు లేవని పోలీసులు మొదట ఊరుకున్నా, మెట్రోపాలిటన్ మేజి[illegible] ఆదేశాలతో ఎఫ్-ఐఆర్ నమోదు చేయాల్సివచ్చింది. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగం కాదు అంటూ 'ఆజాదీ: ద ఓన్లీవే' సదస్సులో అరుంధతీరాయ్ వ్యాఖ్యానించిన ఆ వీడియో ఇప్పటికీ అందుబాటులో ఉంది. ఆ వ్యాఖ్యతో పాటుగా, దానికి సమర్థనగా ఆమె భారతదేశం ఐక్యరాజ్యసమితిలో చేసిన ప్రస్తావనలు, తీర్మానాలను సైతం ఉటంకించారు. అవన్నీ వెనక్కుపోయి వివాదాస్పదంగా కనిపించే ఆ వ్యాఖ్యలు మాత్రమే అవసరార్థం అనంతరకాలంలో ప్రచారంలోకి వచ్చాయి. కశ్మీర్ విషయంలో అప్పటికే కొన్ని సానుకూల చర్యలు ఆరంభించిన తరుణంలో ఆనాటి ప్రభుత్వం ఈ కేసును ముందుకు తీసుకుపోలేదు.

ఇప్పుడు ఆ కశ్మీర్ లేదు. రెండుగా విడిపోయి కేంద్రపాలిత ప్రాంతంగా మిగిలింది. ప్రత్యేక ప్రతిపత్తిని కోల్పోయిన తరువాత అది ఎంతో బాగుపడిందని చెబుతున్న బీజేపీ పెద్దలు, ఇప్పటి పరిస్థితులతో సంబంధం లేని దశాబ్దంన్నర నాటి ఓ కేసును ఎందుకు తవ్వితీస్తున్నారో తెలియదు. చిన్నాచితకా సెక్షన్లతో కాక, ఏకంగా ఊపాతో ఉరిబిగించాలన్న ఆలోచన అంతలోనే వారికి కలిగింది. మూడేళ్ళు ఖైదుచేయగల సెక్షన్లకంటే, వెంటనే అరెస్టుచేసి జైల్లోకి నెట్టివేసి, ఏడేళ్లకుపైగా శిక్షపడే ఊపాను వారు ఎంచుకున్నారు. వారు సమూలంగా ప్రక్షాళించామంటున్న కశ్మీర్‌లో ఉగ్రవాదం తిరిగి బుసకొడుతున్న పరిస్థితులను చూస్తున్నాం. మూడోసారి అధికారంలోకి రాగలిగినా, భారతీయులు బీజేపీ రెక్కలను కత్తిరించారని, సంకీర్ణ పాలనలో మోదీ కచ్చితంగా తగ్గవలసి వస్తుందని దేశవిదేశీ మీడియా విశ్లేషిస్తున్న నేపథ్యంలో, అరుంధతిని చూపి వారు ఏదో సందేశాన్ని ఇవ్వదల్చుకున్నట్టు ఉంది. ఊపా ప్రయోగాన్ని సుప్రీంకోర్టు అంగీకరించదని, దాని గతకాలపు ఆదేశాలు, సూత్రాలకు అనుగుణంగా ఈ నిర్ణయం లేదని న్యాయనిపుణులు అంటున్నారు. సుదీర్ఘకాలం తరువాత సర్వోన్నత న్యాయస్థానంలో ఏమి తేలినప్పటికీ, అంతలోగా గిట్టనివారిని కాల్చుకుతినేందుకు ఊపా ఉపకరిస్తుంది. ఆయా వ్యక్తులు, లేదా సంస్థల చర్యలు, చేష్టల కారణంగా భవిష్యత్తులో హింస రేగకుండా, నేరాలు జరగకుండా నిరోధించడం ఊపా ఆశయం. సభ జరిగిన పద్నాలుగేళ్ళ తరువాత కేసు తవ్వితీయడం అర్థంలేనిది. వక్తల ప్రసంగాలతో కశ్మీరీ ప్రజలు మరింత రెచ్చిపోయి, వేర్పాటువాదం ఇంకొంత బలపడిన దాఖలాలు ఏమైనా ఉంటే అవి అప్పట్లోనే కనిపించివుండేవి, అప్పుడు ఆ ఉపన్యాసాలకు అనంతర పరిణామాలకు మధ్య ఒక లంకె ఏర్పడి, కేసు సముచితమేనని కొందరికైనా నమ్మకం కలిగేది. అరుంధతి తన ప్రసంగంలో కశ్మీర్ అంతర్జాతీయ స్థితి, హోదా, ప్రజల రాజ్యాంగహక్కుల విశ్లేషణకు ప్రయత్నించి ఉంటారే తప్ప, అధికారపార్టీ నాయకుల్లాగా విద్వేషాలను, భావోద్వేగాలను రెచ్చగొట్టే పని చేయరు. అరుంధతీరాయ్ ఒక బలమైన అసమ్మతి గొంతు, ప్రజాపక్షపాతి. పీడితవర్గాల పక్షాన ధైర్యంగా మాట్లాడే ఆమె, బీజేపీ దాని అనుబంధ సంస్థలను ఏకిపారేయడంలో ముందుంటారు. ఇటలీ జీ7 పర్యటనలో, భారత ప్రజాస్వామ్యం గురించి నరేంద్రమోదీ ఎంతో గర్వంగా నాలుగుమాటలు చెబుతున్న తరుణంలోనే, అరుంధతిమీద ఊపా ప్రయోగం జరగడం విశేషం. అసమ్మతి గొంతులను ఏమాత్రం వదిలిపెట్టబోమన్న బలమైన హెచ్చరిక ఇది.

అద్భుత ప్రజాతీర్పు ఇది, గొప్ప మార్పుకు నాంది

17వ లోక్‌సభ ఎప్పుడు పూర్తయిందో, 18వ లోక్‌సభ ఎప్పుడు ఏర్పడిందో తెలియనంతగా దేశ రాజకీయాల్లో మరో ఘట్టం ప్రారంభమైంది. ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ మూడోసారి బాధ్యతలు స్వీకరించడం, మంత్రివర్గాన్ని ఏర్పర్చడం, ఆ వెంటనే ఆయన ఇటలీలో జీ–7 శిఖరాగ్ర సమావేశానికి హాజరై అగ్రదేశాధినేతలతో చర్చలు జరపడం, రైతుల సంక్షేమానికి, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించడంతో అంతా ఎప్పటి మాదిరే ఒక క్రమ పద్ధతిలో కొనసాగుతోందన్న అభిప్రాయం కలిగిస్తోంది. కేంద్రంలోని అన్ని ముఖ్యమైన శాఖలను గతంలో బాధ్యతలు నిర్వర్తించిన వారికే అప్పగించారు. రక్షణమంత్రిగా రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రిగా అమిత్ షా, ఆర్థికమంత్రిగా నిర్మలా సీతారామన్, విదేశాంగ శాఖ మంత్రిగా జయశంకర్, రవాణా, హైవేల మంత్రిగా నితిన్ గడ్కరి, విద్యామంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ యథా ప్రకారం తమ బాధ్యతలను నిర్వహించడం ప్రారంభించారు.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

గత పది సంవత్సరాలుగా జరుగుతున్న అభివృద్ధిని అదే విధంగా కొనసాగించడం కోసం ప్రధానమంత్రి ముఖ్యమైన మంత్రులను కొనసాగించారు. అంతేకాదు, భారతదేశం అవలంబిస్తున్న రక్షణ, ఆర్థిక, విదేశాంగ, అంతర్గత భద్రతా విధానాలలో మార్పు ఉండదనే సంకేతాన్ని పంపించారు. మిత్రపక్షాల్లో చురుకుగా పనిచేసే అయిదుగురు నేతలకు కీలక కేబినెట్ బాధ్యతలు అప్పగించారు. బీజేపీకి చెందిన మాజీ ముఖ్యమంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, మనోహర్ లాల్ ఖట్టర్‌లకు అత్యంత ముఖ్యమైన మంత్రిత్వ శాఖలను కేటాయించారు. ప్రజలకు తాము చేసిన వాగ్దానాలను నెరవేర్చడం విషయంలో కూడా వెనక్కి తగ్గబోమన్న సందేశాన్ని కూడా ప్రధానమంత్రి ఈ మంత్రివర్గం ఏర్పాటు ద్వారా పంపించారు. అంతేకాదు, ఈ మంత్రివర్గం ద్వారా మొదటి పదేళ్లలో తాను చేసిన పనులన్నీ ట్రైలర్‌గా చెప్పిన ప్రధానమంత్రి రానున్న పది సంవత్సరాల్లో అసలు సిసలైన అభివృద్ధి ఏమిటో నిరూపించుకోవాలనుకున్నారు.

ఈశాన్యంలో అరుణాచల్ ప్రదేశ్, తూర్పున ఒడిషాలో ఎన్డీఏ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడడం కూడా ఆరోగ్యకరమైన పరిణామం. ఒడిషాలో 24 సంవత్సరాలు అధికారంలో ఉన్న ఒక పార్టీని గద్దెదించి బీజేపీ అధికారంలోకి రావడం ఒక చరిత్రాత్మక పరిణామమైతే, ఈ ప్రభుత్వానికి ఒక ఆదివాసీ సంతాల్ తెగకు చెందిన మోహన్ మాఝీ ముఖ్యమంత్రి కావడం దేశంలో ఒక సామాజిక విప్లవానికి మోదీ దోహదం చేస్తున్న తీరుకు నిదర్శనం.

దేశంలో చెప్పుకోదగ్గ మార్పు ఆంధ్రప్రదేశ్‌లో జరిగింది. ఒక నియంత నేతృత్వంలో గత అయిదేళ్లుగా జరిగిన అరాచక, కక్షపూరిత పాలనకు ప్రజలు చరమగీతం పాడారు. ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రతిఘటించారు. రైతులు, ఉద్యోగులతో పాటు వివిధ తరగతులకు చెందినవారు తమపై జరిగిన అణిచివేతను, నిర్బంధ విధానాలను ధిక్కరించారు. దాదాపు ప్రతి జిల్లాలోనూ, ప్రతి నియోజకవర్గంలోనూ జగన్ పార్టీ ఘోరంగా ఓటమి పాలైంది. ఒక రకంగా చెప్పాలంటే ఇది జగన్ పాలన పట్ల అసహ్యంతో ప్రజలు సాధించిన నిశ్శబ్ద విప్లవ ఫలితం.



> ఒక సామాన్య కార్యకర్తనైన నన్ను పార్టీ జాతీయ కార్యదర్శిగా నియమించారు; ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయించి ప్రజల ఆశీర్వాదం లభిచేందుకు అవకాశం కల్పించారు; అక్కడితో ఆగకుండా మంత్రిపదవిలో నియమించారంటే అది మోదీ–చంద్రబాబు నా మీద పెట్టుకున్న నమ్మకమే కారణం.

కేంద్రంలో నరేంద్రమోదీ, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల అద్భుత కలయికతో ప్రజలు ఉప్పొంగిపోయి ఈ కలయికను కళ్లకద్దుకున్నారు. దేశంలో గత పదేళ్లుగా మోదీ ఒక్క రోజు కూడా విశ్రమించకుండా అభివృద్ధి కోసం, దేశం ప్రపంచ దేశాల్లో తలెత్తుకుని తిరగడం కోసం, భారతీయుడి మనోభావాలకు గౌరవం లభించడం కోసం చేస్తున్న కృషి ప్రజలు గమనిస్తున్నారు. అదే విధంగా అభివృద్ధికే మారుపేరైన చంద్రబాబు నాయుడు రాష్ట్ర పునర్నిర్మాణం కోసం నిస్వార్థంగా, నిజాయితీగా, చిత్తశుద్ధితో పనిచేయగలరని ప్రజలు గమనించారు. 'చంద్ర బాబు ఎప్పుడు ఫోన్ చేసినా తన రాష్ట్రానికి చెందిన సమస్యలకోసమే చేస్తారు. ఆయన ఏదడిగినా నెరవేర్చేందుకు ప్రయత్నించండి..' అని గతంలో వాజపేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు పీఎంఓలో అధికారులను ఆదేశించేవారు. అప్పటికీ ఇప్పటికీ చంద్రబాబు వైఖరిలో మార్పే లేదు. ఇక గత పదేళ్లుగా జనం మధ్యలోనే తిరుగుతూ రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనను నిరసిస్తూ, అనేక అవమానాలను తట్టుకుంటూ ఉగ్రూతలూగే ప్రసంగాలు చేసిన పవన్ కల్యాణ్ అగ్నిలో ఆజ్యం పోసినట్లు ఈ విజయానికి కారకులయ్యారు. అందుకే మోదీ ఆయనను 'పవన్ కాదు, తుఫాన్' అని ప్రశంసించారు. మోదీ–చంద్రబాబు–పవన్‌ల గొప్ప కలయిక తమకు అదృష్టంగా లభించిందని ప్రజలు భావించినందువల్లే వారి నాయకత్వాన్ని గుండెలకు హత్తుకున్నారు.

జూన్ మొదటి వారంలో లభించిన అద్భుత విజయాల తర్వాత అగ్రనేతలందరూ తమ కర్తవ్య పాలనపై దృష్టి సారించారు. తన శైలికి తగ్గట్లుగా చంద్రబాబు నాయుడు తొలి రోజు నుంచే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం ప్రారంభించారు. పెద్ద ఎత్తున ఉద్యోగాల నియామకానికి శ్రీకారం చుడుతూ మెగా డీఎస్సీపై సంతకం చేశారు. జగన్ పాలనలో దురాక్రమణలకు తావిచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశారు. పింఛన్లను రూ. 4వేలకు పెంచారు. అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించారు. జగన్ దుర్మార్గాలకు వంత పలికిన అధికార వ్యవస్థ ప్రక్షాళనకు నడుం కట్టారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అయిదో రోజే పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. అభివృద్ధి, పునర్నిర్మాణం, ప్రజా సంక్షేమం తప్ప మరో ధ్యాస లేని ముఖ్యమంత్రి సారథ్యంలో ఏపీ అనతికాలంలో మళ్లీ పూర్వవైభవాన్ని సంతరించుకుంటుందన్న విషయంలో ఎటువంటి సందేహం లేదు.

ఇలాంటి నాయకత్వంలో అత్యంత కీలకమైన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యాశాఖ మంత్రిపదవి లభించడం నాకెంతో గర్వకారణం. గత కొన్ని దశాబ్దాలుగా పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ఏ పదవి లభించినా, ఏ పనిచేయాల్సి వచ్చినా కష్టపడి పనిచేయడం, ఇచ్చిన బాధ్యతను నూటికి నూరుపాళ్లు విజయవంతంగా నెరవేర్చడం వల్లనే నాకీ గుర్తింపు లభించిందనుకుంటున్నాను. భారతీయ జనతా పార్టీలో వాజపేయి, అద్వానీ, నరేంద్రమోదీ, వెంకయ్యనాయుడు లాంటి నేతలందరూ అతి సామాన్య స్థాయి నుంచి ఉన్నత పదవులకు ఎదిగినవారే. సామాన్య కార్యకర్తలకు, పార్టీకోసం కష్టపడి పనిచేసేవారికి బీజేపీలో ఎప్పుడూ అవకాశం లభిస్తూనే ఉంటుంది. ఒక సామాన్య కార్యకర్తనైన నన్ను పార్టీలో జాతీయ కార్యదర్శిగా నియమించి, ఉత్తర ప్రదేశ్, కేరళ, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో పరిశీలకుడుగా, సహ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు. అండమాన్ నికోబార్‌కు ఇన్‌ఛార్జిగా నియమించారు. ధర్మవరం లాంటి రాజకీయంగా అత్యంత క్లిష్టమైన నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయించి అక్కడ ప్రజల ఆశీర్వాదం లభించేందుకు అవకాశం కల్పించారు. అక్కడితో ఆగకుండా మంత్రిపదవిలో కూడా నియమించారంటే అది మోదీ–చంద్రబాబు నాయుడు నా మీద పెట్టుకున్న విశ్వాసానికి కారణం. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం కృషి చేయాల్సిన బాధ్యత నాపై ఉన్నది. గత అయిదు సంవత్సరాలుగా 'సత్యకాలమ్' ద్వారా పార్టీ జాతీయ కార్యదర్శిగా దేశంలోనూ, రాష్ట్రంలోనూ జరుగుతున్న పరిణామాలపై విశ్లేషణలు అందించేందుకు అవకాశం కల్పించిన ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, సంపాదకవర్గానికి కృతజ్ఞతలు తెలుపుతూ **ఈ కాలమ్‌కు విరామం ప్రకటిస్తున్నాను.**

(బీజేపీ జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యాశాఖ మంత్రి)

మనకు మిగిలింది పావు శతాబ్దమే!

మానవ ఆలోచనల్లో కొన్ని మైలురాళ్లు ఉంటాయి. వాటిని విస్మరించటం కష్టం. వాటి పరిధిని మనం పూర్తిగా దాటలేం. ప్రతి మైలురాయి మన జ్ఞాన విస్తరణలో ఒక కీలక దశే! డార్విన్ పరిణామ వాదం, కాల్ మార్క్స్ శ్రమ సిద్ధాంతం, సిగ్మండ్ ఫ్రాయిడ్ మానసిక విశ్లేషణ, జపాల్ సార్త్ర అస్తిత్వవాదం, నోమ్ ఛామ్‌స్కీ భాషా సిద్ధాంతాలు వీటిల్లో ప్రముఖమైనవి. వాటిని ప్రతిపాదించినప్పుడే కాకుండా ఇప్పటికీ వాటి ఆధారంగా సమాజం, మనుషులపై విశ్లేషణలు వెలువడుతూనే ఉన్నాయి. మేధావుల వ్యక్తిగత పేర్లతో కాకుండా విశేష ప్రాచుర్యాన్ని పొందిన కొన్ని పరిశోధనలు, నివేదికలు కూడా మనుషుల్ని విపరీతంగా ప్రభావితం చేస్తాయి. అట్లాంటి వాటిల్లో వృద్ధికి పరిమితులు (ద లిమిట్స్ టు గ్రోత్) పేరుతో 1972లో వెలువడిన ఒక నివేదికను ప్రముఖంగా చెప్పుకోవాలి. ఇటలీలోని 'ద క్లబ్ ఆఫ్ రోమ్' అనే స్వచ్ఛంద సంస్థ కోసం ఆ నివేదికను వెలువరించారు. ప్రపంచ సమస్యలను లోతుగా చర్చించి, పరిష్కారాలను సూచించే లక్ష్యంతో క్లబ్ ఆఫ్ రోమ్ ఏర్పడింది. అభివృద్ధి అపరిమితం, మానవ జైత్రయాత్రకు తిరుగులేదన్న భావనలను ఆ నివేదిక కదిలించి వేసింది. వివిధ రకాల అవసరాలు, సుఖాల కోసం మనం వాడే వనరులు పరిమితమనీ, అవధుల్లేని అభివృద్ధి పేరుతో పారిశ్రామిక విప్లవం నుంచి మనిషి మొదలు పెట్టిన ప్రయాణం, దిశ మారకపోతే మొత్తం నాగరికతే సంక్షోభంలో కూరుకుపోతుందనీ హెచ్చరించింది. ప్రకృతిని జయించటాన్ని మానవ కృషికి, ఆధిక్యానికి నిదర్శనంగా భావించటం అన్ని నాగరికతల్లోనూ ఒకనాడు బలంగా ఉండేది. ఇప్పటికీ అది పోయిందని చెప్పలేం. కానీ 'లిమిట్స్ టు గ్రోత్' నివేదిక వెలువడిన నాటి నుంచి ఆ ఆలోచనలో మార్పు మొదలైంది. ప్రగతికి పరిమితులు తప్పవన్నది స్పష్టమైంది. లాభాపేక్షే ధ్యేయమైన ఆర్థిక వ్యవస్థను నియంత్రించాలన్న భావన బలపడింది. ఈ నివేదిక కలిగించిన ప్రభావంతో భూగోళ పరిరక్షణ కోసం ధరిత్రి సదస్సును నిర్వహించారు. అంతకు పదేళ్ల ముందు (1962) జీవశాస్త్రవేత్త రేచల్ కార్సన్ తన ప్రఖ్యాత పుస్తకం నిశ్శబ్ద వసంతం (సైలెంట్ స్ప్రింగ్)ను ప్రచురించారు. క్రిమిసంహారక మందులు వ్యవసాయాన్ని ఎంత విషతుల్యం చేస్తాయో అందులో విశ్లేషించారు. ప్రపంచం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. క్రిమిసంహారకాలపై భయాలు మొదలయ్యాయి. రసాయనిక ఎరువులు తెచ్చే వినాశనాలపై ఆందోళనలు కమ్ముకున్నాయి.

మనుషులు స్వయంగా పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్న తీరునూ అందుకు ఊతం ఇస్తున్న ఆర్థిక విధానాలనూ నియంత్రించాల్సిన అవసరాన్ని అర్థమయ్యేలా చేయటంలో ద లిమిట్స్ టు గ్రోత్ అందించిన తోడ్పాటు చాలా ఘనమైంది. అందుకే ఆ పుస్తకానికి విశేష ఆదరణ లభించింది. దాని అమ్మకాలు కోట్లను దాటాయి. ఇక ద లిమిట్స్ టు గ్రోత్ వెలువడిన ఏడాదికి ప్రముఖ ఆర్థికవేత్త ఇ.ఎఫ్.షుమాకర్ వెలువరించిన 'స్మాల్ ఈజ్ బ్యూటిఫుల్' పుస్తకం కూడా చాలా ప్రభావాన్ని కలిగించింది. బుద్ధుడు, గాంధీ ప్రబోధించిన కోరికల కట్టుబాటు భావాలనూ వనరుల పరిమితుల దృష్ట్యా అపరిమిత అభివృద్ధిని కట్టడి చేయాల్సిన అవసరాలనూ సమన్వయపరుస్తూ షుమాకర్ తన వాదాన్ని రూపొందించారు. 1945 తర్వాత వెలువడిన 100 అత్యంత ప్రభావిత పుస్తకాల్లో ఒకటిగా స్మాల్ ఈజ్ బ్యూటిఫుల్ గుర్తింపు లభించింది. ఈ రచనలన్నిటి ప్రభావంతో పర్యావరణానికి హాని లేకుండా అభివృద్ధి జరగాలన్న భావన బలపడటం మొదలైంది. దాన్నే నిలకడతో కూడిన అభివృద్ధిగా (సస్టేనబుల్ డివలప్‌మెంట్) పిలుస్తున్నాం.



> ఈ భూగ్రహం మీద మనం భద్రంగా బతకాలంటే తొమ్మిది పరిధుల్లోనే మన కార్యక్రమాలు సాగాలని 2015లో శాస్త్రవేత్తలు స్పష్టంచేశారు. వాతావరణం, జీవవైవిధ్యం, అడవులు, ఎరువులకు సంబంధించి పరిమితులను ఇప్పటికే దాటేశాం. విచ్చలవిడి ప్లాస్టిక్ వినియోగంతో అయిదో హద్దునీ అధిగమించేశాం. మొక్కల వేళ్ల చుట్టూ మట్టిని అంటుకుని ఉండే నీటిని హరించివేయటంలో ఆరో పరిమితినీ దాటేశాం. ఇక మిగిలిన మూడు పరిమితులను కూడా దాటేస్తే (సముద్రాల ఆమ్లీకరణ, వాతావరణంలోకి వదిలిపెట్టే ఘన–ద్రవ కణాలు, ఓజోన్‌పొర క్షీణత) మానవాళి మనుగడ ప్రమాదంలో పడినట్లే. భూగోళానికి నష్టంచేయని నవపరిమితుల్లోకి మానవులు వస్తే 2050 నాటికి నవయుగం మొదలవుతుంది. అది జరగకపోతే యుగాంతమే గతి అవుతుంది!



■ రాహుల్ కుమార్

పర్యావరణ విధ్వంసానికి, విపరీత అసమానతలకు, సామాజిక ఉద్రిక్తతలకు కారణమయ్యే ప్రగతికి కళ్లెం వేయాలన్న ఆలోచనలు బలపడుతున్న తరుణంలోనే ఆర్థికరంగంపై నియంత్రణలను ఎత్తివేయాలనే భావనలు పుంజుకోవటం మొదలైంది. అమెరికాలో రొనాల్డ్ రీగన్, బ్రిటన్‌లో మార్గరెట్ థాచర్‌లు సరళీకృత ఆర్థిక విధానాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించటం ప్రారంభించారు. అనేక విధాలుగా ఒత్తిళ్లు తెచ్చి ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ నియంత్రణలు తొలిగేటట్లు చేశారు. 1990ల నుంచి ధనిక దేశాల పెట్టుబడులు పేదదేశాలకు పరుగులెత్తాయి. కాలుష్యకారక పరిశ్రమలను తరలించటమూ మొదలైంది. పారిశ్రామిక ఉత్పత్తి ఆనవాళ్లు ధనిక దేశాల్లో మాయమయ్యాయి. ఇదంతా అందరికీ ఎంతోకొంత తెలిసిన చరిత్ర.

ద లిమిట్ టు గ్రోత్ వెలువడిన 50 ఏళ్లకు 'అందరి కోసం ధరిత్రి' (ఎర్త్ ఫర్ ఆల్) అనే మరో నివేదిక రూపొందింది. దీన్ని కూడా ద క్లబ్ ఆఫ్ రోమ్ కోసమే రూపొందించారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ 50 ఏళ్లల్లో తీవ్ర విపత్కర పరిస్థితిలోకి మానవాళి ప్రవేశించిందని చెప్పటానికి ఎన్నోరంగాల సమాచారాన్ని క్రోడీకరించారు. 1950ల నుంచి జరిగిన విపరిణామాలను అంతకుముందు నాటి పరిస్థితితో పోల్చి విశ్లేషించారు. విధ్వంస చిత్రంతో పాటు పరిస్థితిని సరిదిద్దగలిగిన చర్యలనూ సూచించారు. 20–30 ఏళ్లల్లో తీసుకోవల్సిన నిర్ణయాలను మనముందు ఉంచారు. స్థూలంగా అయిదు పెను సమస్యలను పరిష్కరించాల్సి ఉందని వివరించారు. 1) వందల కోట్ల మందిని దారిద్ర్యం నుంచి గట్టెక్కించటం 2) విపరీత ఆర్థిక అసమానతలు సృష్టిస్తున్న సామాజిక సంక్షోభాన్ని నిలువరించటం 3) ఇంధన రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావటం 4) మన ఆరోగ్యాన్ని అన్ని విధాలుగా దెబ్బతీస్తున్న పారిశ్రామిక ఆహారోత్పత్తులకు ప్రత్యామ్నాయ మార్గాలు కనుగొనటం 5) మహిళలకు అన్నిరంగాల్లో సాధికారత కల్పించటం. ఈ పెను సమస్యలను ఒక తరంలోనే (2050 నాటికి) పరిష్కరించగల అవకాశాలు ఉన్నాయనీ వాటిని విస్మరించి యథాతథ అభివృద్ధిని కొనసాగిస్తే 2100 నాటికి ప్రపంచం కోలుకోలేని సంక్షోభంలోకి పడిపోతుందని ప్రతిపాదించారు. అప్పుడెన్ని నివారణ చర్యలు చేపట్టినా ఫలితం ఉండదు.

మనం ఇప్పుడు నడుస్తున్న రాజకీయ, ఆర్థిక దారులు ప్రమాదకరమైనవి. పనిగట్టుకుని అసమానతలను పెంచేవిగానే ఆర్థిక విధానాలు ఉన్నాయి. సదుద్దేశంతో చేపట్టిన విధానాల అవాంఛిత ఫలితాలు కావవి! వీటితో మున్ముందు అల్పాదాయ దేశాల్లో ఆర్థికాభివృద్ధి ఇంకా మందగించే అవకాశం ఉంది. దారిద్ర్యమూ బాగా పెరిగే ప్రమాదం కనపడుతోంది. అసమానతల వల్ల 2050 నాటికి సామాజిక ఉద్రిక్తతలు అన్ని దేశాల్లోనూ పెరుగుతాయి. ఉద్రిక్తతలతో కొట్టుమిట్టాడే దేశాలు పర్యావరణ ప్రమాదాన్ని అరికట్టే చర్యలను తీసుకోలేవు. రెండు డిగ్రీల మేర ఉష్ణోగ్రతలను తగ్గించలేవు. వేడిగాలులకు ప్రపంచ ప్రజలు తల్లడిల్లిపోతారు. పంటల వైఫల్యాలు, మహా కరువులు, ఒక్కసారిగా భారీగా విరుచుకుపడే వర్షాలు, పెరిగే సముద్రమట్టాలు సమాజాలను అల్లకల్లోలం చేస్తాయి. ప్రమాదంలో పడిన పర్యావరణం దారిలో పడటానికి వేల ఏళ్లు పట్టొచ్చు.

ఎప్పుడో 11,700 ఏళ్ల క్రితం చివరి మంచుయుగం ముగిసిన తర్వాత వాతావరణంలో వచ్చిన మార్పులే ఇప్పటివరకూ మానవ నాగరికతకు వెన్నుదన్నుగా ఉన్నాయి. వ్యవసాయమూ అప్పుడే మొదలైంది. అవసరానికి మించి మిగులు ఉత్పత్తిని సాధించటమూ అప్పుడే సాధ్యమైంది. వృత్తి, వర్గ విభజనలూ అప్పుడే మొదలయ్యాయి. ఇప్పుడా వాతావరణం తల్లకిందులవుతోంది. 1950ల నుంచి దాన్ని దెబ్బతీయటం ప్రమాదకర స్థాయిలో మొదలైంది. అందుకే మానవాళి ముందున్న అయిదు సమస్యలను పరిష్కరించటం అత్యవసరం. ఇవేమీ అసాధ్యమైన ఆదర్శాలు కావు. కాలుష్యరహితమైన శుద్ధ ఇంధనం తయారీకి కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. సూర్యశక్తి ఆధార ఇంధన ఉత్పత్తే దీనికి నిదర్శనం. ఎలక్ట్రిక్ వాహనాలు, విండ్ టర్బై[illegible], పర్యావరణమిత్ర బ్యాటరీలను వాడటం మొదలైంది. అందరికీ ఇంధన, ఆహార భద్రతలకు కల్పించటానికి నిధులు ఎక్కడివన్న ప్రశ్న వస్తుంది. నిజానికది సమస్య కాదు. ప్రపంచ ఆదాయంలో 2 నుంచి 4 శాతం ఈ రెండిటికీ ఏటా ఖర్చుపెట్టగలిగితే సమస్య పరిష్కారం అవుతుంది. కానీ మార్కెట్ శక్తులకే దీన్ని వదిలేస్తే లక్ష్యం నెరవేరదు. సుదీర్ఘ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలే అందుకు పూనుకోవాలి. ఆదాయాన్ని పునఃపంపిణీ చేయకుండా ధరిత్రీ భద్రతను కాపాడుకోలేం. అసమానతల వల్ల నెలకొనే ఆర్థికపరమైన ఆందోళనలు మనుషుల మధ్య అపనమ్మకాలను పెంచుతాయి. వివిధ వర్గాల మధ్య తీవ్రమైన విభజనలు తలెత్తుతాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయ వ్యవస్థను నడిపించలేని పరిస్థితి వస్తుంది. ప్రజాస్వామ్యం మనుగడే ప్రమాదంలో పడుతుంది. అందుకే జాతీయ ఆదాయంలో ధనికుల వాటా 40 శాతానికి లోపునే ఉంచే విధంగా తొలి చర్యలు తీసుకోవాలి. అందుకు అనువైన పన్నుల విధానాన్ని ప్రవేశపెట్టాలి.

ఈ భూగ్రహం మీద మనం భద్రంగా బతకాలంటే తొమ్మిది పరిధుల్లోనే మన కార్యక్రమాలు సాగాలని 2015లో శాస్త్రవేత్తలు స్పష్టంచేశారు. వాతావరణం, జీవవైవిధ్యం, అడవులు, ఎరువులకు సంబంధించి పరిమితులను ఇప్పటికే దాటేశాం. విచ్చలవిడి ప్లాస్టిక్ వినియోగంతో అయిదో హద్దునీ అధిగమించేశాం. మొక్కల వేళ్ల చుట్టూ మట్టిని అంటుకుని ఉండే నీటిని హరించివేయటంలో ఆరో పరిమితినీ దాటేశాం. ఇక మిగిలిన మూడు పరిమితులను కూడా దాటేస్తే (సముద్రాల ఆమ్లీకరణ, వాతావరణంలోకి వదిలిపెట్టే ఘన–ద్రవ కణాలు, ఓజోన్‌పొర క్షీణత) మానవాళి మనుగడ ప్రమాదంలో పడినట్లే. పర్యావరణ అనుకూల సాంకేతిక పరిజ్ఞానాలను ప్రవేశపెట్టినప్పుడు చాలా ఒడిదుడుకులు వస్తాయి. పాత ఉద్యోగాలు పోతాయి. ప్రజలను ఆదుకోటానికి పౌరనిధిని ఏర్పాటుచేయాలి. కనీస ఆదాయాన్ని అందరికీ అందించగలగాలి. నీటి అవసరం ఎక్కువగా ఉన్న పంటలకు పరిమితులు విధించాల్సి వస్తుంది. భారీ ప్రాజెక్టులను వదులుకోవాల్సి వస్తుంది. మన ఆహారానికి అవసరమయ్యే జంతుజాలంతో భూగ్రహాన్ని నింపటాన్ని మానుకోవాల్సి వస్తుంది. భూగోళానికి నష్టంచేయని నవపరిమితుల్లోకి మానవులు వస్తే 2050 నాటికి నవయుగం మొదలవుతుంది. అది జరగకపోతే యుగాంతమే గతి అవుతుంది! మన మరణశయ్యను మనమే పరుచుకున్న వాళ్లం అవుతాం!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

మోదీ హ్యాట్రిక్ ఎలా సాధించారు?



నరేంద్ర మోదీ మళ్లీ ఎందుకు అధికారానికి వచ్చారు? ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజారిటీని ఎన్డీఏ ఎందుకు సాధించుకున్నది? బీజేపీ మరింత పరాజయాన్ని ఎందుకు పొందలేదు? ఎన్నికలకు సంబంధించి మీడియా తప్పుడు కథనాలు ఎంత ప్రభావశీలమైనవి అంటే మనం పై ప్రశ్నలను అడిగే ఆలోచనే చేయలేకపోతున్నాం! బీజేపీకి సంభవించిన అనూహ్య ఎదురుదెబ్బకు కారణాలు ఏమిటి? ఈ ప్రశ్నపైనే మీడియాలో చర్చలు జరుగుతున్నాయి. ఫలితాలను అర్థం చేసుకోవడంలో పొరబడి వేసిన తప్పుడు ప్రశ్న అది. అహంకార పూరితంగా వ్యవహరిస్తూ ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించడంపై శ్రద్ధ చూపని ప్రభుత్వం కనీస మెజారిటీని సాధించుకోలేకపోవడం దిగ్భ్రాంతికరమేమీ కాదు. దిగ్భ్రాంతి ఏమైనా ఉంటే అది మీడియా సృష్టించిందని చెప్పక తప్పదు. ఇప్పుడు మనం అడగవలసిన ప్రశ్న: ఘోరంగా ఓడిపోనున్న ఎన్నికల పోరులో భారతీయ జనతా పార్టీ ఎలా విజయం సాధించింది?

2004 లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో 2024 సార్వత్రక పోరు ఫలితాలను పోల్చి చూడడం ఉపయోగకరంగా ఉంటుంది. అటల్ బిహారీ వాజపేయి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఐదేళ్ల పదవీకాలాన్ని 'విజయవంతంగా' పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన ఎన్నికలవి. 'వెలిగిపోతున్న భారత్' అనే నినాదంతో భారతీయ జనతా పార్టీ ఆ ఎన్నికలకు వెళ్లింది. 2004లో తిరిగి అధికారంలోకి వస్తామనే ధీమా నాడు బీజేపీ శ్రేణుల్లో నిండుగా వ్యక్తమయింది. ఎన్నికలకు ముందు నిర్వహించిన ఓపీనియన్ పోల్స్, పోలింగ్ తరువాత నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్ రెండూ పాలక కూటమి విజయాన్ని ఘంటాపథంగా నిర్ధారించాయి. అయితే ఫలితాలు అనూహ్యంగా ఆ అంచనాలకు విరుద్ధంగా వచ్చాయి. అందరూ తికమకపడ్డారు– ఇటీవలి సార్వత్రక ఎన్నికల ఫలితాల విషయంలో వలే.

2024లో నరేంద్రమోదీకి ఉన్న ప్రజాదరణ 2004లో వాజపేయికి ఉన్న జనసమ్మతి కంటే భిన్నమైనది కాదు, తక్కువా కాదు. ప్రధానమంత్రిగా ఎవరిని ఎంపిక చేసుకుంటారన్న ప్రశ్నకు నాడు 38 శాతం మంది వాజపేయి పేరు ప్రస్తావించగా 2024లో 41 శాతం మంది నరేంద్ర మోదీ వైపు మొగ్గారు. 2004లో వాజపేయి సమీప ప్రత్యర్థి సోనియా గాంధీని 26 శాతం మంది ఓటర్లు ఇష్టపడగా ఈ ఏడాది 27 శాతం మంది మోదీ స్థానంలో రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చూడడానికి ఇష్టపడ్డారు. వాజపేయి ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజల సంతృప్తి మోదీ సర్కార్ విషయంలో కంటే అధికంగా ఉన్నది. నికర సంతృప్తిపరులు (అసంతృప్తి పడిన వారిని తీసివేయగా సంతృప్తిపడినవారు) 2004లో 29 శాతం మంది కాగా 2024లో 23 శాతం మంది ఉన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వానికి మరొక అవకాశాన్ని ఇస్తారా అన్న కీలక ప్రశ్నకు వాజపేయి విషయంలో గరిష్ఠంగా 48 శాతం మంది మోదీ విషయంలో గరిష్ఠంగా 46 శాతం మంది సానుకూలంగా ప్రతిస్పందించారు. అయినా వాజపేయి ప్రభుత్వం ఓడిపోయింది. నాడు ఎన్డీఏకు 230 నుంచి 275 సీట్లు రాగలవని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయగా ఎన్డీఏకు వాస్తవంగా 181 మాత్రమే వచ్చాయి. ఫలితంగా యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 2024లో ప్రత్యర్థి కూటమి ప్రభుత్వం ఎందుకు అధికారంలోకి రాలేకపోయింది? 2024లో ఎన్డీఏ ప్రారంభ బలం 2004లో కంటే ఎక్కువ. అంతేగాకుండా నాడు సంకీర్ణ రాజకీయాలు ప్రాథమిక దశలో ఉన్నాయి. 23 పార్టీల ఎన్డీఏ సంకీర్ణాన్ని వాజపేయి తన రాజకీయ చాతుర్యంతో నిలుపుకుంటూ వచ్చారు. 1999లో బీజేపీకి 182 సీట్లు లభించాయి. 2004లో బీజేపీ 44 సీట్లను నష్టపోయింది. 2024లో పరిణామానికి అది భిన్నమైనది కాదు. ఇటీవలి సార్వత్రక ఎన్నికలలో బీజేపీ బలం 303 నుంచి 240కి తగ్గిపోయింది.

మరో ప్రశ్నను కూడా మనం పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరమున్నది. 2024లో బీజేపీని అధికారం నుంచి తొలగించడం సాధ్యమయ్యేదేనా? మేము తొలుత ఆక్షేపించిన తప్పుడు ప్రశ్నను పక్కన పెట్టి ఇటీవలి ఎన్నికల ఫలితాలను కొత్త దృష్టితో చూడండి. విశదమయ్యేది ఏమిటి? నరేంద్ర మోదీ తన ప్రభుత్వాన్ని చావు తప్పి కన్ను లొట్ట పోయిన రీతిలో కాపాడుకున్నారనే కాదూ? ఎన్నికల తుది ఫలితాలను ప్రారంభ స్థానంగా తీసుకోండి. అదనంగా 1 శాతం ఓట్లు ఎన్డీఏకు వ్యతిరేకంగా పడినట్టయితే (ఎన్డీఏకి సంభవించిన నష్టాలకు సమ నిష్పత్తిలో దాని ప్రధాన ప్రత్యర్థి లబ్ధి పొంది ఉండేది) ఆ కూటమి 18 సీట్లను కోల్పోయి వుండేది. దేశ వ్యాప్తంగా ఓటర్ల మొగ్గు 1.5 శాతం మేరకు ఎన్డీఏకు వ్యతిరేకంగా ఉన్నట్టయితే ఎన్డీఏ సంఖ్యా బలం 261గా మాత్రమే ఉండేది. అంటే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన కనీస మెజారిటీ కంటే కూడా తక్కువగా ఉండేది. అంతే కాదు తన ప్రధాన ప్రత్యర్థి సంఖ్యా బలం కంటే కూడా ఎన్డీఏ తక్కువస్థాయిలో ఉండేది. ఎన్డీఏకు 261 లభిస్తే ఇండియా కూటమికి 263 వచ్చేవి. మరో అర శాతం ఓటర్ల మొగ్గు ఎన్డీఏకు వ్యతిరేకంగా ఉన్నట్టయితే పాలక కూటమి సంఖ్యా బలం 246కు పడిపోయి ఇండియా కూటమి సంఖ్యా బలం 275కు పెరిగి ఉండేది.

హిందీ రాష్ట్రాలలో ఓటర్ల మొగ్గు 2శాతం మేరకు ఎన్డీఏకు వ్యతిరేకంగా ఉన్నట్టయితే ఆ కూటమి సంఖ్యా బలం 260కి తగ్గిపోయేది. ఇదే జరిగినట్టయితే బీజేపీకి లభించిన సీట్లు 214కి తగ్గిపోయేవి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశమివ్వాలని కోరేందుకు సైతం భారతీయ జనతా పార్టీకి అర్హత ఉండేది కాదు. ఎన్డీఏకు వ్యతిరేకంగా ఓటు వేసిన ఓటర్లు 1 శాతం మేరకు ఉన్నా బీజేపీ ప్రతిపక్షంలో కూర్చోవలసివచ్చేది అన్న వాస్తవాన్ని విస్మరించకూడదు.



■ యోగేంద్ర యాదవ్

సరే, ఇప్పుడు మనమే కాకుండా భావి చరిత్రకారులు సైతం పరిగణనలో తీసుకోవల్సిన ప్రశ్న: జాతీయ స్థాయిలో ఎన్డీఏకు 1 శాతం ఓటు తగ్గుదల దేశ రాజకీయ పరిస్థితుల్లో ఎటువంటి తేడాకు దారితీసి ఉండేది? ఇటువంటి విపత్కర పరిస్థితి తమకు ఏర్పడకుండా బీజేపీ నాయకులను అప్రమత్తం చేసినదేమిటి? మనకు తెలియని, బీజేపీ నాయకులకు మాత్రమే తెలిసినదేమిటి? వివిధ పార్టీలతో బీజేపీ కుదుర్చుకున్న పొత్తులే ఈ ప్రశ్నకు సమాధానం. బిహార్‌లో నితీశ్ కుమార్ (జేడీయూ) యూపీలో జయంత్ చౌదరి (ఆర్ఎల్‌డీ)తో పొత్తు పెట్టుకుంది. మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు (తెలుగుదేశం)తో పొత్తు పెట్టుకుంది. అలాగే మహారాష్ట్రలో అధికార శివసేనతో పొత్తు పెట్టుకున్నది. మహారాష్ట్రలో మినహా ఈ పొత్తులతో బీజేపీ లబ్ధి పొందింది. ఈ మిత్రపక్షాలు ఎన్డీఏ సంఖ్యా బలాన్ని పెంచడమే కాకుండా ఆంధ్రప్రదేశ్, బిహార్, యూపీలలో బీజేపీ సొంతంగా మరో పది సీట్లను అదనంగా గెలుచుకోవడానికి విశేషంగా తోడ్పడ్డాయి.

> ...మనకు తెలియని, బీజేపీ నాయకులకు మాత్రమే తెలిసినదేమిటి? వివిధ పార్టీలతో బీజేపీ కుదుర్చుకున్న పొత్తులే ఈ ప్రశ్నకు సమాధానం. బిహార్‌లో నితీశ్ కుమార్, యూపీలో జయంత్ చౌదరి, మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడుతో బీజేపీ పొత్తు పెట్టుకుంది. ఈ మిత్రపక్షాలు ఎన్డీఏ సంఖ్యా బలాన్ని పెంచడమే కాకుండా బీజేపీ సొంతంగా కొన్ని సీట్లను అదనంగా గెలుచుకోవడానికి తోడ్పడ్డాయి.



పై ప్రశ్నకు మరో సమాధానాన్ని కూడా పరిశీలనలోకి తీసుకుందాం. ప్రధాన స్రవంతి మీడియా ఈ ఎన్నికల సంఘటనలు, పరిణామాలపై వార్తలను నివేదించడంలో పక్షపాతాన్ని కొంచెం తగ్గించుకుందని అనుకోండి. లోక్‌నీతి– సిఎస్‌డిఎస్ నిర్వహించిన ఒక పోస్ట్ పోల్ సర్వేలో 83 శాతం మంది ఓటర్లకు ఇంటి వద్ద టీవీ ఉందని, 66 శాతం మంది ఓటర్లు ప్రతి రోజూ లేదా అప్పుడప్పుడూ న్యూస్ ఛానెల్స్‌ను చూస్తుంటారని వెల్లడయింది (47 శాతం మంది ఓటర్లు సామాజిక మాధ్యమాల ద్వారా ఎన్నికల సమాచారాన్ని పొందుతుంటారని కూడా వెల్లడయింది. చాలా తక్కువ మంది మాత్రమే ఎన్నికల సమాచారానికి ఏదో ఒక ప్రభుత్వ విధేయ మీడియా ఛానెల్‌పై ఆధారపడుతున్నట్టు కూడా ఆ సర్వేలో వెల్లడయింది. మోదీ ప్రభుత్వ పనితీరుపై టీవీ ఛానెల్స్ నిష్పాక్షికంగా వార్తలు, వార్తానివేదికలు ప్రసారం చేశాయని అనుకోండి. నిస్సిగ్గుగా అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరించలేదని అనుకోండి. అలాగే పాలకపక్షం సర్వోన్నత నాయకుడుతో అతివినయంతో నిర్వహించిన ఇంటర్వ్యూలను ప్రసారం చేయకుండా 2024 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ విజయం అనివార్యం కాదని, ఎన్డీఏ, ఇండియా కూటమి మధ్య తీవ్ర పోటీ ఉందని కుండబద్దలు కొట్టినట్టు చెప్పాయనుకోండి. దాని ప్రభావం ఎలా ఉండేది? ప్రభుత్వ అనుకూల ప్రసారాలను వీక్షించే ప్రతి 66 మందిలో ఒక్కరు ఎవరికి ఓటు వేయాలనే విషయంలో తన నిర్ణయాన్ని మార్చుకున్నట్టయితే పాలకపక్ష సర్వోన్నత నాయకుడు ఇప్పుడు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడుగా ఉండేవారు.

(శ్రేయాస్ సర్దేశాయి, రాహుల్ శాస్త్రి సహకారంతో)

(ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ప్రముఖ విశ్లేషకుడు, భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్రయాదవ్ అందిస్తున్న ఆరు వ్యాసాల పరంపరలో ఇది ఐదవది)



వైసీపీ హయాంలో జిల్లాల పునర్విభజన అసమగ్రంగా జరిగింది. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి విడివడిన ఎన్టీఆర్ జిల్లా భౌగోళికంగా సరైన రీతిలో లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. విజయవాడ చెంతనే ఉన్న గన్నవరం, పెనమలూరు మండలాలను ఎన్టీఆర్ జిల్లా పరిధిలోకి తీసుకురావాల్సి ఉండగా, కృష్ణాజిల్లాలో చేర్చారు. ఈ రెండు మండలాలు గ్రేటర్ విజయవాడ విలీన ప్రాంతాల జాబితాలో ఉన్నా పట్టించుకోలేదు. గన్నవరం, గుడివాడ నాటి ఎమ్మెల్యేల రాజకీయం కారణంగా ప్రస్తుతం ఈ భౌగోళిక సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రజలతో పాటు అధికారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. వ్యతిరేకత, అభ్యంతరాలు వచ్చినా ఖాతరు చేయకుండా ఇష్టానుసారంగా చేసిన ఈ విభజనను కొత్త ప్రభుత్వం గాడిలో పెట్టాల్సిన అవసరముంది. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

అసమగ్ర విభజన..!

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల విభజన అస్తవ్యస్తం



విజయవాడ రూరల్ ఎటువైపు..?

పార్లమెంట్ నియోజకవర్గాల ప్రకారమే నిఖార్సుగా విభజన చేశామని వైసీపీ చెబుతున్నప్పటికీ, విజయవాడ రూరల్ మండలం గన్నవరం నియోజకవర్గంలోనే ఉంది. కానీ, గన్నవరం కృష్ణాజిల్లాలోకి రాగా, ఇందులోని ప్రధానమైన గ్రామాలన్నీ ఎన్టీఆర్ జిల్లాలో ఉన్నాయి. ఆరు గ్రామాలను కృష్ణాజిల్లా పరిధిలోకి చేర్చారు. విజయవాడ రూరల్ మండలంలో మూడొంతులు గ్రామాలు ఎన్టీఆర్ జిల్లాలో, ఒకవంతు కృష్ణాజిల్లాలో కలిపారు. ఈ అసమగ్ర విభజన వల్ల విజయవాడ రూరల్ మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒకే మండలమైనా రెండు జిల్లాల పరిధిలో ఉంది.

గన్నవరం విభజనలో గజిబిజి

విజయవాడ అంతర్జాతీయ విమానా శ్రయం గన్నవరంలో ఉంది. కానీ, గన్నవరం ప్రాంతం కృష్ణాజిల్లాలో ఉంది. కాబట్టి ఇక్కడికి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్నవారు వచ్చి ఇక్కడ ప్రొటోకాల్ డ్యూటీలు చేయాల్సి వస్తోంది. విమానాశ్రయానికి రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, ఉప రాష్ట్రపతులు, ప్రము ఖులు వచ్చినప్పుడల్లా కృష్ణాజిల్లా అధికారులు బందరు నుంచి పరుగులు పెట్టాల్సిన పరిస్థితి. ఎన్టీఆర్ జిల్లా సరిహద్దు ప్రాంతం గన్నవరానికి పట్టుమని పది కిలోమీటర్ల దూరం కూడా లేదు. విజయవాడ నుంచి అయితే 20 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం 20 నిమిషాల్లోనే విమానాశ్రయానికి చేరుకోవచ్చు. అధికారుల ఇబ్బందులు పక్కన పెడితే, విజయవాడ విమానాశ్రయం ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఉండాలి కానీ, కృష్ణాజిల్లా పరిధిలో ఎలా ఉంటుందన్న కనీస ఆలోచన కూడా నాటి అధికారులు చేయలేదు. జిల్లాల విభజన సమయంలో ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న విజయకుమార్ గతంలో వీజీటీఎం ఉడా వైస్ చైర్మన్‌గా పనిచేశారు. ఆయనకు గ్రేటర్ విలీన గ్రామాలపై అవగాహన ఉంది. అన్నీ తెలిసినా విజయవాడ ప్రజల అభీష్టం కంటే కూడా వైసీపీ ఎమ్మెల్యేల సిఫార్సులు, పెద్దల ఒత్తిళ్ల మేరకు అన్యాయంగా ఈ రెండు ప్రాంతాలను విడదీశారు.

పెనమలూరును పక్కన పెట్టుకుని..

విజయవాడను ఆనుకుని పెనమలూరు మండలం ఉంటుంది. ఈ మండల ప్రజలు విజయవాడతో మమేకమై ఉంటారు. ఏ అవసరాలున్నా వీరంతా విజయవాడకే వస్తారు. దూరాభారం కూడా ఉండదు. ఐదు కిలోమీటర్ల దూరం కూడా ఉండదు. కానీ, పెనమలూరు మండలాన్ని కృష్ణాజిల్లాలో విలీనం చేశారు. ఇక్కడి వారంతా విజయవాడ వదిలి, బందరు వరకూ వెళ్లాలంటే 60 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి.

నూజివీడు, ఆగిరిపల్లి అటా.. ఇటా..!

ఒకప్పటి ఉమ్మడి కృష్ణాలో అంతర్భాగంగా ఉన్న నూజివీడు, ఆగిరిపల్లి మండలాలు కూడా ఎన్టీఆర్ జిల్లాను ఆనుకుని ఉంటాయి. ఈ మండల ప్రజలకు విజయవాడతోనే ఎక్కువ లావాదేవీలు ఉంటాయి. వీటిని ఏలూరు జిల్లాలో కలిపారు. ఆగిరిపల్లి మండలం.. విజయవాడ

- మిగతా 6లో

ఇష్టానుసారంగా విడగొట్టేసిన వైసీపీ ప్రభుత్వం

ప్రజా వ్యతిరేకత వచ్చినా పట్టకుండా నిర్ణయం

- విజయవాడ పక్కనే ఉన్న గన్నవరం, పెనమలూరు
- గ్రేటర్ సిటీ జాబితాలో ఉన్న మండలాలు
- కాదని.. కృష్ణాజిల్లాలో కలిపిన గత పాలకులు
- మచిలీపట్నం వెళ్లాలంటే 65 కిలోమీటర్ల దూరం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, అధికారులు
- విజయవాడ రూరల్ మండల విభజనలో గజిబిజి
- ఏ మండలం ఎటువైపో తెలియని గందరగోళం
- నూజివీడు, ఆగిరిపల్లి మండలాలు ఏలూరు జిల్లాలోకి
- ఎన్టీఆర్ జిల్లాలో కలుపుతానని ప్రతిపక్ష హోదాలో టీడీపీ అధినేత చంద్రబాబు హామీ

గ్రామాల తీర్మానాలు తారుమారు

విజయవాడను గ్రేటర్ సిటీగా మార్చాలన్నది ఎప్పటి నుంచో ఉన్న ప్రతిపాదన. గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ గ్రేటర్ కావాలని గన్నవరం, పెనమలూరు మండలాల్లోని గ్రామాలు ఏకగ్రీవంగా తీర్మానించాయి. అయితే, తమ పట్టు పోతుందన్న ఉద్దేశంతో కొందరు వైసీపీ నాయకులు స్థానిక పంచాయతీలపై ఒత్తిడి తెచ్చి వ్యతిరేక తీర్మానాలు చేయించారు. కానీ, ఒకటి, రెండు తప్ప మెజారిటీ గ్రామాలన్నీ గ్రేటర్ పరిధిలోకి వెళ్లడానికి సమ్మతిస్తూ తీర్మానాలు చేసి పంపాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక జిల్లాల పునర్విభజన పేరుతో విజయవాడలో అంతర్భాగం కావాల్సిన ప్రాంతాలను వేరే జిల్లాలోకి బదిలీ చేశారు.



భక్తిశ్రద్ధలతో బక్రీద్

జిల్లావ్యాప్తంగా సోమవారం బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. చిట్టినగర్‌లోని మోతీ మసీదులో ప్రార్థనలకు ముస్లింలు భారీగా తరలివచ్చారు.



వానొస్తే వరదొస్తది..!

నిర్మల కాన్వెంట్ రోడ్డులో వర్షం కష్టాలు

మొగల్రాజపురం/పటమట, జూన్ 17 : కొద్దిపాటి వర్షమైనా, కుండపోత అయినా.. పటమటలోని నిర్మల కాన్వెంట్ రోడ్డులో వాహనదారులు పడే అగచాట్లు అన్నీ ఇన్నీ కావు. ఇక్కడ జాతీయ రహదారి కలిసేచోట ఎల్ఈపీఎల్ వైపు నుంచి వచ్చే వర్షపునీరు, ఫ్లై ఓవర్ పైపుల నుంచి సర్వీస్ రోడ్డులోకి వచ్చే వర్షపు నీరు భారీగా చేరుతోంది. ఈ నీరంతా ఎన్టీఆర్ సర్కిల్ వరకు కల్వర్టు ద్వారా కృష్ణవేణి రోడ్డులోకి వెళ్లాలి. ఇదే కల్వర్టుకు బెంజిసర్కిల్ నుంచి హోటల్ మార్గ కృష్ణాయ వరకు ఉన్న రోడ్డులోని వర్షపు నీరు కూడా చేరుతోంది. ఇక్కడే అసలు సమస్య వస్తోంది. బెంజిసర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ఉన్న ప్రాంతం, నిర్మల కాన్వెంట్ రోడ్డు ప్రాంతం పల్లంగా ఉండటంతో చిన్నపాటి వర్షమైనా నీరంతా రోడ్డుపైకి చేరుతోంది. అలాగే, కృష్ణవేణి రోడ్డులో ఉన్న డ్రెయిన్ ఎత్తులో ఉండటం, ఒకేసారి భారీ ఫ్లో రావడంతో వర్షపు నీరు రెండు రోజులైనా అలాగే ఉండిపోతోంది.

పరిష్కారమెప్పుడు..?

నిర్మల కాన్వెంట్ రోడ్డులో జాతీయ రహదారివైపు నుంచి ఎన్టీఆర్ సర్కిల్‌వైపు వచ్చే డ్రెయిన్‌ను ఎల్ఈపీఎల్ నుంచి నేరుగా సమరం ఆసుపత్రి మీదుగా, ఎంజీ రోడ్డు దాటి, ఆంజనేయస్వామి గుడి వెనుకగా, అలంకార్ బార్ మీదుగా ఎస్వీఎస్ కల్యాణ మండపం, పటమటలంక రోడ్డు, రామలింగేశ్వరనగర్ స్క్యూబ్రిడ్జి వద్ద బందరు కాల్వలో కలపొచ్చు. ఇలాచేస్తే ఎన్టీఆర్ జంక్షన్ నుంచి కృష్ణవేణి రోడ్డుకు వెళ్లే కల్వర్టుపై భారం తగ్గుతుంది. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి బెంజిసర్కిల్ వరకు వచ్చే నీటిని కూడా ఆంజనేయస్వామి గుడి వెనుకగా వెళ్లే డ్రెయిన్‌కు కలిపితే సమస్య పరిష్కారమవుతుంది. ఆ దిశగా అధికారులు దృష్టిపెడితే నిర్మల కాన్వెంట్ రోడ్డులో వర్షాకాలం సమస్య తీరుతుంది.



ఇంద్రకీలాద్రిపై నిబంధనల ఉల్లంఘన

వాహనంపై అన్యమత స్టిక్కర్‌తో మహిళ

6లో..

మల్లవల్లిపై మళ్లీ ఆశలు



మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్క్ (ఐపీ) అభివృద్ధిపై మళ్లీ ఆశలు నెలకొన్నాయి. టీడీపీ కూటమి అధికారంలోకి రావటంతో ఈ పార్కులో పరిశ్రమల పునరుజ్జీవానికి అడుగులు పడినట్టే అయ్యింది. రాష్ట్ర విభజన జరిగాక రాజధాని అమరావతి పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో గతంలో టీడీపీ హయాంలో ఈ ఐపీకి శ్రీకారం చుట్టగా, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ కక్షకట్టి విజిలెన్స్ విచారణల పేరుతో భయభ్రాంతులకు గురిచేసింది. పనులు చేయలేదన్న వంకతో భూ కేటాయింపుల రద్దుకు పాల్పడింది. పరిశ్రమలు ఉత్పత్తిని ప్రారంభించకపోవటం, ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటు కాకపోవటంతో మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్క్ ఇన్నాళ్లూ అనాథలా మిగిలిపోయింది. తిరిగి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో మల్లవల్లి పారిశ్రామికవాడపై ఆశలు చిగురిస్తున్నాయి. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

వైసీపీ పాలనలో అనాథలా అతిపెద్ద ఇండస్ట్రియల్ ఏరియా

యూనిట్ల నిర్వాహకులకు వేధింపులు.. విజిలెన్స్ విచారణలు

- భూ కేటాయింపులు రద్దు.. భూముల ధరల పెంపు..
- వెనకడుగు వేసి వెళ్లిపోయిన పారిశ్రామికవేత్తలు
- టీడీపీ కూటమి గెలుపుతో ఆనందోత్సాహాలు
- పునరుజ్జీవం కోసం ఔత్సాహికుల ఎదురుచూపులు

గతంలో టీడీపీ హయాంలో..

రాష్ట్ర విభజన తర్వాత రాజధానిగా అమరావతిని ప్రకటించాక కృష్ణాజిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయటానికి వీలుగా మల్లవల్లిలో ఇండస్ట్రియల్ పార్క్ కోసం చర్యలు చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా హైదరాబాద్‌లో పరిశ్రమలు పెట్టిన వారితో పాటు దేశ వ్యాప్తంగా పలు పారిశ్రామికవేత్తలతో ఏపీలో కూడా పెట్టుబడులు పెట్టించాలన్న ఉద్దేశంతో మల్లవల్లి ఐపీని ఎంచుకున్నారు. ఇందుకోసం 1,100 ఎకరాలు సేకరించారు. వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేశారు. భారీ పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలకు ఇందులో చౌకగా ప్లాట్లు కేటాయించాలని నిర్ణయించారు. దీంతో అశోక్ లేల్యాండ్, మోహన్ స్పిన్‌టెక్స్ వంటి భారీ సంస్థలతో పాటు ఎంఎస్ఎంఈ సంస్థలు కూడా దరఖాస్తు చేసుకున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున భూ కేటాయింపులు చేశారు. అశోక్ లేల్యాండ్, మోహన్ స్పిన్‌టెక్స్‌లు పరిశ్రమలు ఏర్పాటు చేశాయి. వందలాది ఎంఎస్ఎంఈ యూనిట్లు నెలకొల్పే దిశగా పనులు ప్రారంభమయ్యాయి.

వైసీపీ వచ్చాక..



వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, మల్లవల్లి సర్వనాశనమైంది. ఇచ్చిన ప్లాట్లు కొండల్లా, లోయలో ఉన్నట్టు ఉండటంతో వాటిని తొలగించాలన్నా, మట్టిని నింపాలన్నా ఖర్చు, కాలాతీతమని కొంతమేర పనుల్లో జాప్యం జరిగింది. అయితే, పారిశ్రామికవేత్తల విన్నపాలను వైసీపీ ప్రభుత్వం వినలేదు. యూనిట్ల నిర్వాహకులకు నోటీసులు జారీచేసి, వారి భూ కేటాయింపులను రద్దు చేసింది. యూనిట్ల నిర్వాహకులు కోర్టును ఆశ్రయించారు. ఇదే సమయంలో టీడీపీ ప్రభుత్వం నిర్ణయించిన ధరలను వైసీపీ ప్రభుత్వం అమాంతం పెంచేసింది. పెరిగిన ధరలపై పారిశ్రామికవేత్తలు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. అయినప్పటికీ వారి గోడును వైసీపీ వినలేదు. దీంతో ఎంఎస్ఎంఈ యూనిట్ల నిర్వాహకులు పరిశ్రమలను ఏర్పాటు చేయలేకపోయారు. ఇది స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచే అంశంపైనా ప్రభావం పడింది. చిన్నవే కాకుండా పెద్ద పరిశ్రమల విషయంలో కూడా వైసీపీ ఇదే వైఖరి అవలంబించింది. అశోక్ లేల్యాండ్ సంస్థ పెద్ద యూనిట్‌ను ఏర్పాటు చేసి, ఉత్పాదకత కూడా ప్రారంభించింది. కరోనా వల్ల ఆ సంస్థకు కొన్ని ఇబ్బందులు వచ్చాయి. కానీ, వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

- మిగతా 6లో

కబేళాలో కాసుల వేట

మూగజీవాలను వధించే కబేళాను సైతం వైసీపీ నాయకులు తమ కాసుల వేటకు కేంద్రంగా మార్చుకున్నారు. వీఎంసీలో కీలక పదవిలో ఉన్న మహిళ కనుసన్నల్లో ఈ దోపిడీ దందా ఇప్పటికీ సాగుతోంది. రెండేళ్లుగా జరుగుతున్న ఈ దోపిడీలో సుమారు రూ.కోటి పైచిలుకు ఆదాయాన్ని పక్కదారి పట్టించారన్న ఆరోపణలు ఉన్నాయి.

కార్పొరేషన్‌కు గండికొట్టి రూ.కోటి స్వాహా



- వీఎంసీలో కీలక పదవిలో ఉన్న మహిళ దందా
- రెండేళ్లుగా టెండర్లు నిర్వహించకుండా దోపిడీ
- 2022లోనే ముగిసిన గడువు.. పొడిగింపునకు బేరాలు
- కుదరని బేరం.. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో వసూళ్లు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : విద్యాధరపురంలో మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తున్న కబేళాకు లీజు గడువు ముగిసి రెండేళ్లవుతోంది. ఇప్పటి వరకు దీనికి వేలం నిర్వహించకుండా అధికారులు, వీఎంసీలో కీలక పదవిలో ఉన్న మహిళ తొక్కిపెట్టారు. లీజు గడువు ముగిశాక వేలం నిర్వహించి ఎక్కువ పాడుకున్న వారికి కేటాయించాల్సి ఉంది. కానీ, లీజు గడువు ముగిసి రెండేళ్లు గడిచినా అదే కాంట్రాక్టర్‌ను కొనసాగిస్తుండటం గమనార్హం. నగరంలో సుమారు 500కు పైగా వేట, బీఫ్ మాంస దుకాణాలున్నాయి. వీరంతా తాము రోజూ వధించబోయే జంతువులను తీసుకెళ్లి, కబేళాలోని పశుసంవర్ధక శాఖ సహాయ సర్జన్ (వీఏఎస్)కు చూపించాలి. ఆయన పరిశీలించి, వాటి ఆరోగ్యం బాగుందని చెప్పి, వాటిపై కార్పొరేషన్ స్టాంప్ వేయాలి. గేదెకు రూ.30, గొర్రె, మేక, పొటేలుకు రూ.15 చొప్పున కార్పొరేషన్‌కు రుసుం చెల్లించాలి. బక్రీద్, తదితర పండుగల సమయంలో రుసుం చెల్లించక్కర్లేదు.

నిబంధనలు తూచ్..

కబేళాలో నిబంధలన్నింటినీ తుంగలో తొక్కేశారు. కొందరు దుకాణాల వారు జంతువులను కబేళాకు తీసుకురాకుండానే వధించేసి విక్రయిస్తున్నారు. వీరు నెలకు రూ.5 వేల నుంచి రూ.10 వేల చొప్పున సంబంధిత అధికారులకు ముడుపులు చెల్లించుకుంటూ పబ్బం గడిపేస్తున్నారు. బక్రీద్, ఇతర పండుగల సమయంలో గేదెకు రూ.200 నుంచి రూ.300, మేకలు, గొర్రెలు, పొటేళ్లకు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. సుమారు పదిమంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో మస్తాన్ అనే ఉద్యోగి వీఎంసీలో కీలక పదవిలో ఉన్న మహిళకు సహకరిస్తున్నాడు. ప్రతినెలా రూ.5 లక్షల వరకు వసూలు చేసి ఆమెకు అందజేస్తున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి. రెండేళ్లలో సుమారు రూ.1.20 కోట్ల ఆదాయం వీఎంసీకి కాకుండా వీరు దోచేయడం గమనార్హం.

లీజు పొడిగింపునకు బేరాలు

కబేళా కాంట్రాక్టు గడువు ముగిసినా కొత్త కాంట్రాక్టరును ఖరారు చేసేందుకు టెండర్లు పిలవకపోవడం అనుమానాలకు తావిస్తోంది. పాత కాంట్రాక్టరుకే లీజు పొడిగించేందుకు పెద్ద ఎత్తున బేరాలు నడుస్తున్నాయని సమాచారం. ఆ కారణంగానే కొత్తగా టెండర్ పిలవకుండా కాలక్షేపం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొద్దిరోజుల క్రితం నగరవ్యాప్తంగా ఉన్న పార్కింగ్ స్థలాలను విడగొట్టి టెండర్లు ఖరారు చేసిన అధికారులు కబేళా విషయంలో మాత్రం వెనకడుగు వేస్తుండటం ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. అధికారికంగా చూపే లెక్కలకు, వాస్తవ లెక్కలకు పొంతన ఉండదు. రోజువారీ 200 జీవాలు వధించినట్లు రికార్డులు చెబుతుంటే, అంతకు రెట్టింపు సంఖ్యలో జీవాలను వధిస్తుంటారు. ఈ లెక్కన వీఎంసీకి సమకూరే ఆదాయంతో సమానంగా కాంట్రాక్టర్లు సంపాదించుకుంటారు. అధికారులు సైతం వీలైనంత పిండుకునే ప్రయత్నం చేస్తుంటారు. విచారణ జరిపితే, వీఎంసీ అధికారులు, వైసీపీ నేతల అక్రమాలు తేటతెల్లమవుతాయని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అఘాయిత్యాలు వద్దు..

ఫర్నీచర్ వెనక్కిచ్చేయ్!

జగన్‌రెడ్డిపై నెట్టెం ఘాటు విమర్శలు



జగ్గయ్యపేట, జూన్ 17 : ఒక సోఫా, టేబుల్ తన కార్యాలయంలో ఉన్నాయని మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ నిజాయితీగా ప్రభుత్వానికి సమాచారం ఇస్తే దొంగ ముద్ర వేసి అఘాయిత్యానికి పాల్పడేలా చేసిన మాజీ సీఎం జగన్‌రెడ్డి తన ఇంట్లో లక్షలాది రూపాయాల ఫర్నీచర్‌ను ఎలా ఉంచుకున్నాడని మాజీ మంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ప్రశ్నించారు. 'కోడెలలా ఆత్మాభిమానం, ఆత్మగౌరవం, నిజాయితీ, వ్యక్తిత్వం ఏమాత్రం లేని జగన్‌రెడ్డి ఆయనలా ఆత్మత్యాగానికి పాల్పడనవసరం లేదు.. ఆ ఫర్నీచర్‌ను వెనక్కి ఇచ్చేస్తే చాలు'.. అని నెట్టెం వ్యాఖ్యానించారు. జగన్ క్యాంప్ నివాసానికి సెక్యూరిటీ, ఫర్నీచర్ కింద రూ.15.65 కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేశాడని ఆరోపించారు.

మీ గెలుపు ఓ సక్సెస్ స్టోరీ

లోకేశ్‌కు గొట్టిపాటి అభినందన



విజయవాడ, జూన్ 17 : టీడీపీ యువనేత, మంత్రి నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గంలో సాధించిన గెలుపు యువ రాజకీయ నాయకులకు ఓ సక్సెస్ పాఠమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ప్రముఖ న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం లోకేశ్‌ను కలిసి అభినందనలు తెలియజేసిన గొట్టిపాటి అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీకి పట్టు లేని నియోజకవర్గంలో పట్టుబట్టి పోటీ చేసి ఓసారి ఓటమి ఎదురైనా వెనుదిరగక అక్కడి నుంచే తిరుగులేని మెజారిటీతో గెలవడం వెనుక చాలా కృషి ఉందన్నారు. ఈ గెలుపు యువ నాయకులకు స్ఫూర్తిపాఠమన్నారు.

కూటమి విజయం.. తలనీలాల సమర్పణ



గుడ్లవల్లేరు, జూన్ 17 : డోకిపర్రు గ్రామానికి చెందిన ఐటీడీపీ కన్వీనర్ షేక్ జాని చంద్రబాబు ముఖ్యమంత్రిగా, గుడివాడ ఎమ్మెల్యేగా వెనిగండ్ల రాము విజయం సాధించాలని కోరుతూ అల్లాకు మొక్కాడు. ఈ నేపథ్యంలో బక్రీద్ పర్వదినం సందర్భంగా డోకిపర్రు తురాయిపాలెం జెండా సెంటర్లో ఐదుగురి వద్ద భిక్షాటన చేసి తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నాడు.



బందరు ఈద్గా వద్ద ప్రార్థనల్లో కొల్లు రవీంద్ర, బండి రామకృష్ణ

ముస్లింలకు రంజాన్ తోఫా పునరుద్ధరిస్తాం

బక్రీద్ వేడుకల్లో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 17 : ముస్లింలకు రంజాన్ తోఫా పునరుద్ధరిస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బక్రీద్ సందర్భంగా ఆదివారం మచిలీపట్నం ఉల్లింగిపాలెం ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మంత్రి రవీంద్రతోపాటు జనసేన నియోజక వర్గం ఇన్‌చార్జి బండి రామకృష్ణ టీడీపీ నేతలు ఎండీ ఇలియాస్ బాషా, ఖాజా, జనసేన నేతలు గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, అల్లా ఆశీర్వాదాలు రాష్ట్ర ప్రజలపై మెండుగా ఉండాలన్నారు. ముస్లింలకు ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. ఖాజీ మహమ్మద్ హుస్సైన్ ఈ సందర్భంగా పవిత్ర ఖురాన్‌లోని దివ్య వచనాలను వినిపించి సందేశమిచ్చారు. కార్యక్రమంలో ఫిరోజ్, అమీర్, బాజాని, మౌలానా, మున్వర్ తదితరులు పాల్గొన్నారు.



కొనకళ్లను సత్కరిస్తున్న జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి

ప్రభుత్వ పాలనలో తెలుగు యువతది కీలక పాత్ర

కొనకళ్ల నారాయణ

మచిలీపట్నం టౌన్, జూన్ 17 : సాధారణ ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వచ్చేందుకు తెలుగు యువత ఎలా కష్టపడి పనిచేశారో అదే స్ఫూర్తితో ప్రభుత్వం పాలనా కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకుని వెళ్లాలని మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. ఆదివారం కొనకళ్ల నారాయణను కృష్ణా జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి కలిసారు. కూటమి విజయంపై సమీక్షా సమావేశంలో చర్చించారు. యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు చంద్రబాబు నైపుణ్యాభివృద్ధి ఫైలుపై సంతకం చేశారన్నారు.



టీడీపీ కార్యకర్తలు, విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న మండలి వెంకట్రామ్

ఘంటసాలపాలెంలో కూటమి విజయోత్సవం

తొమ్మిది మందికి సైకిళ్ల పంపిణీ

ఘంటసాల, జూన్ 17 : ఘంటసాల పాలెంలో కూటమి విజయోత్సవ వేడుకలను సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఘంటసాల, ఘంటసాల పాలెం, దేవరకోట, కొత్తపల్లి, తాడేపల్లి, కొడాలి, చిట్టూర్పు గ్రామాలకు చెందిన ఏడుగురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, ఇద్దరు విద్యార్థులకు రూ.63 వేల విలువ గల సైకిళ్లను వేమూరి వెంకట్రామయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు సాయిబాబు, శ్రీనివాస్‌లు అవనిగడ్డ ఎమ్మెల్యే కుమారుడు మండలి వెంకట్రామ్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ, రాష్ట్రాభివృద్ధి చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లతో సాధ్యమని నమ్మిన ప్రజలు కూటమిని గెలిపించారని, ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. తొలుత వేమూరి శ్రీనివాస్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. అనంతరం మండలి వెంకట్రామ్‌ను శ్రీనివాస్, సాయిబాబులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు, టీడీపీ నేతలు వేమూరి సాయి వెంకటరమణ, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, బండి పరాత్పరరావు, గుత్తికొండ వరప్రసాద్, యార్లగడ్డ వీరభద్రరావు, గొర్రెపాటి శ్రీనివాస్, విజయవాడకు చెందిన ఎల్.ఎస్.కుమార్, కాజ చక్రధర్‌రావు, వల్లభనేని నాని, కేవీఎస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్

మచిలీపట్నం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సమస్యలను తెలుసుకునేందుకు మంగళవారం సాయంత్రం 4 గంటలకు గ్రీవెన్స్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ డీకే బాలాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశపుహాలులో ఈ సమావేశం జరుగుతుందని, అన్ని విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమావేశానికి హాజరై తమ సమస్యలను వివరించవచ్చని కలెక్టర్ తెలిపారు.

మార్పుకోసం తహతహ!

- తిరువూరులో తారస్థాయికి వైసీపీ కౌన్సిలర్ల మధ్య విభేదాలు
- పార్టీ ఓటమితో పలువురు పక్కచూపులు
- బోర్డు మార్పుకోసం రాయబారాలు!

తిరువూరు మునిసిపల్ కార్యాలయం



తిరువూరు, జూన్ 17 : మునిసిపల్ పాలకవర్గానికి చెందిన వైసీపీ కౌన్సిలర్ల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకోవడంతో కొందరు టీడీపీ వైపు చూస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. మునిసిపల్ ఎన్నికల అనంతరం స్థానిక ఎమ్మెల్యే ప్రమేయం లేకుండానే వైసీపీ అధిష్ఠానం ఆశీస్సులతో గత్తం కస్తూరిబాయి చైర్‌పర్సన్‌గా పాలన చేపట్టారు. బోర్డు ఏర్పాటు సమయంలో రెండేళ్ల పదవీకాలం అనంతరం మరొకరికి అవకాశం కల్పించాలని, స్థానిక నాయకత్వం తీర్మానించింది. ఒప్పందం ప్రకారం పదవీకాలం పూర్తయినా బోర్డులో మార్పులేకపోవడంతో, వైసీపీకి చెందిన కొందరు కౌన్సిలర్లు సమావేశాలకు గైర్హాజరవడంతో కోరంలేక పలుమార్లు సమావేశాలు వాయిదా వేశారు. సహాయ నిరాకరణ చేసిన కౌన్సిలర్లు చైర్మన్ మార్పు కోసం తమవంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్టు తెలుస్తున్నది.

అనుమతుల్లేని భవన నిర్మాణంపై ఫిర్యాదు

పట్టణంలో ప్రధాన రహదారికి కూతవేటు దూరంలో ఎటువంటి అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణంపై వైసీపీకి చెందిన కౌన్సిలర్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో కౌన్సిలర్ల మధ్య విభేదాలు మరింత తీవ్రతరంగా మారాయి. భవన నిర్మాణం చేపట్టిన వైసీపీకి చెందిన కౌన్సిలర్ బంధువు తమ పార్టీ వారే ఫిర్యాదు చేయడంపై విఘలిన కౌన్సిలర్లను ప్రశ్నించగా, ఫిర్యాదుకు పార్టీకి సంబంధం లేదని చెప్పి తప్పించుకున్నట్టు తెలుస్తున్నది. అయితే వైస్‌చైర్‌పర్సన్ పదవి ఆశిస్తున్న మరో కౌన్సిలర్ బోర్డు మార్పుపై చక్రతిప్పేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

పార్టీ ఓటమితో పక్కచూపులు..

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెందడంతో పార్టీకి చెందిన కొందరు కౌన్సిలర్లు టీడీపీ నేతల టచ్‌లోకి వచ్చినట్టు తెలుస్తున్నది. స్థానిక టీడీపీ అధిష్ఠానం మాత్రం తొందరపాటు నిర్ణయం తీసుకోకుండా ఆచితూచి అడుగులు వేస్తున్నది.

గత ఒప్పందం ప్రకారం మునిసిపల్ చైర్‌పర్సన్ మార్పునకు సహకారం అందించాలని వైసీపీ కౌన్సిలర్లు కొందరు పెద్దలవద్ద ప్రస్తావిస్తున్నట్టు సమాచారం. బోర్డులో 20 మంది కౌన్సిలర్లకుగాను 17 మంది వైసీపీ కాగా ముగ్గురు టీడీపీ కౌన్సిలర్లు. చైర్‌పర్సన్ మార్పుకోసం అవసరమైతే పార్టీ మారేందుకైన తాము సిద్ధమని సంకేతాలు పంపుతున్నారు. నాలుగేళ్లు పూర్తయిన తర్వాత అవిశ్వాసం పెట్టే అవకాశం ఉండంతో, ఆ దిశగా యోచన చేస్తున్న సమాచారం చక్కర్లు కొడుతుండటంతో, ఎలాగైనా బోర్డు మారకపోతుందా అనే ఆశతో వారు ఎదురు చూస్తున్నారు.



మంత్రికి బొకే ఇస్తున్న పోలినేని అంకమ్మ చౌదరి

మంత్రి రవీంద్రకు శాప్ మాజీ చైర్మన్ శుభాకాంక్షలు

విజయవాడ స్పోర్ట్సు, జూన్ 17: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రిగా పదవీబాధ్యతలు స్వీకరించిన కొల్లు రవీంద్రను నగరంలోని ఆయన నివాసంలో శాప్ మాజీ చైర్మన్ పోలినేని అంకమ్మ చౌదరి సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన కార్యక్రమాలపై అంకమ్మ చర్చించారు. ఎ.ప్రశాంత్ చౌదరి, విప్లవ వంశీ, ఎం.నర్సింహరావులు మంత్రిని అభినందించిన వారిలో ఉన్నారు.

20 నుంచి ఐటీఐలో అడ్మిషన్లకు కౌన్సెలింగ్

భారతీనగర్, జూన్ 17 : 2024-25 విద్యాసంవత్సరానికిగాను ఎన్టీఆర్ జిల్లాలో ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐలలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జూన్ 20 నుంచి జూన్ 22వరకు మెరిట్ నెంబర్ ప్రకారం ఒరిజనల్ సర్టిఫికెట్స్‌లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ ఎం.కనకారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్ పొందిన ఎస్సీ, ఎస్టీ మినహా మిగిలిన కేటగిరి అభ్యర్థులు రూ.60 డిపాజిట్, ప్రైవేట్ ఐటీఐలో చేరగోరే అభ్యర్థులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. జూన్ 20 ఉదయం 8.00గంటల నుంచి 2 గంటల వరకు మెరిట్ నెంబర్ 1 నుంచి 162 వరకు, గ్రేడ్ 6.8నుంచి 10 వరకు గల అభ్యర్థులకు, మధ్యాహ్నం 2.00గంటల నుంచి నెంబర్ 163 నుంచి 333 వరకు, గ్రేడ్ 5.5నుంచి 6.7వరకు గల అభ్యర్థులకు, జూన్21 తేదీన ఉదయం 8.00గంటలనుంచి 2.00 గంటల వరకు నెంబర్ 334 నుంచి 486 వరకు, గ్రేడ్ 4.4నుంచి 5.4వరకు గల అభ్యర్థులు, మధ్యాహ్నం 2.00గంటల నుంచి నెంబర్ 487 నుంచి 646 వరకు, గ్రేడ్ 4.3నుంచి దిగువ గ్రేడ్ వరకు గల అభ్యర్థులు, జనరల్ కేటగిరీ అభ్యర్థులు జూన్22 తేదీన ఉదయం 8.00గంటల నుంచి 2.00 గంటల వరకు నెంబర్ 1 నుంచి 333 వరకు, గ్రేడ్ 5.5నుంచి 10వరకు గల అభ్యర్థులు, మధ్యాహ్నం 2.00గంటలకు నెంబర్ 334 నుంచి 664 వరకు, గ్రేడ్ పాయింట్ 5.4నుంచి దిగువ గ్రేడ్ వరకు గల అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి మార్కుల జాబితా, టీసీ, కులధృవీకరణ పత్రం, ఈడబ్ల్యుఎస్ పత్రం, ఆధార కార్డు, స్టడి అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావలన్నారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేయించుకున్న వారు సంబంధిత ధ్రువీకరణ పత్రంతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు.

దుర్గమ్మకు బంగారు నత్తువ కానుక



అమ్మవారికి నత్తువ సమర్పిస్తున్న భక్తులు

వన్‌టౌన్, జూన్ 17 : ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ అలంకరణ నివిత్తం నగరానికి చెందిన పి.రాజకుమార్ ఆయన కుటుంబసభ్యులు 27 గ్రాముల బంగారు నత్తువను కానుకగా సమర్పించారు. సోమవారం ఆలయానికి విచ్చేసిన రాజకుమార్ ఆయన కుటుంబసభ్యులు ఏఈవో రమేష్ ద్వారా నత్తువను అందజేశారు. దాతలకు అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం కల్పించారు. అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి సంధ్యారాణి



దుర్గమ్మ దర్శనార్థం సోమవారం రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కుటుంబసభ్యులు విచ్చేశారు. ఈవో కేఎస్ రామారావు ఆలయ మర్యాదలు అందజేసి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

తిరుమల తిరుపతి దేవస్థానానికి

పది టన్నుల కూరగాయల వితరణ



కూరగాయల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న గద్దె క్రాంతి కుమార్

భారతీనగర్, జూన్ 17 : తిరుమల తిరుపతి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి మండవ కుటుంబరావు ఆశీస్సులతో మండవ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శ్రీరామచంద్రనగర్ కాలనీ వినాయకుడి గుడి రోడ్‌లో నుంచి సోమవారం దాతలు ధనేకుల నాగేంద్రబాబు(బాబీ), దుర్గ దంపతులు, వారి కుమారుడు సావంత్ సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానానికి నిత్యాన్నదాన పథకానికి ఉచితంగా 10టన్నుల కూరగాయలను పంపించారు. కూరగాయల బండిని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కుమారుడు గద్దె క్రాంతి కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబసభ్యులు ధనేకుల సత్యనారాయణ, నాగేంద్ర, పలువురు బంధుమిత్రులు పాల్గొన్నారు.



ఇంద్రకీలాద్రిపై అన్యమత స్టిక్కర్ ఉన్న వాహనం

ఇంద్రకీలాద్రిపై

నిబంధనల ఉల్లంఘన!

- వాహనంపై అన్యమత స్టిక్కర్‌తో మహిళ
- గుర్తించని టోల్‌గేట్ సెక్యూరిటీ సిబ్బంది
- పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని భక్తుల సూచన

వన్‌టౌన్, జూన్ 17 : హిందూ ఆలయాలలోకి అన్యమతస్తులు వారి మతపరమైన స్టిక్కర్‌లు గాని ఆరాధించే దైవాల బొమ్మలతో గానీ రాకూడదని నిబంధన ఉంది. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో హిందూ ధర్మం మేరకు ఆలయ ప్రవేశాలకు సంబంధించి నియమ నిబంధనలు అమలు చేస్తున్నారు. అయితే సోమవారం ఓ మహిళ ద్విచక్ర వాహనంపై అమ్మవారి దర్శనార్థం వచ్చారు. ఆమె వచ్చిన ద్విచక్ర వాహనంపై ఏసుక్రీస్తు చిత్రం ఉండటం చర్చనీయాంశమైంది. ఘాట్‌రోడ్డు నుంచి వెళుతున్న వాహనాన్ని టోల్‌గేట్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు నిలువరించాల్సి ఉంది. అయితే వారంతా విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండటంతో ఇలా అన్యమతస్తులు తమ వాహనాలపై స్టిక్కర్‌లు ఉన్నప్పటికీ యథేచ్ఛగా వచ్చేస్తున్నారన్న భక్తులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కనకదుర్గానగర్‌లో పలువురు భక్తుల కారు అద్దాలపై సిలువ గుర్తు ఉండటంతో అక్కడ ఉన్న సిబ్బంది అడ్డుకున్నారు. కాగా వారు సెక్యూరిటీ సిబ్బందితో గొడవపడ్డారు. అనంతరం ఆవేశంగా సెక్యూరిటీ సిబ్బందిపై దాడికి దిగారు.

అసమగ్ర విభజన..!

(5వ పేజీ తరువాయి)

మెగాసిటీ విలీన ప్రతిపాదన జాబితాలో ఉంది. నూజివీడు మండల ప్రజలంతా ఎన్టీఆర్ జిల్లాతో నిత్యం ప్రత్యక్ష సంబంధాలను కలిగి ఉంటారు. వారికి ఏలూరు దూరాభారమే. ప్రతిపక్ష నేతగా చంద్రబాబు వచ్చినపుడు నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలని నూజివీడు మండల ప్రజలు కోరారు. దీనికి ఆయన కూడా సానుకూలంగా స్పందించటంతో పాటు అధికారంలో రాగానే నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గన్నవరం, పెనమలూరు మండలాలతో పాటు నూజివీడు, ఆగిరిపల్లి, విజయవాడ రూరల్ మండలాలను కూడా ఎన్టీఆర్ జిల్లా పరిధిలోకి తీసుకురావాలన్న డిమాండ్ ప్రజల నుంచి వస్తోంది.

పల్లా శ్రీనివాస్ యాదవ్ నియామకంపై జనసేన హర్షం

మచిలీపట్నం టౌన్, జూన్ 17 : రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడిగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను నియవి ంచడం పట్ల జనసేన నగర అధ్యక్షుడు బండి రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం జనసేన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గడ్డం రాజు మాట్లాడారు. 95వేల అత్యధిక మెజారిటీ సాధించిన పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను వైసీపీ నాయకులు కక్షగట్టి వేధించారన్నారు. పల్లా శ్రీనివాస్ యాదవ్ నాయకత్వంలో టీడీపీ, జనసేన నాయకులు సమన్వయంతో పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

రామోజీరావు సేవలు స్ఫూర్తిదాయకం



పెదపారుపూడి, జూన్ 17 : చెరుకూరి రామోజీరావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఖమ్మం మున్సిపల్ మేయర్ మీరజా అన్నారు. స్వగ్రామం పెదపారుపూడిలో సోమవారం రామోజీరావు సంతాప సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మేయర్ మీరజా మాట్లాడుతూ, పెదపారుపూడి గ్రామాన్ని ప్రపంచ స్థాయిలో నిలిపిన మహోన్నత వ్యక్తి రామోజీరావు అన్నారు. గ్రామాన్ని దత్తత తీసుకుని సుమారు రూ.20 కోట్లు ఖర్చు చేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం స్ఫూర్తిదాయకమన్నారు. కష్టపడి పని చేస్తే సాధించలేనిది ఏమీ ఉండదనేతత్వంతో ముందుకు వెళ్లారని అన్నారు. రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్ చప్పిడి సమీరా, చప్పిడి కిషోర్, పునుకొల్లు ప్రసాద్, పునుకొల్లు రత్న ప్రసాద్, చంద్రశేఖరరావు, పునుకొల్లు బెనర్జీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

మల్లవల్లిపై మళ్లీ ఆశలు

(5వ పేజీ తరువాయి)

మెగా ఫుడ్ పార్క్ పరిస్థితి మరీ దారుణం

మల్లవల్లిలో 100 ఎకరాల విస్తీర్ణంలో మెగా ఫుడ్‌పార్క్ ఏర్పాటు కోసం లే అవుట్ వేశారు. సెంట్రల్ ఫుడ్‌పార్క్‌తో పాటు స్టేట్ ఫుడ్‌పార్క్‌లను కూడా ఏర్పాటు చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పలు ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రాలు ఏర్పడ్డాయి. వైసీపీ వచ్చాక ఫుడ్‌పార్క్ ధరలు మరింత పెరిగాయి. ఈ ధరలను చూసి కొత్తగా ఎవరూ ముందుకు రాలేదు. అలాగే, ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థల కోసం టీడీపీ ప్రభుత్వ హయాంలోనే మెగాఫుడ్ పార్కులో సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ) ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థలన్నీ జ్యూస్ తీయటానికి, ప్యాకింగ్ చేయటానికి వీలుగా సీపీసీలో మెషినరీ ఏర్పాటు చేశారు. కోల్డ్ స్టోరేజ్ కూడా ఏర్పాటు చేశారు. కానీ, వైసీపీ దీనిని అందుబాటులోకి తీసుకురాలేకపోయింది.



చింతలపూడి ఎత్తిపోతల వద్ద అధికారులతో మాట్లాడుతున్న వసంత కృష్ణప్రసాద్

చింతలపూడి పూర్తికి కృషి

ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్

జి.కొండూరు, జూన్ 17 : మెట్ట ప్రాంత రైతుల చిరకాల స్వప్నం చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తానని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. సోమవారం సీఎం చంద్రబాబు నిర్వహించిన పోలవరం సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా చింతలపూడి పథకం పూర్తి నిమిత్తం చంద్రబాబుకు వినతిపత్రం అందజేసిన అనంతరం పథకాన్ని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రైతుల పాలిట వరం చింతలపూడి

రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో సాగునీటి కష్టాలు రాకుండా ఉండేందుకు సీఎం చంద్రబాబు ముందుచూపుతో రూ.4,909 కోట్లతో ప్రారంభించిన చింతలపూడి ఎత్తిపోతల పథకం రైతులకు వరం లాంటిదని ఎమ్మెల్యే వసంత అన్నారు. 2014-19 మధ్య సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చు చేసి 90 శాతం పనులు పూర్తి చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఈపథకాన్ని పూర్తిగా విస్మరించి రైతుల ఉసురు పోసుకుందన్నారు. ఈ పథకం పూర్తయితే తిరువూరు, మైలవరం, నూజివీడు, గన్నవరం, నందిగామ నియోజకవర్గాల్లోని 18 మండలాల రైతుల సాగునీటి ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయన్నారు. ఎన్ఎస్పీ మూడోజోన్‌లో ఉన్న 2.36 లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అంది ఆయకట్టు స్థిరీకరించబడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, కె.విజయబాబు, చెన్నుబోయిన చిట్టిబాబు, ఉయ్యూరు వెంకటనరసింహారావు, పాలంకి మోహన్ మురళీ రెడ్డి, ఉయ్యూరు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రి అనిత నివాస భవనాన్ని పరిశీలించిన అధికారులు



పెనమలూరు, జూన్ 17 : రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత నివాస ముండేందుకు భవనాన్ని పోలీసు, మునిసిపల్ అధికారులు సోమవారం పరిశీలించారు. తాడిగడప మునిసిపాలిటీ కానూరు కొత్త ఆటోనగర్ రెండో రోడ్డులోని ప్రముఖ పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీశ్‌కు చెందిన భవనాన్ని సోమవారం మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, అదనపు ఎస్పీ ప్రసాద్, విద్యుత్ శాఖ ఏడీఈ నవీన్‌లు పరిశీలించారు. భవనంలో సౌకర్యాలపై ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్టు వారు తెలిపారు.

పాలడుగు జ్యోత్స్నకు అరుదైన గౌరవం



ఇబ్రహీంపట్నం, జూన్ 17 : ఇబ్రహీంపట్నం ఎంపీపీ పాలడుగు జ్యోత్స్నకు అరుదైన గౌరవం దక్కింది. ఈనెల 20, 21 తేదీల్లో నీతి అయోగ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ నందు జరిగే ట్రైనింగ్ నీడ్ అసిస్టెంట్ శిక్షణా తరగతుల్లో ఏపీ నుంచి జ్యోత్స్న ఎంపికయ్యారు. ఈమేరకు ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పీఈటీలను నియమించండి

పెనుగంచిప్రోలు, జూన్ 17 : రాష్ట్రంలో త్వరలో నిర్వహించబోయే ఉపాధ్యాయ నియామకాల్లో (డీఎస్సీ) పాఠశాల క్రీడాభివృద్ధికి ప్రాథమికోన్నత పాఠశాలలకు వ్యాయామ ఉపాధ్యాయుల(పీఈటీ)ను నియమించాలని వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర నేత అజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1985లో అప్పటి ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారక రామారావు క్రీడల ఆవశ్యకతను గుర్తించి పాఠశాలల్లో క్రీడాభివృద్ధిలో భాగంగా ప్రతి ప్రాథమికోన్నత పాఠశాలకు పీఈటీలను నియమించారని గుర్తు చేశారు. వ్యాయామ విద్య సాధారణ విద్యలో భాగమన్నారు. పాఠశాలలో 250 మంది విద్యార్థులు ఉన్న చోట వ్యాయామ ఉపాధ్యాయుడిని, 600 నుంచి 700 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ముగ్గురు వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలని ప్రకటనలో కొత్త ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

గువహటి-ఎస్ఎంవీటీ బెంగళూరు రైలు దారి మళ్లింపు

రైల్వేస్టేషన్, జూన్ 17 : అగర్తలా-సెల్దా కాంచన గంగ ఎక్స్‌ప్రెస్ (13174) పట్టాలు తప్పిన కారణంగా గువహటి-ఎస్ఎంవీటీ బెంగళూరు రైలు (12510)ను దారి మళ్లిస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ అధికారి సీహెచ్ రాకేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం గువహటిలో బయల్దేరిన రైలును న్యూ జల్పాయ్‌గురి-సిలిగురి-బాగ్డోగ్రా-అలువబారిరోడ్డు జంక్షన్ మీదుగా మళ్లించారు.

ఘనంగా వెంపటి పెద్ద సత్యం వర్ధంతి

కూచిపూడి, జూన్ 17 : ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు వెంపటి పెద్ద సత్యం వర్ధంతి వేడుకలు సోమవారం కూచిపూడిలో ఘనంగా నిర్వహించారు. కూచిపూడి శ్రీ సిద్దేంద్ర కళావేదికపై కళాకారులు ప్రదర్శించిన నాట్యాంశాలు ప్రేక్షకులను రంజింపచేశాయి. డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, ఎల్లాజోశ్యుల అనురాధ, మల్లిశెట్టి అనూష శిష్యులు భామా కలాప ప్రవేశ దరువు, ఆనంద నర్తన గణపతి, శివుడు తాండవమాడేను, అన్నమాచార్య కీర్తన అంశాల్లో ప్రదర్శించి మెప్పించారు. కూచిపూడి నాట్యానికి పెద్ద సత్యం చేసిన సేవలను నాట్యాచార్యులు కొనియాడారు. వెంపటి సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ నాట్యాచార్యులు వేదాంతం వెంకటాచలపతి, డాక్టర్ చింతా రవిబాలకృష్ణ, వై.వి.ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడి అభినయంలో అనురాధ శిష్య బృందం

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	152, 161, 172
చికెన్ విత్ స్కిన్	296
చికెన్ స్కిన్‌లెస్	306

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.80

ప్రస్థాన సాధన శిక్షణ ముగింపు వేడుకలు



గవర్నర్‌పేట, జూన్ 17: ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో స్ఫూర్తి కుటుంబం 9 వారాలుగా నిర్వహిస్తున్న దివ్య ఔషధం ప్రస్థాన సాధన శిక్షణ ముగింపు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సభకు అమరావతి బోట్ క్లబ్ అధ్యక్షుడు కాకాని తరుణ్ అధ్యక్షత వహించారు. ప్రతిభ కనబర్చిన వలంటీర్లకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి, ట్రస్ట్ సభ్యులు ప్రభాకర్, మాధవి, కాదంబరి జ్యోతి, గిరిజ, చొప్పవరపు నారాయణరావు, పసుపులేటి నారాయణరావు, షణ్ముఖరావు, స్ఫూర్తి వలంటీర్లు పాల్గొన్నారు.

టీడీపీ...బీసీల పక్షమే

● కోగంటి రామారావు

వన్‌టౌన్, జూన్ 17: టీడీపీ ఎల్లవేళలా బీసీల పక్షపాతి అని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కోగంటి రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి పల్లా శ్రీనివాసరావును నియమించడంతో పాటు అసెంబ్లీ స్పీకర్ పదవికి అయ్యన్న పాత్రుడి పేరును పరిగణనలోకి తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి చంద్రబాబు న్యాయం చేస్తారని పేర్కొన్నారు.

ఎం హోటల్ సెంటర్‌లో ప్లైవుడ్ లారీ బోల్తా



కృష్ణలంక, జూన్ 17: కృష్ణలంక ఎం హోటల్ సెంటర్‌లో ప్లైవుడ్ లోడ్‌తో వున్న లారీ సోమవారం తెల్లవారుజామున 3.30 సమయంలో బోల్తా పడింది. ఇతర ప్రాంతాల నుంచి సత్యం హోటల్ సెంటర్ సమీపంలోని పాత పోస్టాఫీసు రోడ్డులో వున్న ప్లైవుడ్ గోడౌన్‌కు ఆ లారీ రావాలి. లారీ డ్రైవర్ ఎం హోటల్ సెంటర్‌లో లారీ ఆపి అడ్రస్ అడిగేందుకు ప్రయత్నించాడు. ఇంతలో హైవే నుంచి సర్వీసు రోడ్డులో ర్యాంప్‌గా వుండటంతో ప్లైవుడ్ లోడ్ బరువుకు లారీ ఓ పక్కకు ఒరిగి పోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గా యాలు కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గవర్నర్‌పేట, జూన్ 17: ఆల్ ఇండియా రేడియో ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం ఈనెల 18న ఉదయం 8 గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహణాధికారి బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫీడర్ పరిధిలోని రెడ్ సర్కిల్ ఏరియా, గిరిపురం, స్టేడియం రోడ్, బందరు రోడ్డు, పోలీసు కమాండ్ కంట్రోల్ ఆఫీసు ఏరియా, ఆర్ అండ్ బీ కాంప్లెక్స్, వ్యాస్ కాంప్లెక్స్, మాంటిసోరి కాలేజి రోడ్డు, సబ్ కలెక్టర్ ఆఫీసు, పున్నమ్మతోట, స్వగృహ ఫుడ్స్, రైల్వే క్వార్టర్స్, పాస్‌పోర్టు ఆఫీసు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.



దుర్గగుడి ఆలయ శిఖరం స్వర్ణ తాపడానికి విరాళం

వన్‌టౌన్, జూన్ 17: దుర్గగుడిలో ఆలయ శిఖరానికి స్వర్ణతాపడం నిమిత్తం కబేళా ఇండస్ట్రియల్ ఏరియా ఆర్ ఆర్ నగర్‌కు చెందిన యేగిన లక్ష్మీకాంతరావు ఆయన కుటుంబసభ్యులు సోమవారం ఆలయానికి విచ్చేసి రూ 1,11,116 విరాళాన్ని అందచేశారు. ఈవో కేఎస్ రామారావు ద్వారా చెక్కు రూపంలో విరాళం అందించారు. అమ్మవారి దర్శనం అనంతరం వారికి అమ్మవారి ప్రసాదం. శేషవస్త్రం, చిత్రపటం, ఆశీర్వచనం అందచేశారు.



గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును సత్కరించిన గన్నె ప్రసాద్ తదితరులు

పల్లా శ్రీనివాసరావుకు అభినందన

విద్యాధరపురం, జూన్ 17: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడుగా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఆదివారం రాత్రి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నె వెంకటనారాయణ ప్రసాద్(అన్న) మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అభినందనలు తెలియజేశారు. నాయకులు యలమంచిలి శ్రీనివాసరావు, పొన్నం రవి, పడాల గంగాధర్‌లు ఉన్నారు.

దుర్గాఘాట్ ప్రక్షాళన



వన్‌టౌన్, జూన్ 17: దుర్గాఘాట్‌లో భక్తులు స్నానాలు చేసేందుకు వీలుగా ప్రక్షాళన చేస్తున్నారు. ఇప్పటి వరకు ఘాట్‌లో మెట్లు పాచి పట్టి ఉండడంతో పాటు జిడ్డుగా ఉండే నాచు పేరుకుపోవడంతో మెట్లు మీద కాలివేయాలంటే భక్తులు భయపడేవారు. మరోవైపు చాలా కాలంగా కూడా ఘాట్‌లో సిల్ట్‌ను తొలగించలేదు. దీంతో చెత్తా చెదారాలు కూడా పేరుకు పోయాయి. తాజాగా మెట్లతో పాటు ఆ ప్రాంతాన్ని శుభ్రపరించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లి నాచు తదితరాలను తొలగించారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

వన్‌టౌన్, జూన్ 17: ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు సోమవారం గవర్నరుపేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. రాజగోపాలచారి రోడ్డులో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా పడి ఉన్నాడు, స్థానికులు 108లో ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, చికిత్స పొందుతూ మృతి చెందాడు, మృతుడికి సుమారు 40 సంవత్సరాల లోపు వయస్సు ఉంటుందని పోలీసులు తెలిపారు.



చిట్టినగర్ మోతీ మసీద్‌లో, లబ్బీపేట మసీదులో బక్రీద్ ప్రార్థనల్లో ముస్లిం సోదరులు, ముస్లిం పెద్దలతో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

స్వార్థం, అసూయ, ద్వేషాలను విస్మరించాలి

మోతీ మసీద్ ఇమామ్ మౌలానా నజీర్ అహ్మద్

చిట్టినగర్, జూన్ 17: త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అని, ప్రతి ఒక్కరు భగవంతునికి లోబడి పని చేయాలని చిట్టినగర్ మోతీ మసీద్ ఇమామ్ మౌలానా నజీర్ అహ్మద్ అన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకొని సోమవారం చిట్టినగర్ మోతీమసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమామ్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ సత్యం, న్యాయం, ధర్మం, త్యాగం, సహనం, పరోపకారం లాంటి సుగుణాలను ప్రతి ఒక్కరు మనస్సులో ప్రతిష్ఠించుకోవాలన్నారు. స్వార్థం, అసూయ ద్వేషాలను విస్మరించాలని సూచించారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరికి ఒకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ప్రార్థనల్లో ఎంపీ కేశినేని శివనాథ్, టీడీపీ సీనియర్ నాయకులు నాగుల్ మీరాలు పాల్గొని ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు ముస్లిం మత పెద్దలు, మోతీ మసీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు: ఎమ్మెల్యే గద్దె

పటమట : స్వార్థం, అసూయ, రాగద్వేషాలు లేని త్యాగనిరతిని వ్యాప్తి చేయడమే బక్రీద్ ముఖ్య ఉద్దేశ్యమని, అటువంటి మహత్తరమైన పండుగను జరుపుకుంటున్న ముస్లిం సోదరులకు తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సోమవారం శుభాకాంక్షలు తెలిపారు.

బక్రీద్ పురస్కరించుకుని 12వ డివిజన్ మసీద్ ఏ ఫరుకియాలో జరిగిన బక్రీద్ ప్రార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

బక్రీద్ వేడుకల్లో ఎంపీ శివనాథ్

భారతీనగర్: గురునానక్ కాలనీలోని మైనారిటీ సెల్ నగర మాజీ అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నేత మహమ్మద్ ఇర్ఫాన్ నివాసంలో సోమవారం బక్రీద్ సందర్భంగా ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇర్ఫాన్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పరిశ పోగు రాజేష్, పొలిటికల్ సెక్రటరీ నరసింహచౌదరి పాల్గొన్నారు.



ఎంపి కేశినేని శివనాథ్‌ను సన్మానిస్తున్న మహమ్మద్ ఇర్ఫాన్

కూటమి విజయంతో కార్పొరేటర్ల సంబరాలు



వీఎంసీలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ కార్పొరేటర్లు

చిట్టినగర్, జూన్ 17: రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని, ప్రజలు నమ్మి కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించారని టీడీపీ ఫ్లోర్‌లీడర్ ఎన్.బాలస్వామి అన్నారు. రాష్ట్రంలో కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం టీడీపీ ఫ్లోర్‌లీడర్ చాంబర్‌లో టీడీపీ కార్పొరేటర్లు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రజలు 164 మంది కూటమి అభ్యర్థులను గెలిపించారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలు నానా కష్టాలు అనుభవించారని, ఆ కష్టాలు తొలగిపోవాలంటే చంద్రబాబు నాయుడు వంటి నాయకుడి అవసరం ఎంతో ఉందని, ప్రజలు కూటమిని గెలిపించారన్నారు. ప్రజల నమ్మకం మేరకు టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్రాన్ని అన్ని హంగులతో అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు. నగరంలో ముగ్గురు ఎమ్మెల్యేల సహకారంతో నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా కూటమిని భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. టీడీపీ సీనియర్ కార్పొరేటర్ ముమ్మనేని వెంకట ప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని, నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తారన్నారు. అనంతరం కార్పొరేటర్లు కేక్ కట్ చేసి తినిపించుకున్నారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, చెన్నుపాటి, ఉషారాణి, పొట్లూరి శివసాయి ప్రసాద్, దేవినేని అపర్ణ, వీరమాచినేని లలిత తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌ను అందుబాటులోకి తీసుకొస్తాం

పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి

భవానీపురం, జూన్ 17 : ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులోని అన్న క్యాంటీన్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సుజనా చౌదరి అన్నారు. సచివాలయంగా నడుస్తున్న అన్న క్యాంటీన్ ప్రాంతాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ యేదుపాట రామయ్య తాను కార్పొరేటర్‌గా ఉన్నప్పుడు ఐరన్ యార్డులోని ముఠా కార్మికులు, ఇతర కూలీలకు వెసులుబాటుగా ఉండేందుకు రెండు క్యాంటీన్‌లు ఏర్పాటు చేశామని సుజనా చౌదరికి వివరించారు. సీఎం చంద్రబాబు వేసిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అన్న క్యాంటీన్‌ను తిరిగి ప్రారంభించేందుకు కావల్సిన ఏర్పాట్లపై అధికారులతో ఆయన చర్చించారు. పలుచోట్ల అన్న క్యాంటీన్‌లను సచివాలయాలుగా మార్చారన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు మళ్లీ అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామన్నారు. టీడీపీ వాణిజ్య విభాగం నాయకురాలు వల్లభనేని ప్రసన్నలక్ష్మి, 43వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కొనికి కొండయ్య, అధికార ప్రతినిధి పూజల శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, జనసేన నాయకులు కోటి పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్ లోపల పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

సుజనాచౌదరికి హరిబాబు అభినందనలు

వన్‌టౌన్: పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరిని సోమవారం భవానీపురంలోని ఎన్‌డీఏ కార్యాలయంలో టీడీపీ మాజీ ఫ్లోర్‌లీడర్ హరిబాబు కలిశారు ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించినందుకు సుజనాకు పుష్పగుచ్ఛం అందచేసి , దుశ్శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న బొండా ఉమా, చరణ్‌సాయి యాదవ్ తదితరులు

యువతకు మంచి రోజులు వచ్చాయి

● సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

సత్యనారాయణపురం, జూన్ 17: యువతకు మంచి రోజులు వచ్చాయని, చంద్రబాబు పాలనలో యువత ఉన్నత స్థాయికి చేరుకొని, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకు వస్తారని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్ సెంట్రల్ కార్యాలయంలో సోమవారం ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు మెగా డీఎస్సీపై సంతకం పెట్టిన సందర్భంగా టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి పి. చరణ్ సాయి యాదవ్ ఆధ్వర్యంలో యువత పెద్దెత్తున సంబరాలు చేసుకొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ త్వరలో 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. టీఎన్‌ఎస్‌ఎఫ్ సెంట్రల్ అధ్యక్షుడు, ప్రధానకార్యదర్శి మనోజ్ కుమార్, అఖిల్, బి. సతీష్, బంద సూర్య, ఎ. రవి, యువకిషోర్, శ్రీరామ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో తాగునీటి కోసం భక్తుల పాట్లు

● రెండు రోజులుగా చలివేంద్రాల్లో తాగునీరు లేని వైనం

● కుళాయిల్లో వేడిగా వస్తున్న తాగునీరు

వన్‌టౌన్, జూన్ 17: దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో అమ్మవారి దర్శనార్థం వచ్చిన భక్తులకు మహామండపం దిగువన తాగునీరు అందుబాటులో లేకపోవడం వలన భక్తులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. వేసవి కాలాన్ని పురస్కరించుకుని భక్తులు సౌకర్యార్థం ఆలయ అధికారులు మహామండపం దిగువన తాగునీరు నిమిత్తం చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే గత రెండు రోజుల నుంచి చలివేంద్రాల్లో తాగునీరు లేకపోవడం వలన షెడ్డు కింద కూర్చుని విశ్రాంతి తీసుకునే భక్తులకు, చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారు. చలివేంద్రం సమీపంలో కుళాయిలు ఉన్నప్పటికీ అందులో నీరు వేడిగా ఉండడంతో భక్తులు తాగడానికి ఇబ్బంది ఏర్పడుతుంది. అధికారులు తక్షణమే స్పందించి చలివేంద్రాల్లో తాగునీరు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

కొత్తపేట స్టేషన్ పరిధిలో

గంజాయిబాబుల హల్‌చల్

● పోలీస్ కమిషనర్‌కు వాట్సా‌ప్‌లో ఫిర్యాదు చేసిన స్థానికులు

● నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

● వారిలో ఇద్దరు పాతనేరస్తులే ● ఆటో సీజ్

చిట్టినగర్, జూన్ 17: కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయిబాబులు హల్‌చల్ చేస్తున్నారు. సాయిరాం థియేటర్ పక్కనే వీజీఎస్ సందులో ఆటోలో కూర్చొని గంజాయి తాగుతూ స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నారు. రాత్రి అయిందంటే ఆ వీధిలో రాకపోకలు సాగించాలంటే మహిళలు భయపడుతున్నారు. గంజాయి బాబుల ఆగడాల గురించి కంట్రోల్ రూమ్‌కు, స్థానిక పోలీసులకు తెలియజేసినా పట్టించుకోలేదని, కొన్ని సందర్భాల్లో పోలీసులు సైరన్ మోగించుకుంటూ వచ్చేవారని పోలీసుల రాక ముందుగానే తెలియడంతో గంజాయి బాబులు అక్కడ నుంచి వెళ్లి పోయేవారని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు వెళ్లిన తరువాత గంజాయి బాబులు ఇష్టారాజ్యం నానా యాగీ చేసేవాళ్లని స్థానికులు వాపోతున్నారు. దీంతో స్థానికులు ఆదివారం నగర పోలీస్ కమిషనర్‌కు వాట్సాప్‌లో సమస్యను తెలియజేయటంతో ఆయన వెంటనే స్పందించారు. కొత్తపేట పోలీసులకు ఆదేశాలు ఇవ్వడంతో నిఘా పెట్టిన పోలీసులు ఆటోను, దానిలో ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఇద్దరిపై పాతకేసులు ఉన్నాయని తెలిసింది. కమిషనర్ స్పందనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పచ్చదనం పరిరక్షణపై చిత్తశుద్ధి ఏదీ?

● ఉద్యాన అధికారుల పర్యవేక్షణ లోపం

● పలు డివిజన్లలో ట్రీ గార్డులతో నేలవాలుతున్న మొక్కలు



భవానీపురం, జూన్ 17 : వీఎంసీ ఉద్యాన అధికారుల పర్యవేక్షణ లోపంతో నగరంలో పచ్చదనం ఏర్పాటుకు శాపంగా పరిణమిస్తోంది. పార్కుల్లో ఉద్యానవనాలు అభివృద్ధే అంతంత మాత్రంగా ఉంటుండగా, భవానీపురం పురవీధుల్లో హెచ్‌బీ కాలనీ, పాత హెచ్‌బీకాలనీ, ఎంఐజీ బ్లాకులు, ఎల్ఐసీ కార్యాలయం రోడ్డు తదితరాల్లో పెద్ద ఎత్తున వైసీపీ ప్రభుత్వం హయాంలో పచ్చదనం పేరిట లక్షల్లో వ్యయం చేస్తూ మొక్కలు నాటి, ట్రీ గార్డులను ఏర్పాటు చేశారు. ఎవరూ వీటిని పర్యవేక్షణ చేయకపోవడంతో ట్రీగార్డుల సహా మొక్కలు నేలవాలుతున్నాయి. నీడనిచ్చే చెట్లతో పాటు గుబురు పెరిగే పలు రకాలు చెట్లను ప్రతీ డివిజన్‌లోను నాటారు. వీటి పర్యవేక్షణకు స్థానికంగా ఉండే కాలనీ పెద్దలు, ఇతరులతో కమిటీలు వేసి వారికి బాధ్యతలు అప్పగిస్తే మేలు. ఇప్పుడు ఇబ్బడి ముబ్బడిగా వర్షాలు పడే రోజులు కావడంతో వీటి సంరక్షణను ఉద్యానశాఖ అధికారులు పట్టించుకుంటే నాటిన మొక్కల్లో కొన్నైనా ఎదగడానికి అవకాశం ఉంటుంది. పడిపోయిన టీ గ్రార్డులను మొక్కలతో నిలబెట్టి వాటిని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

నగరంలోని ప్రధాన డ్రెయిన్లలో వేగంగా పూడికతీత పనులు

● పూడిక తీసిన సిల్ట్‌ను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు



చిట్టినగర్, జూన్ 17: ఆపరేషన్ డీ సిల్టింగ్ పేరిట నగరంలోని ప్రధాన డ్రెయిన్లలో పూడిక తీత పనులు వేగంగా జరుగుతున్నాయి. నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ అధికారులు మూడు సర్కిల్స్‌లో ప్రధాన డ్రెయిన్లలో వర్షంనీరు, మురుగునీరు పారుదలకు ఆటంకంగా ఉన్న డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టారు. పూడిక తీసిన సిల్ట్‌ను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకున్నారు. సర్కిల్-1 పరిధిలో చనమోలు వెంకట్రావ్ ప్లైఓవర్, ఎలక్ట్రిక్ లోకోమోటివ్ షెడ్ దగ్గర, సితార నుంచి కబేళా వరకు, క్రాంబేరోడ్డు, ఎస్‌హెచ్ 65 ఆర్టీసీ వర్క్‌షాపు నుంచి వెంకటేశ్వర ఫౌండ్రి వరకు, జీరో బల్బ్ ఏరియా, జెండా చెట్టు తదితర ప్రాంతాల్లో ప్రధాన డ్రెయిన్లలో పూడిక తీత పనులు వేగంగా జరుగుతున్నాయి. సర్కిల్-2లో రామవరప్పాడు ప్లైఓవర్ దగ్గర నుంచి ఎంపీఎల్ ఎంప్లాయీస్ గుణదల, హౌరా రైల్వే ట్రాక్, ముస్తాబాద్ దగ్గర, ఐఆర్ఆర్, వాంబేకాలనీ హెచ్‌బ్లాక్, న్యూరాజరాజేశ్వరిపేట రైల్వే ట్రాక్ ఉన్న డ్రెయిన్లలో పూడికతీత పనులు జరుగుతున్నాయి. సర్కిల్-3 పరిధిలో బెంజ్‌సర్కిల్ ట్రెండ్‌సెట్ మాల్ దగ్గర నుంచి రాజధాని టీ స్టాల్ వరకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి స్వీట్ మ్యాజిక్ వరకు ఉన్న డ్రెయిన్లలో పూడికతీత పనులు జరుగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
మంగళవారం • 18 జూన్ 2024
cinema@andhrajyothy.com

యాక్షన్ షో రీల్

రవితేజ, దర్శకుడు హరీశ్‌శంకర్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ బచ్చన్' చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా షో రీల్‌ను సోమవారం విడుదల చేశారు. ఎలాంటి డైలాగులు లేకపోవడం ఈ రీల్ ప్రత్యేకత. పాత్రలను పరిచయం చేస్తూ ఆసక్తికరంగా ఇది ఉంది. రవితేజ స్టైలిష్, మాస్ క్యారెక్టర్‌లో కనిపించారు. ఆయన గెటప్ క్లాస్‌టచ్‌తో ఉంది. ఆయన పాల్గొన్న యాక్షన్ సీన్లు మాస్‌ని ఆకట్టుకునేలా ఉన్నాయి. జగపతిబాబు ఓల్డ్ ఫెరోషియస్ మ్యాన్‌గా కనిపించారు. రీల్ చివరిలో రవితేజ అమితాబ్ బచ్చన్‌ను ఇమిటేట్ చేసే సీన్ ఆసక్తికరంగా ఉంది. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సచిన్ ఖేడ్కర్ కీలక పాత్రను పోషిస్తున్నారు. వీరిద్దరూ కూడా షో రీల్‌లో కనిపించారు. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తామని చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ చెప్పారు. 'నామ్‌తో సునా హో గా' అనే ట్యాగ్‌లైన్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, ఫొటోగ్రఫీ: అయనంక బోస్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.



'భైరవ యాంథమ్' వచ్చేసింది



ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏడీ' నుంచి మొదటి సింగిల్ 'భైరవ యాంథమ్' పూర్తి లిరిక్ వీడియో సోమవారం విడుదలైంది. సినిమా ప్రచారంలో భాగంగా ఈ పాటను విడుదల చేసిన మేకర్స్. ఈ సాంగ్‌ను భారతదేశపు అతిపెద్ద పాటగా పేర్కొన్నారు. ప్రభాస్, పంజాబీ సింగర్ దిల్జీత్ దోసాంజే ఈ పాటలో ఆకట్టుకునే వేషధారణతో తలపాగాలు ధరించి సందడి చేశారు. కథానాయకుడి పాత్ర తీరు తెన్నులను ప్రేక్షకులకు పరిచయం చేసేలా సాగే ఈ పాటను రామజోగయ్య శాస్త్రి, కుమార్ రాశారు. తెలుగుతో పాటు హిందీ లిరిక్స్ కలగలసిన ఈ సాంగ్‌ను పంజాబీ సింగర్ దిల్జీత్ దోసాంజే, విజయనారాయణ్ సంయుక్తంగా ఆలపించగా, సంతోశ్ నారాయణన్ సంగీతం అందించారు. కాగా, ఈ సినిమాకు నాగ్‌అశ్విన్ దర్శకత్వం వహించగా, అశ్వనీదత్ నిర్మించారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె, దిశా పటానీ వంటి భారీ తారాగణం నటించిన 'కల్కి 2898 ఏడీ' ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది.



డేట్ మారింది!

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'పుష్ప 2' చిత్రాన్ని ఆగస్టు 15న విడుదల చేస్తున్నట్లు చిత్ర నిర్మాతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్ వై ఇంతకుముందు ప్రకటించారు. అయితే షూటింగ్ పార్ట్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ఇంకా పూర్తి కాకపోవడం, క్వాలిటీ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా, టెక్నికల్‌గా మరింత అత్యున్నత విలువలతో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతో విడుదల తేదీని మార్చామనీ, డిసెంబర్ 6న సినిమా రిలీజ్ అవుతుందని నిర్మాతలు తాజాగా వెల్లడించారు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం నుంచి ఇంతవరకూ విడుదలైన 'పుష్పరాజ్' టైటిల్ సాంగ్, 'సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉంటాడే నా సామి' అనే కపుల్ సాంగ్ సంచలనం సృష్టించాయి. ఈ రెండు పాటల తర్వాత సినిమా మీద అంచనాలు మరింత పెరిగాయి. 'పుష్ప 2' కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అందుకే దర్శకుడు సుకుమార్ విడుదల విషయంలో తొందర పడకుండా మేకింగ్ విషయంలో మరింత శ్రద్ధ తీసుకుని చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు.





వరుణ్ కెరీర్‌కు మైలురాయిగా మారుతుంది

వరుణ్ సందేశ్ నటించిన లేటెస్ట్ చిత్రం 'నింద'. కాండ్రకోట మిస్టరీ ఉపశీర్షిక. రాజేశ్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన 'నింద' చిత్రం ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో నిఖిల్ మాట్లాడుతూ "ఈ సినిమా వరుణ్ సందేశ్ కెరీర్‌కు మైలురాయిగా మారుతుంది. అందరూ సినిమాను పెద్ద సక్సెస్ చేయాలి" అని కోరారు. "ఇన్నేళ్ల కెరీర్‌లో నా మనసుకు బాగా దగ్గరైన చిత్రం 'నింద'" అని వరుణ్ సందేశ్ చెప్పారు. "'నింద' మూవీ వరుణ్ కమ్‌బ్యాక్‌కు నాంది పలుకుతుంది" అని దర్శకనిర్మాత రాజేశ్ జగన్నాథం అన్నారు.

అమిష్టగా దర్శన రాజేందర్

'సినిమా బండి' చిత్రంతో సెన్సిబుల్ డైరెక్టర్‌గా గుర్తింపు పొందిన ప్రవీణ్ కండ్రీగుల తెరకెక్కిస్తోన్న చిత్రం 'పరదా'. మహిళా ప్రాధాన్యమున్న కథతో రూపొందుతున్న ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్, మలయాళ చిత్రం 'హృదయమ్' ఫేమ్ దర్శన రాజేంద్రన్, సంగీత నటిస్తున్నారు. శ్రీనివాసులు పివి, శ్రీధర్ మక్కువ, విజయ్ డొంకాడ నిర్మిస్తున్నారు. సోమవారం దర్శన రాజేంద్రన్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్‌తో పాటు ఓ స్పెషల్ వీడియోను విడుదల చేశారు. సినిమాలో దర్శన పోషిస్తున్న పాత్ర పేరు 'అమిష్ట'. ఈ చిత్రానికి ఎడిటర్: ధర్మేంద్ర కాకరాల, డీఓపీ: మృదుల్ సుజిత్‌సేన్, సంగీతం: గోపి సుందర్.



ఎర్ర గులాబీ

మలయాళ నటి హనీ రోజ్ లీడ్ రోల్ పోషిస్తున్న 'రేచల్' చిత్రం టీజర్ విడుదలైంది. వయలెన్స్, బ్లడ్ షెడ్ కలిగిన కథాంశమని ఈ టీజర్ చూడగానే అర్థమవుతుంది. నటిగా హనీ రోజ్‌కు ఉన్న అనుభవం, నైపుణ్యాన్ని ఈ సినిమా ఉపయోగించుకుంటోందనే విషయాన్ని ఈ టీజర్ వెల్లడించింది. నూతన దర్శకురాలు ఆనందిని బాలాను పరిచయం చేస్తూ బాదుషా ఎన్.ఎం, రాజన్ చిరాయిల్ నిర్మిస్తున్నారు. దర్శకుడు అబ్రిడ్ షైన్ ఈ సినిమాకు సహ నిర్మాత. మలయాళంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని తమిళ, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు. రాహుల్ మణప్పట్టు కథ అందించిన ఈ చిత్రానికి ఆయనతో పాటు అబ్రిడ్ షైన్ కూడా స్క్రీన్‌ప్లే తయారు చేశారు.



కథ విన్నప్పుడే.. సక్సెస్‌ను ఊహించా



విజయ్ సేతుపతి

తెలుగులో మంచి ఫ్యాన్ బేస్‌ను సొంతం చేసుకున్న అతికొద్ది తమిళ నటుల్లో విజయ్ సేతుపతి ఒకరు. ఆయన నటించిన 50వ చిత్రం 'మహరాజా'. అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్, అభిరామి కీలక పాత్రలు పోషించారు. నిథిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో సుధన్ సుందరమ్, జగదీశ్ పళనిసామి నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకుని.. హిట్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఈ సందర్భంగా సోమవారం చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా మూవీ డైరెక్టర్ నిథిలన్ స్వామినాథన్ మాట్లాడుతూ "ఈ సినిమాలోని ఎమోషన్‌తో ప్రేక్షకులు చివరివరకూ ప్రయాణిస్తారు. ఈ సినిమాకి వస్తున్న రెస్పాన్స్ చాలా సంతోషాన్నిస్తోంది. ఈ సినిమాని ఇంతలా ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు" అని అన్నారు. "నన్ను సినిమా సినిమాకి మరింతగా ప్రేమిస్తున్న తెలుగు ప్రేక్షకులకి నా కృతజ్ఞతలు. ఈ సినిమా కథ విన్నప్పుడే ఇది అందరి మనసులని గెలిచే సినిమా అవుతుందని ఊహించా. ఈ సక్సెస్‌ని ప్రేక్షకులకి అంకితం చేస్తున్నాను" అని విజయ్ సేతుపతి చెప్పారు.

నాకంత సీన్ లేదు

కథానాయికగా, గాయనిగా, రచయిత్రిగా, డైరెక్టర్‌గా, నిర్మాతగా తండ్రికి తగ్గ కూతురు అనిపించుకుంటున్నారు శ్రుతి హాసన్. ఫాదర్స్ డే సందర్భంగా తన తండ్రి కమల్ హాసన్‌ను పొగడ్తలతో ముంచెత్తారు శ్రుతి. "నా జీవితంలో మొదటి గురువు.. ఆదర్శం మీరే నాన్నా. విభిన్న రంగాల్లో రాణించొచ్చనే స్ఫూర్తినిచ్చింది మీరే. నటిగా మీ అడుగుజాడలను ఎలా ఫాలో అయ్యానో.. ఓ దర్శకురాలిగానూ మిమ్మల్నే అనుసరిస్తా. నిజానికి నాకు దర్శకత్వం అంటే ఆసక్తి మిమ్మల్ని సెట్‌లో డైరెక్టర్‌గా చూసినప్పుడే ఏర్పడింది" అని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఓ అభిమాని "మీ తండ్రి బయోపిక్ మీరు చేసే అవకాశం ఉందా" అని అడిగిన ప్రశ్నకు "కచ్చితంగా కాదు. నేను ఆ పనికి సరైన వ్యక్తిని అనుకోవడం లేదు. నిజం చెప్పాలంటే నాకంత సీన్ లేదు. ఎందుకంటే ఇండస్ట్రీలో నాకంటే అద్భుతమైన ప్రతిభ ఉన్నవారు.. అర్హత ఉన్నవారు చాలా మందే ఉన్నారు" అని శ్రుతి బదులిచ్చారు.



చిత్ర పరిశ్రమ నేపథ్యంలో సినిమా

అభిరామ్, వెన్నెల, మనోహర్, పవన్, కృష్ణ, మంజుల హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఇట్లు.. మీ సినిమా' ఈ నెల 21న విడుదల కానుంది. నలుగురు యువకులు సినిమా మీదున్న ప్యాషన్‌తో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి ఎటువంటి సవాళ్లు ఎదుర్కొన్నారు.. అనే కథాంశంతో రూపుదిద్దుకున్న చిత్రమిది. లవ్, రొమాన్స్, కామెడీ, సెంటిమెంట్ అంశాలతో రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి హరీశ్ చావా దర్శకుడు.




నోరి నాగప్రసాద్ నిర్మాత. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసిన సందర్భంగా ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దర్శకుడు హరీశ్ చావా మాట్లాడుతూ 'సినిమా కథ కోసం అన్వేషిస్తున్నప్పుడు ఏ కథో ఎందుకు.. సినిమా ఇండస్ట్రీలో పడే ఇబ్బందుల గురించి సినిమా తీద్దాం. అన్నారు మా నిర్మాత. పరిశ్రమలోకి అడుగుపెట్టే వారికి అవగాహన కల్పించే విధంగా మా సినిమా ఉంటుంది. ప్రేక్షకులందరికీ తప్పకుండా నచ్చుతుంది' అని చెప్పారు. 'పరిశ్రమలోకి వచ్చే కొత్త వాళ్లు పడే ఇబ్బందుల్ని ఆసక్తికరంగా, ప్రేక్షకులకు నచ్చే రీతిలో చూపించాం. ఈ నెల 21న విడుదల చేస్తున్నాం. చిన్న సినిమా కనుక దయచేసి అందరూ థియేటర్లకు వెళ్లి చూడండి' అని కోరారు నిర్మాత నాగప్రసాద్. ఈ కార్యక్రమంలో హీరో అభిరామ్, హీరోయిన్ వెన్నెల, తెలుగు నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ తదితరులు పాల్గొన్నారు.



అది ఫేక్ అకౌంట్

'మిస్టర్ అండ్ మిస్సెస్ మహీ' చిత్రంతో సూపర్ హిట్ కొట్టిన ఆనందంలో ఉన్నారు బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్. తాజాగా ఆ సంతోషాన్ని ఆవిరి చేసేలా ఓ సంఘటన జరిగింది. అదేంటంటే ఆమె ఎక్స్ ఖాతా నుంచి అశ్లీల ఫొటోలు ప్రత్యక్షమవ్వడం. దీంతో ఒక్కసారిగా ఆమెతో పాటు జాన్వీ ఫ్యాన్స్ ఆందోళనకు గురయ్యారు. దీనిపై స్పందించిన జాన్వీ టీమ్.. ఆ ఫొటోలు పోస్ట్ చేసింది ఫేక్ అకౌంట్ నుంచి అని.. అసలు జాన్వీకి ఎక్స్ ఖాతానే లేదని స్పష్టతనిచ్చింది. సోషల్ మీడియాలో ఇలాంటి నకిలీ ఖాతాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.





కిడ్నీ కేర్

నిశ్శబ్దంగా తమ పని తాము చేసుకుపోతూ ఉండే కిడ్నీలు జబ్బు పడే ప్రక్రియ కూడా నిశ్శబ్దంగానే జరిగిపోతూ ఉంటుంది. కాబట్టి వాటి మీద ఓ కన్నేసి ఉంచి, ముందస్తు పరీక్షలతో అప్రమత్తంగా నడుచుకుంటూ ఉండాలంటున్నారు వైద్యులు.

కిడ్నీలు ఇలా క్షేమం

మూత్రపిండాలు రక్తాన్ని వడగట్టే సామర్థ్యాన్ని క్రమేపీ కోల్పోతూ ఉంటాయి. ఏడాదికి 5% చొప్పున సహజంగానే కిడ్నీల సామర్థ్యం తిరగిపోతూ ఉంటుంది. దీనికి తోడు అధిక రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులు లాంటి రుగ్మతలు, ఊబకాయం, అస్తవ్యస్థ జీవనశైలి లాంటి సమస్యల వల్ల కిడ్నీలు మరింత వేగంగా దెబ్బతినడం మొదలుపెడతాయి. అయితే కిడ్నీ ఫెయిల్యూర్, అక్యూట్ కిడ్నీ ఫెయిల్యూర్, క్రానిక్ కిడ్నీ డిసీజ్, ర్యాపిడ్లీ ప్రోగ్రెసివ్ రీనల్ ఫెయిల్యూర్ అనే మూడు దశల్లో సాగుతుంది.

- **అక్యూట్:** అకస్మాత్తుగా వాంతులు, విరేచనాలతో శరీరంలోని నీటి శాతం తగ్గిపోయినప్పుడు లేదా ఒంటికి సరిపడని మందులు తీసుకోవడం వల్ల, గుండెపోటుకు గురైన సందర్భాల్లో ఆ ప్రభావాలు కిడ్నీల మీద పడి, వాటి సామర్థ్యం కొంత మేరకు దెబ్బ తింటుంది. అలాగే మూత్రపిండాల్లో రాళ్ల వల్ల, తీవ్రమైన కొవిడ్ ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా ఇలా జరగవచ్చు. ఇలాంటి సందర్భాల్లో కిడ్నీల పనితీరు దెబ్బతినడానికి కారణమైన ప్రధాన సమస్యను చికిత్సతో సరిదిద్దితే, కిడ్నీలు కూడా పూర్వపు స్థితికి చేరుకుంటాయి. అయితే మూత్రపిండాలు నిమిషానికి 70 నుంచి 100 మి.లీ రక్తాన్ని వడగట్టడానికి బదులుగా, 15 మి.లీ రక్తాన్ని మాత్రమే వడగట్టే స్థితికి చేరుకుంటే, అప్పుడు ఆ వ్యక్తులకు డయాలసిస్ అవసరమవుతుంది. కిడ్నీలు పూర్తి సామర్థ్యాన్ని పుంజుకునే వరకూ ఇలా డయాలసిస్ అందించవలసి ఉంటుంది. ఇలా కాకుండా కిడ్నీల వడపోత సామర్థ్యం 15, 70 మి.లీ మధ్య ఉంటే, మందులతోనే పరిస్థితిని అదుపులోకి తీసుకురావచ్చు.
- **క్రానిక్ కిడ్నీ డిసీజ్:** ఇది నిశ్శబ్ద వ్యాధి. దీన్ని మొదట్లోనే కనిపెట్టగలిగితే, సమస్యను సరిదిద్దుకోగలిగే అవకాశం ఉంటుంది. కిడ్నీల సామర్థ్యం 60 మి.లీటర్లకు పడిపోయినప్పుడు కనిపెట్టినా, తిరిగి చికిత్సతో కిడ్నీలను కాపాడుకోవచ్చు. అలా కాకుండా వ్యాధిని కనిపెట్టకుండా కిడ్నీల సామర్థ్యం 10 మి.లీకు పడిపోతే, తిరిగి చికిత్సతో కిడ్నీలను మెరుగు చేసుకునే పరిస్థితి ఉండదు. క్రానిక్ కిడ్నీ డిసీజ్‌లో కిడ్నీల సామర్థ్యం 90%కి పడిపోయినా ఎటువంటి లక్షణాలు బయల్పడవు. వంద మంది కిడ్నీ ఫెయిల్యూర్ రోగుల్లో, దీర్ఘకాలిక మధుమేహం, అధిక రక్తపోటులను అదుపులో పెట్టుకోకపోవడం వల్ల కిడ్నీలు ఫెయిల్ అయిన వాళ్లు 70 నుంచి 80 మంది ఉంటారు. వంశపారంపర్య కిడ్నీ జబ్బులు సంక్రమించిన వాళ్లు, పదే పదే కిడ్నీ స్టోన్స్, కిడ్నీ ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యే సమస్య బారిన పడేవాళ్లు, పుట్టుకతో సమస్యను వెంట తెచ్చుకున్నవాళ్లు, దీర్ఘకాలికంగా పెయిన్ కిల్లర్స్ తీసుకున్న వాళ్లు, అవసరం లేకపోయినా మూలికా మందులు వాడుకునేవాళ్లు, గుండెజబ్బులు ఉన్న మిగతా 20 నుంచి 30 మందిలో కిడ్నీలు ఫెయిల్ అవుతూ ఉంటాయి.
- **ర్యాపిడ్లీ ప్రోగ్రెసివ్ రీనల్ ఫెయిల్యూర్:** అతి తక్కువ కాలంలో కొన్ని రోజుల వ్యవధిలో కిడ్నీలు ఫెయిల్ అయిపోయే పరిస్థితి ఇది. క్రానిక్ కిడ్నీ డిసీజ్‌కు దారి తీసే కారణాలే దీనికీ వర్తిస్తాయి. వీళ్లకు డయాలసిస్ లేదా కిడ్నీ మార్పిడి ఒక్కటే పరిష్కారం.

కిడ్నీ ఫ్యాక్ట్స్!

- శరీరంలోని మొత్తం రక్తాన్ని కిడ్నీలు గంటకు 12 సార్లు వడపోస్తూ ఉంటాయి.
- రోజు మొత్తంలో మూత్రపిండాలు 180 లీటర్ల రక్తాన్ని వడపోస్తాయి.
- కాలేయానికి చోటివ్వడం కోసం కుడివైపు మూత్రపిండం ఎడమవైపు కిడ్నీ కంటే కొద్దిగా చిన్నదిగా, దిగువకు ఉంటుంది.
- విపరీతంగా నీళ్లు తాగడం కిడ్నీలకు ప్రమాదకరం. ఎక్కువ పరిమాణంలోని నీళ్లను తాగడం వల్ల కిడ్నీలు అన్ని నీళ్లను త్వరితంగా వడగట్టలేకపోవడం మూలంగా రక్తంలోని సోడియం పలుచనవుతుంది. హైపోనట్రీమియా అనే ఈ స్థితిలో శరీరంలోని కణాలు వాపుకు గురవుతాయి.
- నొప్పి నివారణ మందులైన ఇబ్యుప్రోఫెన్, యాస్పిరిన్‌లు కిడ్నీలను దెబ్బతీస్తాయి.

ఈ పరీక్షలు అత్యవసరం

మధుమేహం, అధిక రక్తపోటు ఉన్నవాళ్లు, కుటుంబ చరిత్రలో కిడ్నీ వ్యాధులు ఉన్నవాళ్లు, పదే పదే కిడ్నీ స్టోన్లు ఏర్పడుతున్న వాళ్లు, గుండె జబ్బులున్నవాళ్లు ఏడాదికోసారి 'ఎస్టిమేటెడ్ జీఎఫ్ఆర్ టెస్ట్' చేయించుకుంటూ ఉండాలి. అలాగే మూత్రపిండాల పనితీరు మెరుగ్గానే ఉన్నప్పటికీ, మూత్రంలో ప్రొటీన్ లేదా రక్తం పోతూ ఉంటే, భవిష్యత్తులో కిడ్నీల సామర్థ్యం తగ్గే అవకాశం ఉంటుంది. కాబట్టి కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్ పరీక్ష కూడా చేయించుకోవాలి. ఈ పరీక్షల్లో కిడ్నీ సామర్థ్యం 80 శాతానికంటే తగ్గితే, కారణాలను గుర్తించి, తగిన చికిత్స తీసుకోవాలి.

మధుమేహులు ఇలా....

మధుమేహులు రక్తంలోని చక్కెరలతో పాటు, అధిక రక్తపోటును కూడా అదుపులో ఉంచుకోవాలి. ఒకసారి మధుమేహం వచ్చిన తర్వాత, రక్తపోటు 130/80 దగ్గర ఉండేలా చూసుకోవాలి. సాధారణంగా బిపిని తేలికగా తీసుకుంటూ ఉంటారు. మందులు వేసుకున్నా, వేసుకోకపోయినా బిపిలో ఎలాంటి తేడా తెలియడం లేదు కదా అని మందులు మానేస్తూ ఉంటారు. కానీ రక్తపోటు నిర్ధారణ అయిన తర్వాత వైద్యుల సూచన మేరకు మందులు వాడుకుంటూనే ఉండాలి. అలాగే మధుమేహులు ప్రతి మూడు నెలలకోసారి గ్లైకోజినేటెడ్ హీమోగ్లోబిన్ 7% తక్కువ కంటే తక్కువగా ఉండేలా చూసుకుంటూ ఉండాలి. కిడ్నీ డిసీజ్‌లో రక్తంలో హీమోగ్లోబిన్ తగ్గడం, శరీరంలో యాసిడ్, పొటాషియం శాతం పెరగడం లాంటివి జరుగుతూ ఉంటాయి. కాబట్టి కిడ్నీ డిసీజ్ దశ ఆధారంగా సమస్యలను సరిదిద్దుకోగలిగితే వ్యాధి చివరి దశకు చేరుకోకుండా ఉంటుంది.

కిడ్నీ కాపాడుకోవాలంటే...

- స్మోకర్ల మూత్రపిండాల సామర్థ్యం వేగంగా తగ్గిపోతుంది. కాబట్టి నికోటిన్ కలిగి ఉండే ధూమపానం, గుట్కా, పాన్ మసాలాలను మానేయాలి.
- కిడ్నీ జబ్బులు ఉన్న వాళ్లు పెయిన్ కిల్లర్స్‌కు దూరంగా ఉండాలి.
- ఏ రుగ్మత కోసం వైద్యులను సంప్రతించినా, తమకున్న కిడ్నీ జబ్బు గురించి చెప్పాలి.
- 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఏడాదికోసారి మూత్రపిండాల పనితీరును పరీక్షించుకుంటూ ఉండాలి.
- కుటుంబ చరిత్రలో కిడ్నీ సమస్య ఉన్నవాళ్లు, హృద్రోగులు, మధుమేహులు, హై బిపి ఉన్న వాళ్లు కూడా ఏడాదికోసారి కిడ్నీలను పరీక్షించుకుంటూ ఉండాలి.
- రోజు మొత్తంలో తీసుకునే ఉప్పును 3 నుంచి 4 గ్రాములకు తగ్గించాలి.
- వారంలో ఐదు రోజుల పాటు, రోజుకు కనీసం 45 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.
- బరువును అదుపులో ఉంచుకోవాలి.
- కొవిడ్‌తో కిడ్నీ జబ్బుకుకు గురైనవాళ్లు ప్రతి మూడు నెలలకోసారి మూత్రంలో ప్రొటీన్ నష్టాన్ని గమనించుకుంటూ ఉండాలి. కిడ్నీ పనితీరును పరీక్షించుకుంటూ, దాని సామర్థ్యాన్ని కాపాడుకునే జాగ్రత్తలు పాటించాలి.
- కిడ్నీ సమస్య తీవ్రంగా ఉన్న వాళ్లు ప్రొటీన్ పరిమితి పాటించాలి.
- రోజుకు మూడు నుంచి నాలుగు లీటర్ల నీళ్లు తాగాలి.

ఈ లక్షణాల మీద ఓ కన్నేసి...

- తరచూ మూత్రం రావడం లేదా మూత్రం తగ్గిపోవడం
- కాళ్ల వాపు
- రక్తపోటు పెరగడం
- తొందరగా నీరసించిపోవడం
- ఆయాసం రావడం
- ఫిట్స్
- రక్తంలో హీమోగ్లోబిన్ తగ్గిపోవడం

ఒకే కిడ్నీ ఉంటే...

వీళ్లు రెండు కిడ్నీలు ఉన్న వాళ్లు పాటించే జాగ్రత్తలనే పాటించాలి. వీళ్లలో ఉన్న ఒక్క కిడ్నీ ఎక్కువగా పని చేయడం వల్ల మూత్రంలో ప్రొటీన్ నష్టం జరుగుతూ ఉంటుంది. ఈ పరిస్థితి అరుదుగా ఏర్పడుతుంది. కాబట్టి ఏడాదికోసారి కిడ్నీలను పరీక్షించుకుంటూ ఉండాలి. కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్ చేయించుకుంటూ ఉండాలి.

డాక్టర్ రాజశేఖర చక్రవర్తి
సీనియర్ నెఫ్రాలజిస్ట్ అండ్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్,
యశోద హాస్పిటల్స్,
హైటెక్ సిటీ, హైదరాబాద్.



ఇది నిశ్శబ్ద వ్యాధి. దీన్ని మొదట్లోనే కనిపెట్టగలిగితే, సమస్యను సరిదిద్దుకోగలిగే అవకాశం ఉంటుంది. కిడ్నీల సామర్థ్యం 60 మి.లీటర్లకు పడిపోయినప్పుడు కనిపెట్టినా, తిరిగి చికిత్సతో కిడ్నీలను కాపాడుకోవచ్చు.



ఫిట్‌నెస్

వ్యాయామం ఎంత సేపు?



వ్యక్తిగత ప్రాధామ్యాలు, లక్ష్యాలు, ఫిట్‌నెస్ మోతాదుల మీదే వ్యాయామ సమయం ఆధారపడి ఉంటుంది. అయితే గాయాలకూ, ప్రమాదాలకూ తావు లేని వ్యాయామ నిడివిని ఏ అంశాల ఆధారంగా ఎంచుకోవాలో తెలుసుకుందాం!


- వ్యాయామం చేయడం వెనకున్న లక్ష్యాన్ని బట్టి ఎలాంటి వ్యాయామం ఎంత సమయం పాటు చేయాలనేది తెలుసుకోవాలి. బరువు తగ్గడం, కండరాలను పెంచడం, కార్డియోవ్యాస్క్యులర్ ఆరోగ్యాన్ని పెంచుకోవడం.. ఇలా వ్యాయామ లక్ష్యాల ఆధారంగా అందుకు తగిన వ్యాయామాలనూ, నిడివినీ కేటాయించుకోవాలి.
- తక్కువ సమయం పాటు ఎక్కువ తీవ్రతతో కూడిన వ్యాయామాలు చేయడం లేదా ఎక్కువ సమయం పాటు తక్కువ తీవ్రతతో కూడిన వ్యాయామాలు చేయడం వ్యక్తుల శరీర దారుఢ్యం, వయసు, ఆరోగ్య పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి అందుకు తగిన వ్యాయామ ప్రక్రియను ఎంచుకోవాలి.
- కొత్తగా వ్యాయామం మొదలుపెట్టేవాళ్లు తక్కువ నిడివితో, తేలికపాటి వ్యాయామాలు చేయాలి. వ్యాయామం అనుభవం ఉన్న వాళ్లు క్రమేపీ తీవ్రతను, వ్యాయామ నిడివినీ పెంచుకుంటూ పోవచ్చు.
- కొందరికి వారంలో ఒకటి రెండు రోజుల పాటు సుదీర్ఘమైన వ్యాయామాలను ఎంచుకుంటారు. ఇంకొందరు వారంలో ఐదు రోజుల పాటు తక్కువ సమయాలను వ్యాయామాలకు కేటాయిస్తూ ఉంటారు. తీరిక దొరికే సమయాల ఆధారంగా, ఈ రెండింటిలో ఎవరికి ఏది సూటవుతుందో తెలుసుకోవాలి.

అవేర్‌నెస్

శరీరం షాక్‌కు గురైతే?

షాక్ అనేది ప్రాణాంతకమైన పరిస్థితి. సరిపడా రక్తప్రసరణ జరగనప్పుడు శరీరం షాక్‌కు గురవుతుంది. సాధారణంగా ఐదు ప్రధాన షాక్‌లకు శరీరం గురవుతూ ఉంటుంది. అవేంటంటే...

- **అనాఫిలాక్టిక్ షాక్:** అలర్జీ వల్ల శరీరం షాకు గురయ్యే పరిస్థితి ఇది. పెన్సిలిన్, లేటెక్స్, తేనెటీగలు, నట్స్, షెల్‌ఫిష్ లాంటి పదార్థాలతో తలెత్తే షాక్‌లు ఈ కోవలోకి వస్తాయి.
- **కార్డియోజెనిక్:** హార్ట్ అటాక్ సమయంలో శరీరం షాక్‌కు గురయ్యే పరిస్థితి ఇది. అకస్మాత్తుగా గుండె వేగం పెరిగిపోయి, శ్వాస హెచ్చుతగ్గులకు లోనవుతుంది. చర్మం పాలిపోతుంది. విపరీతమైన చమటలు ఉంటాయి. మూత్రవిసర్జన ఆగిపోతుంది.
- **హైపోవోలమిక్:** శరీరం 20% అంతకు మించి రక్తాన్ని కోల్పోయినప్పుడు, ఈ షాక్‌కు గురవుతుంది. విపరీతమైన రక్తస్రావం. చమట, తల తిరుగుడు, అయోమయం, శ్వాస నెమ్మదించడం లాంటి లక్షణాలు ఉంటాయి. ఒకవేళ అంతర్గత రక్తస్రావమైతే, నలుపు రంగులో రక్తంతో కూడుకున్న మలం, పొట్ట నొప్పి, రక్తపు వాంతులు లాంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి.
- **న్యూరోజెనిక్:** కేంద్రనాడీ వ్యవస్థ పాత్‌వేస్, మరీముఖ్యంగా వెన్నెముకకు దెబ్బతిన్నప్పుడు తలెత్తే షాక్ ఇది. ఇలాంటప్పుడు రక్తపోటు పడిపోయి, చర్మం ఎరుపు రంగులోకి మారుతుంది. గుండె కొట్టుకునే వేగం తగ్గుతుంది.
- **సెప్టిక్:** బ్యాక్టీరియా, వైరస్ లేదా ఫంగస్ వల్ల శరీరం మొత్తం ఇన్‌ఫెక్షన్‌కు గురైతే శరీరం సెప్టిక్ షాక్‌కు గురవుతుంది. ఈ పరిస్థితినే సెప్సిస్ అంటారు. మూత్రవిసర్జన తగ్గడం, అయోమయం, మత్తు, శ్వాసకోశ సమస్యలు, జ్వరం ఉంటాయి.



ఆయుర్వేదం

ఆయుర్వేద చికిత్సా విధానంలో రుతుచర్య, రుతు (కాలం), చర్య (క్రమశిక్షణ)ను అనుసరిస్తూ ఉంటారు. వర్షాకాలంలో రుతుపరమైన మార్పులకు గురయ్యే శరీరానికి సాంత్వన సమకూర్చడం కోసం ఆహారపుటలవాట్లలో మార్పులు చేసుకోవాలని ఆయుర్వేదం సూచిస్తోంది.

వానల్లో ఆహారం ఆచితూచి...

వర్షాకాలంలో శక్తి సన్నగిల్లుతుంది. కాబట్టి శక్తిని సమకూర్చి, వానాకాల వ్యాధులు దరి చేరకుండా ఉండేలా వ్యాధినిరోధకశక్తిని పెంచే పదార్థాలను ఆహారంలో చేర్చుకోవాలి. అవేంటంటే...

నెయ్యి

నెయ్యిలో ఫ్యాటీ యాసిడ్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలోని విషాలను హరించి, వ్యాధినిరోధకశక్తిని పెంచి శరీరాన్ని బలపరుస్తాయి. కాబట్టి వానాకాలం తీసుకునే ఆహారంలో తప్పక నేయిని చేర్చాలి. అయితే ఆవు నెయ్యిని ఎంచుకుంటే, జీర్ణశక్తి కూడా మెరుగై, అజీర్తి సమస్యలు తలెత్తకుండా ఉంటాయి.

అల్పాహారాలు

వానలు కురుస్తూ వాతావరణం చల్లగా మారిన సమయంలో వేడి వేడిగా పకోడీలు, బజ్జీలు తినాలనిపిస్తుంది. ఈ రుతువులో శరీరానికి కొవ్వు అవసరం ఎక్కువ కాబట్టి, మనసు అలాంటి అల్పాహారాల వైపు మళ్లడం సహజం. అయితే వీటిని పరిమితంగా తీసుకుంటూ డ్రైఫ్రూట్స్, నట్స్‌ను ఎక్కువగా తీసుకోవడం ఆరోగ్యకరం. వీటితో శరీరానికి అవసరమైన ఫ్యాటీ యాసిడ్లు సమకూరి, శరీరంలోని ఆమ్లం తగ్గి, క్షారం పెరుగుతుంది.

సుగంధ ద్రవ్యాలు

ఎండలతో వేడెక్కిన వాతావరణం వానలతో చల్లబడడంతో, వ్యాధికారక క్రిములు విజృంభించడం మొదలుపెడతాయి. వీటితో సంక్రమించే వ్యాధుల నుంచి రక్షణ పొందాలంటే ఆహారంలో సుగంధ ద్రవ్యాల వాడకాన్ని పెంచాలి. వీటితో శరీరంలో అగ్ని పెరిగి, వానాకాలంలో వేధించే జలుబు, దగ్గు, డయేరియా, జ్వరాల నుంచి రక్షణ దక్కుతుంది.

తేనె

వానాకాలంలో తరచూ తీపి తినాలనిపిస్తుంది. ఈ వాంఛను తీర్చుకోవడం కోసం సహజసిద్ధమైన తేనెను ఎంచుకోవచ్చు. సాధారణంగా తేనె శరీరంలో పిత్తాన్ని పెంచుతుంది. కానీ వానాకాలంలో వాతం పెరుగుతుంది కాబట్టి తేనెను పరిమితంగా తీసుకోవచ్చు. తేనె శరీరంలోని బ్యాక్టీరియా, వైరస్‌లను హరిస్తుంది.

ఇవి పరిమితం

వానాకాలంలో కొన్ని పదార్థాలను పరిమితం చేసుకోవాలి. అవేంటంటే...

పెరుగు: శరీరాన్ని చల్లబరచడం పెరుగు స్వభావం. కాబట్టి పెరుగుతో శరీరంలో వాత దోషం పెరుగుతుంది. వానాకాలంలో స్వతహాగానే వాత దోషం పెరుగుతుంది. కాబట్టి అదనంగా పెరుగు తినడం వల్ల ఈ దోషం తీవ్రమయ్యే అవకాశాలుంటాయి. దీంతో పాటే పిత్త దోషం కూడా పెరిగి వానాకాల సమస్యలు మొదలవుతాయి. కాబట్టి ఈ కాలంలో పెరుగును పరిమితంగా తినాలి.

సలాడ్: బ్యాక్టీరియా, వైరస్‌లు పచ్చి కూరగాయల ద్వారా శరీరంలోకి చొరబడే అవకాశాలు ఈ కాలంలో ఎక్కువ. కలుషిత ఆహారం ద్వారా జీర్ణ సమస్యలు, విరోచనాలు, వాంతులు వేధించే అవకాశాలు కూడా ఈ కాలంలో ఎక్కువే! కాబట్టి వానాకాలంలో ముందుగానే తరిగి పెట్టుకునే కాయగూరలు, సలాడ్లకు దూరంగా ఉండాలి.

ఆకుకూరలు: ఈ కాలంలో వాతావరణంలో తేమ ఎక్కువ. వానలతో ఆకుకూరలు విపరీతంగా తడిచిపోయి, కుళ్లిపోయే అవకాశాలు కూడా ఎక్కువే! ఇలాంటి ఆకుకూరలతో ఇన్‌ఫెక్షన్లు సోకుతాయి. కాబట్టి ఇంట్లో పెంచిన తాజా ఆకుకూరలు మినహా, మార్కెట్లో దొరికే ఆకుకూరలు తినకపోవడమే మేలు.

మాంసాహాహారం: ఈ కాలంలో వాత దోషం పెరగడం వల్ల జీర్ణవ్యవస్థ ప్రక్రియ మందగించి ఉంటుంది. కాబట్టి మాంసాహారాన్ని వీలైనంత పరిమితం చేయాలి. జీర్ణం కావడానికి ఎక్కువ శక్తిని సంగ్రహించే మాంసాహారం వల్ల శరీరంలో ఆమం పెరిగే ప్రమాదం కూడా ఉంటుంది.



లైఫ్ స్టైల్

షిఫ్టుల్లో పర్‌ఫెక్ట్‌గా...

షిఫ్టుల్లో పని చేసేవాళ్ల ఆహారవేళలు అస్తవ్యస్థంగా ఉంటాయి. కాబట్టి ఆరోగ్యం దెబ్బతినే అవకాశాలు వాళ్లకు ఎక్కువే! కాబట్టి షిఫ్టు సిస్టంకు తగ్గట్టు జీవనశైలిని ఆరోగ్యకరంగా ఎలా మలుచుకోవాలో తెలుసుకోవడం అవసరం.

సమతులాహారం: పిండిపదార్థాలు, ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు కలిగి ఉండే ఆహారం తీసుకుంటే, శక్తి మోతాదులు హెచ్చుతగ్గులకు లోనవకుండా ఉంటాయి.

హైడ్రేషన్: షిఫ్టులో డీహైడ్రేషన్‌కు గురి కాకుండా ఉండడం కోసం నీళ్లు తాగుతూనే ఉండాలి.



స్వల్ప భోజనం: నిస్సత్తువ ఆవరించకుండా ఉండడం కోసం తరచూ, స్వల్ప భోజనాలు చేయాలి.

పోషకాలు: పండ్లు, కూరగాయలు, పొట్టుతీయని ధాన్యాలు, చికెన్, గుడ్లు ఉండేలా చూసుకోవాలి.

కెఫీన్: తరచూ కూల్‌డ్రింక్స్, కాఫీల జోలికి వెళ్లకూడదు. షిఫ్ట్ ముగిసే సమయంలో వీటిని తీసుకోవడం వల్ల రాత్రి నిద్ర కరువవుతుంది.

చక్కెర: తీయగా ఉండే స్నాక్స్, కూల్‌డ్రింక్స్ తీసుకుంటే శక్తి హెచ్చుతగ్గులకు లోనవుతుంది. కాబట్టి క్యాంటీన్స్‌లో దొరికే కేక్స్, బిస్కెట్స్‌కు దూరంగా ఉండాలి.

ప్రాసెస్డ్ ఫుడ్స్: వీటితో మెటబాలిక్ ఆరోగ్యం దెబ్బతింటుంది. కాబట్టి మైదాతో తయారైన పదార్థాలను తగ్గించాలి.

అర్థ రాత్రి భోజనం: లేట్ నైట్ మీల్స్ మానేయాలి. వీటితో నిద్రాభంగం. కొవ్వు పెరుగుతుంది.

డయాబెటిక్ కేర్

ఆహారంతో చక్కెర అదుపు

ఆహార వర్గాల మధ్య తేడాలు, గ్లైసెమిక్ మోతాదుల మీద వాటి ప్రభావాలు, వాటిలోని పోషక విలువల మీద అవగాహన ఏర్పరుచుకుని అందుకు తగిన ఆహారాన్ని ఎంచుకోగలిగితే చక్కెర అదుపు తప్పకుండా ఉంటుంది.

కుటుంబ చరిత్ర: కుటుంబ చరిత్ర, జెనెటిక్ మేకప్‌లను అర్థం చేసుకోగలిగితే, మన శరీరం పనితీరు అవగతమవుతుంది. పరిసరాలు, జీవనశైలి, ఆహారపుటలవాట్ల ఆధారంగా మధుమేహం అదుపులో ఉండే ఆహారశైలీ, వ్యాయామాలను రూపొందించుకోవాలి.

కార్బొహైడ్రేట్ కౌంట్: తీసుకునే ఆహారం ద్వారా అందుతున్న పిండిపదార్థాలు, వాటితో పెరిగే చక్కెర మోతాదుల పట్ల కూడా అవగాహన ఏర్పరుచుకోవాలి. చక్కెరను క్రమం తప్పకుండా ఉంచగలిగే కార్బొహేడ్రేట్ల మోతాదును, అందుకోసం తీసుకోవలసిన ఆహార మోతాదును నిర్ణయించుకోవాలి.



గ్లైసెమిక్ ఛాయిస్: రక్తంలోకి చక్కెరను నెమ్మదిగా విడుదల చేసే పదార్థాలను ఎంచుకోవాలి. అందుకోసం వీలైనంత తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉండే చిక్కుళ్లు, నాన్ స్టార్చీ కూరగాయలు, పాలిష్ పట్టని ధాన్యాలు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి.

పోర్షన్ కంట్రోల్: చక్కెర అదుపులో ఉండడం కోసం తీసుకుంటున్న ఆహార పరిమితి మీద నియంత్రణ ఉండాలి. లీన్ ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉండే పదార్థాలను పరిమితిలో తీసుకుంటూ ప్రాసెస్డ్ ఫుడ్స్ తీసుకోవడం మానేయాలి.

వచ్చే మార్చి నాటికి

హ్యుండయ్ క్రెటా ఈవీ

భవిష్యత్‌లో మరో 3 ఈవీలు సైతం.. ఐపీఓ పత్రాల్లో వెల్లడించిన కంపెనీ



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (జనవరి-మార్చి)లో క్రెటా ఎలక్ట్రిక్ వెర్షన్ సహా భవిష్యత్‌లో నాలుగు ఈవీ మోడళ్లను మార్కెట్లోకి ప్రవేశపెట్టనున్నట్లు హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్‌ఎంఐఎల్) తెలిపింది. మెగా పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు అనుమతి కోరుతూ సెబీకి సమర్పించిన ప్రాథమిక ముసాయిదా పత్రాల్లో (డీఆర్‌హెచ్‌పీ) కంపెనీ ఈ విషయాన్ని వెల్లడించింది. హ్యుండయ్‌కి చెందిన మిడ్ సైజ్ ఎస్‌యూవీ క్రెటా.. అత్యధికంగా అమ్ముడవుతున్న కంపెనీ మోడళ్లలో ఒకటి. 1996లో భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన హెచ్‌ఎంఐఎల్.. అన్ని విభాగాల్లో కలిపి 13 మోడళ్లను దేశీయ మార్కెట్లో విక్రయిస్తోంది. అందులో రెండు ఈవీలు కూడా ఉన్నాయి. ఐయోనిక్ క్యూ5 రేటు రూ.45 లక్షలు, కోనా ఎలక్ట్రిక్ ధర రూ.24 లక్షల స్థాయిలో ఉంది. ప్రస్తుతం ప్రీమియం ఎలక్ట్రిక్ కార్లనే విక్రయిస్తోన్న ఈ కంపెనీ ఇక అందుబాటు ధరల్లో లభించే ఈవీలను మార్కెట్లోకి తేవాలని భావిస్తోంది. ధర విషయంలో ఈవీ మోడళ్ల పోటీ సామర్థ్యాన్ని మరింత పెంచాలని చూస్తున్నట్లు కంపెనీ పేర్కొంది. ఇందులో భాగంగా సెల్స్, బ్యాటరీ ప్యాక్, పవర్ ఎలక్ట్రానిక్స్, డ్రైవ్‌ట్రైన్స్ వంటి కీలక విడిభాగాలను దేశీయంగా సేకరించడంతో పాటు స్థానిక ఈవీ సరఫరా వ్యవస్థను నిర్మించుకోవాలనుకుంటున్నట్లు తెలిపింది.

హెచ్‌ఎంఐఎల్ చెన్నైలోని తన ప్లాంట్‌లో కొంత భాగాన్ని ఈవీ బ్యాటరీల అసెంబ్లింగ్ కోసం మోబిస్‌కు లీజుకిచ్చింది. మోబిస్ కూడా హ్యుండయ్ గ్రూప్ కంపెనీయే. ఈ సంస్థ తయారు చేసే ఈవీ బ్యాటరీలను హెచ్‌ఎంఐఎల్‌కే సరఫరా చేస్తోంది. హ్యుండయ్ మోటార్‌కు బ్యాటరీ పాక్స్ సేకరణ వ్యయం గణనీయంగా తగ్గేందుకు ఇది దోహదపడనుంది. ఈవీ సరఫరా వ్యవస్థను స్థానికీకరించేందుకు మరిన్ని దేశీయ, అంతర్జాతీయ ఈవీ పవర్ ఎలక్ట్రానిక్ వెండార్లతో జతకట్టనున్నట్లు డీఆర్‌హెచ్‌పీలో హెచ్‌ఎంఐఎల్ పేర్కొంది. అంతేకాదు, ఈ మార్చి చివరినాటికి కంపెనీ దేశంలో 11 ఎలక్ట్రిక్ కార్ల చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. దేశంలో ఈవీల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు అన్ని నగరాలతో పాటు రహదారుల ప్రక్కన చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు కంపెనీ తెలిపింది.

హెచ్‌ఎంఐఎల్ గత వారాంతంలో సెబీకి డీఆర్‌హెచ్‌పీ సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ 17.5 శాతం వాటాకు సమానమైన 14,21,94,700 ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. తద్వారా కనీసం రూ.25,000 కోట్లు సమీకరించే అవకాశం ఉంది. అదే గనుక జరిగితే, దేశంలో ఇదే అతిపెద్ద పబ్లిక్ ఆఫరింగ్ కానుంది. గతంలో ఐపీఓ ద్వారా ఎల్‌ఐసీ సమీకరించిన రూ.21,000 కోట్ల మొత్తాన్ని మించిపోనుంది. అంతేకాదు, రెండు దశాబ్దాలకు పైగా కాలంలో ఐపీఓకు రాబోతున్న కార్ల కంపెనీ కూడా ఇదే. చివరగా, 2003లో మారుతి సుజుకీ ఇండియా పబ్లిక్ ఇష్యూకు వచ్చింది.

రూ.21 లక్షల కోట్లకు..

» ఐదేళ్లలో రెట్టింపు కానున్న ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ

న్యూఢిల్లీ: దేశంలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ వచ్చే ఐదేళ్లలో రెట్టింపై 25,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.21 లక్షల కోట్లు) స్థాయికి చేరుకోవచ్చని ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు అన్నారు. ప్రస్తుతం దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీ 12,500-13,000 కోట్ల డాలర్ల స్థాయిలో ఉంది. అంతేకాదు, నిరుద్యోగ సమస్య పరిష్కారాల్లో భాగంగా ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో భారీగా ఉద్యోగాల కల్పన జరిగేందుకు దోహదపడాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రిత్వ వర్గాలు తెలిపాయి. ఈ రంగంలో ప్రస్తుతం 25 లక్షల మంది పనిచేస్తుండగా.. వచ్చే ఐదేళ్లలో ఈ సంఖ్యను 50 లక్షలకు పెంచాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలు పథకాల ద్వారా రూ.76,000 కోట్ల విలువైన ప్రోత్సాహకాలను ప్రకటించింది.

◆ సాలిడ్ సర్ఫేస్ తయారీదారు డ్యూరాలక్స్ టాప్ సర్ఫేస్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 19న ప్రారంభమై 21న ముగియనుంది. ఇష్యూలో భాగంగా ఒక్కో షేరు ధరను రూ.65-68గా ఖరారు చేసింది. కొత్తగా 42 లక్షల షేర్లను జారీ చేయటం ద్వారా రూ.28.56 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.12.24 కోట్ల విలువైన 18 లక్షల షేర్లను కంపెనీ సమీకరించనుంది.

సబ్బులు, హెయిర్ ఆయిల్స్

ధరలు పైపైకి

» ఎఫ్ఎంసీజీ కంపెనీలపై ఖర్చుల భారం

» ఆ భారమంతా వినియోగదారులకు బదిలీ

» 2 నుంచి 17% వరకు వడ్డింపు

న్యూఢిల్లీ: నిత్య జీవితంలో విరివిగా ఉపయోగించే ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) ఉత్పత్తులు మరింత భారంగా మారాయి. వీటిని ఉత్పత్తి చేసే కంపెనీలు గత రెండు మూడు నెలల్లో వీటి ధరలను 2 నుంచి 17 శాతం వరకు పెంచేశాయి. ముడి పదార్థాల ధరలు పెరిగినందున, అందులో కొంతైనా వినియోగదారులకు బదిలీ చేయక తప్పలేదని కంపెనీలు చెబుతున్నాయి. దీంతో సబ్బులు, బాడీ వాష్‌లు, హెయిర్ ఆయిల్స్, ఎంపిక చేసిన



కొన్ని ఆహార ఉత్పత్తుల ధరలు మరింత భారంగా మారాయి. తమ లాభాలను కాపాడుకునేందుకు ధరల పెంపు తప్పడం లేదని కంపెనీలు చెబుతున్నాయి.

ఎంత భారమంటే ?

గత రెండు నెలల్లో సబ్బులు, బాడీ వాష్‌ల ధర 2 నుంచి 9 శాతం పెరిగాయి. హెయిర్ ఆయిల్స్ ధర 8 నుంచి 11 శాతం పెరిగింది. కొన్ని ఆహార ఉత్పత్తుల ధరలను కంపెనీలు 3 నుంచి 17 శాతం పెంచేశాయి. కీలక ముడి పదార్థాల ధరలు తగ్గడంతో గత ఏడాది కాలంగా ఎఫ్ఎంసీజీ కంపెనీలు ధరల పెంపునకు విరామం ప్రకటించాయి. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం పామాయిల్ ధర తక్కువగానే ఉంది. అయితే పాలు, పంచదార, కాఫీ, కొబ్బరి, బార్లీ వంటి ప్రధాన ముడి పదార్థాల ధరలు మాత్రం పెరిగాయి. దీంతో తమ ఉత్పత్తుల ధర పెంచడం ద్వారా ఎఫ్ఎంసీజీ కంపెనీలు ఆ ఒత్తిడి తట్టుకుంటున్నాయి.

రూ.89,000 కోట్లు..

» 2023-24లో యూఏఈ నుంచి దిగుమతైన బంగారం, వెండి మొత్తమిది

న్యూఢిల్లీ: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుంచి భారత్‌కు పసిడి, వెండి దిగుమతులు భారీగా పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఈ దేశం నుంచి మన దేశానికి 1,070 కోట్ల డాలర్ల (సుమారు రూ.89,000 కోట్లు) విలువైన బంగారం, వెండి దిగుమతయ్యాయి. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 210% ఎక్కువ. భారత-యూఏఈ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) ఇందుకు ప్రధాన కారణం. ఈ ఒప్పంద కింద మన దేశం.. యూఏఈ నుంచి దిగుమతయ్యే వెండి మీద 7%, బంగారంపై 1% దిగుమతి సుంకం రాయితీ కల్పిస్తోంది. ఈ ఒప్పందం కింద ఎంత వెండినైనా 7% సుంకం రాయితీతో దిగుమతి చేసుకోవచ్చు. బంగారం దిగుమతులను మాత్రం 160 టన్నులకు పరిమితం చేశారు. దీంతో యూఏఈ నుంచి పెద్ద ఎత్తున వెండి దిగుమతవుతోంది.

డిపాజిట్లపై వడ్డీ రేట్లు పెంచం

» పరపతి వృద్ధికి ఢోకా లేదు

» ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ ఖారా

న్యూఢిల్లీ: డిపాజిట్లపై ప్రస్తుతానికి వడ్డీ రేట్లు పెంచే యోచన లేదని దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ ప్రకటించింది. బ్యాంక్ చైర్మన్ దినేశ్ ఖారా ఈ విషయం స్పష్టం చేశారు. ప్రామాణిక నగదు నిల్వల నిష్పత్తి (ఎస్ఎల్ఆర్) ఉండాల్సిన దానికంటే రూ.3.5 లక్షల కోట్ల నుంచి 4 లక్షల కోట్లు అధికంగా ఉన్నందున, ప్రస్తుతం తమకు ఎలాంటి నిధుల కొరత లేదన్నారు. ఈ కారణంగా వడ్డీ రేట్లు పెంచి, అదనంగా డిపాజిట్లు సేకరించాల్సిన అవసరం లేదన్నారు. అయినా గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం డిపాజిట్లు 12-13% పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం తమ రుణాల మంజూరు వృద్ధి రేటు 14 నుంచి 15% వరకు ఉంటుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం స్థూల, నికర మొండి బకాయిలు మరింత తగ్గే అవకాశం ఉందన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,330 ▼	66,300 ▼	95,700 ▲
ముంబై	71,866 ▲	65,829 ▲	87,833 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

18వ తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	480
వరంగల్	497	గోదావరి	475
చిత్తూరు	553	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	139	విజయవాడ	145
వరంగల్	139	గుంటూరు	145
కరీంనగర్	139	ఒంగోలు	145
మహబూబ్‌నగర్	139	చిత్తూరు	140
కర్నూలు	139	నెల్లూరు	140
విశాఖపట్నం	136	అనంతపురం	145
గోదావరి	145		

తిరుపతిలో ఎకో హోటల్

ముంబై: ఎకో హోటల్స్ అండ్ రిసార్ట్స్ కంపెనీ తన హోటల్ చెయిన్‌ను విస్తరిస్తోంది. ఇందులో భాగంగా కొత్తగా తిరుపతి, వారణాసి, హుబ్లీ, అమృత్‌సర్, గోవా, మనాలీ, నోయిడా, ఉదయపూర్, మైసూర్, చెన్నై నగరాలకు విస్తరిస్తోంది. ఇందుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. పర్యావరణానికి హాని లేకుండా, జీరో కాలుష్య ప్రమాణాలతో హోటల్స్ నిర్వహించడం ఎకో హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రత్యేకత. వచ్చే పదేళ్లలో 15,000 రూమ్స్‌తో దేశంలోని ప్రముఖ నగరాల్లో హోటల్స్ ఏర్పాటు చేయాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.

◆ కేబీసీ గ్లోబల్ లిమిటెడ్ (గతంలో కర్దా కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్).. ఆఫ్రికా మార్కెట్లోకి ప్రవేశించింది. తూర్పు ఆఫ్రికాలో రైల్వే, ఫైవ్ స్టార్ హోటల్స్ నిర్మాణంలో కీలకంగా ఉన్న సీఆర్‌జేఈ నుంచి 2 కోట్ల డాలర్ల విలువైన కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. కంపెనీ అనుబంధ సంస్థ కర్దా ఇంటర్నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఈ కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది.

◆ డ్రోన్ లాజిస్టిక్ సొల్యూషన్స్ ప్రొవైడర్ స్కై ఎయిర్.. సిరీస్ ఏ ఫండింగ్‌లో భాగంగా రూ.34 కోట్ల నిధులను సమీకరించింది. హైదరాబాద్ ఏంజెల్స్, మౌంట్ జూడి వెంచర్స్, వెంచర్ క్యాటలిస్ట్, సూనీకార్న్ వెంచర్స్ వంటి సంస్థల నుంచి ఈ మొత్తాలను సమీకరించింది.

గరిష్ఠ స్థాయిల్లో నిరోధం!

ఈ వారం స్టాక్ మార్కెట్ సూచీలు మిశ్రమంగా కదలాడే అవకాశం ఉంది. సూచీలు ఇప్పటికే గరిష్ఠ స్థాయిలకు చేరటంతో స్వల్ప పుల్‌బ్యాక్‌కు వీలుంది. ఒకవేళ అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు వస్తే మరింత పెరుగుతాయి. ఈ వారం నిఫ్టీకి 23,250 వద్ద మద్దతు స్థాయి, 23,500 వద్ద నిరోధ స్థాయిలున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

ఐషర్ మోటార్స్: మూడు నెలల నుంచి అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ కౌంటర్‌లో ఈ మధ్యనే పుల్‌బ్యాక్ వచ్చింది. అయితే మళ్లీ జోరందుకుని సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని అధిగమించింది. నిఫ్టీతో పోల్చితే మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. గత శుక్రవారం 2.78 శాతం లాభంతో రూ.4,935 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.4,900 స్థాయిల్లో ప్రవేశించి రూ.5,050/5,150 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,840 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టైటాన్: ఫిబ్రవరి నుంచి డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తున్న ఈ షేరు మళ్లీ పుంజుకుంటోంది. వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. రూ.3,200 స్థాయిలో డబుల్ బాటమ్ ఏర్పడింది. గత శుక్రవారం ఈ షేరు 1.67 శాతం లాభంతో రూ.3,530 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.3,510/3,520 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.3,660/3,750 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,475 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సిప్లా: గడచిన ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసిక ఫలితాల అనంతరం ఈ షేరు బలంగా పుంజుకుంది. రూ.1,330 స్థాయిలో డబుల్ బాటమ్ ఏర్పడిన తర్వాత డెలివరీ వాల్యూమ్ విపరీతంగా పెరిగింది. గత శుక్రవారం రూ.1,564 వద్ద జీవితకాల గరిష్ఠాన్ని బ్రేక్ చేసి చివరకు 1.39 శాతం లాభంతో రూ.1,566 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.1,550/1,540 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.1,665/1,725 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,525 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ లైఫ్: జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ కౌంటర్‌లో 16 శాతం మేరకు కరెక్షన్ జరిగింది. ఈ నెల 5 నుంచి మెరుగైన ట్రేడింగ్ వాల్యూమ్‌తో షేర్లు పుంజుకుంటున్నాయి. రిలేటివ్ స్ట్రెంత్ కూడా పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు 1.38 శాతం లాభంతో రూ.1,469 వద్ద స్థిరపడింది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.1,460 స్థాయిలో ఎంటరై రూ.1,550/1,670 టార్గెట్ ధరతో పొజిషన్ తీసుకునే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,430 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఇండియా హోటల్స్: ఈ షేరుకు చాలా సానుకూలతలు కనిపిస్తున్నాయి. క్రితం వారం ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని బ్రేక్ చేసింది. భారీ వాల్యూమ్‌తో షేరు ధరల పెరుగుతోంది. మరోసారి జీవితకాల గరిష్ఠాన్ని అధిగమించే దిశగా సాగుతోంది. గత శుక్రవారం 4.17% లాభంతో రూ.613 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.600/575 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని 650/690 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.545 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి

స్పోర్ట్స్

టీ20 ప్రపంచకప్‌లో నేడు
వెస్టిండీస్ x అఫ్ఘానిస్థాన్ (ఉ. 6. గం.)



ఫెర్గూసన్ (4-4-0-3)

ఫెర్గూసన్ రికార్డు

- 24 డాట్ బాల్స్‌తో 3 వికెట్లు
- పీఎన్‌జీపై న్యూజిలాండ్ విజయం

టరౌబా (ట్రినిడాడ్): న్యూజిలాండ్ పేసర్ లోకీ ఫెర్గూసన్ (4-4-0-3) చరిత్ర సృష్టించాడు. టీ20 వరల్డ్ కప్ టోర్నీలో నాలుగు ఓవర్ల కోటాలో ఒక్క పరుగు కూడా ఇవ్వకుండానే మూడు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా నిలిచాడు. అతడి అద్భుత ప్రదర్శనతో సోమవారం గ్రూప్ 'సి'లో జరిగిన ఆఖరి మ్యాచ్‌లో కివీస్ 7 వికెట్ల తేడాతో పపువా న్యూగినీపై నెగ్గింది. ఓవరాల్‌గా అంతర్జాతీయ టీ20ల్లో కెనడా కెప్టెన్ సాద్ బిన్ జఫార్ పనామాపై 2021లోనే ఈ ఫీట్ సాధించాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పీఎన్‌జీ 19.4 ఓవర్లలో 78 పరుగులకే కుప్పకూలింది. అమిని (17), వనువా (14) రాణించారు. సౌథీ, బౌల్ట్, సోధీలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో కివీస్ 12.2 ఓవర్లలో 3 వికెట్లకు 79 పరుగులు చేసి గెలిచింది. కాన్వే (35), మిచెల్ (19 నాటౌట్), విలియమ్సన్ (18 నాటౌట్) ఆకట్టుకున్నారు.



సుమిత్ @ 71

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ సింగిల్స్ స్టార్ సుమిత్ నగల్ కెరీర్‌లో బెస్ట్ ర్యాంక్ సాధించాడు. గతవారం 77వ ర్యాంకులో నిలిచిన సుమిత్.. సోమవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో 71వ స్థానానికి ఎగబాకాడు. గత వారం పెరూగియా టోర్నీలో రన్నరప్‌గా నిలవడంతో 26 ఏళ్ల సుమిత్ ర్యాంక్ మెరుగైంది. భారత్ నుంచి సింగిల్స్ టాప్ ర్యాంకర్‌గా కొనసాగుతున్న సుమిత్.. పారిస్ ఒలింపిక్స్‌కు ఇప్పటికే ఎంపికైన సంగతి తెలిసిందే.



తన్‌జీమ్ (4-2-7-4)



ముస్తాఫిజుర్ (4-1-7-3)

బంగ్లా.. ఘనంగా

సూపర్-8కు అర్హత

చెలరేగిన తన్‌జీమ్, ముస్తాఫిజుర్ ● నేపాల్ చిత్తు

కింగ్స్‌టౌన్: బౌలర్ల అద్భుత రాణింపుతో బంగ్లాదేశ్ జట్టు టీ20 వరల్డ్‌కప్ సూపర్-8లో ప్రవేశించింది. తమ స్వల్ప స్కోరును కాపాడే క్రమంలో బంగ్లా పేసర్లు తన్‌జీమ్ హసన్ షకీబ్ (4-2-7-4), ముస్తాఫిజుర్ (4-1-7-3) కళ్లు చెదిరే గణాంకాలు నమోదు చేశారు. దీంతో సోమవారం గ్రూప్ 'డి'లో నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో 21 పరుగుల తేడాతో విజయాన్నందుకుంది. అలాగే ఈ మెగా టోర్నీ చరిత్రలో తక్కువ స్కోరును కాపాడుకున్న తొలి జట్టుగా బంగ్లా నిలవడం విశేషం. ఆరు పాయింట్లతో తమ గ్రూప్ నుంచి సౌతాఫ్రికా తర్వాత సూపర్-8లో ప్రవేశించిన రెండో జట్టుగా నిలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాను నేపాల్ బౌలర్లు వణికించడంతో 19.3 ఓవర్లలో 106 పరుగులకు ఆలౌటైంది. వీరి ఇన్నింగ్స్‌లో షకీబ్ (17) టాప్ స్కోరర్ కావడం గమనార్హం. పవర్‌ప్లేలోనే ఈ జట్టు 30/4 స్కోరుతో కష్టాల్లో పడింది. ఆ తర్వాత కూడా బ్యాటర్లకు ఇబ్బంది తప్పలేదు. ఆఖరి వికెట్‌కు టస్కిన్ (12 నాటౌట్), ముస్తాఫిజుర్ (3) 18 పరుగులు జత చేయడంతో అతి కష్టమ్మీద స్కోరు వంద పరుగులు దాటగలిగింది. సోమ్‌పాల్ కమి, లామిచానె, రోహిత్, దీపేంద్రలకు రెండేసి వికెట్లు దక్కాయి.

పేసర్ల హవా: దక్షిణాఫ్రికాపై ఒక్క పరుగు తేడాతో ఓడిన నేపాల్.. ఈసారి స్వల్ప ఛేదనలో బంగ్లాకు షాక్ ఇవ్వగలదని అంచనా వేశారు. కానీ ప్రత్యర్థి పేసర్ల తడాఖాతో 19.2 ఓవర్లలో 85 పరుగులే చేసి ఓడింది. తన్‌జీమ్ అద్భుత బౌలింగ్‌తో టాపార్డర్ పనిబట్టడంతో పవర్‌ప్లేలో 24/4 స్కోరుతో ఇబ్బందుల్లో పడింది. అయితే మిడిలార్డర్‌లో కుశాల్ మల్ల (27), దీపేంద్ర సింగ్ (25) పోరాటంతో ఆశలు రేపారు. కానీ 24 బంతుల్లో 30 పరుగులు కావాల్సిన వేళ 17వ ఓవర్‌లో కుశాల్‌ను ముస్తాఫిజుర్ అవుట్ చేశాడు. దీంతో ఆరో వికెట్‌కు 52 పరుగుల కీలక భాగస్వామ్యం ముగియడంతో పాటు చివరి వికెట్లు టపటపా నేలకూలాయి. ఏకంగా ఎనిమిది మంది సింగిల్ డిజిట్‌కే పరిమితం కాగా.. చివరి నలుగురు డకౌట్లుగా వెనుదిరగడం గమనార్హం.

సంక్షిప్త స్కోర్లు

బంగ్లాదేశ్: 19.3 ఓవర్లలో 106 ఆలౌట్ (షకీబ్ 17, రిషద్ 13, మహ్మదుల్లా 13; సోమ్‌పాల్ 2/10, లామిచానె 2/17, రోహిత్ 2/20, దీపేంద్ర 2/22).
నేపాల్: 19.2 ఓవర్లలో 85 ఆలౌట్ (కుశాల్ 27, దీపేంద్ర 25, ఆసిఫ్ 17;తన్‌జీమ్ 4/7, ముస్తాఫిజుర్ 3/7, షకీబ్ 2/9).



బార్బడోస్‌లోని బీచ్‌లో వాలీబాల్ ఆడుతున్న టీమిండియా క్రికెటర్లు విరాట్, రింకూ సింగ్

ఇక.. 'సూపర్' మజా

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

టీ20 ప్రపంచకప్‌లో ఇక కీలక సమరానికి వేళైంది. మొత్తం 20 జట్లు పోటీపడ్డ ఈ మెగా టోర్నమెంట్‌లో పేలవ ప్రదర్శన చేసిన 12 జట్లు గ్రూప్ దశలోనే వెనుదిరిగాయి. అత్యుత్తమంగా రాణించిన జట్లు సూపర్-8 పోరుకు అర్హత సాధించాయి. బుధవారం నుంచి జరిగే ఈ సూపర్ ఫైట్‌లో పోటీపడే ఆ జట్లు ఏంటన్నది ఇప్పటికే ఖరారయ్యాయి. ఈ ఎనిమిది జట్లు రెండు గ్రూపులుగా విడిపోయి తలపడతాయి. ఇకపోతే..సూపర్-8 దశ గ్రూపులను ప్రిలిమినరీ పోటీల సందర్భంగా ఆయా జట్లకు కేటాయించిన సీడింగ్‌ల ఆధారంగా నిర్ణయించారు. దీని ప్రకారం ఎ1గా భారత్, ఎ2గా పాకిస్థాన్, ఇంగ్లండ్ బి1, ఆస్ట్రేలియా బి2, న్యూజిలాండ్ సి1, వెస్టిండీస్ సి2, దక్షిణాఫ్రికా డి1, శ్రీలంక డి2గా టోర్నీకి ముందు లీగ్ దశలో పోటీపడ్డాయి. లీగ్ దశలో గ్రూప్-ఎ నుంచి భారత్, అమెరికా.. గ్రూప్-బి నుంచి ఇంగ్లండ్, ఆస్ట్రేలియా.. గ్రూప్-సి నుంచి అఫ్ఘానిస్థాన్, వెస్టిండీస్.. గ్రూప్-డి నుంచి దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ సూపర్-8లో ప్రవేశించాయి. భారత్, అఫ్ఘానిస్థాన్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ జట్లను గ్రూప్-1గా... అమెరికా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, వెస్టిండీస్ జట్లను గ్రూప్-2గా విభజించారు. ఇందులో ఒక్కో జట్టు ప్రత్యర్థితో ఒక్కో మ్యాచ్ ఆడాల్సి ఉంటుంది. అంటే.. ప్రతి జట్టు మూడేసి మ్యాచ్‌లు ఆడతాయి. దీంతో ప్రతి గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్ చేరతాయి. సూపర్-8లో భాగంగా టీమిండియా తన పోరును అఫ్ఘానిస్థాన్‌తో ఈనెల 20న ప్రారంభించనుంది. తర్వాతి మ్యాచ్‌ను బంగ్లాదేశ్‌తో 22న, చివరి మ్యాచ్‌ను ఆస్ట్రేలియాతో 24న ఆడనుంది. కాగా, సూపర్-8 మ్యాచ్‌లన్నీ వెస్టిండీస్ వేదికగానే జరగనున్నాయి.

సూపర్-8 షెడ్యూల్

తేదీ	మ్యాచ్	సమయం
జూన్ 19	దక్షిణాఫ్రికా x అమెరికా	రా. 8 గం.
జూన్ 20	ఇంగ్లండ్ x వెస్టిండీస్	ఉ. 6 గం.
జూన్ 20	భారత్ x అఫ్ఘానిస్థాన్	రా. 8 గం.
జూన్ 21	ఆస్ట్రేలియా x బంగ్లాదేశ్	ఉ. 6 గం.
జూన్ 21	ఇంగ్లండ్ x దక్షిణాఫ్రికా	రా. 8 గం.
జూన్ 22	వెస్టిండీస్ x అమెరికా	ఉ. 6 గం.
జూన్ 22	భారత్ x బంగ్లాదేశ్	రా. 8 గం.
జూన్ 23	అఫ్ఘానిస్థాన్ x ఆస్ట్రేలియా	ఉ. 6 గం.
జూన్ 23	ఇంగ్లండ్ x అమెరికా	రా. 8 గం.
జూన్ 24	వెస్టిండీస్ x దక్షిణాఫ్రికా	ఉ. 6 గం.
జూన్ 24	భారత్ x ఆస్ట్రేలియా	రా. 8 గం.
జూన్ 25	అఫ్ఘానిస్థాన్ x బంగ్లాదేశ్	ఉ. 6 గం.

గ్రూప్-1
భారత్, ఆస్ట్రేలియా, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్

గ్రూప్-2
అమెరికా, ఇంగ్లండ్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా



జూడ్ బెలింగ్‌హామ్

యూరో చాంపియన్‌షిప్

జెల్సెన్‌కిర్చెన్ (జర్మనీ): స్టార్ మిడ్‌ఫీల్డర్ జూడ్ బెలింగ్‌హామ్ కొట్టిన ఏకైక గోల్‌తో యూరోపియన్ చాంపియన్‌షిప్‌ను ఇంగ్లండ్ విజయంతో ఆరంభించింది. గ్రూప్ 'సీ'లో ఆదివారం అర్ధ రాత్రి జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 1-0తో సెర్బియాపై విజయం సాధించింది. 13వ నిమిషంలో వింగర్ బుకాయో సాకా నుంచి అందుకున్న పాస్‌ను జూడ్..హెడర్‌తో గోల్‌పోస్టులోకి పంపాడు. ఈ మ్యాచ్‌తో బెలింగ్‌హామ్ రికార్డుపుటలకెక్కాడు. 21 ఏళ్ల లోపే (20 ఏళ్ల 353 రోజులు) మూడు పెద్ద అంతర్జాతీయ టోర్నమెంట్లు ఆడిన తొలి యూరప్ ఆటగాడిగా జూడ్ రికార్డు నెలకొల్పాడు. 2020 యూరోపియన్ చాంపియన్‌షిప్‌లో ఆడిన అతడు 2022 ఫిఫా వరల్డ్ కప్‌లోనూ పాల్గొన్నాడు. ప్రస్తుతం మళ్లీ యూరో చాంపియన్‌షిప్ బరిలో దిగాడు. గ్రూప్ 'ఈ'లో రొమేనియా 3-0తో ఉక్రెయిన్‌ను చిత్తు చేసింది. కాగా, ఇదే గ్రూప్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో స్లోవేకియా 1-0తో బెల్జియం జట్టుకు షాకిచ్చింది.



ఫుట్‌బాల్ కోచ్ స్టిమాక్‌పై వేటు

న్యూఢిల్లీ: ఫిఫా వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు పేలవ ప్రదర్శన నేపథ్యంలో చీఫ్ కోచ్ ఇగోర్ స్టిమాక్‌పై వేటుపడింది. అతడి కాంట్రాక్ట్ మరో ఏడాది మిగిలుండగానే బాధ్యతల నుంచి తప్పించినట్టు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) సోమవారం ప్రకటించింది. 2019లో స్టిమాక్‌ను భారత జట్టు కోచ్‌గా నియమించారు. గత అక్టోబరులో అతడి పదవీ కాలాన్ని 2026 వరకు పొడిగించారు. అయితే, అకస్మాత్తుగా తప్పించడంతో.. అగ్రిమెంట్ నిబంధనల ప్రకారం నష్టపరిహారం కింద స్టిమాక్‌కు రూ. 3 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది.

భారత సాఫ్ట్ టెన్నిస్ బృందంలో ఆరోన్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): కొరియా కప్ కోసం ప్రకటించిన భారత సాఫ్ట్ టెన్నిస్ బృందంలో అనంతపురానికి చెందిన ఆరోన్ రొనాల్డిన్‌కు చోటు లభించింది. ఈనెల 18 నుంచి 23 వరకు దక్షిణ కొరియాలోని ఇంచియాన్‌లో జరగనున్న ఈ పోటీల్లో ఆరోన్ సింగిల్స్ బరిలోకి దిగనున్నాడు. ఆరోన్‌కు ఇదే తొలి అంతర్జాతీయ టోర్నీ.

లంకకు ఓదార్పు

గ్రోస్ ఐస్‌లెట్ (సెయింట్ లూసియా): ఎట్టకేలకు సత్తాచాటిన శ్రీలంక.. టీ20 వరల్డ్‌కప్‌ను విజయంతో ముగించింది. గ్రూప్-డిలో సోమవారం జరిగిన తమ ఆఖరి, నామమాత్రపు మ్యాచ్‌లో లంక 83 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌ను చిత్తు చేసింది. తొలుత లంక 20 ఓవర్లలో 201/6 స్కోరు చేసింది. కుశాల్ మెండిస్ (46), అసలంక (46), ధనంజయ డిసిల్వ (34), ఏంజెలో మాథ్యూస్ (30 నాటౌట్) దాటిగా ఆడారు. వాన్ బీక్ 2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో నెదర్లాండ్స్ 16.4 ఓవర్లలో 118 పరుగులకు కుప్పకూలింది. మైకేల్ లెవిట్ (31), స్కాట్ ఎడ్వర్డ్స్ (31) టాప్ స్కోరర్లు. తుషార 3 వికెట్లు పడగొట్టగా.. హసరంగ, పతిరన చెరో 2 వికెట్లు దక్కించుకొన్నారు. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిన లంక సూపర్-8 నుంచి అవుటైన సంగతి తెలిసిందే.


ఐకమత్యం లేదు..

అది జట్టా?



పాక్‌పై కోచ్ కిర్‌స్టెన్ విమర్శలు

న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్‌లో గ్రూప్ దశలోనే ఇంటిముఖం పట్టిన పాకిస్థాన్ జట్టుపై చీఫ్ కోచ్ గ్యారీ కిర్‌స్టెన్ తీవ్ర విమర్శలు చేశాడు. పాక్ టీమ్‌లో ఐకమత్యమే లేదన్నాడు. తన సుదీర్ఘ కోచింగ్ కెరీర్‌లో ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ ఎదురుకాలేదని చెప్పాడు. 'పాక్ టీమ్‌లో ఒక్కొక్కరిది ఒకో దారి. వారిలో ఐకమత్యం లేదు.. కానీ జట్టు అని పిలుస్తుంటారు. ఎన్నో టీమ్‌లతో పని చేశా. ఎన్నడూ ఇలాంటి అనుభవం ఎదురుకాలేదని కిర్‌స్టెన్ అన్నాడు. మిగతా అగ్రశ్రేణి జట్లతో పోల్చితే నైపుణ్యాల పరంగా పాక్ ఎంతో వెనుకబడిందని చెప్పాడు.

బక్రీద్ సందర్భంగా మంగళగిరిలోని అంజుమన్-ఇ-హిమాయతుల్ ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్

ఉండవల్లి నివాసంలో నిర్వహించిన బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు

పవన్‌కు ఇరిగేషన్ గెస్ట్‌హౌస్

- డిప్యూటీ సీఎం క్యాంపు ఆఫీసుకు విశాల ప్రాంగణం

అమరావతి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ క్యాంప్ కార్యాలయంగా ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌ను ప్రభుత్వం కేటాయించింది. విజయవాడలోని సూర్యారావుపేటలో ఉన్న ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌ను గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో దేవినేని ఉమా జలవనరుల మంత్రిగా ఉన్నప్పుడు విశాలంగా నిర్మించారు. తర్వాత గత ప్రభుత్వంలో మంత్రి బొత్స సత్యనారాయణకు ఈ గెస్ట్‌హౌస్‌ను కేటాయించారు. అలాగే, సచివాలయంలో గతంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పేషీ ఐదో బ్లాక్‌లో ఉండేది. ఇప్పుడు పవన్‌తో పాటు జనసేన మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్‌కు కూడా రెండో బ్లాక్‌లో మొదటి అంతస్తులో కేటాయించారు. ఇప్పటికే ఈ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లో పేషీని మంత్రి నారాయణకు అప్పగించారు. సీఎం పేషీ ఒకటో బ్లాక్ వద్ద ఉండటంతో, పవన్ పేషీలు రెండోబ్లాక్‌లో ఉంటే అందుబాటులో ఉంటుందని ఆ మేరకు కేటాయింపులు చేసినట్లు తెలుస్తోంది. కాగా, ప్రతి పండగలోనూ గొప్ప ధార్మిక సందేశం, విశిష్టత నిబిడీకృతమై ఉంటుందని పవన్ అన్నారు. ఇస్లాంమతంలో విశ్వాసం ఉన్నవారు రంజాన్‌ను ఎంత భక్తి, శ్రద్ధలతో జరుపుకుంటారో బక్రీద్ పండుగను కూడా అంతే నిష్ఠతో చేసుకొంటారని గుర్తుచేశారు. ప్రవక్త మహ్మద్ త్యాగనిరతిని స్మరించుకుంటూ నిర్వహించుకునే పండుగ ముస్లింలందరికీ భగవదనుగ్రహం కలుగచేయాలని ఆకాంక్షించారు.

ఈఎన్‌సీ కార్యాలయాన్ని ప్రక్షాళన చేయండి

- మంత్రి పవన్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ సప్లయ్ కాంట్రాక్టర్ల ఫిర్యాదు

విజయవాడ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఈఎన్‌సీ కార్యాలయం పరిధిలో భారీ ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌కు సోమవారం ఈ మెయిల్ ద్వారా ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్లు ఫిర్యాదు చేశారు. గురు, శుక్రవారాలలో పవన్‌ను నేరుగా కలిసి ఫిర్యాదు అంశాలపై చర్చించనున్నారు. ఈఎన్‌సీ కార్యాలయంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ స్టేట్ వాటర్ శానిటేషన్ (పీడీఎస్‌డబ్ల్యూఎస్‌ఎం) అకౌంట్‌లో భారీ అక్రమాలు జరిగాయని ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్లు గారపాటి సూర్యకిరణ్ , మొవ్వా సుబాకర్ ఫిర్యాదు చేశారు.

ప్రమాణం చేసి చెబుతున్నా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం

- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు
- రోజూ 18 గంటలు పనిచేస్తా: రాష్ట్ర మంత్రి అచ్చెన్న



కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్న తొలిసారి సొంత జిల్లా శ్రీకాకుళానికి వచ్చిన సందర్భంగా పోటెత్తిన అభిమానులు

శ్రీకాకుళం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని కేంద్రవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. మంత్రి పదవులు చేపట్టాక తొలిసారిగా సోమవారం రాత్రి జిల్లాకు వచ్చిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ముందుగా నగరంలో భారీర్యాలీ చేపట్టారు. కార్యకర్తలు, ప్రజలు గజమాలతో వారిని సత్కరించారు. అనంతరం ఎన్టీఆర్ ఎంహెచ్ స్కూల్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో రామ్మోహన్‌నాయుడు ప్రసంగించారు. 'రాష్ట్రంలో ఉన్న అన్ని ఎయిర్‌పోర్టులతో పాటుగా భోగాపురం ఎయిర్‌పోర్టును వేగవంతంగా పూర్తిచేస్తాం. రైల్వేపరంగా ఉన్న సమస్యలను కూడా పరిష్కరిస్తా' అన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ 'ప్రస్తుతం ఖజానాలో పైసా లేదు. అంతా ఖాళీ చేసేశారు. అయితే ప్రజలు ఆందోళన చెందనవసరంలేదు. ఐదారు మాసాల్లో చంద్రబాబు రాష్ట్రాన్ని అగ్రగామిగా తీసుకువెళ్తారు. ఇప్పుడు కేంద్రప్రభుత్వం కూడా మనతో ఉంది. రోజుకు 18గంటలు శ్రమిస్తా. ఒకే కుటుంబంలో కేంద్రమంత్రి, రాష్ట్ర మంత్రి పదవి ఇవ్వడమన్నది చిన్న విషయం కాదు' అని పేర్కొన్నారు.

అగ్రి గోల్డ్ భూములతో దందా!

మొదటి పేజీ తరువాయి)

పోలవరపు మురళీమోహన్‌కు అమ్మారు. ఆయన మహాలక్ష్మీ ప్రాపర్టీస్ అండ్ ఇన్వెస్టిమెంట్స్‌కు చెందిన అడుసుమిల్లి మోహన రామదాసుకు 3,800 గజాలు విక్రయించారు. ఈ మోహన రామదాసు నుంచి 2022లో జోగి వెంటేశ్వరరావు, జోగి రాజీవ్‌లు 2,160 గజాలు కొనుగోలు చేసి వెంటనే 200 గజాలు ప్లాట్లుగా వేసి ఏడుగురు వ్యక్తులకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఇక్కడే జోగి కుటుంబం తెలివితేటలు ఉపయోగించింది. సర్వే నం.88లో కొనుగోలు చేసినట్లుగా చూపిన భూమి దస్తావేజుల్లో తప్పు దొర్లిందని పేర్కొంటూ 2023లో స్వీయ సవరణ చేయించారు. ఆ సమయంలో అగ్రి గోల్డ్ భూములున్న సర్వే నం.87ను అసలుదిగా పేర్కొన్నారు. అంటే సర్వే నం.87లోని భూమి కొనుగోలు అంతా ఉత్తుత్తి డ్రామా అని వీరి ఎత్తుగడ అగ్రి గోల్డ్ భూమిని కాజేయడమేనని అర్థమవుతోంది. వీరు కొనుగోలుదారులకు విక్రయించినది కూడా అగ్రి గోల్డ్‌కు చెందిన భూమి కావడం గమనార్హం. అసలు విషయం తెలియక కొనుగోలుదారులు సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న భూమిని కొనుగోలు చేసి మునిగిపోయారు. విక్రయించగా మిగిలిన 800గజాల్లో జోగి కుటుంబం ప్రహరీ నిర్మించుకునే ప్రయత్నంలో ఉండగా అగ్రి గోల్డ్‌కు చెందిన అవ్వా వెంకట శేష నారాయణ రావు విజయవాడ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల ఫిర్యాదు అనంతరం విజయవాడ రూరల్ తహశీల్దార్ నివేదిక మేరకు వివాదా స్పద అగ్రి గోల్డ్ భూముల్ని జోగి కుటుంబం విక్రయించినట్లు స్పష్టమవుతోంది.

రుషికొండ ప్యాలెస్ వెనుక మరెన్నో విషయాలు

- ఇలాంటి కట్టడాలు ఇంకా ఉన్నాయి
- వంద రోజుల్లో గంజాయి అరికట్టేలా ఆదేశాలు: మంత్రి లోకేశ్

మంగళగిరి సిటీ, జూన్ 17: విశాఖలోని రుషికొండ ప్యాలెస్ వెనుక మరెన్నో విషయాలు దాగున్నాయని, ఇలాంటి కట్టడాలు ఇంకా ఉన్నాయని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. రుషికొండ ప్యాలెస్‌కు ఎంత ఖర్చు చేశారు.. దేనికి ఖర్చు చేశారు అనే విషయాలకు సంబంధించి సీఎం చంద్రబాబు ఇప్పటికే నివేదిక అడిగారని, పూర్తి వివరాలు వచ్చిన తరువాత ప్రజల ముందు బహిర్గత పరుస్తామని తెలిపారు. బక్రీద్ సందర్భంగా మంగళగిరి ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ యువగళం పాదయాత్ర సందర్భంగా.. గంజాయి వల్ల నష్టపోయిన కుటుంబాల గోడు తనను కలచివేసిందన్నారు. వంద రోజుల్లో గంజాయిని పూర్తిగా నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పోలీసులకు ఆదేశాలిచ్చామన్నారు. తాను కూడా డీజీపీ, హోం మంత్రితో ఈ విషయమై మాట్లాడానని, సెబ్ అధికారులతో సమీక్ష జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూకల దాడులు ఆగలేదన్నారు. ఈ 12 రోజుల్లో ముగ్గురు టీడీపీ కార్యకర్తలను వైసీపీ నేతలు హత్య చేశారని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాలలో టీడీపీకి చెందిన ఓ మైనార్టీ కార్యకర్తను వైసీపీ నాయకుడు బ్యాటుతో కొట్టి చంపాడని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు ఓర్పు, సహనంతో ఉండాలని చెప్పడంతో లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా ఎంతో సంయమనంతో ఉన్నామని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గానికి ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తానన్నారు. ముఖ్యంగా దశాబ్దాల కాలంగా పేదలు నివసిస్తున్న భూములను రెగ్యులరైజ్ చేయడం, డ్రెయిన్లు, రోడ్లు, ఇతర మౌలిక వసతులు, స్వర్ణకారులకు గోల్డ్ క్లస్టర్ వంటి హామీలను నెరవేరుస్తామని మంత్రి లోకేశ్ మరోమారు స్పష్టం చేశారు.



మంత్రి లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌లో సమస్యలు చెప్పుకొనేందుకు బారులుదీరిన జనం



ప్రజా దర్బార్‌లో సమస్యలు చెప్పుకొనేందుకు వచ్చిన జనంతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

పవన్‌కు సవాల్!



గాడితప్పిన గ్రామీణాభివృద్ధి

- పంచాయతీరాజ్ శాఖ నిర్వీర్యం
- ఉపాధి హామీ పథకానికి తూట్లు
- సమర్థులైన అధికారులతో కింది స్థాయి నుంచి మార్పులతోనే ప్రక్షాళన సాధ్యం
- రేపు బాధ్యతలు స్వీకరించనున్న పవన్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ సర్కారు పాలనలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ గాడితప్పింది. కేంద్ర నిధులతో చేపట్టే ఉపాధి హామీ పథకం పూర్తిగా నిర్వీర్యమైంది. పంచాయతీల నిధులను దారి మళ్లించి గ్రామాల్లో కనీస సౌకర్యాల కల్పనకూ కటకటలాడే పరిస్థితులు తీసుకొచ్చారు తమకు భజన చేసేవారిని అధికారులుగా నియమించుకుని ప్రజలకు పాలనను దూరం చేశారు. వైసీపీ సర్కారు నిర్వాకంతో ఈ శాఖలో పాలన పూర్తిగా అస్తవ్యస్తమైంది. నిధుల దుర్వినియోగంతో వ్యవస్థలన్నీ చతికిలబడ్డాయి. ఇప్పుడు వీటన్నింటినీ సరిదిద్ది దారికి తెచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వంపై పడింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీశాఖ మంత్రిగా బుధవారం బాధ్యతలు చేపట్టనున్న పవన్‌కల్యాణ్‌కు ఈ సమస్యలన్నీ సవాలుగా నిలుస్తున్నాయి. పవన్ రాకతో శాఖలో సంస్కరణలకు అంకురార్పణ జరుగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులతో పాటు భూమిలేని వ్యవసాయ కూలీలు, చిన్న సన్నకారు రైతులకు పనులు కల్పించే అవకాశం ఉంది. అలాగే తాగునీటి శాఖ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించాల్సి ఉంది. సమర్థులైన అధికారులను నియమించి కింది నుంచి పైదాకా ప్రక్షాళన చేస్తే గానీ ఈ శాఖ గాడిలో పడే అవకాశం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దొంగ మస్టర్లతో మమ

చంద్రబాబు హయాంలో గ్రామీణాభివృద్ధి శాఖపై ప్రత్యేక దృష్టి ఉండేది. లోకేశ్ మంత్రిగా ఉండగా ఉపాధి హామీ పథకం ద్వారా ఏటా రూ.10వేల కోట్లు కేంద్ర నిధులు సాధించి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20వేల కి.మీ మేర గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు నిర్మించారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి ఏపీలో జరగడంతో అప్పట్లో ఏటా 11 నుంచి 20 దాకా కేంద్ర అవార్డులు ఈ శాఖకు దక్కేవి. అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా మొక్కలు, రైతులకు ఉద్యాన మొక్కలతో పాటు నిర్వహణ కోసం భారీగా ఉపాధి నిధులు అందజేసేవారు. దీంతోపాటు వాటర్‌షెడ్లు నిర్వహణ సమర్థంగా చేపట్టారు. ఎన్టీఆర్ జలసిరి పేరుతో పేద రైతులకు రూ.6వేలు చెల్లిస్తే రూ.2.50లక్షల విలువైన సోలార్ పంపుసెట్లు ఉచితంగా అందించేవారు. వైసీపీ సర్కారు వచ్చిన తర్వాత ఈ పనులన్నీ కనుమరుగయ్యాయి. కూలీలకు సంబంధం లేకుండా మస్టర్లు కొట్టి వైసీపీ కార్యకర్తల జేబులు నింపారు. మెటీరియల్ నిధులను సైతం ఉపయోగం లేని జగనన్న కాలనీల చదును కోసం దుర్వినియోగం చేశారు. గ్రామీణ పేద రైతులకు ఈ పథకం ద్వారా అందే ప్రయోజనాలేవీ అందనీయకుండా చేశారు. వైఎస్ఆర్ జలకళ పేరుతో కొంతమంది వైసీపీ కార్యకర్తల పొలాల్లో బోర్లు వేశారు. ఈ పథకం పేదలకు అందని ద్రాక్షలాగా మిగిలింది. ఉపాధి హామీ సిబ్బందిని దొంగ మస్టర్లు వేయాలని ప్రభుత్వ అధికారులే ప్రోత్సహించడంతో వారు పూర్తిగా తప్పుడు పనులకు అలవాటుపడ్డారు. క్షేత్రస్థాయిలో ఈ పనుల్లో ఉన్న వైసీపీ కార్యకర్తలను ఉన్నఫళంగా తొలగించాల్సిన అవసరం ఉంది. ఉపాధి పథకంలో నిహా వ్యవస్థలైన సోషల్ ఆడిట్, క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ విభాగాలను వైసీపీ సర్కారు నిర్వీర్యం చేసింది. సోషల్ ఆడిట్ డైరెక్టర్‌గా వైసీపీ ఎమ్మెల్యే బావమరిదిని అర్హత లేకపోయినా నియమించారు. దీంతో ఆ విభాగం అవినీతిలో కూరుకుపోయింది. విజిలెన్స్ విభాగాన్ని సైతం నిర్వీర్యం చేయడంతో అది సుప్తచేతనావస్థలో ఉంది. ఇక క్వాలిటీ కంట్రోల్ విధించిన రూ.20 కోట్ల జరిమానాలో కనీసం రూ.లక్షలు కూడా వసూలు చేయలేని దుస్థితిలో గ్రామీణాభివృద్ధిశాఖ యంత్రాంగం ఉంది. గ్రామీణాభివృద్ధి శాఖలో పైనుంచి కింది దాకా సిబ్బందిని మార్చి ప్రక్షాళన చేస్తే తప్ప ఈ శాఖను గాడిలో సాధ్యం కాదని పలువురు పేర్కొంటున్నారు. వాటర్‌షెడ్‌లో ఇతరులను రానీయకుండా అధికారుల నుంచి సిబ్బంది దాకా ఒకే వర్గం పెత్తనం సాగిస్తోంది. గత ఐదేళ్లలో వాటర్‌షెడ్, జలకళలో జరిగిన అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేయాల్సిన అవసరముంది. అలాగే వైసీపీ సర్కారు వచ్చిన తొలినాళ్లలో రాష్ట్రవ్యాప్తంగా మొక్కల పెంపకంలో జరిగిన అవినీతిని కూడా వెలికి తీయాల్సి ఉంది.

పంచాయతీరాజ్‌లోనూ అంతే..

గ్రామాల్లో పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ఉపాధి హామీ పథకం వైసీపీ నేతల చేతిలోకి పోయింది. ఈ పథకం భ్రష్టు పట్టడంతో గ్రామాల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. పంచాయతీలకు కేంద్ర నుంచి వచ్చిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించి అప్పట్లో నవరత్నాలకు వాడేశారు. ఖజానాలో ఒక్క పైసా కూడా లేకపోవడంతో గ్రామాలు కనీసం తాగునీటి వసతికి కూడా నోచుకోలేకపోతున్నాయి. గ్రామ పంచాయతీలకు అందాల్సిన సీనరేజ్, రిజిస్ట్రేషన్ చార్జీలు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వంలో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు వేశారని విజిలెన్స్ తనిఖీలతో పంచాయతీరాజ్ ఇంజనీర్లను వేధిస్తున్నారు. గ్రామీణ నీటిసరఫరా విభాగంలో అధికారుల నియామకాలు, పదోన్నతులు అన్నీ అడ్డగోలుగానే సాగుతున్నాయి. కేంద్రం పంపిన జల్‌జీవన్ మిషన్ నిధులను సద్వినియోగం చేసుకోకపోవడంతో మురిగిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించకపోవడంతో కేంద్రం కూడా నిధులు నిలిపేసింది. గత ప్రభుత్వం పంచాయతీరాజ్ సిబ్బందికి శిక్షణనిచ్చే స్టేట్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ(ఎస్ఆర్‌డీఎస్)ను గ్రామ, వార్డుసచివాలయ శాఖకు అనుబంధంగా ఉంచింది. ఇప్పుడు ఆ శాఖను మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామికి అప్పగించారు. దీంతో పంచాయతీరాజ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చే శాఖ వేరుగా, పంచాయతీరాజ్ శాఖ వేరుగా ఉన్నాయి. గ్రామ, వార్డు సచివాలయ శాఖలో ఉన్న ఎస్ఆర్‌డీఎస్‌ను పంచాయతీరాజ్ కిందకు మార్చాల్సిన అవసరం ఉంది. అలాగే గ్రామ సచివాలయాలన్నీ పంచాయతీ కార్యాలయాల్లోనే నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామ సచివాలయాలను, పంచాయతీరాజ్‌శాఖను వేరుగా చూడలేం. ఈ రెండు శాఖలు వేర్వేరుగా ఉండటంతో ఈ శాఖను బలోపేతం చేయడం సాధ్యంకాదని పలువురు పేర్కొంటున్నారు. ఈ శాఖను ప్రక్షాళన చేయాలంటే వరుసగా 3నెలల పాటు సమీక్షలు నిర్వహించి, కిందిస్థాయి నుంచి పైదాకా మార్పులు తెస్తేనే సాధ్యమని పలువురు అధికారులు స్పష్టం చేస్తున్నారు.

కోడెల చేస్తే తప్పు.. జగన్ చేస్తే ఒప్పా?

- నాడు మాజీ స్పీకర్‌పై 'దొంగ' ముద్ర వేశారు
- నేడు మాజీ సీఎంపైనా ఫర్నిచర్ దొంగతనం కేసు పెట్టాలి
- టీడీపీ నేతల డిమాండ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కోట్లకొద్దీ ప్రజాధనంతో మాజీ సీఎం జగన్ ఇంట్లో ఫర్నిచర్ ఏర్పాటు చేసుకోవడంపై వైసీపీ నాయకులు చేస్తున్న ప్రకటనలు, ఇస్తున్న సంజాయిషీలపై టీడీపీ నేతలు విరుచుకుపడుతున్నారు. మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావును ఫర్నిచర్ దొంగగా ముద్ర వేసి.. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని జగన్‌ను సమర్థిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. 'జగన్ గతం మరచిపోయారా? కోడెల చేస్తే తప్పయింది ఆయన చేస్తే ఒప్పవుతుందా? జగన్ మీద కూడా ఫర్నిచర్ దొంగతనం ఎందుకు పెట్టకూడదు' అన్న ప్రశ్నలు టీడీపీ శిబిరం నుంచి వినిపిస్తున్నాయి. 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయిన తర్వాత అప్పటిదాకా స్పీకర్‌గా పనిచేసిన కోడెలపై వైసీపీ ప్రభుత్వం అసెంబ్లీ ఫర్నిచర్ దొంగతనం చేశారని కేసు మోపింది. నరసరావుపేట వైసీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో ఫిర్యాదు ఇప్పించి కేసు నమోదు చేశారు. వివాదంలో ఉన్న ఫర్నిచర్ హైదరాబాద్‌లో ఉమ్మడి అసెంబ్లీకి సంబంధించింది. ఏపీ వాటాగా అందులో కొంత ఫర్నిచర్‌ను నిర్ధారించి దానిని లారీల్లో అమరావతికి పంపారు. పెద్ద పెద్ద టేబుళ్లు, పాత కుర్చీలు అందులో ఉన్నాయి. అప్పటికే అమరావతిలోని అసెంబ్లీలో పూర్తిస్థాయిలో ఫర్నిచర్‌ను సమకూర్చుకున్నారు. కొత్త అసెంబ్లీలో పెట్టడానికి ఖాళీ లేకపోవడంతో వాటిని తన క్యాంపు కార్యాలయంలో పెడితే వాడుకుంటానని కోడెల చెప్పారు. దాంతో అక్కడకు పంపారు. 2019 ఎన్నికల్లో టీడీపీతోపాటు కోడెల కూడా ఓడిపోయారు. జూన్ 3న కోడెల అసెంబ్లీ కార్యదర్శికి ఫోన్ చేసి తన క్యాంపు కార్యాలయంలో అసెంబ్లీకి సంబంధించిన ఫర్నిచర్ ఉందని చెప్పారు. దీని కొనసాగింపుగా 7న అసెంబ్లీ కార్యదర్శికి ఒక లేఖ పంపారు. పాత ఫర్నిచర్‌కు రేటు నిర్ణయిస్తే దానిని చెల్లించి తానే ఉంచుకుంటానని అందులో పేర్కొన్నారు. కానీ ప్రత్యుత్తరం రాలేదు. ఆగస్టు 20న కోడెల కొత్త స్పీకర్ తమ్మినేని సీతారాంకు మరో లేఖ రాశారు. ఈ లేఖ అందినట్లుగా స్పీకర్ కార్యాలయం సిబ్బంది సంతకం కూడా చేశారు. తర్వాత ఈ లేఖలు పక్కన పడవేసి అసెంబ్లీ ఫర్నిచర్‌ను కోడెల దొంగతనం చేశారంటూ కేసు నమోదు చేశారు. అవమానంతో కుంగిపోయిన కోడెల ఆత్మహత్య చేసుకున్నారు. ప్రభుత్వం తనపై ఫర్నిచర్ దొంగతనం మోపడంతోనే ఆయన ఈ అఘాయిత్యానికి ఒడిగట్టారని కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలు ఆరోపించారు. కోడెల తన క్యాంపు కార్యాలయంలో వాడుకొన్న పాత ఫర్నిచర్ మొత్తం విలువ రూ. 2లక్షలకు మించదని అప్పట్లో అసెంబ్లీ వర్గాలు లెక్కగట్టాయి. కోడెల రాజకీయాల్లోకి రాక ముందే బాగా ఆస్తిపరుడు. నరసరావుపేటలో బాగా పేరున్న వైద్యుడు. ఆయన ఆస్పత్రి నిత్యం రోగులతో కిటకిటలాడుతుండేది. అంత ఆస్తిపరుడిపై ఫర్నిచర్ దొంగతనం కేసు మోపడం టీడీపీ వర్గాలను కలచివేసింది. ఇప్పుడు సరిగ్గా ఇదే పరిస్థితి జగన్‌కు ఎదురైంది. సీఎంగా ఉన్న సమయంలో ఆయన తన తాడేపల్లి ప్యాలెస్‌లో ఏర్పాటు చేసుకున్న క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ధనంతో కొనుగోలు చేసిన ఫర్నిచర్ వినియోగించుకున్నారు. పదవి నుంచి దిగిపోయిన తర్వాత ఆయన ఆ ఫర్నిచర్‌ను ప్రభుత్వానికి అప్పగించాలి. కానీ ఆ ఫర్నిచర్ ధర ఎంతో చెబితే చెల్లిస్తామని వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పేరిట ప్రకటన వెలువడింది. దీనిపై టీడీపీ నేతలు మండిపడుతున్నారు. 'అప్పుడు కోడెలపై ఏం కేసు పెట్టారో ఇప్పుడు జగన్‌పై కూడా అదే కేసు పెట్టాలి' అని ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు డిమాండ్ చేశారు.




సత్యనారాయణకు షాక్!

- రైల్వేశాఖ అనుమతితో రిలీవ్‌ను ఆపేసిన ప్రభుత్వం



అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక శాఖ సెక్రటరీ సత్యనారాయణను విధుల నుంచి రిలీవ్ చేసేందుకు ప్రభుత్వం బ్రేకులు వేసింది. ఆయనపై వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణల నిగ్గు తేలేవరకు ఆయనను రాష్ట్రంలోనే ఉంచాలని నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో డిప్యుటేషన్ గడువును మరో 6మాసాలకు పెంచాలంటూ.. సత్యనారాయణ మాతృసంస్థ రైల్వేకు లేఖ రాసి.. అనుమతి తెచ్చుకుంది. దీంతో సత్యనారాయణ రిలీవింగ్ నిలిచిపోయింది. ఐఆర్ఏఎస్ అధికారి కేవీవీ సత్యనారాయణ 2017లో డిప్యూటేషన్‌పై రాష్ట్రానికి వచ్చి ఆర్థిక శాఖలో సెక్రటరీగా పాతుకుపోయారు. జగన్ పాలనలో చెల్లింపుల వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకుని అనేక అవకతవకలకు పాల్పడ్డారు. అడ్డగోలుగా అప్పులు తెచ్చి ఆర్థిక రంగాన్ని అస్తవ్యస్తం చేశారు. ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకున్నారు. కొంతమంది కాంట్రాక్టర్లు దొంగతనాలకు పాల్పడ్డారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో తన డిప్యూటేషన్ ఈనెల 18తో ముగిసిపోతోందంటూ మాతృసంస్థ ఇండియన్ రైల్వేస్‌కి లేఖ రాశారు. దీంతో ఆ శాఖ నార్త్ ఈస్టర్న్ రైల్వేస్‌లో సత్యనారాయణకు పోస్టింగ్ ఇచ్చింది. కానీ, అక్కడ జాయిన్ కావాలంటే రాష్ట్ర ప్రభుత్వం రిలీవింగ్ లేఖ ఇవ్వాలి. అవకతవకల ఆరోపణలు ఎదుర్కొంటున్న సత్యనారాయణ సంగతి తేల్చాలని సర్కారు నిర్ణయించింది. ఆయనకు రిలీవింగ్ లేఖ ఇవ్వబోమని స్పష్టంచేస్తూ సీఎస్ నీరబ్ కుమార్ ఆదేశాలిచ్చారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం రైల్వే శాఖతో సంప్రదింపులు జరిపి, మరో 6 నెలలపాటు సత్యనారాయణ రాష్ట్రంలోనే ఉండేలా అనుమతి తీసుకుంది. దీంతో సత్యనారాయణ చేసిన అవకతవకలపై ప్రభుత్వం విచారించేందుకు అవకాశం ఏర్పడింది.

అ'భద్రతా' భావంలో జగన్!

- తాడేపల్లి ప్యాలెస్‌కు ప్రైవేటు సెక్యూరిటీ
- అధికారంలో ఉండగా నిత్యం 200 మంది పోలీసుల పహారా
- ఇప్పుడున్నది ఎమ్మెల్యే హోదానే అసాధారణ పోలీసు భద్రత కుదరదు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పూర్తి అభద్రతా భావంలో కూరుకుపోయారా? 'ప్యాలెస్'ను ప్రజలు చుట్టుముడతారని భయపడుతున్నారా? ఆయన వ్యవహార శైలి చూస్తుంటే అలాగే ఉంది. తాజాగా... తాడేపల్లి ప్యాలెస్‌కు భద్రతగా సుమారు 30 మంది ప్రైవేటు గార్డులను ఏర్పాటు చేసుకున్నారు. వీరంతా సఫారీ దుస్తులు ధరించి... 'డ్యూటీ'లో చేరారు. సీఎంగా ఉన్నప్పుడు జగన్ పరదాలు, బ్యారికేడ్ల మధ్యనే తిరిగారు. పాతకాలపు రాజుల కోటను తలపించేలా ప్యాలెస్‌ను కట్టుకున్నారు. అటు వైపు వెళ్లే దారిని మూసేశారు. నిత్యం సుమారు 200 మంది పోలీసులతో సెక్యూరిటీ ఏర్పాటు చేసుకున్నారు. అంతేకాదు... ఇంటి వైపు ఎవరూ కన్నెత్తి చూసే అవకాశమే లేకుండా దాదాపు 30 అడుగుల ఎత్తున దుర్భేద్యమైన ఇనుప ప్రహరీని నిర్మించుకున్నారు. తనకు, తన కుటుంబ సభ్యులకు దేశ విదేశాల్లో భద్రత కల్పించేందుకు ప్రత్యేక పోలీసు దళాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తీరా చూస్తే.. జగన్‌ను జనం గద్దె దించేశారు. ఆయనకు ప్రతిపక్ష నేత హోదా కూడా వచ్చే అవకాశంలేదు. కేవలం ఒక ఎమ్మెల్యేకు ఇచ్చే సెక్యూరిటీకి మాత్రమే ఆయన అర్హుడు. ఆయనకు అదనపు భద్రత కల్పించాలంటే.. సంబంధిత కమిటీ సమీక్షించాలి. అయితే.. జగన్‌కు భద్రతాపరమైన ముప్పు ఉందని నిర్ధారించాలి. రాష్ట్రంలో ఉగ్రవాదం లేదు. మావోయిస్టు తీవ్రవాదమూ లేదు. 'మాజీ ముఖ్యమంతి' అనే హోదాను పక్కనపెడితే... జగన్ ఇప్పుడు సాధారణ ఎమ్మెల్యేనే! అందువల్ల ఆయనకు అసాధారణమైన భద్రత కల్పించే అవకాశం లేదు. తాడేపల్లి ప్యాలెస్ చుట్టూ మూసివేసిన రహదారులను కొత్త ప్రభుత్వం తెరిపించింది. సామాన్యుల రాకపోకలకు అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలోనే జగన్ ప్రైవేటు సెక్యూరిటీని నియమించుకున్నట్లు తెలుస్తోంది.



తాడేపల్లిలోని మాజీ సీఎం జగన్ ఇంటిలోకి వెళ్తున్న ప్రైవేట్ భద్రతా సిబ్బంది

గంజాయిపై ఉక్కుపాదం

నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

3 నెలల్లో పూర్తిస్థాయిలో అడ్డుకట్ట: హోంమంత్రి

విశాఖపట్నం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయి నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు హోంమంత్రి వంగలపూడి అనిత ప్రకటించారు. గంజాయి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సర్క్యూట్ హౌస్‌లో జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, విశాఖ సీపీ రవిశంకర్ అయ్యన్నార్, జాయింట్ సీపీ ఫకీరప్పతోపాటు నగరంలోని పైస్థాయి పోలీస్ అధికారులతో సోమవారం ఆమె సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అనిత మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖ గంజాయి, మాదక ద్రవ్యాలకు రాజధానిగా మారిపోయిందన్నారు. యువతకు గంజాయి సులభంగా దొరుకుతోందని, ఆ మత్తులో వారు దోపిడీలు, చైన్‌స్నాచింగ్‌లు, ఈవ్‌టీజింగ్ వంటి నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఏపీని గంజాయి రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించానన్నారు. హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టకముందే నగరంలోని పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి దీనికి సంబంధించిన ఆదేశాలు జారీ చేశానన్నారు. చెక్‌పోస్టుల సంఖ్య పెంచడంతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులకు స్పష్టంగా చెప్పానన్నారు. టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటుచేసి నగరంలో రాత్రిపూట గుంపుగా ఉండే యువతను, బస్టాపుల్లో కనిపించే ఆకతాయిలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించాలని, సోమవారం నుంచే ఈ ప్రక్రియ ప్రారంభం కావాలని ఆదేశాలిచ్చినట్టు తెలిపారు. గంజాయి కేసుల్లో పట్టుబడేవారు ఏ పార్టీవారైనా, చివరకు టీడీపీ వారైనా సరే క్షమించేది లేదని హెచ్చరించారు. గంజాయి డీ అడిక్షన్ సెంటర్లు పెంచడంతోపాటు, కేజీహెచ్‌లో ప్రత్యేకంగా ఒక బ్లాక్‌ను కేటాయించే ప్రతిపాదన ఉందన్నారు. మూడు నెలల్లో గంజాయికి పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేస్తామని చెప్పారు. ఇకపై దిశ పోలీస్ స్టేషన్ల పేరును మహిళా పోలీస్ స్టేషన్‌గా మార్చేస్తామని హోంమంత్రి అన్నారు.

ఇంకా జగన్‌పై ప్రేమ ఉంటే వెళ్లిపోండి..

గత ఐదేళ్లు కొంతమంది పోలీసులు వైసీపీ సేవలోనే తరించారని, టీడీపీ నేతలను వేధించడంలోనే మునిగితేలారని మంత్రి అనిత అన్నారు. తాము పోలీసులకు అన్ని సదుపాయాలూ కల్పిస్తామని, పని తీరు కూడా అదేస్థాయిలో ఉండాల్సిందేనని చెప్పారు. ఇప్పటికైనా ప్రజా పోలీసింగ్ చేయాలని, అలా కాకుండా ఎవరికైనా ఇంకా జగన్‌పై ప్రేమ ఉంటే తక్షణం లూప్‌లైన్‌లోకి వెళ్లిపోవాలని హోం మంత్రి స్పష్టం చేశారు. పోలీస్ వ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తామన్నారు. పోర్టులోకి 2,500 కిలోల హెరాయిన్‌తో కంటైనర్ రాక కేసుపై కూడా దృష్టిపెడతామన్నారు. కాగా, రాష్ట్రంలో గంజాయి రవాణా, వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు వీలుగా వారంరోజుల్లో టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు హోంమంత్రి చెప్పారు.



మీడియాతో మాట్లాడుతున్న హోంమంత్రి అనిత

దుకాణాలు మూసేయండి: మంత్రి సుభాష్

ద్రాక్షారామ, జూన్ 17: 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గంలో గంజాయి వ్యాపారం చేసే 120మంది పేర్లు నా వద్దకు వచ్చాయి. అసెంబ్లీ సమావేశాల తర్వాత వచ్చేసరికి దుకాణాలు మూసివేయాలి. లేనిపక్షంలో మేమే మూయిస్తాం' అని మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు. సోమవారం వెంకటాయపాలెంలో మంత్రి జన్మదిన వేడుకలు జరిగాయి. 'యువతను మత్తులో ముంచి జీవితాలు పాడుచేస్తున్న గంజాయి వ్యాపారులపై ఉక్కుపాదం మోపుతాం. ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ ప్రమేయంతో అవినీతి జరిగింది. అందులో భాగస్వాములైన వారిని ఆలయంలో ఉంచబోం. విచారణ జరిపించి నిగ్గుతేలుస్తాం. గోవధను జరగనివ్వను' అని అన్నారు.


కుంగిన గైడ్‌బండ్ ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సీఎం చంద్రబాబు



డయాఫ్రమ్‌వాల్‌పై నడుస్తూ.., క్షేత్రస్థాయిలో ప్రాజెక్టు వ్యూహం పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



ప్రాజెక్టు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న సీఎం, పక్కన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

కూడబలుక్కుని కూల్చేశారు!

(మొదటి పేజీ తరువాయి)

విధ్వంసం ఏ స్థాయిలో ఉందో ప్రజల ముందుంచి వారి అభిప్రాయం ప్రకారం ఏం చేయాలో నిర్ణయిస్తామని స్పష్టంచేశారు. సోమవారం ఆయన ప్రాజెక్టు వద్ద క్షేత్ర స్థాయిలో పర్యటించారు. నిర్మాణ పనులన్నిటి వద్దా ఆగి ఎక్కడెక్కడ ఏయే లోపాలు జరిగాయి.. గడిచిన ఐదేళ్లుగా జరిగిన నష్టం, దుర్వినియోగమైన ప్రజా ధనం తదితరాలన్నిటినీ గంటన్నరకు పైగా క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారులను ఆరా తీశారు. కీలక కట్టడాలైన డయాఫ్రం వాల్ దెబ్బతినడం.. ఎగువ , దిగువ కాఫర్ డ్యాంలలో సీపేజీ, గైడ్‌బండ్ కుంగిపోవడం.. ప్రాజెక్టు క్షేత్రంలో ఎక్కడ చూసినా పెద్ద పెద్ద గుంతలు కనిపించడంతో సీఎం చలించిపోయారు. అనంతరం జల వనరుల శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ) సి.నారాయణరెడ్డి, చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి, మాజీ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు తదితరులతో తొలి సమీక్ష నిర్వహించారు. మంత్రులు నిమ్మల రామానాయుడు (జలవనరులు), కొలుసు పార్థసారథి (గృహ నిర్మాణం), కందుల లక్ష్మీదుర్గేశ్ (పర్యాటకం), పలువురు టీడీపీ ఎమ్మెల్యేలు, ఏలూరు కలెక్టర్ వెంకటేశ్ కూడా పాల్గొన్నారు. 30 నిమిషాలపాటు సాగిన సమీక్షలో పోలవరం దుస్థితిపై చంద్రబాబు తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. కేంద్రం సంపూర్ణంగా సహకరించినా ప్రాజెక్టును ధ్వంసం చేశారని ఆయన అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టుపై నిరంతరం సమీక్షిస్తూ.. సమస్యలను అధిగమించి ఒక కొలిక్కి తీసుకొచ్చానని.. ఇప్పుడు ప్రాజెక్టును చూస్తుంటే ఎక్కడ నుంచి మొదలుపెట్టాలో కూడా అర్థం కావడం లేదని.. పూర్తిగా నాశనం చేశారని ధ్వజమెత్తారు.

> జగన్ నాయకుడు కాడు.. విధ్వంసకుడు. దురదృష్టం కొద్దీ రాష్ట్ర రాజకీయాల్లోకి వచ్చారు. రాష్ట్ర ప్రజల దురదృష్టం కొద్దీ ముఖ్యమంత్రి అయ్యారు.
>
> నేను ఐదేళ్లు కష్టపడి ఒక దశకు తీసుకొచ్చిన పనులన్నిటినీ నిర్వీర్యం చేశారు. గత ఐదేళ్లలో వాటిల్లిన నష్టానికి కారకులెవరు?
>
> - చంద్రబాబు

32వ సారి ఇక్కడకు వచ్చా..: 'పోలవరం నిర్మాణంపై 2014-19 మధ్యకాలంలో 163 సార్లు వర్చువల్ సమీక్షలు నిర్వహించాను. 31 సార్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి.. సమీక్షించాను. ఇప్పుడు ముఖ్యమంత్రిగా 32వ సారి స్వయంగా వచ్చాను. అంతా సవ్యంగా జరిగితే.. 2020 డిసెంబరు నాటికి పూర్తయ్యేది. కానీ 2019లో జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్టు సంస్థను మార్చేశారు. ఆయన, అధికారులందరూ కూడబలుక్కుని ప్రాజెక్టులోని కీలక నిర్మాణాలను కూల్చేశారు. కేంద్రం ముందు రాష్ట్రం తలదించుకునేలా చేశారు. దీనికి ఏం జవాబు చెబుతాం? దీనికి కారకులెవరు.. బాధ్యత ఎవరు వహిస్తారు' అని శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ నారాయణరెడ్డి, సీఈ నరసింహమూర్తిని చంద్రబాబు ఆగ్రహంతో నిలదీశారు. శశిభూషణ్ సమాధానం చెప్పలేదు. సీఈ మాత్రం తాను కొత్తగా బాధ్యతలు చేపట్టానని తెలిపారు. తాను హెడ్‌క్వార్టర్‌లో ఉంటానని.. నిర్మాణ బాధ్యతలన్నీ అప్పటి సీఈ చూశారని నారాయణరెడ్డి చెప్పారు. దీంతో మరింత అసహనం వ్యక్తం చేసిన చంద్రబాబు.. ఈ విధ్వంసంలో మీ బాధ్యత లేదా అని ఆయన్ను ప్రశ్నించారు. పూర్తిస్థాయి సమీక్షకు ఇప్పుడు సమయం లేదని.. త్వరలోనే మళ్లీ ప్రాజెక్టు పరిశీలనకు వచ్చి సమీక్షిస్తానని స్పష్టం చేశారు.

జగన్ మూర్ఖత్వంతో ప్రాజెక్టు సర్వనాశనం

- అంతా సంక్లిష్టం చేసేశారు.. ఇది క్షమించరాని నేరం
- ఏం జరిగిందో ప్రజలకు స్పష్టత రావాలి
- మేమేం చేయాలో వారే చెప్పాలి: చంద్రబాబు

ఏలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): 'పోలవరం ప్రాజెక్టు ఇంతలా నాశనం కావడానికి జగనే కారణం. ఆయన మూర్ఖత్వం దానిపాలిట శాపమే అయింది. ఆయన రాజకీయాల్లోకి రాదగిన వ్యక్తి కాదు. క్షమించరాని తప్పిదాలు చేసిన గత ప్రభుత్వంపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రజలే చెప్పాలి. దీనిని ఒక కేస్ స్టడీగా చేసి జనం, మీడియా చర్చించాలి.. పోలవరం పనులను ఎంత సంక్లిష్టం చేయాలో అంతా చేసి ప్రాజెక్టును పనికి రాకుండా చేశారు. ఇది క్షమించరాని నేరం..' అని సీఎం చంద్రబాబు విరుచుకుపడ్డారు. ప్రాజెక్టుపై సమీక్ష తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఒకపక్క బాధగా ఉంది. పోలవరంలో పనులు అత్యంత దారుణంగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టును ఆంధ్ర జీవనాడిగా మార్చి ఆ మేరకు శ్రమించాం, కష్టపడ్డాం. ప్రాజెక్టును పూర్తి చేసి నదులను అనుసంధానం చేస్తే కరువే లేకుండా చేద్దామనుకున్నాం. 2014లో ఏడు ముంపు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసేలా కేంద్రాన్ని ఒప్పించాం. పార్లమెంటులో చట్టం రాకముందే రాష్ట్రపతితో ఆర్డినెన్స్ జారీ చేయించాం. అప్పట్లో ఇదొక రికార్డు' అని తెలిపారు. కరవు ప్రాంతమైన రాయలసీమకు కృష్ణా జలాలనే గాక గోదావరి నీటిని కూడా వీలైతే అందించాలన్న తపనతో నాడు తన ప్రభుత్వం పనిచేసిందన్నారు. చైనాలో త్రీగార్జెస్ కన్నా పోలవరం ఎంతో గొప్పదని.. అత్యధిక నీటి నిల్వ సామర్థ్యం గల ప్రాజెక్టుగా రూపుదిద్దుకుందని చెప్పారు. తాను నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేశానని, గతంలో కేంద్రంలో జల వనరుల మంత్రులుగా ఉన్న ఉమాభారతి, నితిన్ గడ్కరీలను ఒప్పించి అనేకసార్లు పోలవరం అనుకూల నిర్ణయాలు వెలువడేలా చేశామన్నారు. జగన్ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్‌తో ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపివేసిందని దుయ్యబట్టారు. కాంట్రాక్టు సంస్థలను మార్చేయడమే కాకుండా ఇంకొన్ని కాంటాక్టు ఏజెన్సీలను మూలనపడేసేలా చేశారని, ఆఖరుకు ఈఎన్‌సీతో పాటు అనేక మందిని తప్పించి ఏమాత్రం అనుభవం లేనివారిని పోలవరం ప్రాజెక్టులోకి తీసుకొచ్చారని తప్పుబట్టారు. కాంటాక్టర్‌ను మార్చవద్దని కేంద్ర జల సంఘం చెప్పినప్పటికీ వినలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

డయాఫ్రంవాల్ ఖర్చు తడిసి మోపెడు..

2019లో వచ్చిన అధిక వర్షాల కారణంగా డయాఫ్రం వాల్ నాలుగు చోట్ల దెబ్బతిందని, దాదాపు వీటి మరమ్మతులకు 447 కోట్లు ఖర్చు అవుతాయని, అయినప్పటికీ పూర్తిగా మరమ్మతు అవుతుందనే నమ్మకం లేదని, డయాఫ్రంవాల్ సమాంతరంగా కొత్తగా నియమించేందుకు 996 కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయని తాజాగా అధికారులు నివేదిస్తున్నారని చంద్రబాబు తెలిపారు. వాస్తవానికి మా ప్రభుత్వ హయాంలో 446 కోట్ల వ్యయంతో నిత్యం శ్రమించి వాల్ నిర్మిస్తే దానిని కాపాడకుండా ప్రాజెక్టు పనులతో ఆడుకుని డ్యామేజీలను కూడా కనిపెట్టలేకుండా ఏడాది కాలం గడిపేశారని జగన్‌పై మండిపడ్డారు. ఫలితంగా డయాఫ్రంవాల్ భారీగా దెబ్బతిందని.. తాజాగా దెబ్బతిన్న రెండు చోట్ల సమాంతరంగా డీవాల్ నిర్మిస్తే దాదాపు 447 కోట్లు ఖర్చవుతాయని.. ఈ నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. తాను గతంలో (విపక్ష నేతగా) ప్రాజెక్టు పనులను తనిఖీ చేసేందుకు వచ్చినప్పుడు గ్యాప్-1 సకాలంలో పూడ్చివేయలేక భారీ వరదల కారణంగా 250 మీటర్ల గ్యాప్ కాస్తా 150 మీటర్ల మేర పూర్తిగా కొట్టుకుపోయిందని.. ఇప్పుడు ఈ కారణంగానే పెద్దపెద్ద సుడిగుండాలు ఏర్పడ్డాయని తెలిపారు. వాటిని పూడ్చేందుకు మరింత ఖర్చవుతుందన్నారు. గైడ్‌బండ్ కుంగిపోయిందని.. దీనిని పునర్నిర్మించేందుకు ఎన్నాళ్లు పడుతుందోనని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి మంత్రులు వెకిలి వ్యాఖ్యలు చేసిన విషయాన్ని విలేకరులు సీఎం దృష్టికి తీసుకురాగా.. రాష్ట్రానికి ఒక వ్యక్తి శాపంగా మారితే ఎలా ఉంటుందో పోలవరం ప్రాజెక్టును ఒక కేస్ స్టడీగా తీసుకోవాలన్నారు. గడిచిన ఐదేళ్లలో ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన నిర్లక్ష్యం, అవకతవకలు నిగ్గు తేల్చేందుకు కమిటీని నియమిస్తారా అని అడుగగా.. 'మూసకట్టు విధానాలకు సిద్ధంగా లేను. ఇన్నాళ్లూ ప్రాజెక్టులో ఏం జరిగిందో, ఆ తదుపరి మేమేం చేయాలో ప్రజలకు స్పష్టత రావాలి. మేం ఏంచేయాలో వారే చెప్పేలా చర్చ సాగాల్సిందే' అని బదులిచ్చారు.

పోలవరం పూర్తికి మరో నాలుగేళ్లు!!

- పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో అధికారుల వెల్లడి
- డయాఫ్రం వాల్ కొత్తది కట్టాలి!.. రూ.990 కోట్లు ఖర్చవుతుంది
- ఏడాదిన్నర పడుతుంది.. ఇక గైడ్‌బండ్ రిపేర్ చేయాలి
- కాఫర్ డ్యాంల్లో సీపేజీ ఆపాలి... సీఎంకు వివరణ

అమరావతి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పూర్తి కావడానికి మరో నాలుగేళ్లు పడుతుందని జలవనరుల శాఖ స్పష్టం చేసింది. నిర్మాణం పనులు ముందుకు సాగాలంటే.. సాంకేతిక సమస్యలను అధిగమించాల్సి ఉందని తెలిపింది. సోమవారం ప్రాజెక్టు క్షేత్రంలో సమీక్ష సందర్భంగా ఆ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డయాఫ్రం వాల్ దెబ్బతిందని.. మరమ్మతు చేయాలంటే రూ.447 కోట్ల వ్యయం, 288 రోజుల సమయం పడుతుందని చెప్పారు. అదే సమాంతరంగా కొత్త వాల్ నిర్మించాలంటే రూ.990 కోట్లు ఖర్చవుతుందని.. 457 రోజులు సమయం తీసుకుంటుందని వివరించారు. అంటే డయాఫ్రం వాల్ నిర్మాణానికే ఏడాదిన్నర పడుతుందని చెప్పారు. ఎగువ కాఫర్ డ్యాంలో సీపేజీని నివారించాల్సి ఉందని.. కుంగిన గైడ్‌బండ్‌ను మరమ్మతు చేయాలని వెల్లడించారు. ప్రాజెక్టు 41.15 మీటర్ల కాంటూరులో 115 టీఎంసీల నీటి నిల్వకు రూ.7,792.83 కోట్లు కావాలని.. అదేవిధంగా 45.72 మీటర్ల కాంటూరులో 194.60 టీఎంసీల గరిష్ఠ నీటి నిల్వకు రూ.29,949.42 కోట్లు అవసరమని వివరించారు.

జల వనరుల శాఖ సలహాదారుగా ఎం.వెంకటేశ్వరరావు!

- పోలవరం రిటైర్డ్ సీఈ రమేశ్‌బాబు సేవలూ వినియోగం

రాష్ట్ర జల వనరుల శాఖ సలహాదారుగా రిటైర్డ్ ఈఎన్‌సీ, మాజీ ప్రభుత్వ సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు సేవలను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. గతంలో పోలవరం నిర్మాణంలో వెంకటేశ్వరరావు కీలకంగా వ్యవహరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆయన్ను సలహాదారుగా నియమించినా.. చంద్రబాబు సర్కారులో సేవలు అందించినందుకు పక్కన పెట్టేశారు. ఆయన బాధ్యతలు నిర్వహించిన కాలంలో చేపట్టిన పనులపై విజిలెన్స్ విచారణ కూడా జగన్ ప్రభుత్వం జరిపింది. అయితే.. ఎక్కడా లోపాలు కనిపించకపోవడంతో మౌనంగా ఉండిపోయింది. ఇప్పుడు చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావడంతో.. వెంకటేశ్వరరావును ప్రభుత్వ సలహాదారుగా నియమించాలని నిశ్చయించారు. ఒకట్రెండు రోజుల్లో ఉత్తర్వు జారీ అయ్యే వీలుందని అధికార వర్గాలు తెలిపాయి. అలాగే గతంలో పోలవరం చీఫ్ ఇంజనీర్‌గా సేవలందించి రిటైరైన వి.రమేశ్‌బాబు సేవలను కూడా వినియోగించుకునే ఆలోచనలో చంద్రబాబు ప్రభుత్వం ఉంది. సోమవారంనాటి పోలవరం సమీక్షకు హాజరు కావాలని వీరిద్దరికీ సీఎంవో కబురుపంపింది. దీంతో.. వీరిద్దరూ ప్రత్యేకంగా హాజరయ్యారు.



'రాజకోట' రహస్యం ముందే తెలిస్తే... 11 సీట్లు కూడా వచ్చేవి కావు: గంటా

- జగన్ పెదవులపై మాత్రమే పేదల మాట: వర్ల
- ఆ భవన నిర్మాణ ఖర్చుపై విచారణ జరపాలి: సీపీఐ

విశాఖపట్నం, అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): విశాఖ రుషికొండపై వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన విలాసవంతమైన భవన సముదాయంపై పలువురు నేతలు, వివిధ పార్టీలు స్పందించాయి. సోమవారం ఎక్స్ వేదికగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎక్స్‌లో స్పందిస్తూ.. 'జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ నిధులతో నిర్మించిన రాజకోట రహస్యం ఎన్నికలకు ముందు బయటపడి ఉంటే ఆ పదకొండు సీట్లు కూడా వైసీపీకి వచ్చేవి కావు. విశాఖలో రాష్ట్రపతి, ప్రధాని, గవర్నర్‌లు బస చేయడానికి ఐఎన్ఎస్ డేగ, నేవల్ గెస్ట్‌హౌస్ వంటి నిర్దిష్ట విడిది ప్రాంతాలు ఉన్నాయి. వారి కోసం నిర్మించామని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పడం హాస్యాస్పదంగా ఉంది' అని అన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య తమ పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, 'అధికార మాయలో ఉన్న జగన్ తనకే అధికారం శాశ్వతం అనుకున్నారు. రాష్ట్రంలో ఇళ్లు లేక పేదలు అల్లాడుతున్నా... ఆయన, ఆయన భార్య అప్పుడప్పుడు నివశించడానికి ప్రజల సొమ్ము రూ.500 కోట్లతో రుషికొండకు గుండు కొట్టించారు. మాయా మహల్ నిర్మించుకున్నారు. జగన్ పెదవులపై మాత్రమే పేదల మాట. మనసులో సిరుల మూట... నడిచేది ధనవంతుల బాట' అని విమర్శించారు. దీనిపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ఓ ప్రకటన చేస్తూ... 'రూ.వందల కోట్లు వెచ్చించి రాజప్రాసాదంలా నిర్మించిన భవనాల నిర్మాణ ఖర్చుపై సమగ్ర విచారణ జరిపించాలి. పేదల ఇళ్ల నిర్మాణానికి ఒక సెంటు స్థలం ఇచ్చిన జగన్ తన నివాసం కోసం రిషికొండపై కొన్ని ఎకరాల స్థలంలో రాజమహల్‌ను నిర్మించుకున్న తీరు గర్హనీయం. ఈ అక్రమ భవన నిర్మాణాలకు కారకులైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఆ భవనాలను పర్యాటకశాఖకు అప్పగించి ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా వినియోగించాలి' అని ప్రభుత్వాన్ని కోరారు.

సోనియా, రాహుల్‌తో షర్మిల భేటీ


సోనియా, రాహుల్, ప్రియాంకతో వైఎస్ షర్మిల

న్యూఢిల్లీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంకతో ఏపీ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం భేటీ అయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం, భవిష్యత్తు ప్రణాళికలు, కార్యాచరణపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. రానున్న రోజుల్లో ఏపీలో కాంగ్రెస్ పునర్వైభవం సాధించి, బలీయమైన శక్తిగా అవతరించే దిశగా మరిన్ని అడుగులు పడనున్నాయని 'ఎక్స్' వేదికగా షర్మిల వెల్లడించారు.

సోకులకే 120 కోట్లు



(మొదటి పేజీ తరువాయి)

వందల కోట్ల ప్రజాధనం నీళ్లుగా ఖర్చుచేసి వారితో రుషికొండ ప్యాలెస్ కట్టించుకున్నారు. చెవ్వా సుప్రియారెడ్డి అనే సమీప బంధువే జగన్ అభిరుచికి తగినట్లుగా, భారతిరెడ్డి ఇష్టాలను బట్టి అందమైన డిజైన్లు, ఇంటీరియర్‌ను రూపొందించారు. జగన్ వద్ద నాడు ఐటీ సలహాదారుగా పనిచేసిన దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి భార్య సుప్రియారెడ్డి. జగన్ తరఫున ఇసుక వ్యాపార సామ్రాజ్యాన్ని నడిపిన సోదరుడు అనిల్‌రెడ్డికి ఈమె సమీపబంధువు. ఆమెదీ, జగన్‌దీ ఒకే ఊరు. ఉమ్మడి కడప జిల్లా భక్రాపురంలో వారివి పక్కపక్క ఇళ్లే. సుప్రియారెడ్డికి చెందిన పాంథియన్ డిజైన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకే రుషికొండ టూరిజం ప్రాజెక్టు డిజైన్స్, ఆర్కిటెక్చువల్, ఇంటీరియర్ ప్రాజెక్టును ఇచ్చారు. ఒక్క రుషికొండనే కాదు, రాష్ట్రంలోని టూరిజం ప్రాజెక్టులన్నీ ఈ సంస్థకే అప్పగించినట్లుగా నాటి జగన్ ప్రభుత్వం ఓ నోట్‌ఫైల్‌లో పేర్కొంది. అయితే, ఆ కంపెనీకి ఏ ప్రాతిపదికన వర్క్ ఇచ్చారు...ఆ సంస్థకు ఉన్న అర్హతలు, అనుభవం ఏపాటివో ఎవ్వరికీ తెలియదు. అసలు ఆ సంస్థకు టెండర్ ఎలా ఇచ్చారనేదీ ఆ శాఖలో ఉన్నవారికి తెలియదు. కానీ ఆ సంస్థే రుషికొండ ప్రాజెక్టులో కర్త, కర్మ, క్రియగా నిలిచింది. ఆ సంస్థ పేరిట సుప్రియారెడ్డినే చక్రం తిప్పారు. ఫలితంగా ఆ ప్రాజెక్టు వ్యయం 500 కోట్లకు చేరుకుంది. ఇందులో సుప్రియారెడ్డికి చేరింది ఎంత? నికరంగా ప్రభుత్వం రుషికొండపై ఖర్చుపెట్టిన దెంతో తేలాల్సి ఉంది. ఇది తేలాలంటే సర్కారు రుషికొండ ప్రాజెక్టు వర్క్‌లపై సిట్‌తో ప్రత్యేక దర్యాప్తు చేయించాలని పర్యావరణ, ఆర్థికవేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

జగన్ భవనాలకు అందాలు...

జగన్ 2019లో అధికారంలోకి వచ్చాక కడప జిల్లాకు చెందిన దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి అనే వ్యక్తిని తన ఐటీ సలహాదారుగా నియమించుకున్నారు. అయితే, అప్పటికే ఆయన భార్య సుప్రియారెడ్డి.. జగన్ భవనాలను చక్కదిద్దుతున్నారు. జగన్‌కు చెందిన బెంగళూరు, హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్ ప్యాలెస్‌లకు ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైన్లు, ఇంకా అదనపు హంగులు అద్దినది ఆమెనే. అయితే, అప్పటికి ఆమెకు ప్రత్యేకంగా కంపెనీలేదు. 2019లో మేలో జగన్ అధికారంలోకి వచ్చారు. తాడేపల్లిలోని తన ప్యాలెస్‌ను క్యాంపు ఆఫీసుగా చేసుకున్నారు. ఆ తర్వాత కొద్ది నెలలకే, ఆగస్టులో సుప్రియారెడ్డి డైరెక్టర్‌గా పాంథియన్ డిజైన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీని ఏర్పాటు చేశారు. ఇందులో ఆమె భర్త దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి, మరో వ్యక్తి డైరెక్టర్‌లుగా ఉన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌ను పూర్తిస్థాయి క్యాంపు ఆఫీసుగా మార్చాక, అందులో ఆర్కిటెక్చువల్, ఇంటీరియర్ డిజైన్స్ సుప్రియారెడ్డియే చేశారని ఆర్ అండ్‌బీ వర్గాలు చెబుతున్నాయి. ఆమె డిజైన్స్ నచ్చిన తర్వాతే జగన్ కుటుంబం సుప్రియాకు రుషికొండ ప్రాజెక్టు బాధ్యతలను అప్పగించినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.

ఏ ప్రతిపాదికన ఇచ్చారు?

జగన్ వ్యక్తిగతంగా తన ఇంటి నిర్మాణం, డిజైన్ పనులను సుప్రీయారెడ్డికి ఇచ్చుకోవచ్చు. ఇందులో ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండదు. కానీ, రుషికొండ ప్రాజెక్టు ప్రభుత్వానిది. ప్రభుత్వ నిధులతో చేపట్టే ఏ ప్రాజెక్టు అయినా ఒకరికి అప్పగించాలంటే నిర్దిష్టమైన మార్గదర్శకాలు ఉంటాయి. టెండర్‌లు పిలవాలి. అర్హత ఉన్న కంపెనీలను ఎంపిక చేయాలి. ఆ తర్వాతే వర్క్ ఆర్డర్ ఇవ్వాలి. మరి సుప్రియారెడ్డికి చెందిన పాంథియన్ డిజైన్స్‌కు ఏ ప్రాతిపదికన రుషికొండ ప్రాజెక్టు అప్పగించారు? ఇప్పుడు ఇదే పెద్ద ప్రశ్న. నిజానికి రుషికొండ ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారు చేసేందుకు టెండర్లు పిలవగా, ఆర్వీ అసోసియేట్స్ ఆర్కిటెక్ట్ ఇంజనీర్స్ కన్సల్టెంట్స్ ప్రైవేటు లిమిటెడ్ బిడ్ దక్కించుకుంది. ప్రాజెక్టు వ్యయంలో మూడు శాతం ఫీజుగా ఆ సంస్థకు ఇచ్చేలా ఒప్పందం ఉంది. మరి పాంథియన్ డిజైన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీని ఎలా ఎంపిక చేశారు? ఆర్కిటెక్చువల్, ఇంటీరియర్ డిజైన్స్ కోసం టెండర్లు పిలిచారా? నామినేషన్ ప్రాతిపదికన ఇచ్చారా? వీటిల్లో ఏ ఒక్క ప్రశ్నకూ సమాధానం లేదు. ఆ కంపెనీని ఎలా ఎంపిక చేశారో ప్రభుత్వం వద్ద ఏ రికార్డూ లేదు. అయితే, ప్రాథమిక ఆర్కిటెక్చువల్ ప్లాన్‌లకు ఆ సంస్థ డబ్బులు తీసుకోలేదని ప్రభుత్వం చెబుతోంది. ఓ ప్రైవేటు సంస్థ ప్రభుత్వానికి ఉచితంగా సేవలందించగలదా? అలా అని జగన్ చెబితే ప్రజలు నమ్మాలా? టూరిజం చెబుతోన్న వివరణలో మరో కోణం ఉంది. ప్రాథమిక డిజైన్లు ఉచితంగా ఇచ్చినా, అసలు సిసలైన డిజైన్లకు ఆ సంస్థ భారీగానే ఫీజులు తీసుకున్నట్లు చెప్పకనే చెప్పినట్లుగా ఉంది.

సుందరీకరణకు 120 కోట్లపైనే....

రుషికొండ ప్యాలెస్ బడ్జెట్ ఎంత? తొలుత ఎన్ని కోట్లతో నిర్మించాలనుకున్నారు? ఆ తర్వాత ఎన్ని కోట్లకు చేరిందో తెలిస్తే జగన్ అభిష్టాల విలువ ఎంత ఖరీదో తెలిసిపోతుంది. ఫేజ్1-, ఫేజ్2 భవనాల నిర్మాణంకోసం 120 కోట్లు వ్యయం కానుందని అంచనావేశారు. కానీ ఇప్పుడు మొత్తం వ్యయం 450 కోట్లపైమాటే. ఇందులో అందాల కోసమే 120 కోట్లపైనే ఖర్చుపెట్టినట్లు తెలిసింది. బహిరంగ మార్కెట్‌లో 100 రూపాయలకు దొరికే వస్తువును అంతర్జాతీయ ప్రమాణాలు పేరు చెప్పి వెయ్యిరూపాయలకుపైనే కొనుగోలు చేయించినట్లు చెబుతున్నారు.ప్యాలెస్‌లో వాడిన కర్టెన్‌లు, వాటి పరికరాల ఖర్చు 10 కోట్లపైనే ఉంటుందని చెబుతున్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారు, ఆయన, భారతీ కుటుంబం రుషికొండ ప్యాలెస్‌లో నివాసం ఉంటారు, క్యాంపు ఆఫీసు ఇక్కడే ఉంటుందన్న ధీమాతో ప్రభుత్వ సొమ్మును మంచినీళ్ల ప్రాయంలా ఖర్చుపెట్టించారు. ఇప్పటివరకు అక్కడ ఎంత ఖర్చుపెట్టారు...ఏ కేటగిరీలో ఎంత వ్యయం చేశారో ఆడిటింగ్ జరగలేదు. ఏ పనికి ఎంత మేర నిధులు వాడాల్నో పరిమితి లేదు. దీంతో అడిగినంత ఇచ్చేశారు. నచ్చినట్లుగా పరికరాలు కొన్నారు. ప్రజాధనాన్ని, పర్యావరణాన్ని పణంగాపెట్టి రుషికొండ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టులో అధికార, నిధుల దుర్వినియోగం బయటకు రావాలంటే ప్రత్యేకంగా సిట్‌తో విచారణ చేయించాలని పర్యావరణ, ఆర్థికవేత్తలు కోరుతున్నారు. ఏమాత్రం అనుభవం లేని సుప్రియారెడ్డి కంపెనీకి కాంట్రాక్టు ఎలా ఇచ్చారో నిగ్గుతేల్చాలని, ఇందులో జగన్, ఇతరుల పాత్రపై విచారించాలని వారు కోరుతున్నారు.

> **'అమ్మగారు చెప్పినట్లే చేయండి'**
>
> సుప్రియారెడ్డి ఇచ్చిన సలహాలు, సూచనలు చాలా ఖరీదైనవని రుషికొండ ప్యాలెస్‌లోని ఏర్పాట్లు, వాటిపై చేసిన వ్యయాన్ని పరిశీలిస్తే అర్థమవుతోంది. ప్రభుత్వ సొమ్మేకదా అని డిజైన్‌లు, ఇంటీరియర్స్‌కు, ఇతర హంగులు, ఆర్భాటాలకు అడ్డగోలుగా ఖర్చుచేయించారని అధికారవర్గాలు చెబుతున్నాయి. యూరోపియన్, ఇటాలియన్, అమెరికన్ సంప్రదాయాలు కొట్టొచ్చినట్లు కనబడేలా ఖరీదైన డిజైన్లు చేయించారని, దానిపై పరిమితికి మించిన ఖర్చుచేయించారని పర్యాటక శాఖకు చెందిన ఓ సీనియర్ అధికారి చెబుతున్నారు. "అమ్మగారు చెప్పినట్లే చేయండి. అన్నీ ది బెస్ట్ ఉండాలి. ఎందులో రాజీపడినట్లుగా ఇంటీరియర్స్ ఉండకూడదు." అని పలుసందర్భాల్లో ప్యాలెస్‌నుంచి టూరిజంలోని ఓ ఉన్నతాధికారికి ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది.
>
> 'తిరుపతిలో కొండపై వేంకటేశ్వరస్వామి గుడి కట్టలేదా? సింహాచలంలో నృసింహస్వామి ఆలయం నిర్మించలేదా? శ్రీశైలంలో మల్లిఖార్జున స్వామి ఆలయం లేదా?...జగన్ కోసం రుషికొండపై భవనం కడితే తప్పేమిటి?'
>
> - నాటి పర్యాటక శాఖ మంత్రి రోజా ఉవాచ

ప్యాలెస్‌పై పూటకో పాట

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రుషికొండపై రూ.500 కోట్లతో నిర్మించిన విలాసవంతమైన భవనాల గురించి వైసీపీ నేతలు రోజుకో మాట చెబుతున్నారు. అక్కడ నిర్మాణం ప్రారంభించిన నాటి నుంచి అవాస్తవాలే మాట్లాడుతున్నారు. ప్రజాసంఘాలు అక్రమ నిర్మాణమని న్యాయస్థానాల్లో కేసులు వేస్తే అక్కడ కూడా అబద్ధాలే చెప్పారు. వాటిని విశ్వసించని న్యాయమూర్తులు కమిటీని వేసి వాస్తవాలు తెలుసుకున్నారు.

స్టార్ హోటల్ పేరిట మభ్యబెట్టి..

అమరావతిని రాజధానిగా అంగీకరించకుండా మూడు రాజధానులను తెరపైకి తీసుకువచ్చిన జగన్మోహన్‌రెడ్డి.. విశాఖను పరిపాలనా కేంద్రం చేయాలని నిర్ణయించుకున్నారు. అందుకు అవసరమైన భవనాలను వెదికారు. ఎక్కడా ఆశించిన స్థాయిలో తన కోసం కార్యాలయం లభించకపోవడంతో రుషికొండపై కన్నేశారు. అక్కడ అప్పటికే 60 గదులతో నడుస్తున్న రిసార్ట్స్‌ను కూలగొట్టి రాజభవంతి నిర్మించాలనుకున్నారు. సుమారు 9.8ఎకరాల విస్తీర్ణంలో 4.7 ఎకరాల్లో నిర్మాణాల కోసం 22 ఎకరాల కొండను తవ్వేశారు. కానీ, 70 ఎకరాల్లో నిర్మాణాలకు అనుమతి కావాలని మహా విశాఖ నగర పాలక సంస్థకు దరఖాస్తు చేశారు. వాస్తవానికి అదంతా కోస్తా నియంత్రణ మండలి పరిధిలో ఉన్న ప్రాంతం. భారీ నిర్మాణాలు చేపట్టకూడదు. ఈ విషయం తెలిసీ ఆ శాఖకు తప్పుడు సమాచారం ఇచ్చారు. భవనాలు కూలగొట్టిన 4.7 ఎకరాల్లోనే నిర్మాణాలు చేపడతామని దరఖాస్తు చేశారు. అందులో పర్యాటకుల కోసం ఏడు నక్షత్రాల హోటల్, కన్వెన్షన్ సెంటర్ నిర్మిస్తామన్నారు. దీంతో షరతులతో కూడిన అనుమతిని కేంద్రం ఇచ్చింది.

రూపాయి కట్టకుండా రూ. 500 కోట్ల భవనం

రుషికొండ మొత్తం రెవెన్యూకు చెందిన భూమి. సర్వే నంబరు 19లో 70 ఎకరాల కొండ ప్రభుత్వ భూమిగానే ఇప్పటికీ ఉంది. దానిని పర్యాటక అభివృద్ధి కోసం పర్యాటక శాఖకు అప్పగించినా హక్కులు బదలాయించలేదు. అయినా సరే ఏపీటీడీసీ అందులో భారీ నిర్మాణాలకు దరఖాస్తు చేస్తే జీవీఎంసీ అధికారులు కళ్లు మూసుకొని అనుమతులు ఇచ్చేశారు. నిర్మాణ ఫీజులుగా రూ.19.05 కోట్లు కట్టాల్సి ఉండగా, వాటిని ఐదేళ్ల తరువాత వాయిదాల పద్ధతిలో చెల్లించడానికి అనుమతి ఇస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి సంస్థ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి ప్రత్యేక జీవో ఇచ్చారు. రూపాయి ఫీజు కట్టకుండా రూ.500 కోట్ల భవనం నిర్మించారు.

ప్రారంభోత్సవం రోజున...

రుషికొండలో నిబంధనల ఉల్లంఘనపై పత్రికల్లో తరచూ వార్తలు వచ్చేవి. నాటి పర్యాటక శాఖ మంత్రి రోజా, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ... అవన్నీ అబద్ధాలను కొట్టి పడేశారు. 'తిరుపతిలో కొండపై వేంకటేశ్వరస్వామి గుడి కట్టలేదా?, జగన్ కోసం రుషికొండపై భవనం కడితే తప్పేమిటి?'...అంటూ రోజా విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. మంత్రి అమర్‌నాథ్ అయితే 'సీఎం కోసం నిర్మాణం రెడీ అవుతోంది. ఉగాదికి వస్తారు. దసరాకు వస్తారు. దీపావళికి వస్తారు' అనేవారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో రుషికొండ భవనాన్ని శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతితో కలిసి నాటి మంత్రి రోజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తాము నిర్మించింది పర్యాటక శాఖ భవనమేనని పునరుద్ఘాటించారు. అయితే సీఎం కార్యాలయం కోసం త్రిసభ్య కమిటీ అనేక భవనాలు పరిశీలించిందని, వారు ఇదే అన్ని విధాలుగా బాగుందని, భద్రత ఉంటుందని చెప్పారన్నారు. సీఎం జగన్‌కు ఫైల్ పెట్టారని, అక్కడ నుంచి గ్రీన్‌సిగ్నల్ వస్తే..ఇదే సీఎం కార్యాలయం అవుతుంది". అంటూ ప్రకటించారు. తాజాగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రుషికొండపైకి వెళ్లి అక్కడి పర్యాటక భవనాలను పరిశీలించి, నిధులు దుబారా చేశారని, వ్యక్తిగత నివాసాల కోసం విలాసవంతంగా కట్టుకున్నారని ఆరోపించారు. దీనిని ఖండిస్తూ మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. విశాఖ పరిపాలన రాజధాని అవుతున్నందున ప్రధాని, రాష్ట్రపతి, గవర్నర్ వంటి వారు తరచూ వస్తారని, వారు బస కోసమే ఈ భవనం నిర్మించామని బుకాయించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.






నగరంలో కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నిర్మలా కాన్వెంట్ రోడ్ పూర్తిగా మునిగి పాదచారులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. కాన్వెంట్ చర్చి ప్రాంగణం నీటితో నిండిపోయింది. భారతీ నగర్ రోడ్డుపై నీళ్లు నిలిచి చెరువును తలపించింది...

కదిలేదే లేదు..!

భీష్మించుకుని కూర్చున్న ఆక్రమణదారులు ● కరకట్ట ర్యాంపును ఆక్రమించి నిర్మాణాలు

● వేరే చోట ఇళ్లిస్తామన్నా కదలని వైనం ● వైసీపీ మద్దతుదారులవడంతో అధికారుల వెనకడుగు ● ఆ ఇళ్లను వదిలేసి రివిటింగ్ నిర్మిస్తున్న అధికారులు

కృష్ణలంక, జూన్ 17: స్థానిక 20వ డివిజన్‌లోని నెహ్రూనగర్ డొంకరోడ్డు చివరన జాతీయ రహదారి అధికారులు కొద్దిరోజుల నుంచి కరకట్ట ర్యాంపునకు రివిటింగ్ చేసే పనిని ప్రారంభించారు. వర్షాలకు ర్యాంపునకు వున్న మట్టి కొట్టుకుపోతుండటంతో అధికారులు పగడ్బందీగా కొండరాళ్లతో రివిటింగ్ చేసే పనికి శ్రీకారం చుట్టారు. అయితే డొంకరోడ్డు చివరన ఉన్న సాయిబాబా గుడి పక్కన ఉన్న మెట్ల వద్ద నుంచి దాదాపు ఐదారుగురు ర్యాంపును ఆక్రమించి కొన్నేళ్లుగా ఇళ్లు నిర్మించుకొన్నారు. అయితే ఈ అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వెళ్లడంతో జాతీయ రహదారి అధికారులు, తహసీల్దార్, వీఎంసీ అధికారులు ఆక్రమణ ఇళ్లను పరిశీలించి వారికి వేరేచోట ఇళ్లు కేటాయిస్తామని చెప్పినా ఆక్రమణదారులు మొండికేస్తున్నారు. దీంతో వాటిని వదిలేసి ఎన్‌హెచ్ అధికారులు కరకట్ట ర్యాంపునకు రివిటింగ్ పనులు చేస్తున్నారు. జాతీయ రహదారిపై పొరపాటున ఏదైనా ప్రమాదం జరిగి వాహనం గనుక కిందకు పడి ఆక్రమణదారుల ఇళ్లపైకి పడితే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉంది. ఇది దృష్టిలో పెట్టుకొనే ఎన్‌హెచ్, రెవెన్యూ, వీఎంసీ అధికారులు పలు దఫాలుగా సైట్‌కు వచ్చి ఆక్రమణదారులతో సంప్రదింపులు జరిపారు. వారికి వేరే చోట ఇళ్లు కేటాయిస్తామని స్వయంగా ఎమ్మార్వో ఆదేశాలు కూడా జారీ చేసినప్పటికీ వీరు మాత్రం ఇక్కడి నుంచి వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. ఎమ్మార్వో వెన్నెల శ్రీను గత ఏడాది డిసెంబర్ 14న ఆక్రమణదారులకు వేరేచోట ఇళ్లను కేటాయిస్తూ ఇచ్చిన ఆదేశాల్లో 'జాతీయ రహదారి వెంబడి ఉన్న ర్యాంపునకు ఆనుకొని ఉన్న ఇళ్ల వలన భవిష్యత్తులో వీవీఐపీల భద్రతకు నష్టం వాటిల్లే ప్రమాదముందని' ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆక్రమణదారుల్లో గతంలో డివిజన్ వైసీపీ కార్పొరేటర్‌గా పనిచేసిన పళ్లెం రవికుమార్ తన భార్య పళ్లెం తేజశ్రీ పేరున తహసీల్దార్ నుంచి ఇల్లు కేటాయించుకొన్న వారిలో ఉన్నారు. ఆక్రమణదారులందరూ వైసీపీ మద్దతుదారులు కావడంతో గత వైసీపీ ప్రభుత్వం అండదండలందించడంతో వీరిని ఇక్కడ నుంచి తొలగించేందుకు రెవెన్యూ, జాతీయ రహదారి అధికారులు సాహసం చేయడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



వైసీపీ మద్దతుదారులు ఆక్రమించిన హైవే కరకట్ట కింద ర్యాంపు పైనున్న ఇళ్లు

నివాసాల మధ్య ప్రైవేట్ కాలేజీ వద్దు..!

● పట్టించుకోని అధికారులు ● కలెక్టర్‌కు భవానీపురం వాసుల ఫిర్యాదు

విద్యాధరపురం, జూన్ 17: నివాసాల మధ్య ప్రైవేట్ కళాశాల ఏర్పాటు చేయవద్దని భవానీపురానికి చెందిన స్థానికులు అధికారులను కోరుతున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా తగిన చర్యలు తీసుకోమని అధికారులను కలెక్టర్ ఆదేశించినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. భవానీపురం రాజేంద్ర వీధిలో గృహ నివాసాల మధ్య ఓ ప్రైవేటు డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తున్నారు. అయితే కాలేజీ ఏర్పాటుకు స్థానికులు అభ్యంతరం తెలియజేసినప్పటికీ కాలేజీ యాజమాన్యం గత ప్రభుత్వం అండతో అడ్డగోలుగా కాలేజీ ఏర్పాట్లు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాలేజీ భవనం నిర్మాణం కూడా నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని దీనిపై కూడా సంబంధిత కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేయగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెబుతున్నారు. గృహ నివాసాల మధ్య కాలేజీ ఏర్పాటు వల్ల అనేక సమస్యలు వస్తాయని దీనిపై ఈనెల 8న కలెక్టర్ ఢిల్లీరావుకు ఫిర్యాదు చేయగా సంబంధిత విభాగ అధికారులను విచారించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారని అయితే నేటి వరకు అలాంటి చర్యలేవి తీసుకోనట్టు చెబుతున్నారు. యాజమాన్యం మాత్రం కళాశాల ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్టు తెలిపారు. నివాసాల మధ్య కాలేజీ ఏర్పాట్లను అపకపోతే ఆందోళన చేపడుతామని స్థానికులు హెచ్చరించారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్

విస్సన్నపేట, జూన్ 17: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌పై ఓల్టా చట్టం కింద కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ లింగం బెనర్జీ ఏసుపాదం తెలిపారు. ఆదివారం నూతిపాడులో మూలవాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను అనధికారికంగా తరలిస్తుండగా గంటల మాధవాచారిని అదుపులోకి తీసుకొని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నందిగామ రూరల్: నందిగామ శివారు అనాసాగరం మునేరు నుంచి అనధికారికంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను నందిగామ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం రాత్రి సమాచారం అందడంతో పోలీసులు తనిఖీకి వెళ్లారు. వారిని చూడగానే డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విస్సన్నపేటలో మట్టి ట్రాక్టర్ స్వాధీనం

రెడ్డిగూడెం మండలం నుంచి విస్సన్న పేటకు అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం విస్సన్నపేట రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు.



సహకార వ్యవస్థ ప్రాధాన్యతపై జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న విశాఖపట్నం సహకార బ్యాంక్ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు

ఉద్యోగుల జీవన ప్రమాణాల పెరుగుదలపైనే బ్యాంకు మనుగడ

● విశాఖపట్నం సహకారబ్యాంకు చైర్మన్ రాఘవేంద్రరావు

వన్‌టౌన్, జూన్ 17: ఉద్యోగుల జీవన ప్రమాణాల పెరుగుదలపైనే విశాఖపట్నం సహకారబ్యాంక్ మనుగడ ఆధారపడి ఉందని బ్యాంక్ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. స్థానిక గవర్నర్‌పేటలోని ఎంబీ భవన్‌లో సోమవారం సహకార వ్యవస్థ ప్రాధాన్యతపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పటిష్ట చర్యలు తీసుకుని మొండి బకాయిల వసూలు చేసిన బ్యాంక్ ఉద్యోగులకు రూ.కోటి ప్రత్యేక అవార్డును ప్రకటించారు. పాలకవర్గం నిర్ణయాలను అమలు చేస్తూ, అత్యధిక నిధుల సాధనకు, నిరర్థక ఆస్తుల తగ్గింపునకు కృషి చేసిన సిబ్బందిని అభినందించారు. రూ.కోటి నజరానాలో 700 మంది ఉద్యోగులకు రూ.14,300 చొప్పున అందనున్నట్టు తెలిపారు. విశాఖ బ్యాంకుకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఈనేపథ్యంలో సంస్థ భవిష్యత్ మనుగడకు ఉద్యోగుల జీవన ప్రమాణాల పెరుగుదల కారణమవుతాయన్నారు. సహకార జీవనం లేకుండా మానవ మనుగడ లేదని పాలకవర్గం నమ్ముతోందన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరంగా 2025ను ఐక్యరాజ్యసమితి ప్రకటించిదన్నారు. ఈ తరుణంలో సహకార వ్యవస్థ ప్రాధాన్యతపై తెలుగురాష్ట్రాల్లో నిర్వహించనున్న సదస్సులు, ప్రత్యేక కార్యక్రమాల్లో సిబ్బంది భాగస్వాములు కావాలన్నారు. బ్యాంక్ మార్గ దర్శకుడు మానం ఆంజనేయులు మాట్లాడుతూ ఉద్యోగులు మరింత అంకితభావంతో పని చేసి బ్యాంకుకు పేరు తీసుకురావాలన్నారు. బ్యాంక్ చైర్మన్ రాఘవేంద్రరావు నాఫ్కాబ్ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా దేశంలోని 1500 సహకార బ్యాంకులు ఇటువైపే చూస్తున్నాయన్నారు. మరింత సమన్వయంతో, ఐక్యతతో పనిచేయాలని, బ్యాంకు లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏ రామకృష్ణారావు, డైరెక్టర్లు జేవీ సత్యనారాయణ మూర్తి, జనార్ధన్, చిన్నం కోటేశ్వరావు, పి.రమణరావు, పీ నారాయణ స్వామి, సీఈవో నరసింహమూర్తి పాల్గొన్నారు.

శిథిలావస్థలో నవనగరాలు



నెర్రెలిచ్చిన సీడ్ యాక్సెస్ రోడ్డు నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్లు

- గత ప్రభుత్వ నిర్వాకంతో మరింత భారం
- జంగిల్ క్లియరెన్స్‌కే రూ.వందల కోట్లు వెచ్చించాల్సిన పరిస్థితి
- వినియోగం లేక దెబ్బతిన్న రహదారులు, కుంగిపోయిన రోడ్లు
- శిథిల భవనాల పునరుద్ధరణకూ తప్పని అధిక వ్యయం
- నీళ్లలో మునిగిపోయిన సెక్రటేరియట్ భవన పునాదులు, వంతెనలు
- పనికివస్తాయా లేదా అన్నదాన్ని బట్టి మారనున్న అంచనాలు

విజయవాడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని నిర్మాణం అనుకున్న విధంగా జరిగి ఉంటే నేడు అద్భుత నగరంగా ఆవిష్కృతమై ఉండేది. కానీ గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం, నిర్లక్ష్యం ఫలితంగా అమరావతి నిర్మాణం దారుణంగా దెబ్బతింది. 2015 నుంచి 2019 వరకూ జరిగిన నిర్మాణాలు, అమరావతి అభివృద్ధి అదేవిధంగా కొనసాగి ఉంటే అయ్యే ఖర్చు కంటే ఇప్పుడు మరింత ఖర్చు చేయాల్సిన పరిస్థితి. 2019 తరువాత నిర్మాణాలను కొనసాగించి ఉన్నా, కనీసం నవనగరం అడవిగా మారిపోకుండా, భవనాలు శిథిలమై పోకుండా సంరక్షణ చర్యలు చేపట్టి ఉన్నా నిర్మాణ వ్యయం అంతలా పెరిగేది కాదన్నది నిర్మాణ నిపుణులు చెబుతున్న మాట! కానీ వైసీపీ ప్రభుత్వ ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యంతో నవనగర నిర్మాణం నేడు మరింత భారంగా మారింది. ఆ భారమంతా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పైనే పడనుంది.

జంగిల్ క్లియరెన్సుకే రూ.వందల కోట్ల వ్యయం

దాదాపు 29 గ్రామాల్లో నిర్మితమవుతున్న అమరావతి మొత్తం నేడు అడవిలా మారిపోయింది. ఐదేళ్లుగా ఎలాంటి కార్యకలాపాలు లేకపోవడంతో కంప చెట్లు మొలిచాయి. దాదాపు 20, 30 అడుగుల ఎత్తున్న కంపచెట్లతో ఆ ప్రాంతమంతా చిట్టడవిని తలపిస్తోంది. రోడ్లు మొదలు, ప్రభుత్వ భవనాలు, రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ వాణిజ్య, నివాస ప్లాట్లు మొత్తం కంపలతో నిండిపోయాయి. మంత్రులు, న్యాయమూర్తుల భవనాల చుట్టూ పదడుగుల ఎత్తులో జమ్ము, రెల్లు గడ్డి పెరిగిపోయింది. ఏకంగా భవనాలపైనే మొక్కలు పెరిగుతున్నాయి. వందల కొద్దీ పొక్లెయినర్లు నెలల తరబడి పనిచేస్తే తప్ప ఈ కంపను తొలగించలేరు. కంపను తొలగించడం, దాన్ని తరలించడమనేది అత్యంత వ్యయప్రయాసగా మారబోతోందని అధికారవర్గాలు చెబుతున్నాయి.




నీటిలో మునిగిపోయిన సెక్రటేరియట్ భవనాల పునాదులు

ఘోరంగా దెబ్బతిన్న రహదారులు

రాజధానిలో ప్రతి ప్రాంతాన్ని, ప్రతి కార్యాలయాన్ని కలుపుతూ సీడ్ యాక్సెస్ రోడ్డుతో పాటు డజన్ల కొద్దీ అంతర్గత రహదారులున్నాయి. ఐదేళ్లుగా ప్రభుత్వ కార్యకలాపాలు లేకపోవడంతో ఆ రోడ్లపై వాహనాలు తిరిగిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజధాని నిర్మాణ పనులు వేగం పుంజుకోవడంతో వాహనాల రాకపోకలు మొదలయ్యాయి. నిర్వహణ లేక రోడ్లన్నీ అంతర్గతంగా దెబ్బతినిపోయాయి. చాలాచోట్ల కోతలకు గురయ్యాయి. సీడ్ యాక్సెస్ రోడ్డు చివరి భాగాలు కుంగిపోయి విరిగి పడిపోతున్నాయి. భూకంప సమయంలో చీలిపోయినట్టుగా అంతర్గత రహదారులు చీలిపోయి, నెర్రెలు విచ్చి అత్యంత ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. ఇప్పుడు ఆ రోడ్లన్నీ పునాదుల నుంచి మళ్లీ నిర్మించాల్సిన పరిస్థితి నెలకొంది. ఫలితంగా గతంలో రోడ్ల నిర్మాణానికి చేసిన ఖర్చు మొత్తం వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో బూడిదలో పోసిన పన్నీరుగా మారిపోయింది. చాలాచోట్ల రోడ్లు తవ్వుకుని గులకరాయి, కంకరను కూడా కొల్లగొట్టుకుపోయిన పరిస్థితులు కళ్లముందే ఉన్నాయి. అది కూడా మరింత భారం.

నీటిపాలైన నూతన భవనాల పునాదులు, వంతెనలు

రాజధాని నిర్మాణంలో అత్యంత కీలకమైన సెక్రటేరియట్ జంట భవనాలకు వేసిన పునాదులు పనికి వస్తాయా లేదా అన్నది ఇప్పుడు సమాధానం వెతుక్కోవాల్సిన ప్రశ్నగా మారింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 72 గంటలపాటు నిర్విరామంగా ఆ భవనాలకు పునాదులు వేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించారు. అంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన భవనాల పునాదులు ఐదేళ్లుగా నీళ్లలోనే నానిపోతున్నాయి. ఇప్పుడు ఆ పునాదులు ఎంత వరకూ పటిష్టంగా ఉంటాయన్నది తేలాల్సి ఉంది. ఆకాశ హర్మ్యాలుగా ఉన్న ఆ భవనాల నిర్మాణానికి ఆ పునాదులు పనికి వస్తాయా లేదా అన్నది తెలియాల్సి ఉంది. దానిపై ఇంజనీరింగ్ అధికారులు దృష్టి సారించినట్టు సమాచారం. ఆ పునాదులు పనికిరాకుండా పోతే రూ.వందల కోట్ల భారం పెరిగినట్టేనని చెప్పుకోవాలి. దాంతోపాటు అమరావతిలో కీలక రహదారులు, వంతెనల కోసం నిర్మించిన పునాదులు కూడా ఐదేళ్లుగా నీళ్లలో నానిపోతున్నాయి. వాటి పరిస్థితి ఏమిటన్నది తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగా అమరావతిలోని ప్రభుత్వ భవనాలు మధ్యలోనే నిలిచిపోయాయి. వాటి నిర్మాణంలో వినియోగించిన ఇనుము చాలా వరకూ దొంగల పాలైంది. మిగిలినది ఏదైనా ఉందంటే అది తుప్పు పట్టిపోయింది. వాటన్నింటినీ పునరుద్ధరించడం మరింత భారం కాబోతోంది. మొత్తంగా వైసీపీ నిర్వాకం కారణంగా కొన్ని వేల కోట్ల రూపాయల భారం ప్రభుత్వంపై పడుతోంది. ఆ భారం మొత్తం రాష్ట్ర ప్రజలే మోయాల్సి వస్తుంది.



మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో లీగల్ సెల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలుపుతున్న టీడీపీ లీగల్‌సెల్ జనరల్ సెక్రటరీ గూడపాటి లక్ష్మీనారాయణ

వైసీపీ నేత శిరోముండనం

● కక్షతో తన భవనాలు కూల్చేశారంటూ నిరసన ● అర్ధనగ్న ప్రదర్శనకు యత్నం, అడ్డుకున్న పోలీసులు
● చంద్రబాబు, పవన్‌ను కలిసి బొండాపై ఫిర్యాదు చేస్తానన్న జగదీష్

పాయకాపురం, జూన్ 17: ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తనపై కక్షకట్టి వేధింపులకు గురి చేస్తున్నారని, అందులో భాగంగానే పాయకాపురంలోని తన రెండు భవనాలను పగలగొట్టించారని వైసీపీ నేత మాజీ కార్పొరేటర్ నందెపు జగదీష్ ఆరోపించారు. రెండు రోజుల క్రితం పాయకాపురం ప్రకాష్‌నగర్ ప్రాంతంలోని జగదీష్ రెండు భవనాలకు అనుమతులు లేవని టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించిన విషయం విదితమే. అయితే సదరు భవనాలు నందెపు జగదీష్‌వి కావటంతో సోమవారం ఆయన అదే భవనాల వద్ద ఆందోళనకు దిగారు. భార్యతో సహా ప్రకాష్‌నగర్ చేరుకుని శిరోముండనం చేయించుకున్నారు. అనంతరం దుస్తులు విప్పేసి డ్రాయర్‌తో నిరసన తెలిపారు. అనంతరం జగదీష్ భార్య కూడా శిరోముండనం చేయించుకోవడానికి సిద్ధమవగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నందెపు జగదీష్ మాట్లాడుతూ తాను తెలుగుదేశం పార్టీలో ఉండగా బొండా ఉమా విజయం కోసం ఎంతో కృషి చేశానని తెలుగుదేశం పార్టీలో తన ఎదుగుదలని చూసి ఓర్వలేక బొండా ఉమా చేసిన వేధింపులు భరించలేక తాను పార్టీని వీడి వైసీపీలో చేరానన్నారు. అయితే వైసీపీకి పని చేశాననే అక్కసుతో తన భవనాలను కూలగొట్టించాడని బొండా ఉమాపై ఆరోపణలు చేశారు. తాను బొండా ఉమా విజయానికి పనిచేసినప్పుడు వైసీపీ నేతలు తనని ఏ రోజూ ఇబ్బంది పెట్టలేదని కానీ నేడు వైసీపీకి పనిచేశాననే సాకుతో బొండా ఉమా నన్ను వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుడినైన తనపై వ్యక్తిగతంగా కక్ష పెట్టుకుని వేధించడం సరైనది కాదన్నారు. తన భవనాలు అక్రమ కట్టడాలు కాదని కోర్టు నుంచి 24 గంటలు ఆగాలని స్టే తెచ్చుకున్నా 8 గంటలలోనే దుర్మార్గంగా కూల్చేశారని విమర్శించారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి బొండా ఉమాపై ఫిర్యాదు చేస్తానన్నారు.



శిరో ముండనంతో అర్ధ నగ్న ప్రదర్శనకు సిద్ధమైన నందెపు

జూనియర్లకు పెద్దపీట..!

- సీనియర్ అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తరిమేసేందుకు యత్నం
- ఇదీ ఏపీ స్పేస్ అప్లికేషన్ సెంటర్ అధికారి తీరు
- ఐదేళ్లుగా ఒకే ప్లేస్‌లో పాతుకుపోయిన అధికారి

కృష్ణలంక, జూన్ 17: 'అయిన వారికి ఆకుల్లో.. కానివారికి కంచాల్లో..' అన్నట్టుంది ఆ అధికారి తీరు. బందరురోడ్డులోని లబ్బీపేట ప్రశాంతి హాస్పిటల్ వెనుక ఏపీ స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఐటీఈ&సీ డిపార్ట్‌మెంట్) ఉంది. దీనికి సంబంధించిన ఐఎఫ్ఎస్ అధికారి బందరురోడ్డులోని ఆర్అండ్‌బీ కార్యాలయం పై అంతస్తులో విధులు నిర్వహిస్తున్నారు. ఐటీఈ&సీ డిపార్ట్‌మెంట్‌లో మూడేళ్ల నుంచి పదేళ్లకు పైగా సీనియారిటీ కలిగిన అవుట్ సోర్సింగ్ సిబ్బంది వివిధ పనుల్లో 11మంది ఉన్నారు. ఈ అధికారి వచ్చినప్పటి నుంచి సీనియారిటీ ఉన్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని ఉద్యోగం మానేయమంటూ వారిపై ఒత్తిడి తెచ్చి తన ఇంటి వద్ద అన్ని పనులు చక్కబెట్టే జూనియర్‌లైన అవుట్ సోర్సింగ్ సిబ్బందికి పెద్ద పీట వేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఆప్కాస్ (అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి సంబంధించిన కార్పొరేషన్) ద్వారా విధుల్లోకి వచ్చారు. ఈయన విధుల నుంచి తప్పించాలనుకొంటున్న సీనియారిటీ కలిగిన అవుట్‌సోర్సింగ్ సిబ్బందిపై లేనిపోని ఆరోపణలతో ఆప్కాస్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు సమాచారం. జూనియర్‌లైన అవుట్ సోర్సింగ్ సిబ్బంది నుంచి ఇంటి పనులతో పాటు ఏదో 'ఆశించి' సీనియర్లకు 'చెక్' పెట్టేందుకు అధికారి సిద్ధమైనట్టు ఆ శాఖలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

వైసీపీకి మాజీ మంత్రి శిద్దా గుడ్‌బై

- వ్యక్తిగత కారణాలతోనే.. జగన్‌కు రాజీనామా లేఖ



ఒంగోలు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి శిద్దా రాఘవరావు వైసీపీకి గుడ్‌బై చెప్పారు. ఈ మేరకు పార్టీ అధినేత జగన్మోహ న్‌రెడ్డికి సోమవారం తన రాజీనామా లేఖను పంపారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలోని చీమకుర్తి పట్టణానికి చెందిన శిద్దా రాఘవరావు గ్రానైట్ వ్యాపారి. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన ఆయన 1999 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. అనతికాలంలోనే టీడీపీ అధినేత చంద్రబాబుకు సన్నిహితులై.. తొలుత శ్రీశైలం ట్రస్టు బోర్డు చైర్మన్‌గా నియమితులయ్యారు. 2004లో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందారు. అనంతరం టీడీపీ నుంచి ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2014 ఎన్నికల్లో దర్శి నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. ఐదేళ్లు చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. 2019 ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంట్ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా టీడీపీకి చెందిన వ్యాపారులను టార్గెట్ చేసింది. అందులో భాగంగా శిద్దా గ్రానైట్ క్వారీలపై దాడులు చేసి వందల కోట్ల రూపాయల జరిమానాలు విధించింది. వైసీపీలో చేరకపోతే మరిన్ని దాడులు, వేధింపులు తప్పవన్న సంకేతాలు ఇచ్చింది. దీంతో ఇష్టం లేకున్నా శిద్దా టీడీపీని వీడి వైసీపీలో చేరిపోయారు. ఇటీవల ఎన్నికల్లో దర్శి నుంచి తనకు లేదా తన కుమారుడు సుధీర్‌కు వైసీపీ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని శిద్దా కోరుతూ వచ్చారు. అయితే అద్దంకి లేదా ఒంగోలు కాదంటే మార్కాపురం నుంచి పోటీ చేయాలని వైసీపీ అధిష్ఠానం సూచించింది. అప్పటి నుంచి శిద్దా అసంతృప్తితో ఉన్నారు. తాజా ఎన్నికల్లో వైసీపీ ఓడి.. టీడీపీ గెలిచింది. ఈ నేపథ్యంలో ఆయన వైసీపీకి రాజీనామా చేశారు. పార్టీ అధినేత జగన్‌కు రాజీనామా లేఖ పంపిన శిద్దా.. ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు.

బడ్జెటేతర అప్పుల్లో తెలంగాణదే అగ్రస్థానం!

- ఇలాంటి రుణాలకు ప్రభుత్వాలు గ్యారెంటీ ఇస్తున్నాయ్
- దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాలు అప్పులమయం
- అప్పుల కుప్పగా ఆంధ్రప్రదేశ్
- ఏపీ, పంజాబ్‌ల్లో ఆదాయాన్ని మించి వ్యయం
- ఎన్‌ఐపీఎఫ్‌పీ పత్రంలో వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): దేశంలో కొన్ని రాష్ట్రాలు బడ్జెట్‌తో నిమిత్తం లేకుండా అప్పులు చేస్తున్నాయని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ (ఎన్‌ఐపీఎఫ్‌పీ)' తెలిపింది. ఇలాంటి అప్పులకు ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు గ్యారెంటీ కూడా ఇస్తున్నాయని వెల్లడించింది. 'ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్‌ఆర్‌బీఎం)'కు అవసరమైన ప్రభుత్వ పత్రాల్లో ఈ అప్పుల ప్రస్తావన ఎక్కడా ఉండదని ఎన్‌ఐపీఎఫ్‌పీ విడుదల చేసిన పత్రంలో వివరించింది. 2021 మార్చి 31 నాటికి అన్ని రాష్ట్రాల బడ్జెటేతర అప్పులు కలిపి రూ.2,52,308 కోట్లు ఉన్నట్లు తెలిపింది. ఇలాంటి అప్పులున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలోను, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు ఉన్నాయని వెల్లడించింది. ప్రభుత్వ లెక్కల్లో ప్రస్తావన లేకుండా అదనంగా అప్పులు చేయడం వల్ల ఆర్థిక పరిస్థితులు ప్రమాదకరంగా మారతాయని ఎన్‌ఐపీఎఫ్‌పీ హెచ్చరించింది. ఇక ఈ లోపాయికారీ అప్పుల గురించి ప్రజలకు చెప్పకుండా తమకే వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను కోరిందని, ఇది ఆర్థిక జవాబుదారీ విధానానికి, పారదర్శకతకు విరుద్ధమని పేర్కొంది. దేశంలో అప్పుల కుప్పగా మారిన 13 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఉందని, ఆ రాష్ట్ర మొత్తం అప్పులు 2021లో జీఎస్‌డీపీలో 36.9 శాతం, 2024 నాటికి 33.5 శాతంగా ఉన్నట్లు వివరించింది. ఏపీ, పంజాబ్ రాష్ట్రాల్లో ఆదాయం కంటే వ్యయం భారీగా పెరిగిపోవడంతో నగదు అందుబాటులో లేక, సమస్యలు ఎదుర్కొంటున్నాయని తెలిపింది. నగదు అందుబాటులో లేకపోవడం వల్ల ఓవర్ డ్రాఫ్ట్, వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులపై ఆధారపడాల్సి వస్తోందని పేర్కొంది. మార్కెట్ రుణాలపై ఏపీ ఎక్కువగా ఆధారపడుతోందని తెలిపింది. తెలంగాణ, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, మహారాష్ట్ర కూడా ఈ సమస్య ఎదుర్కొంటున్నాయని వెల్లడించింది.

కూటమి విజయంలో ప్రవాసాంధ్రుల భాగస్వామ్యం ముదావహం

- వాషింగ్టన్ డీసీలో ఎన్నారైల సంబరాలు
- ఆన్‌లైన్‌లో పాల్గొన్న కేంద్ర మంత్రి పెమ్మసాని

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఏపీలో ఎన్డీఏ కూటమి సాధించిన అఖండ విజయంలో ప్రవాసాంధ్రులు భాగస్వామ్యం ఉండడం ముదావహం అని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆంధ్రలో ఎన్డీఏ కూటమి అఖండ విజయం సాధించి, సీఎంగా చంద్రబాబు, ఇతర మంత్రులు బాధ్యతలు స్వీకరించడంతో అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన ప్రవాసాంధ్రులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. మూడు పార్టీల జెండాలు చేతబట్టి, ఎన్డీఏకు మద్దతుగా నినాదాలు చేశారు. దాదాపు 500 కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలేసి, నివాళులర్పించారు. కేక్ కట్ చేసి, ప్రవాస భారతీయులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్న కేంద్రమంత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ... అనేక వ్యయప్రయాసలకు ఓర్చి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసాంధ్రులు జన్మభూమికి వచ్చి కూటమి విజయానికి దోహదపడ్డారని ప్రశంసించారు. బీజేపీ ఎమ్మెల్యే సుజనాచౌదరి మాట్లాడుతూ... రాక్షస ప్రభుత్వాన్ని తరిమికొట్టడంలో ప్రవాసాంధ్రులు తమవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించారని, రాష్ట్రాభివృద్ధిలో ఎన్నారైలు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో తానా మాజీ అధ్యక్షుడు సతీష్ వేమన, సొంగా రోషన్‌కుమార్, సుందరపు విజయ్‌కుమార్, భాను మాగులూరి, మన్నవ సుబ్బారావు, సుధీర్ కొమ్మి, విజయ్ గుడిసేవ, యాష్ బొద్దులూరి, సాయి బొల్లినేని, వేణి పులిగుజ్జు, అనిల్ ఉప్పలపాటి, త్రిలోక్ తదితరులు ప్రసంగించారు.



విజయవాడలోని లబ్బీపేటలో ఉన్న మసీదులో ముస్లిం సోదరుల ప్రార్థనలు



బక్రీద్ సందర్భంగా సీఎం చంద్రబాబును కలిసిన ముస్లిం ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్



కర్నూలు నగరంలోని కొత్తబస్టాండు వద్ద ఉన్న పాత ఈద్గా వద్ద ముస్లిం సోదరుల ప్రార్థనలతో నిండిపోయిన రహదారి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి జమ్మూకశ్మీర్ బాధ్యతలు

- ఎన్నికల ఇన్‌చార్జిగా అధిష్ఠానం ప్రకటన
- మహారాష్ట్రకు.. కేంద్ర మంత్రులు
- భూపేంద్ర యాదవ్, అశ్వినీ వైష్ణవ్
- హరియాణాకు ధర్మేంద్ర ప్రధాన్, బిప్లవ్
- ఝార్ఖండ్‌కు శివరాజ్, హిమంత
- అసెంబ్లీ ఎన్నికలకు కమలం కసరత్తు

న్యూఢిల్లీ, జూన్ 17: లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగిసి రెండు వారాలు కూడా గడవకముందే బీజేపీ పలు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఈ ఏడాది చివరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు కసరత్తు ప్రారంభించింది. మహారాష్ట్ర, హరియాణా, ఝార్ఖండ్, జమ్మూకశ్మీర్ రాష్ట్రాలకు పార్టీ ఇన్‌చార్జిల పేర్లను సోమవారం ప్రకటించింది. అత్యంత కీలకమైన మహారాష్ట్రకు ఇద్దరు కేంద్ర మంత్రులను ఇన్‌చార్జిలుగా నియమించింది. కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ ఇన్‌చార్జిగా, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సహ ఇన్‌చార్జిగా ఉంటారని పార్టీ ప్రకటించింది. 2014 తర్వాత తొలిసారి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న జమ్మూకశ్మీరుకు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని ఇన్‌చార్జిగా నియమించింది. జమ్మూకశ్మీర్‌లో ఈ సెప్టెంబరులోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇక మరో కేంద్ర మంత్రి ధరేంద్ర ప్రధాన్‌కు హరియాణా బాధ్యతలు అప్పగించింది. త్రిపుర మాజీ సీఎం బిప్లవ్‌కుమార్ ఆయనకు సహాయంగా ఉంటారని ప్రకటించింది. ఝార్ఖండ్ ఇన్‌చార్జిగా మధ్యప్రదేశ్ మాజీ సీఎం, ప్రస్తుత కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌ను నియమించింది. ఆయనకు అసోం సీఎం హిమంతబిశ్వ శర్మ మద్దతుగా ఉంటారని తెలిపింది. మహారాష్ట్ర, ఝార్ఖండ్, హరియాణాల్లో ఈ ఏడాది చివరలో ఎన్నికలు జరగనున్నాయి.







మహారాష్ట్రపై ప్రత్యేక దృష్టి..

త్వరలో పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా.. అందరి దృష్టీ మహారాష్ట్రపైనే ఉంది. దేశ ఆర్థిక రాజధానిగా పేరొందడమే గాక.. అత్యధిక లోక్‌సభ సీట్లున్న రాష్ట్రాల్లో మహారాష్ట్ర రెండోస్థానంలో ఉంది. అంతేకాదు ఈ రాష్ట్రం నుంచి బీజేపీ తొలిసారి పూర్తిగా కొత్త కూటమితో కలిసి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనుంది. ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలతో కలిసి.. కాంగ్రెస్, శరద్ పవార్ ఎన్సీపీ, ఉద్ధవ్ శివసేన పార్టీల కూటమిపై పోటీ చేస్తోంది. మహారాష్ట్రలో మొత్తం 48 ఎంపీ సీట్లుండగా.. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 23, కూటమి పార్టీలతో కలిపి 41 సీట్లు సాధించింది. కానీ, తాజా ఎన్నికల్లో సొంతంగా 9 సీట్లకు పడిపోయిన బీజేపీ.. కొత్త కూటమితో కలిసి కేవలం 17 సీట్లే గెలుచుకుంది. అదేసమయంలో కాంగ్రెస్ ఒక్క సీటు నుంచి 13 సీట్లకు చేరుకొని అతిపెద్ద పార్టీగా అవతరించింది. కూటమి పార్టీలతో కలిసి 30 సీట్లు గెలుచుకుంది. ఈ క్రమంలో మహారాష్ట్రకు బీజేపీ ఇన్‌చార్జిలుగా భూపేంద్ర యాదవ్, అశ్వినీ వైష్ణవ్ నియమితులయ్యారు. వీరి నేతృత్వంలో గత ఏడాది మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాషాయ పార్టీ భారీ విజయాన్ని నమోదు చేసింది. 230 సీట్లకు గాను 163 స్థానాల్లో విజయబావుటా ఎగరవేసింది.



జమ్మూకశ్మీర్‌కు కిషన్‌రెడ్డి

2014 తర్వాత తొలిసారి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న జమ్మూకశ్మీరుకు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని ఇన్‌చార్జిగా నియమించింది. మహారాష్ట్ర, ఝార్ఖండ్, హరియాణాల్లో ఈ ఏడాది చివరలో ఎన్నికలు జరగనుండగా.. జమ్మూకశ్మీర్‌లో మాత్రం సెప్టెంబరులోనే జరిగే అవకాశం ఉంది.

మూడోసారి గెలుపే లక్ష్యంగా..

హరియాణాలోనూ బీజేపీకి ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ తాజా లోక్‌సభ ఎన్నికల్లో 10 సీట్లకు గాను కేవలం ఐదింట్లోనే విజయం సాధించింది. కాంగ్రెస్ ఐదు సీట్లను కైవసం చేసుకుంది. లోక్‌సభ ఎన్నికలకు ముందే మనోహర్‌లాల్ ఖట్టర్ స్థానంలో సీఎంగా నాయబ్‌సింగ్ సైనీని నియమించింది. అయినా లోక్‌సభ ఎన్నికల్లో నిరాశాజనకమైన ఫలితాలే వచ్చాయి. ఈ క్రమంలో వరసగా మూడోసారి రాష్ట్రంలో కాషాయ జెండాను రెపరెపలాడించడమే లక్ష్యంగా పెట్టుకొన్న బీజేపీ.. ధర్మేంద్ర ప్రధాన్, బిప్లవ్‌కుమార్‌లను ఇన్‌చార్జిలుగా నియమించింది. ఇక ఝార్ఖండ్‌కు కూడా శివరాజ్‌సింగ్‌తో పాటు ట్రబుల్ షూటర్‌గా పేరొందిన హిమంత బిశ్వ శర్మను ఇన్‌చార్జిలుగా నియమించింది.

ఉద్యోగుల విభజనపై.. ఇంకా నిర్ణయం తీసుకోలేదు

- తెలంగాణ నుంచి ఏపీకి 1,369 మంది ఆప్షన్లు
- తెలంగాణకు రావాలనుకుంటున్నది 1,808 మంది
- ఇది ఎనిమిదేళ్లుగా నానుతున్న వ్యవహారం

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ఉద్యోగుల పంపిణీకి సంబంధించి ఇంకా కొత్త నిర్ణయాలేమీ తీసుకోలేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఏపీ నుంచి తెలంగాణకు ఉద్యోగులు వస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని కోరాయి. రాష్ట్రం ఏర్పడిన ఏడాది రెండేళ్లలోనే ఉద్యోగుల పంపిణీ ప్రక్రియ దాదాపుగా ఓ కొలిక్కి వచ్చిందని వివరించాయి. ఉద్యోగుల విభజన సమయంలో ఆప్షన్లు, పోస్టుల లభ్యత ఆధారంగా తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగులు కొందరు ఏపీకి, ఏపీ స్థానికత ఉన్నవారిలో కొందరు తెలంగాణకు పంపిణీ చేశారని పేర్కొన్నాయి. వైద్య అవసరాలు, భార్యాభర్తలు ఉద్యోగాల్లో ఉండడం, పిల్లల చదువులు, సొంత ఇళ్లు ఉన్నాయనే కారణాలతో కొందరు ఉద్యోగులు ఈ పంపిణీతో ఇబ్బంది పడ్డారని తెలిపాయి. మానవీయ కోణంలో తమ బాధను అర్థం చేసుకోవాలంటూ పలుమార్లు ప్రభుత్వాన్ని అభ్యర్థించారని వివరించాయి. అయితే.. ఏపీకి వెళ్లేందుకు తమకు అవకాశం కల్పించాలని కోరుతూ తెలంగాణకు కేటాయించిన 1,369 మంది ఉద్యోగులు తమంతట తాము సమ్మతి తెలిపారని పేర్కొన్నాయి. వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఈ 1,369 మంది శాశ్వతంగా ఏపీకి వెళ్లేందుకు సమ్మతించాలంటూ అభ్యర్థించారని గుర్తుచేశాయి. 2021 సెప్టెంబరులో వీరి వివరాలను సేకరించామని, వారందరినీ ఏపీకి పంపించేందుకు తమకెలాంటి అభ్యంతరం లేదని తెలియజేస్తూ అదే నెలలో తాము సర్క్యులర్‌ను జారీ చేశామని స్పష్టం చేశాయి. ఇదే తరహాలో ఏపీ ప్రభుత్వం కూడా అక్కడి నుంచి తెలంగాణకు వచ్చేందుకు సిద్ధపడిన ఉద్యోగుల వివరాలను సేకరించిందని వివరించాయి. అక్కడి నుంచి 1,808 మంది ఉద్యోగులు తెలంగాణకు రావడానికి ఆప్షన్లు ఇచ్చారని.. 2022 సెప్టెంబరు 23న అప్పటి ఏపీ సీఎస్ సమీర్ శర్మ.. అప్పటి తెలంగాణ సీఎస్ సోమేశ్‌కుమార్‌కు లేఖ రాశారని పేర్కొన్నాయి. ఈ అంశం ఎనిమిదేళ్లుగా నానుతున్న వ్యవహారమని.. విభజన చట్టంలోని అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య సమావేశాలు జరిగినప్పుడల్లా ఈ అంశం చర్చకు వచ్చిందని వివరించాయి. ఇంతకాలం ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ ఈ నెల 2 నుంచి తెలంగాణకు ప్రత్యేక రాజధానిగా మారిందని, ఇదే సందర్భంగా ఏపీకి కేటాయించిన ఆఫీసులు, భవనాలతో పాటు విభాగాల వారీగా విభజన చట్టంలోని అన్ని అంశాలపై ప్రత్యేక నివేదిక ఇవ్వాలని ఆర్థికశాఖకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని వెల్లడించాయి. పెండింగ్‌లో ఉన్న అంశాలపై తదుపరి చర్చలు, సమావేశాలేవీ జరగలేదని స్పష్టం చేశాయి.

ఏయూలో అరాచకం

- నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రార్ పీహెచ్‌డీ ప్రవేశం
- 2022లో ఎగ్జిక్యూటివ్ కోటాలో ప్రవేశాన్ని పొందిన ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్
- 50 కోట్లు టర్నోవర్ ఉన్న సంస్థలకు మాత్రమే ఎగ్జిక్యూటివ్ కోటాకు అవకాశం
- పీహెచ్‌డీ ప్రవేశం పొందే సమయానికి ఏయూలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా స్టీఫెన్
- అది కూడా మరో ఉల్లంఘన

విశాఖపట్నం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ నిబంధనలకు విరుద్ధంగా పీహెచ్‌డీ ప్రవేశాన్ని పొందారు. ఆయన 2022లో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో పీహెచ్‌డీలో చేరారు. కొద్దిరోజుల కిందట ప్రీ పీహెచ్‌డీ పరీక్షల కోసం దరఖాస్తు చేసినప్పుడు...విభాగాధిపతి అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సాధారణంగా ఎగ్జిక్యూటివ్ కోటాలో పీహెచ్‌డీ పట్టా పొందాలంటే కొన్ని నిబంధనలు ఉంటాయి. ఏ సంస్థ నుంచి అయితే ఎగ్జిక్యూటివ్ పీహెచ్‌డీ ప్రవేశం పొందాలనుకుంటున్నారో ఆ సంస్థ టర్నోవర్ కనీసం రూ.50 కోట్లు ఉండాలి. పీహెచ్‌డీ ప్రవేశం పొందే సమయానికి స్టీఫెన్ నగర పరిధిలోని ఒక ఇంజనీరింగ్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఆ సంస్థ టర్నోవర్ ఆ స్థాయిలో లేకపోయినప్పటికీ ఎగ్జిక్యూటివ్ కోటాలో ఆయనకు పీహెచ్‌డీ ప్రవేశాన్ని కల్పించారు. అదేవిధంగా ఆ ప్రవేశం పొందే సమయానికే స్టీఫెన్ ఏయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా వ్యవహరిస్తున్నారు. వర్సిటీలోని కీలక పదవిలో ఉంటుండగా పీహెచ్‌డీలో ప్రవేశం పొందకూడదు. కానీ, ఈ నిబంధనను కూడా ఉల్లంఘించి మరీ ఆయన ప్రవేశాన్ని పొందారని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి. అధికారాన్ని దుర్వినియోగం చేసి ఉన్నతాధికారి అండదండలతోనే పీహెచ్‌డీ ప్రవేశాన్ని పొందినట్టు చెబుతున్నారు. ఇదిలా ఉండగా స్టీఫెన్ పీహెచ్‌డీ ప్రవేశం ప్రస్తుతం హెచ్‌వోడీగా ఉన్న ప్రొఫెసర్‌కు తెలియకుండా జరగడం గమనార్హం. ప్రీ పీహెచ్‌డీ పరీక్షలకు సంబంధించిన దరఖాస్తును కూడా హెచ్‌వోడీకి తెలియకుండానే ముందుకు పంపించాల్సిందిగా రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి.



జేమ్స్ స్టీఫెన్

నిబంధనలు ఉల్లంఘనే..

వర్సిటీలోకి ప్రొఫెసర్ స్టీఫెన్ వచ్చిన దగ్గర నుంచి అనేక ఉల్లంఘనలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. అసలు స్టీఫెన్ ప్రవేశమే నిబంధనలకు విరుద్ధమని చెబుతున్నారు. ప్రైవేటు కాలేజీలో పనిచేస్తున్న ఆయన అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్‌గా నిబంధనలకు విరుద్ధంగా అప్పట్లో చేరారు. ఆ తరువాత ఎంతో మందిని సీనియర్లను పక్కనపెట్టి మరీ ట్రాన్స్ డిసిప్లినరీ హబ్‌కు డీన్‌గా వర్సిటీ ఉన్నతాధికారులు నియమించారు. ఇదే టీడీఆర్ హబ్ నుంచి వందలాది మందికి అడ్డగోలుగా ప్రవేశాలు కల్పించారన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఆ తరువాత వర్సిటీలోని ఎంతోమంది రెగ్యులర్ ప్రొఫెసర్ల సీనియారిటీని పక్కనపెట్టి మరీ ఆయనకు ఉన్నతాధికారులు రిజిస్ట్రార్‌గా బాధ్యతలను అప్పగించారు. ఇది వర్సిటీ చరిత్రలోనే మరో అడ్డగోలు నిర్ణయంగా అప్పట్లోనే విమర్శలు వెల్లువెత్తాయి.

డీజే.. డ్రగ్స్ జాకీ

- మత్తు మందు తీసుకుని.. పబ్‌లకు డిస్క్ జాకీ
- అతడితో టచ్‌లో ఉన్న 16 మందికి పరీక్షలు..!
- డీజే మరో ఇద్దరు డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ
- టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య స్పష్టీకరణ
- గంజాయి అలవాటు చేసి.. విక్రేతలుగా మార్చి..
- ఏపీకి చెందిన తండ్రీ, కుమారుల ఘరానా దందా
- వారితో సహా 12 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పలు పబ్‌లలో డిస్క్ జాకీ (డీజే)గా పని చేస్తున్న వ్యక్తితో పాటు అతడితో టచ్‌లో ఉన్న ఇద్దరు డ్రగ్స్ తీసుకున్నట్లు తేలింది. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ న్యాబ్) డైరెక్టర్ సందీప్ శాండిల్య సోమవారం ఈ వివరాలను వెల్లడించారు. తమకు ఉన్న సమాచారం మేరకు హైదరాబాద్ మాదాపూర్, గచ్చిబౌలిలోని పబ్‌లకు తరచూ వెళ్లే 16 మందిని పిలిపించామని చెప్పారు. పరీక్షలు చేయగా డీజే, మరో ఇద్దరు కొకైన్, గంజాయి తీసుకున్నట్లు తేలిందన్నారు. వీరిపై మాదాపూర్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని శాండిల్య తెలిపారు. డీజేతో సంబంధాలు ఉన్నవారందరిపై నిఘా పెట్టామని చెప్పారు. మత్తు పదార్థాల కట్టడి చర్యల్లో భాగంగా విద్యార్థుల బ్యాగులను వంద శాతం తనిఖీ చేయాలని విద్యాసంస్థలకు స్పష్టం చేశారు. లాకర్లనూ పరిశీలించాలని సూచించారు. వేసవి సెలవుల అనంతరం విద్యాసంస్థలు పునఃప్రారంభమైన నేపథ్యంలో పలు కీలక సూచనలు చేశారు. డ్రగ్స్ నిరోధానికి సంబంధించి తనిఖీలపరంగా విద్యాసంస్థల సిబ్బందికి ఏవైనా ఇబ్బందులుంటే, విశ్రాంత పోలీసులను నియమించుకోవాలని పేర్కొన్నారు. యాంటీ డ్రగ్ కమిటీ (ఏడీసీ)లు మరింత చురుగ్గా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. జూనియర్లను బెదిరించి సీనియర్లు మత్తు పదార్థాలు సరఫరా చేయించే ప్రమాదం ఉందన్నారు. విద్యాసంస్థలతో పాటు బయట మరెక్కడైనా మత్తు పదార్థాల వాడకం, విక్రయాలపై సమాచారం ఉంటే టీజీ న్యాబ్ కంట్రోల్ రూమ్ నెంబరు 8712671111 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

తప్పతాగి వాహనాలు నడుపుతూ..

మద్యం మత్తులో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నిరోధించడానికి, తాగి వాహనాలు నడుపుతున్నవారిని అడ్డుకునేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో పెద్దఎత్తున యువత పట్టుబడ్డారు. కమిషనరేట్ పరిధిలో గత శనివారం శనివారం సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి 2 వరకు 349 కేసులు నమోదైనట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. అత్యధికంగా మాదాపూర్ స్టేషన్ పరిధిలో 74 మంది పట్టుబడినట్లు వెల్లడించారు. వీరిలో 21-30 ఏళ్లలోపు వారు 172 మంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

గంజాయి అలవాటు చేసి.. విక్రేతలుగా మార్చి

యువతకు గంజాయి అలవాటు చేసి.. వారినే ఏజెంట్లుగా మార్చుకుని విక్రయిస్తున్న ఏపీకి చెందిన తండ్రీ కుమారులతో పాటు మరో పదిమందిని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ రాజశేఖరరాజు వివరాల మేరకు.. ఏపీలోని గుంటూరు జిల్లా దాచేపల్లికి చెందిన సాకేటి పోలినాయుడు(46) వ్యవసాయ కూలీ. అతడి కుమారుడు తిరుపతి నారంనాయుడు అలియాస్ దాదు (28) డ్రైవర్. వారికున్న పరిచయాలతో విశాఖ జిల్లా పాడేరుకు చెందిన బాబీ వద్ద 10 కిలోల గంజాయిని కొని రైలు, బస్సుల్లో పల్నాడు జిల్లా దాచేపల్లికి తరలిస్తారు. చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి తెలంగాణ సరిహద్దు మండలాల యువతకు విక్రయిస్తున్నారు. తర్వాత వారికే విక్రయం బాధ్యత అప్పగిస్తున్నారు. గంజాయి అమ్మేందుకు పోలినాయుడు, తిరుపతి సోమవారం దామరచర్ల మండలానికి వచ్చారు. బొత్తలపాలెం శివారులోని రైల్వే అండర్‌పాస్ వద్ద వీరిద్దరితో పాటు 10 మందిని వాడపల్లి ఎస్ఐ రవికుమార్ అదుపులోకి తీసుకున్నారు. వీరితోపాటు కొంగ ప్రకాష్ (19-అడవిదేవులపల్లి మండలం ముదిమాణిక్యం), నందిపాటి నవీన్ (23-పాలకవీడు మండలం శూన్యపహాడ్), సిగపట్ల మహేష్ (22-దామరచర్ల), కలిమెల కిశోర్ (23-దామరచర్ల మండలం వాడపల్లి), వీరభద్రాపురం తురక రమేష్ (27), మిర్యాలగూడ షాబునగర్ సంగోజు కార్తీక్ (19), రెడ్డికాలనీ జగతికుమార్ (25), ఈదులగూడెం జగతి కోటేష్ (24), షాబునగర్ షేక్‌ఖాజా (24), శాంతినగర్ ముడావత్ రమేష్ (24)ను అదుపులోకి తీసుకుని, రూ.90వేల విలువైన 6 కిలోల గంజాయి, రూ.46 వేల నగదు, 3 బైక్‌లు, 12 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ప్రత్యక్ష రాజకీయాలలోకి ప్రియాంక!

- వయనాడ్ నుంచి పోటీకి సిద్ధం
- ఇక పార్టీలోనూ క్రియాశీల పాత్ర
- వయనాడ్ సీటు వదులుకున్న రాహుల్
- రాయబరేలీ నుంచి ప్రాతినిధ్యానికే మొగ్గు

న్యూఢిల్లీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నెహ్రూ, గాంధీల కుటుంబానికి చెందిన మరో వ్యక్తి ప్రత్యక్ష రాజకీయాలలో అడుగుపెట్టడానికి సర్వం సిద్ధమైంది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మనువరాలు, రాజీవ్‌గాంధీ, సోనియా తనయ ప్రియాంక గాంధీ ప్రత్యక్ష రాజకీయాలలోకి రానున్నారు. గత కొంతకాలంగా వినిపిస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రియాంక అరంగ్రేటాన్ని ప్రకటించారు. వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి ప్రియాంక పోటీ చేయనున్నారని తెలిపారు. ఇటీవలి ఎన్నికలలో పోటీ చేసిన రెండు స్థానాలు రాయబరేలీ, వయనాడ్ నుంచి రాహుల్‌గాంధీ గెలవడంతో ఏ స్థానాన్ని వదులుకోవాలన్న అంశంపై సోమవారం సాయంత్రం ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్ భేటీ అయ్యారు. పార్టీ శ్రేయస్సు దృష్ట్యా రాయబరేలీ నుంచి రాహుల్ కొనసాగాలని నిర్ణయించారు. వయనాడ్ నుంచి అభ్యర్థిగా ప్రియాంకను నిర్ణయించారు. ఆమె ఇక పార్టీలోనూ క్రియాశీలం కానున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవలి ఎన్నికలలో కాంగ్రెస్ మంచి ఫలితాలు రాబట్టడంలో ప్రియాంక కష్టం ఉందని వారు అంటున్నారు. రాహుల్‌కు ఏమాత్రం తీసిపోకుండా ఎన్నికలలో ఆమె పార్టీ ప్రచార బాధ్యతలను తన భుజస్కంధాలపై వేసుకున్న విషయం తెలిసిందే. నానమ్మ ఇందిరా పోలికలు ఉండడం, ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రజలు ఇందిరా మనువరాలిగా గుర్తిస్తున్నందున ప్రత్యక్ష రాజకీయాలలోకి ఆమె రాకతో కాంగ్రెస్ మరింత పుంజుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా, తొలుత ప్రియాంక 2019 సాధారణ ఎన్నికల ముందు పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. అ తర్వాత తూర్పు ఉత్తరప్రదేశ్‌కు పార్టీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2020లో యూపీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. 2019తో పాటు ఇటీవలి పార్లమెంటు ఎన్నికలలో పార్టీ తరఫున ప్రియాంక మమ్మురంగా ప్రచారం చేశారు.



రాయబరేలీతో అనుబంధం: ఖర్గే

తరతరాలుగా నెహ్రూ కుటుంబంతో ప్రత్యేక అనుబంధం ఉన్నందువల్ల రాయబరేలీ నుంచే రాహుల్ ఎంపీగా కొనసాగాలని పార్టీ నిర్ణయించిందని ఖర్గే తెలిపారు. రాయబరేలీ ఎంపీగా రాహుల్ ఉంటే పార్టీకి మేలు జరుగుతుందని అక్కడి ప్రజలు, పార్టీ నేతలు భావిస్తున్నారని అన్నారు. వయనాడ్ ప్రజలూ రాహుల్‌నే కోరుకుంటున్నప్పటికీ నిబంధనల అనుమతించడం లేదని ఖర్గే అన్నారు.

నా ఇంటి తలుపులు తెరిచే ఉంటాయి: రాహుల్

రాయబరేలీ, వయనాడ్‌తో తనకు భావోద్వేగ అనుబంధం ఉందని రాహుల్‌గాంధీ అన్నారు. గత ఐదేళ్లు వయనాడ్ ప్రజలు, పార్టీ కార్యకర్తలు తనపై ఎంతగానో అభిమానం చూపించారని పేర్కొన్నారు. తన జీవితాంతం వారి ఆదరాభిమానాలను గుర్తుంచుకుంటానన్నారు. వయానడ్ ప్రజల కోసం తన ఇంటి గుమ్మం తలుపులు ఎల్లప్పుడూ తెరుచుకుని ఉంటాయన్నారు. రాయబరేలీకి ప్రాతినిధ్యం వహించడం సంతోషంగా ఉన్నప్పటికీ వయనాడ్ ను వదులుకోవడం చాలా క్లిష్టమైన నిర్ణయమన్నారు. కష్ట సమయాలలో వయనాడ్ ప్రజలు తనకు పోరాడే శక్తినిచ్చారని తెలిపారు. రాయబరేలీ ఎంపీగా ఉన్నప్పటికీ వయనాడ్‌కు తరుచూ వెళతానని, అక్కడి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నిటినీ నెరవేర్చడానికి ప్రయత్నిస్తానని రాహుల్ తెలిపారు. ప్రియాంక వయనాడ్ నుంచి గెలిచి మంచి ప్రజాప్రతినిధి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ లేని లోటును వయనాడ్ ప్రజల దరిచేరనివ్వనని ప్రియాంక స్పష్టం చేశారు.

పీకల్లోతు అప్పుల్లో ఏపీ: ఎన్‌ఐపీఎఫ్‌పీ

న్యూఢిల్లీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): దేశంలో తీవ్రంగా అప్పుల పాలైన 13 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఉందని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్‌ఐపీఎఫ్‌పీ) ఒక పత్రంలో తెలిపింది. ఏపీ మొత్తం అప్పులు 2021లో జీఎస్‌డీపీలో 36.9 శాతం కాగా.. 2024 నాటికి అది 33.5 శాతానికి చేరుకుందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో ఆదాయం కంటే వ్యయం పెరిగిపోయినందువల్ల అందుబాటులో నగదు లేక సమస్యలు ఎదుర్కొంటున్నాయని ఈ పత్రం వెల్లడించింది. నగదు అందుబాటులో లేకపోవడం వల్ల ఓవర్ డ్రాఫ్ట్, వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులపై ఆధారపడవలిసి వస్తుందని తెలిపింది. మార్కెట్ రుణాలపై ఏపీ ఎక్కువగా ఆధారపడుతోందని.. తెలంగాణ, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, మహారాష్ట్ర కూడా ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయని తెలిపింది. కొన్ని రాష్ట్రాలు బడ్జెట్ తో నిమిత్తం లేకుండా అప్పులు చేస్తున్నాయని, దానికి ప్రభుత్వాలు గ్యారెంటీ కూడా ఇస్తున్నాయని ఎన్‌ఐపీఎఫ్‌పీ తెలిపింది. ఎఫ్‌ఆర్‌బీఎంకు అవసరమైన ప్రభుత్వ పత్రాల్లో ఈ అప్పుల ప్రస్తావన ఎక్కడా ఉండదని తెలిపింది. ఇలాంటి రాష్ట్రాల్లో తెలంగాణ, ఏపీ, కర్ణాటక, కేరళ, తమిళనాడు ఉన్నాయని వెల్లడించింది. ప్రభుత్వ లెక్కల్లో ప్రస్తావన లేకుండా అదనంగా అప్పులు చేయడం వల్ల ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని పరిస్థితి ప్రమాదకరంగా మారుతుందని హెచ్చరించింది.

అణ్వాయుధాల ఆధునికీకరణ

- నిమగ్నమైన భారత్ సహా 9 దేశాలు

ప్రపంచంలోని తొమ్మిది అణ్వాయుధ దేశాలు తమ అస్త్రాలను ఆధునికీకరిస్తున్నాయి. ఈ జాబితాలో భారత్, పాక్‌లతో పాటు అమెరికా, రష్యా, ఫ్రాన్స్, చైనా, ఉత్తర కొరియా, ఇజ్రాయెల్, బ్రిటన్‌లు ఉన్నాయి. వీటిలో రష్యా, అమెరికాలయితే అణ్వాయుధాలను మోహరించాయి. 2023లో అణ్వాయుధాల సామర్థ్యంపై అధ్యయనం చేసిన స్వీడన్‌కు చెందిన స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రి) ఈ విషయాన్ని వెల్లడించింది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● మంగళవారం 18 జూన్ 2024

కంటికి కనిపించదు, ప్రభావం మాత్రమే అనుభవంలోకి వస్తుంది. అదే విద్యుత్తు. ఇంట్లో బల్బు వెలగడం నుంచి నీళ్ళు పైకి ఎక్కించేందుకు ఉపయోగించే మోటారు పనిచేయడం వరకు దీనికి ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు. ఆ వ్యవహారాన్నంతటినీ ఒక గొడుగు కిందకు తీసుకువస్తే అదే ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్. దీనికి సంబంధించిన కెరీర్ వివరాలను చూద్దాం.

ఎవర్ గ్రీన్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్



కెరీర్ అవకాశాలు అధికంగా ఉన్న ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ వాస్తవానికి ప్రాక్టికల్ డిసిప్లిన్. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీర్లు కలగలిసి రీసెర్చ్ - డెవలప్‌మెంట్ సంస్థలు మొదలుకుని అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలు, ఇంజనీరింగ్ సర్వీసెస్ సంస్థలు, మాన్యుఫాక్చరింగ్, ప్రభుత్వ, టెక్ కంపెనీల్లో పనిచేయవచ్చు. 2021-2031 మధ్య పదేళ్ళలో ఈ పరిశ్రమ ఎదుగుదల మూడు శాతంగా లెక్కగట్టారు. మన దేశంలో ఏటా సగటున ఇరవై వేల కంటే కొద్దిగా ఎక్కువ ఉద్యోగాలు ఈ పదేళ్ళలో వీరికి లభిస్తాయి. ప్రజలందరూ వేలం వెర్రిగా కంప్యూటర్ వైపు వెళుతుండడంతో, వీరికి జాబ్ గ్యారెంటీ లభిస్తోంది అనే చెప్పాలి.

- అవకాశాల విషయానికి వస్తే ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్లకు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, కంట్రోల్ సిస్టమ్, సిస్టమ్ మేనేజ్‌మెంట్, ప్రొడక్ట్ డిజైన్, సేల్స్, కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ ట్రాన్స్‌పోర్టేషన్, వైర్‌లెస్ కమ్యూనికేషన్, మాన్యుఫాక్చరింగ్, కెమికల్, ఆటోమోటివ్, డిఫెన్స్, స్పేస్ రీసెర్చ్ తదితర సంస్థల్లో అవకాశాలు ఉంటాయి. నిర్దేశిత ప్రొఫెషన్‌కు మాత్రమే వీరు పరిమితం కారు కూడా.
- భిన్న రంగాలు అంటే హౌస్‌హోల్డ్ అప్లయిన్సెస్ డివిజన్, భవన నిర్మాణాల్లో ఎలక్ట్రికల్ సిస్టమ్ డిజైన్, ఎలక్ట్రిక్ వెహికల్స్/ కార్లు, రైల్వేస్, ఎయిర్‌పోర్ట్స్, రోబోటిక్స్, ఏరోస్పేస్, సొఫిస్టికేటెడ్ మెడికల్ ఎక్విప్‌మెంట్స్, ఎలక్ట్రిక్ పవర్ జనరేటింగ్ - ట్రాన్స్‌మిషన్ - డిస్ట్రిబ్యూషన్ సంస్థల్లో కెరీర్ అవకాశాలు ఉంటాయి.

సంబంధిత బ్రాంచీలు

ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్(పవర్ సిస్టమ్), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్), ఎలక్ట్రికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, పవర్ ఇంజనీరింగ్ ఉన్నాయి.

కెరీర్ అవకాశాలు

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివిన వారికీ అనేకానేక అవకాశాలు ఉన్నాయి. హౌస్‌హోల్డ్ అప్లయిన్సెస్ డిజైనింగ్, భవనాలకు ఎలక్ట్రికల్ సిస్టమ్ డిజైన్, రైల్వేలు, విమానాశ్రయాలు, రోబోటిక్స్, ఏరోస్పేస్, ఎలక్ట్రిసిటీ జనరేషన్ - ట్రాన్స్‌మిషన్ - డిస్ట్రిబ్యూషన్, ఆసుపత్రుల్లో సొఫిస్టికేటెడ్ మెడికల్ ఎక్విప్‌మెంట్స్‌కు తోడు ప్రభుత్వ విభాగాల్లో అవకాశాలు ఉంటాయి. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎఎల్‌ఎస్‌టిఒఎం ఇండియా లిమిటెడ్, స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్, బీహెచ్‌ఈఎల్, ఎబిబి ట్రాన్స్‌ఫార్మర్స్ అండ్ ఎలక్ట్రికల్స్, ఎన్‌టీపీసీ, జీఈ, ప్రభుత్వ కళాశాలల్లో టీచింగ్, హెచ్‌ఏఎల్, డీఆర్‌డీఓ, ఎల్ అండ్ టీ, ఇస్రో, క్రాంప్టన్ గ్రీవ్స్ పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ లిమిటెడ్, నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్, సీడేక్, ఓఎన్‌జీసీ, ఐఓఎల్, ఇస్రో, ఐఓసీఎల్, బజాజ్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, పీడబ్ల్యూడీ, బీపీసీఎల్, సైమన్స్, హెచ్‌పీసీఎల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, హార్బర్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, ఇండియన్ రైల్వేస్- ఆర్‌ఆర్‌బీ టాటా స్టీల్, ఇరిగేషన్ విభాగం, గెయిల్, టాటా మోటార్స్, సెయిల్, టాటా రిఫ్రాక్టరీస్ లిమిటెడ్, హెచ్‌బిఎల్ పవర్ సిస్టమ్స్ లిమిటెడ్, యునైటెడ్ ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, డిఫెన్స్ సర్వీసెస్, రిలయన్స్ పవర్, ట్రాకో కేబుల్ కంపెనీ లిమిటెడ్, నాల్కో, షైక్రాన్ ఎలక్ట్రికల్స్, బీడీఎల్, హాలోనిక్స్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, విప్రో లైటింగ్, ఎన్‌ఎండీసీలో అవకాశాలు ఉంటాయి. కోర్ ఎలక్ట్రికల్ కంపెనీలకు తోడు యాపిల్, ఐబీఎం, గూగుల్, శాంసంగ్, మైక్రోసాఫ్ట్, సోనీ కార్పొరేషన్, తోషిబా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, సీటీఎస్, ఒరాకిల్, ఇంటెల్, బోష్, ఎరిక్‌సన్, హెచ్‌పీ తదితరాల్లోనూ వీరికి అవకాశాలు ఉంటాయి. టెక్నో పార్క్‌లోని వివిధ ఐటీ సంస్థలు, స్మార్ట్ సిటీ, టెక్నో సిటీ, సైబర్ పార్క్, ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్, నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్, కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, బెల్, సీడాక్, సీఎస్ఐఆర్, సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కూడా ఎలక్ట్రికల్ ఇంజనీర్లకు అవకాశాలు కల్పిస్తాయి.

ప్రయోజనాలు

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ తరవాత ప్రపంచంలో ఎక్కడైనా పనిచేసే అవకాశం ఉంటుంది. మేథ్స్, ఫిజిక్స్ సహా ఎలక్ట్రికల్ అప్లికేషన్స్‌కు సంబంధించిన గైడింగ్ ప్రిన్సిపల్స్‌లో మార్పు ఉండనందున గ్లోబల్ కంపెనీలన్నీ వీరిని తీసుకుంటాయి. అవసరమైన నైపుణ్యాలు ఉన్న ఎలక్ట్రికల్ ఇంజనీర్లకు విశ్వవ్యాప్తంగా డిమాండ్ ఉంది. అనుభవజ్ఞులకు మాదిరిగా ఎక్కువ వేతనాలు ఉండవు. అయితే ఫ్రెషర్స్‌ను కూడా మల్టీనేషనల్ కంపెనీలు తీసుకుని తమకు అవసరమైన రీతిలో శిక్షణ ఇచ్చుకుంటాయి. కొన్ని కంపెనీలు వీరిని తీసుకుని స్కిల్ పెంచే కార్యక్రమాలను చేపడుతున్నాయి. కొద్దికాలం అనుభవం గడించిన తరవాత ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేసి పొజిషన్‌ను మెరుగుపర్చుకోవచ్చు.

- అలాగే ఈ కెరీర్‌లో ఇన్నోవేషన్‌కు అవకాశం ఉంటుంది. ఇది డెస్క్ జాబ్ కాదు అన్న విషయాన్ని గుర్తు పెట్టుకుంటే నైపుణ్యాల పెంపు, అనుభవం, క్రియేటివిటీతో ఎంత ఎత్తుకు ఎదగవచ్చో అర్థమవుతుంది. కొవిడ్ కాలంలో అందరూ ఇళ్ళకు పరిమితమైనప్పటికీ వీరికి తీరికలేదంటే అతిశయోక్తి కాదు. అంతరాయం లేకుండా విద్యుత్తు, వైఫై వంటి సదుపాయాలను కలిగించడంలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు ఎంతో కృషి చేశారన్నది వాస్తవం. ఆరోగ్య పరిరక్షణలో అంటే అప్పట్లో ఆసుపత్రులకు అవసరమైన విద్యుత్తు సరఫరా, ఎలక్ట్రిసిటీతో పనిచేసే పరికరాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేయడంలో వీరి పాత్ర అమోఘం. ఆర్థికమాంద్యానికి సైతం తలొగ్గని కెరీర్. మల్టీ డైమన్షనల్ కెరీర్ ఆప్షన్స్ ఉన్నాయి. ఇందుకోసం పోర్ట్‌ఫోలియోను పెంచుకోవాలి. పవర్ ఇంజనీరింగ్, మైక్రో ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్స్, రేడియో ఫ్రీక్వెన్సీ ఇంజనీరింగ్ ఈ ఆప్షన్స్‌లో కొన్ని. మల్టిపుల్ స్పెషలైజేషన్స్‌తో భిన్న కెరీర్లకు తద్వారా ఎదిగే అవకాశం ఎలక్ట్రికల్ ఇంజనీర్లకు ఉంటుంది.
- ఏతావతా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఏమంత గొప్ప కెరీర్ కాదన్న అపోహ ఉంది. అది తప్పు అనడానికి పై ఉదాహరణలే చాలు.



ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటి రాయపూర్

ఆర్‌జీఐపీటీలో బీటెక్, ఐడీడీ



అమేథీలోని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ (ఆర్‌జీఐపీటీ)- బీటెక్, ఇంటిగ్రేటెడ్ డ్యూయల్ డిగ్రీ(ఐడీడీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. జేఈఈ(అడ్వాన్స్‌డ్) 2024/జేఈఈ (మెయిన్) 2024 స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. బీటెక్ వ్యవధి నాలుగేళ్లు. ఐడీడీ వ్యవధి అయిదేళ్లు. ఇందులో బీటెక్, ఎంటెక్/ఎంఎస్ డిగ్రీలు పొందవచ్చు. మొత్తం 600 సీట్లు ఉన్నాయి. అదనంగా 106 సూపర్‌న్యూమరరీ సీట్లను మహిళలకు ప్రత్యేకించారు.

బీటెక్ స్పెషలైజేషన్‌లు-సీట్లు: కెమికల్ 60, కెమికల్ ఇంజనీరింగ్(పెట్రో కెమికల్స్ అండ్ పాలిమర్స్ ఇంజనీరింగ్ 30, రెన్యూవబుల్ ఎనర్జీ ఇంజనీరింగ్ 30), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 60, కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్ ఇంజనీరింగ్ 50, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 50, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ 50, మెకానికల్ 30, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 50, మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్ 60, పెట్రోలియం ఇంజనీరింగ్ 60, పెట్రోలియం ఇంజనీరింగ్(అప్లయిడ్ పెట్రోలియం జియోసైన్స్) 20.

ఐడీడీ స్పెషలైజేషన్‌లు-సీట్లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ 40, పెట్రోలియం ఇంజనీరింగ్ అండ్ పెట్రోలియం & నేచురల్ గ్యాస్ ఇంజనీరింగ్ 10.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్(ఎంపీసీ)/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణతతోపాటు జేఈఈ(అడ్వాన్స్‌డ్) 2024 అర్హత పొందిన అభ్యర్థులు, కనీసం 80 శాతం మార్కులతో ఇంటర్(ఎంపీసీ)/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు జేఈఈ(మెయిన్) 2024 అర్హత పొందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. జేఈఈ అడ్వాన్స్‌డ్ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. సీట్లు మిగిలిన పక్షంలో మాత్రమే జేఈఈ మెయిన్ 2024 అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు సడలింపులు వర్తిస్తాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1416; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీలకు రూ.708
- **మొదటి రౌండ్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 7
- **మొదటి రౌండ్‌లో ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 9
- **మొదటి రౌండ్ అభ్యర్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 15
- **సెకండ్ రౌండ్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 16
- **సెకండ్ రౌండ్‌లో ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 18
- **సెకండ్ రౌండ్ అభ్యర్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 27
- **క్యాంపస్ రిపోర్టింగ్:** ఆగస్టు 9
- **రిజిస్ట్రేషన్:** ఆగస్టు 10
- **ఓరియంటేషన్ ప్రోగ్రామ్:** ఆగస్టు 10, 11
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 12 నుంచి
- **వెబ్‌సైట్:** rgipt.ac.in

తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్ శిక్షణ

హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని తెలంగాణ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్(టీజీఎస్సీ ఎస్సీ)- యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(ప్రిలిమ్స్, మెయిన్స్) 2025నకు ఉచిత శిక్షణ అందిస్తోంది. ఇది ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. 2024 ఆగస్టు నుంచి పది నెలలు/ఎగ్జామ్స్ పూర్తయ్యేవరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. రాష్ట్రానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీసీ-ఇ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 100 సీట్లు ఉన్నాయి. ఎస్సీ అభ్యర్థులకు 75 శాతం, ఎస్టీ అభ్యర్థులకు 10 శాతం, బీసీ అభ్యర్థులకు 15 శాతం సీట్లు నిర్దేశించారు. మొత్తమ్మీద 33.33 శాతం సీట్లను మహిళలకు, 5 శాతం సీట్లను దివ్యాంగులకు ప్రత్యేకించారు.



అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని గ్రాడ్యుయేషన్/ప్రొఫెషనల్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.3 లక్షలు మించకూడదు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ 2025 ఎగ్జామ్‌నకు నిర్దేశించిన అర్హతలన్నీ ఉండాలి. అభ్యర్థులు నిరుద్యోగులై ఉండాలి. ఇతర కోర్సులు చేస్తున్నవారు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న తత్సమాన ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లో చేరినవారు, సివిల్ సర్వీసెస్‌కు సంబంధించి తెలంగాణ ఎస్సీ/ఎస్టీ/బీసీ/మైనారిటీ స్టడీ సర్కిళ్లలో ఇప్పటికే శిక్షణ పొందినవారు దరఖాస్తుకు అనర్హులు. రాష్ట్రంలోని 12 టీజీఎస్సీ డిస్ట్రిక్ట్ స్టడీ సర్కిళ్లలో అయిదు నెలల ఫౌండేషన్ కోర్సు పూర్తిచేసినవారు; ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలకు సంబంధించిన షార్ట్ టర్మ్ కోర్సుల్లో కోచింగ్ తీసుకొన్నవారు; గ్రూప్స్-2, 3, 4 సర్వీస్‌లకు సంబంధించిన స్పెషల్ ఫౌండేషన్ కోర్సుల్లో శిక్షణ పొందినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఎంట్రెన్స్ ఎగ్జామ్ వివరాలు: ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. యూపీఎస్సీ నిర్వహించే ప్రిలిమ్స్ ఎగ్జామ్‌లో మాదిరిగానే మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జనరల్ స్టడీస్(పాలిటీ, ఎకానమీ, జాగ్రఫీ, హిస్టరీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కల్చర్ అండ్ సోషల్ ఇష్యూస్, కరెంట్ అఫైర్స్) అంశాల నుంచి 100 ప్రశ్నలు; రెండో పార్ట్‌లో సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్(సీశాట్) పేపర్ 2 అంశాలైన టెస్ట్ ఆఫ్ రీజనింగ్, మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లీష్ కాంప్రహెన్షన్‌ల నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. జనరల్ స్టడీస్ ప్రశ్నలకు ఒక్కోదానికి రెండు మార్కులు; సీశాట్ పేపర్ 2 ప్రశ్నలకు ఒక్కోదానికి రెండున్నర మార్కులు నిర్దేశించారు. మొత్తం మార్కులు 300. తప్పుగా గుర్తించిన సమాధానానికి మూడోవంతు మార్కు కోత విధిస్తారు.

- జనరల్ స్టడీస్ ప్రశ్నలన్నీ ఆరోతరగతి నుంచి పన్నెండోతరగతి వరకు ఎన్‌సీఈఆర్‌టీ నిర్దేశించిన సిలబస్ ప్రకారం ఉంటాయి. ఈ పార్ట్‌లో సాధించిన మార్కుల ఆధారంగానే అభ్యర్థుల మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. రెండో పార్ట్‌లో నిర్దేశించిన ప్రకారం అర్హత మార్కులు వస్తే చాలు. ఇందులో కనీసం 33 మార్కులు సాధించాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 10
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూలై 17 నుంచి
- **ఎంట్రెన్స్ టెస్ట్ కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూలై 21
- **వెబ్‌సైట్:** http://tsstudycircle.co.in

ఐఐఐటీఎంలో ఎంబీఏ



కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలోని అటల్ బిహారీ వాజపేయి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(ఏబీవీ-ఐఐఐటీఎం), గ్వాలియర్- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్, ఐటీ అండ్ సిస్టమ్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ అంశాలతోపాటు రీసెర్చ్ బేస్డ్ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. క్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా ఎంపిక చేసిన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్స్, రైటింగ్ కాంప్రహెన్షన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ ఓబీసీ అభ్యర్థులకు రూ.1,000; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500.
- **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 20
- **అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ:** జూలై 3
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 4
- **అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 11
- **స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఏబీవీ-ఐఐఐటీఎం గ్వాలియర్ - 474015
- **వెబ్‌సైట్:** www.iiitm.ac.in


లిటిల్స్



నక్క ఉపాయం

వీరభద్ర పురం పక్కనున్న అడవిలో ఉన్న చిన్న చెరువులో ఒక మొసలి ఉండేది. ఆ చెరువులో ఉండే చేపలన్నిటినీ అది తింటూ ఉండేది. అదే చెరువులో నివసించే పీతకు ఈ మొసలికి మంచి స్నేహం. కొంత కాలానికి ఆ మొసలికి అక్కడి చేపలు తినీతినీ విసుగు పుట్టింది. అది తన నేస్తమైన పీతను పిలిచి నాకు రోజూ ఈ చేపలే తినాలంటే విసుగ్గా ఉంటోంది. వేరే ఏదైనా జంతువు ఆహారంగా దొరికితే బాగుంటుంది. 'నువ్వు అడవిలోకి వెళ్లి అక్కడి జంతువులకు మొసలి చనిపోయిందని చెప్పు, ఆ మాటనమ్మిన జంతువులన్నీ ఇక్కడికి నీళ్లు తాగడానికి వస్తాయి. అపుడు నేను ఏదో ఒక జంతువును పట్టి తింటాను' అని చెప్పింది. దాని మాటలకు సరే అన్న పీత అలాగే అడవిలోకి వెళ్లి 'మిత్రులారా చెరువులోని మొసలి చచ్చిపోయింది, ఇక మనకేం భయం లేదు అందరూ అక్కడికి వచ్చినీళ్లు తాగండి' అని చెప్పింది. పీత మాటలు అన్ని జంతువులు నమ్మాయి కానీ ఒక నక్క మాత్రం నమ్మలేదు. అందులో ఏదో మోసం ఉంది అనుకున్నది. ఐనా ఆ నక్క మిగతా జంతువులతో పాటు చెరువు దగ్గరకు వెళ్లి, అందరికీ వినిపించేటట్లు ఇలా అన్నది. 'మిత్రులారా నా మిత్రురాలైన ఒక గుడ్లగూబ చెప్పిన దాని ప్రకారం మొసలి చనిపోయినా దాని తోక మాత్రం కదులుతూనే ఉంటుంది. ఈ మొసలి తోక కదిలితే ఇది చనిపోయిందని మనం నమ్మవచ్చు అన్నది. ఆ మాటలు విన్న మొసలి తాను చనిపోయానని నమ్మించడం కోసం తన తోకను వెంటనే మెల్లగా కదిలించడం మొదలు పెట్టింది. అది చూసిన నక్క' నేను అనుమానించినట్టే ఈ మొసలి చనిపోలేదు, బ్రతికే ఉంది. ఏదో ఒక జంతువును పట్టుకుని తినడానికి అది పీతతో కలిసి ఇంత నాటకం ఆడింది' అనుకుని, మిగతా జంతువుల దగ్గరకు వెళ్లి వాటి చెవిలో రహస్యంగా మొసలి ఆడిన నాటకం గురించి చెప్పింది. అసలు విషయం తెలుసుకున్న జంతువులు 'హమ్మయ్య గండం గడిచింది' అనుకుని, ఉపాయంతో అందరినీ కాపాడిన నక్కకు కృతజ్ఞతలు చెప్పాయి.


ఎన్ని ఏనుగులు? ఎన్ని రైనోలు?



7 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 335

1	4		2		8			
		5	6					
				5	4			7
	6		4				5	3
	1	8				6	9	
3	5				9		8	
4			3	1				
					6	3		
			8		5		6	1

సుడోకు - 334 సమాధానం

2	8	5	6	7	4	9	1	3
1	4	3	8	5	9	7	2	6
9	7	6	1	2	3	4	8	5
8	3	9	5	6	7	1	4	2
7	6	4	3	1	2	5	9	8
5	1	2	4	9	8	3	6	7
3	5	8	9	4	6	2	7	1
4	2	1	7	8	5	6	3	9
6	9	7	2	3	1	8	5	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.